# ఆధునిక భారతదేశ ఆర్థిక చరిత్ర (1757-1947)

## ఎం.ఏ. చరిత్ర, రెండవ సంవత్సరం

**సెమిస్టర్-III, పేపరు-II**

## పాఠ్య రచయితలు


**డా॥ జి. సోమశేఖర,**
ఎం.ఏ., పిహెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్,
చరిత్ర మరియు పురావస్తు విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ జె. క్రిష్ణ ప్రసాద్ బాబు,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్,
చరిత్ర విభాగం,
జె.బి. డిగ్రీ కళాశాల, కావలి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా.

**డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర్ రావు,**
లెక్చరర్,
చరిత్ర విభాగం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట, అన్నమయ్య జిల్లా.

**శ్రీ బి. గంగాధర్,**
ఎం.ఏ., ఎం.ఫిల్.
లెక్చరర్,
వై.ఎస్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల
వై.ఎస్.ఆర్. కడప జిల్లా.

***సంపాదకులు & సమన్వయకర్త***

**డా॥ జి. సోమశేఖర,**
ఎం.ఏ., పిహెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్,
చరిత్ర మరియు పురావస్తు విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

***డైరెక్టర్***

**డా॥ నాగరాజు బట్టు,**
**ఎం.హెచ్.ఆర్.ఎం., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. (సై.), ఎం.ఏ (సో.), ఎం.ఇడి., ఎం.ఫిల్., పిహెచ్.డి.**

**దూర విద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్-522 510.
ఫోన్ నెం.: 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)
వెబ్‌సైట్: www.anucde.info ఇ-మెయిల్: anucdedirector@gmail.com

**ఎం.ఏ. చరిత్ర - ఆధునిక భారతదేశ ఆర్థిక చరిత్ర (1757-1947)**

First Edition: 2023

No. of Copies:

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. HISTORY-ECONOMIC HISTORY OF MODERN INDIA (1757-1947)**, Semester III, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only.

**Published by:**

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

**Printed at:**

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A'ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యాకేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యాకేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్. పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

# సిలబస్

## ఎం.ఏ. చరిత్ర, రెండవ సంవత్సరం

## సెమిస్టర్-III, పేపరు-II

## 302HI21-ఆధునిక భారతదేశ ఆర్థిక చరిత్ర (1757-1947)

1. Indian Economy in the Mid-Eighteenth Century-Agriculture-Industries and Trade-Colonialism-Meaning Features-Stages.
2. Agriculture under British Rule-Revenue Settlements-Permanent Revenue Settlement-Mahalwari Settlement, Ryotwari Settlement- Irrigation-Commercialization of Agriculture-Plantations.
3. De-industriliasation of small scale and cottage industries. Transport and Communication-Railways -Growth of foreign capital.
4. Growth of Modern Industry- Cotton Textile-Iron and Steel - Sugar- Indian Capitalist class- Impediments to the growth of industries..
5. Effects of Colonial Policies on India-Drain of Indian Wealth-Poverty, Famines and Under Development. British and Indian Ideas on Indian Economic Development.

**Suggested Readings:**

| | |
|---|---|
| 1. Bipin Chandra | : Nationalism and Colonialism in Modern India. |
| 2. Bipin Chandra | : Essays on Colonialism. |
| 3. R.P. Dutt | : India Today. |
| 4. D.R. Gadgil | : The Industrial Evolution of India (1860-1939). |
| 5. Sunit Sarkar | : Modern Indian Economic History. |
| 6. Sabyasachi Bhattachrya | : Essays of Modern Indian Economic History. |
| 7. Tapan Raychaudari and Irfan Habib | : Cambridge Economic History of India, 2 Vols. |
| 8. B.N. Chopra, B.N.Puri and | : A Social, Cultural and Economic History of India, 3, vols. |

# విషయ సూచిక

## ఆధునిక భారతదేశ ఆర్థిక చరిత్ర (1757-1947)


| సంఖ్య | పాఠం | పుట |
|---|---|---|
| 1. | 18వ శతాబ్దం మధ్య భాగంలో భారతదేశం యొక్క ఆర్థిక పరిస్థితులు-వ్యవసాయం | 1.1 - 1.9 |
| 2. | బ్రిటీష్ పాలనకు ముందు భారతదేశములోని పారిశ్రామిక, వ్యాపార రంగం పరిస్థితి | 2.1 - 2.12 |
| 3. | భారతదేశములో బ్రిటీష్ వలస విధానము | 3.1 - 3.9 |
| 4. | బ్రిటీష్ వారి పాలనలో వ్యవసాయము (1747-1947) | 4.1 - 4.6 |
| 5. | బ్రిటీష్ వారి కాలం నాటి భూమి శిస్తు పద్ధతులు (1757-1947) | 5.1 - 5.9 |
| 6. | భారతదేశంలో వ్యవసాయ వాణిజ్యీకరణ వృద్ధి-ఫలితాలు | 6.1 - 6.5 |
| 7. | భారతదేశంలోని బ్రిటీష్ ప్రభుత్వం యొక్క నీటిపారుదల, తోటల (ప్లాంటేషన్) పెంపకం | 7.1 - 7.9 |
| 8. | భారతదేశంలో చిన్న, కుటీర పరిశ్రమల క్షీణత | 8.1 - 8.9 |
| 9. | రవాణా మరియు సమాచార వ్యవస్థ | 9.1 - 9.8 |
| 10. | భారతదేశంలో విదేశీ పెట్టుబడులు | 10.1 - 10.8 |
| 11. | ఆధునిక పరిశ్రమలు - నూలు, ఇనుము, ఉక్కు మరియు పంచదార పరిశ్రమలు | 11.1 - 11.9 |
| 12. | భారతీయ పెట్టుబడిదారీ వర్గం | 12.1 - 12.8 |
| 13. | ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఆటంకాలు | 13.1 - 13.10 |
| 14. | భారతదేశంలో వలస పాలన విధానాలు - ప్రభావం | 14.1 - 14.9 |
| 15. | భారతదేశంలో సంభవించిన క్షామాలు - పేదరికం | 15.1 - 15.11 |
| 16. | బ్రిటీష్ కాలంలో అభివృద్ధి స్థబ్దత (లేక) అభివృద్ధి నిరోధకం | 16.1 - 16.10 |

పాఠం - 1

# 18వ శతాబ్దం మధ్య భాగంలో భారతదేశం యొక్క ఆర్థిక పరిస్థితులు-వ్యవసాయం

## 1.0. లక్ష్యము:

బ్రిటీష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో వ్యవసాయ రంగం యొక్క స్థితిగతులను గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయక్రమము:**


1.1. పరిచయము

1.2. గ్రామీణ వ్యవస్థ

1.3. కుల వ్యవస్థ

1.4. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

1.5. వ్యవసాయము

1.6. భూదానాలు

1.7. వ్యవసాయ సంబంధాలు

1.8. భారతీయ ఫ్యూడలిజం-ఐరోపా ఫ్యూడలిజం

1.9. పన్ను విధానము

1.10. నీటి వసతులు

1.11. కరువులు

1.12. వ్యవసాయ ఉత్పత్తులు

1.13. సాంకేతిక పరిజ్ఞానము

1.14. సారాంశము

1.15. నమూనా ప్రశ్నలు

1.16. ఆధార గ్రంథాలు


## 1.1. పరిచయము:

భారతీయ ప్రజల యొక్క ఆర్థిక జీవనంపై భౌగోళిక పరిస్థితులు, భౌతిక పరమైన అంశాలు, వాతావరణ పరిస్థితులు ఒకవైపు, సాంఘిక పరిస్థితులు, పురాతన ఆచారాలు, మతపరమైన విశ్వాసాలు మరియొక వైపు ప్రభావితం చేస్తున్నాయి.

యుగాల నుంచి కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థ ప్రాచీన, మధ్య యుగాల కాలం వరకు నిరాటంకంగా కొనసాగుతూ వచ్చింది. అయితే భారతదేశం అనేక కాలాల్లో వివిధ విభిన్న రాజకీయ పరివర్తనలకు లోనయింది. విశాల భారతావనిలో ఒకవైపు సస్యశామలమై దనదాన్యాలతో కళకళలాడుతుండగా మరియొకవైపు కొన్ని ప్రాంతాలలో కరువు కాటకాలు, దారిద్ర్యం తాండవిస్తూవుండేది. సువిశాల వైవిధ్యమైన ఈ భారతావనిలో ఒక ప్రాంతంలో సంవృద్ధియైన ఆహారం లభించగా మరియొక ప్రాంతం తీవ్రమైన ఆహారం కొరతతో ఇబ్బందిపడేది. దీనికి కారణం ఆధునిక రవాణా సౌకర్యాలు లేకపోవటమే.

## 1.2. గ్రామీణ వ్యవస్థ:

భారతీయ గ్రామము ఏకైక మరియు విశేషమైన సాంఘిక ఆర్థికపరమైన వ్యవస్థ. ప్రాచీన కాలం నుండి స్వయం సంపూర్ణ గ్రామము ప్రాధమిక ఆర్థిక వ్యవస్థగా ఉంటూ తన ప్రత్యేకతను చాటుకుంది. గ్రామాన్ని ఆర్థిక భాషలో చెప్పాలంటే గ్రామ సంఘంగా చెప్పవచ్చు. దీనికి ఒక గొప్ప నిర్వచనము ఎలపిన్‌స్టాన్ తన గ్రంథమైన భారతదేశ చరిత్రలో గ్రామ సమాజాలు చిన్న రిపబ్లిక్‌ల వలే ఉంటూ వారికి కావలసిన వన్ని వారే సమకూర్చుకుంటూ స్వయం సంవృద్ధి కలిగి వుండేవారు. ఏవోకొన్ని చిన్న చిన్న మార్పులు మినహాయిస్తే రాజకీయంగా ఎన్నో మార్పులు వచ్చినా మతపరంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, వినాశకరమైన యుద్ధాలు ఎన్ని సంభవించినా, బ్రిటీష్ పాలన వరకు ఈవిధానం కొనసాగింది.

రాజవంశాలు అనేకం విస్తరించినా, అంతరించిన భారతీయ నాగరికతకు ప్రాతిపదికయగు గ్రామం మాత్రం మార్పోందక తన స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కొనసాగిస్తూ నిలువగలిగింది. ఒక గ్రామానికి కావలసిన వస్తువలన్నీ ఆ గ్రామంలో గాని, ఇరుగుపొరుగు గ్రామాలలో గాని తప్పక లభించేవి. ఇంకా అరుదైన వస్తువులు వారానికి ఒకసారి జరిగే సంతలో లభించేవి. నాటి సమాజంలో ప్రజలకు కావలసిన సాధారణ అవసరాలు కూడు, గుడ్డలు. దీనిని సమకూర్చే రైతులు, నేతగాండ్రు ప్రతి గ్రామంలోనూ ఉండేవారు. వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు వ్యవసాయ పరికరాలను, గృహోపకరణాలను సమకూర్చేవారు. చేతి పనుల వారు, వర్తకులు అవసరాలకు ఎలాంటి లోటు లేకుండా చూసేవారు. రైతులు తమకు కావలసిన వస్త్రాలు, మున్నగు వానికి బదులుగా దాన్యం ఇచ్చేవారు. ఈ వినిమయ పద్ధతి మధ్య యుగాంతం వరకు కొనసాగనుంది.

## 1.3. కుల వ్యవస్థ:

భారతీయ సామాజిక వ్యవస్థకు మూలాధారమైనది కులవ్యవస్థ. వివిధ కులాలకు నిర్ణేతలైన వృత్తులు ఉండేవి. ఆ వృత్తులను ఏకులానికాకులం చక్కగా నిర్వహిస్తూ ఉండేది. ప్రతి కులానికి వంశపారంపర్యంగా వృత్తులను సంక్రమింపజేసింది. ప్రతి కులము ఒక ఆర్థిక యూనిట్‌గా వ్యవహరిస్తూ ప్రయోజనకారిగా ఉండేది. అయితే గ్రామంలో సాంఘిక వ్యవస్థ కులప్రాతిపదికపై ఉండటం వల్ల వ్యక్తి చొరవుకు, సాహసానికి, కొత్త దృక్పధానికి వీలుండేది కాదు. కులవ్యవస్థ దైవదత్తమని నమ్మిన గృహస్తుడు దాని విధి నిషేధాలకు లొంగిపోయి తన అంతస్తును అంగీకరించి గ్రామ ఆర్థిక, సాంఘిక నిర్మాణంలో దైవసృష్టిగా వచ్చిన తన కులవృత్తిని పాటించేవాడు. మతమార్మిక వివరణలతో జీర్ణించుకుని పోయిన గ్రామస్థులు ఈ వ్యవస్థను దాన్ని అంటిపెట్టుకున్న ఆదర్శాలను పరిశోధించి దానికి పూనుకూనేవారు కాదు.

సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ఉన్నత కులాలవారుగా పరిగణించబడేవారు. బ్రాహ్మణులు పౌరోహిత్యానికి, క్షత్రియులు యుద్ధవిద్యలకూ, వైశ్యులు వర్తక వ్యాపారాలకు సాధారణంగా పరిమితమై ఉండేవారు. బ్రిటీష్ పాలనకు పూర్వం ఈ వృత్తులను మాత్రమే అంటిపెట్టుకొనక రాజోద్యోగాలలో ప్రవేశించేవారు. వీరు భూస్వాములుగా ఉన్నప్పటికీ తమ భూములను

శూద్రులకు కొలుకిస్తూ ఉండేవారు. శూద్రులు శ్రామిక వర్గంగా ఉండేవారు. వారిలో వ్యవసాయం మున్నగు వృత్తులు అవలంబించిన వారు చతుర్థులు చెలామణిగా అయినారు. తక్కువ వృత్తులు అవలంభించిన వారు, నిమ్న జాతులు లేక పంచములని వ్యవహరించబడుతూ వుండేవారు. గ్రామంలో ఏకంగా ఉండటం వరదలకు, కరువులకు తరచు గురికావటం కులబంధాలలో చిక్కుకోవటం వల్ల ఉమ్మడి కుటుంబపు అజమాయిషీలో ఉండటం చిన్నతనం నుండి నూరిపోసిన మత మార్మికతత్వం తలెక్కడం వల్ల గ్రామస్తులలో మానసిక ఉత్సాహం గాని, పరిశోధనా జ్ఞానం కాని, అన్వేషణా భావం గాని, ఎదురు తిరిగేతత్వం గాని లేకుండా పోయింది.

## 1.4. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ:

ఉమ్మడి కుటుంబ పద్ధతి సంప్రదాయక సామాజిక విధానానికి చెందినదియైనా భారతీయుల ఆర్థిక జీవితంపై అత్యంత ప్రభావాన్ని నెరపుతూవుంది. కుటుంబ సభ్యులందరూ ఒకే ఇంటిలో ఉంటూ ఒకే వృత్తిని తరతరాలుగా కొనసాగిస్తూ జీవించడం జరగుతుండేది. అందరూ ఇంటి పెద్దకు లోబడి తన ఆజ్ఞాలను పాటిస్తారు. కొన్ని సమయాలలో ఉమ్మడి కుటుంబ సభ్యుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండేది. అంతేగా కొన్ని కుటుంబాలు ఏడు తరాల వరకూ కూడా ఉమ్మడి కుటుంబం చెలామణిలో ఉండేవారు. కుటుంబ సభ్యులందరికి పని కల్పించి పోషణ భాధ్యత వహించి వారి సంక్షేమానికై ఉమ్మడి కుటుంబం పాటుపడుతూ ఉండేది. చిన్న పిల్లలు, వయసు మల్లిన వారిని సంరక్షిస్తూ వుండేది. ఉమ్మడి ఆదాయం, అందరి ఖర్చులు సమానంగా వినియోగించేవారు.

అయితే తరతరాలుగా ఒకే వృత్తిలో కొనసాగడం వల్ల కొందరిలో వృత్తి పట్ల ఇష్టం లేకున్ననూ సమాజపు కట్టుబాట్లకు లోబడి కొనసాగించేవారు. ఫలితంగా వృత్తిలో నాణ్యత లోపించేది. అంతేగాక ఈర్ష్యాద్వేషాలు, కలతలు కర్పణ్యాలు చోటుచేసుకొని ఉమ్మడి కుటుంబం విడిపోవడానికి కారణమయ్యేది.

## 1.5. వ్యవసాయము:

ప్రాచీన కాలం నుండి నేటి వరకు కూడా భారతదేశం గ్రామీణ భూభాగంగా ప్రసిద్ధి చెందిది. ఇది దేశ ఆర్థిక సామాజిక జీవనానికి ఆయువుపట్టుగా నిలిచింది. వ్యవసాయం, పరిశ్రమలు చేదోడువాదోడుగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. భారతదేశ ఆర్థిక విధానంలో ఐశ్వర్యం కనపడినా, ఇది కొన్ని ప్రాంతాలకు కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమైంది. సంపద రాజదాని నగరాలలోను, కోశాగారాలలోను, దేవాలయాలలోను కేంద్రీకృతమై ఉండటంవల్ల ఇవి ఎక్కువగా దండయాత్రలకు గురిఅయ్యేవి. వర్తక వాణిజ్య కేంద్రాలు, నీటి వసతులు గల ప్రాంతాలు ఉన్నత స్థావరాలుగా వున్నప్పటికి మారుమూల ప్రాంతాలు, కరువు సంభవించిన ప్రాంతాలలో ప్రభుత్వం నివారణా మార్గాలను చేపట్టలేదు. ప్రభుత్వ ఆదాయాన్ని ఎక్కువ చేసే చర్యలలో భూభాగ విస్తీర్ణం తప్ప పలసాయమధికం చేయటానికి రైతుకు ఆర్థిక సహకారం గాని, రహదారి రవాణా సౌకర్యాల పెంపుదల గాని ఎప్పుడు జరుగులేదు.

**భూమి మీద అధికారం: విభాగాలు**

అనాదిగా భారతీయుల ప్రధాన వృత్తి వ్యవసాయమే. దేశ ఆర్థికవ్యవస్థకు రైతే వెన్నెముక. గ్రామ పరిశ్రమలన్ని వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని ఉండేవి. రాజ్యములోని భూమి అంతా రాజు / సుల్తానులకు, షాదుషాలకే చెందింది.

సారవంతమైన భూమి, సమ వర్షపాతం, స్వతసిద్ధ జలాశయాలు, రైతుల శ్రమ కారణాలుగా తప్ప ఆదాయం అధికంగానే ఉండేది. అధిక పంటలను భట్టీలలో భద్రపరిచేవారు.

## 1.6. భూదానాలు:

బ్రాహ్మణులకు, దేవాలయాలకు, ఉద్యోగులకు, సామంతలకు దేశమంతటా భూదానాలు జరిగాయి. వీటివల్ల భూమిపై గల సర్వహక్కులు, చుట్టుప్రక్కల గల నీటి వనరులు, ఫల సాయం ఇచ్చి చెట్లుతో సహా రాజు నుంచి దానగ్రహీతకు సంక్రమించేది. భూమిని అనుభవించడానికే గాక అమ్మడానికి, తాకట్టు పెట్టడానికి, విభజించడానికి, వారసత్వంగా ఇవ్వడానికి దానగ్రహీతకు హక్కు ఉండేది. రాజుకు భూమిపై గల సార్వభౌమత్వం, గ్రామీణులకు తమ భూమి వనరులపై గల సామూహిక హక్కులు క్రమంగా తగ్గి వ్యక్తిగత హక్కు ఏర్పడింది.

ఈ భూదానం వల్ల భూ స్వాముల స్వంత భూమి విస్తీర్ణం పెరిగింది. భూ స్వాములకు స్వంత భూములను పెంచుకునే అవకాశం ఇవ్వడం వల్ల చుట్టుప్రక్కల గల సారవిహీనమైన నేలను, పచ్చిక భయళ్ళను, అటవీ ప్రదేశాలను వారు సాగులోకి తెచ్చారు. గ్రామాలను గ్రామ నిధులతో సహితంగా దానమివ్వటం వల్ల గ్రామస్థులకు గల ఉమ్మడి హక్కులు, కులహక్కులు పోయాయి.

హిందూ వారసత్వం విధానం ప్రకారం భూమిపై హక్కు తండ్రి నుండి కుమారులకు సమానంగా సంక్రమించేది. 11వ శతాబ్ధంలో ఉత్తర, దక్షిణ, పశ్చిమ భారతదేశంలో మిటాక్షర స్మృతిననుసరించి ఆస్తి హక్కు సంక్రమించేది. ఈ పద్ధతి ప్రకారం తండ్రితో సమానంగా కొడుకులకు పుట్టినప్పటి నుండి ఆస్థి మీద హక్కు ఏర్పడుతుంది. తండ్రి కొడుకులకు సమానంగా హక్కు ఉండటం వల్ల కొడుకులు ఎప్పుడైనా తన భాగాన్ని కోరుకునే హక్కు వుంటుంది. ఉమ్మడి కుటుంబం కలసి ఉన్నంత వరకు ఆస్థిపై హక్కు ఇంటి యజమాని ఆధ్వర్యంలోనే ఉంటుంది. అయితే 14వ శతాబ్దంలో బెంగాల్ ప్రాంతములో వారసత్వపు హక్కు మరియొక విధంగా ఉండేది. దీనిని 'దయాభగ' అంటారు. ఈ పద్ధతి ప్రకారం భూమిపై తండ్రికి చట్ట ప్రకారం అధికారం ఉంటుంది. తండ్రి జీవిత కాలంలో దీనిని తిరస్కరించడానికి ఎవరికీ హక్కు ఉండదు. తండ్రి మరణించిన పిమ్మట కుమారు ఈ భూమిని పంచుకొనవచ్చును. అంతవరకు వారు ఉమ్మడి కుటుంబంలో సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా వారికి భూమిపై హక్కు చట్టపరంగా ఉంటుంది. అయితే తండ్రి చనిపోయిన తరువాత మాత్రమే వారికి పూర్తి హక్కు ఏర్పడుతుంది.

అదేవిధంగా ముస్లింలలో వారసత్వపు హక్కు వేరువేరుగా ఉండేది. ఇది చాలా క్లిష్టతరంగా ఉండేది. ఇంటి పెద్ద మరణించిన తరవాత వారసత్వపు హక్కు సెటిల్‌మెంట్ ద్వారా జరిగేది. వారసత్వపు హక్కుదారు ఒకడు వున్నప్పుడు ఇబ్బంది లేదు కాని అనేక మంది వున్నప్పుడు చాలా సమస్యలు వచ్చాయి.

## 1.7. వ్యవసాయ సంబంధాలు:

ధర్మ శాస్త్రాలు భూస్వామికి, రైతుకు గల సంబంధములను విశదపరుస్తున్నాయి. సాధారణ భూమిపై భూస్వామికి 1/8 వ వాటాను, వ్యవసాయ యోగ్యమైన భూమిపై 1/6 వ వంతును, ఎక్కువ కాలం సాగులో లేని భూమిపై 1/10 వ భాగం ఇవ్వమని ఉండేది. కౌలుదార్లు పనిముట్లకు, విత్తనాలకు కూలీలకు వారి ధనాన్ని ఖర్చు చేసేవారు. కౌలుదారు వ్యవసాయాన్ని

నిర్లక్ష్యం చేసినప్పటికీ, భూస్వామికి చెల్లించవలసిన భాగం తప్పక చెల్లించాలి.

భూస్వామికి భూమిపై వ్యక్తిగత హక్కు ఏర్పడటం వల్ల గ్రామీణులు వారి ధయాధర్మాలపై ఆధారపడవలసి వచ్చేది. ముందుగా భూస్వామి అనుమతి పొంది, నిర్ణీత రుసుము చెల్లించి మాత్రమే తటాకాలను, పచ్చిక భయళ్ళను, అడవులను ఉపయోగించుకోవాలి. రాజోద్యోగుల పర్యవేక్షణ కంటే, స్థానికంగా ఉన్న భూస్వాముల అజమాయిషీ ఎక్కువగా ఉండేది.

## 1.8. భారతీయ ఫ్యూడలిజం–ఐరోపా ఫ్యూడలిజం:

భారతీయ ఫ్యూడలిజం ఐరోపా ఫ్యూడలిజానికి భిన్నంగా ఉండేది. ఇక్కడ భూమిపై సొంతహక్కులేదు. భూమి అంతా గ్రామ సమాజానికి చెందినదే కాని రాజు హక్కుదారుడుగా హిందూ యుగంలో ఎన్నడు పరిగణించలేదు. గ్రామ సమాజ పక్షాన, గ్రామ సభ భూములలో ఉత్పత్తి అయిన దానిలో కొంత భాగం రాజుకు గాని అతని అధికారికి గాని చెల్లించేవారు. ఈ విధంగా భూమిపై వస్తు రూపేణా రాజ్యానికి హక్కు ఉండేది. ముస్లిం పాలనలో కౌలు విధానంలో, పన్నుల పద్ధతిలో కొన్ని మార్పులు జరిగాయి.

జమీందారులు లేదా పన్ను వసూలుదారులు, జాగీర్దారులు లేదా రాజుచే నియమించబడిన వారికి మాత్రమే వారికి కేటాయించిన ప్రాంతంలో పన్నులు వసూలు చేసుకునే అధికారం ఉంటుంది. మతపరమైన, ధార్మిక సంస్థలపైన, విద్యా సంస్థల పైన వసూలు చేసిన మొత్తాన్ని కొంత గాని, మొత్తం గాని అడ్డుపెట్టుకునే హక్కు కేవలం యువరాజుకు మాత్రమే ఉండేది. అయితే రాజు గాని, అతని మధ్యవర్తులు గాని భూమిపై హక్కుదారులు కాదు. గ్రామ సమాజంపై సంభవించే కలహాలన్ని పాలకుల మధ్య, పాలకులకు మధ్యవర్తులకు గ్రామంలో ఉత్పత్తి అయిన దానిలో ఎంత భాగం తమకి చెందాలి అనే విషయం మీద మాత్రమే జరిగేవి.

భారతదేశ చరిత్రలో పెద్ద పోరాటాలేవి గ్రామంలో హక్కులకు సంబంధించినవి కావు. గ్రామాలపై అధికారం కోసం మాత్రమే. ఏమేరకు చెల్లింపులు రైతులు నుంచే రాబట్టాలనే గాని భూమిని స్వాధీనం చేసుకొనడానికి కాదు. అయితే ఐరోపాలో ఇందుకు భిన్నంగా రైతులకు భూస్వాములకు మధ్య పోరాటాలు జరిగాయి. ఉత్పత్తిలో భాగాన్ని కోరటమే గాక భూస్వాములు సాగులో కొత్త పద్ధతి ప్రవేశపెట్టాలని, ఒకే విధమైన సాగు పద్ధతి ఉండాలని, నిర్బంధ సేవకులుండాలని కోరడం జరిగింది. అయితే ఇక్కడ మాత్రం సాగు పద్దతులతో నిమిత్తం లేకుండా రైతుల నుండి రాబడి స్వీకరించడానికి మాత్రమే భూ స్వాములు తమ పోరాటాలను పరిమితం చేసుకున్నారు.

## 1.9. పన్ను విధానము:

ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం భూమి పన్ను ద్వారానే వచ్చేది. సరియైన కొలతలు కొలిపించడం, రాబడిని బట్టి పన్ను నిర్ణయించడం ఖచ్చితంగా జరిగేది కాదు. పూర్వపు దస్తావేజుల ఆధారంతో, పంట అంచనాతో, రాజ్య అవసరాలను బట్టి పన్ను నిర్ణయించేవారు. చెల్లించే పన్ను శాతం సుల్తానుల యుగంలో, మొగలుల పాలనలో మారుతూ వచ్చింది. హిందువుల నుంచి వసూలు చేసే భూమి పన్ను 'ఖరాజ్' అని పిలిచేవారు. ఇది పంటలో 1/5 వంతు నుండి 1/2 వంతు వరకు ఉండేది. ముస్లింల నుండి వసూలు చేసే పన్ను పంటలో 1/10 వ వంతు ఉండేది. భూమి అంతా రాజ్యానికి చెందినప్పటికీ, ప్రభుత్వ ఆధీనంలో గల భూమి కంటే వ్యక్తుల, సంస్థల ఆధీనంలో గల భూమే ఎక్కువ. ప్రభుత్వ భూములను

ఖల్సా భూములని పిలిచేవారు. పన్ను వసూలు దారుని ఆధీనంలో గల భూములున్న గ్రామాన్ని తాలుకా గ్రామమని పిలిచేవారు.

సైనికులకు ఇచ్చిన భూమిని 'ఇక్తా' అని, దానంగా ఇచ్చిన భూమిని 'ఈనాం' అని, ఒక ప్రత్యేక లక్ష్యం కోసం ఇచ్చిన దానిని 'వక్ఫ్' అని, ఫించనుగా ఇచ్చినది 'ఇద్రరత్' అని మత పురుషులకు ఇచ్చిన దానిని 'మిత్క్' భూములని పేర్కొన్నారు. అంతర్యుద్ధాలు జరిగినప్పుడు బలహీన సుల్తానులు రాజ్యానికి వచ్చినప్పుడు భూ స్వాములు స్వతంత్ర ప్రవృత్తి చూపునపుడు ఆదాయం జమపడేది కాదు. మధ్యయుగ భారతదేశ చరిత్రలో అల్లా ఉద్దీన్ ఖల్జీ, మహమ్మద్ బిన్ తుగ్లక్, షేర్షా, అక్బర్ పాలనలో తప్ప ఈ విషయంలో ఎవరూ శ్రద్ధ వహించలేదు.

## 1.10. నీటి వసతులు:

వ్యవసాయ భూములకు సహజంగా ఏర్పడిన జలాశయాలు, తటాకాల వల్ల నీటి వసతి లభించేది. ఈ నీటిపారుదల సౌకర్యాల వల్ల రైతుల బాధలు తగ్గలేదని నాటి శాసనాలు, సాహిత్యం వల్ల తెలుస్తుంది. గుజరాత్ ప్రాంతాన్ని పాలించిన చాళుక్య చక్రవర్తి సిద్ధిరాజు జయసింహుడు అనహిల్ల పురంలో సహస్ర లింగ కొలను, అజ్మీరులో చౌహాను రాజయిన అర్ధిరాజు అనాసాగరమనే కొలను, పరమార రాజయిన బోజుడు చిత్తోర్ సమీపంలో బోజసాగరమనే తటాకాం నిర్మించారు.

భూములకు నీటిని సరఫరా చేసే నిమిత్తం ధీమదులను, మార్వారి భావులన, అహరత్తులను, పర్షియమ చక్రాలను దానం చేసినట్లుగా నాటి శాసనాలు తెలుపుతున్నాయి. మందరులో దొరికిన శిల్పాలు, రాజస్తాన్‌లో పాదలిలోని జోగేశ్వరాలయంలో పై కప్పులోని శిల్పం ఈ వృత్తాంతాన్ని ధృవీకరిస్తుంది. చక్రం మీద తిరిగే కుండల వలయాన్ని 'సాఖిమా' లేదా 'అర్ధఘట్టం' అని కూడా పిలిచేవారు. ఈ నీటి చక్రానికి లంబకోణంలో పనిచేసే పళ్ళు చక్రాన్ని చేర్చటం ముస్లింలతోనే ప్రవేశించింది.

అల్‌బెరునీ, ఇబన్ బతూతా, షహ్ బుద్దీన అబ్బాస్ అహ్మద్, అమీర్ ఖుస్రూ, షామ్సీసిరాజ్ ఆఫ్‌ష్‌లు నాటి రైతుల ప్రజల ఐశ్వర్యాన్ని వర్ణించారు. ధాన్యం ఏడాదికి మూడు పంటలు వస్తాయని, నేల సారవంతమయినది అని ఇబన్‌బతూతా పేర్కొనగా, ఆసీఫ్ ఒరిస్సా ప్రాంతాన్ని అభినందిస్తూ సైన్య అవసరాలన్నీ అక్కడ పండే ఫలధాన్యాదులు తీరుస్తాయని తెలిపాడు. కాని తరువాత రైతు స్థితి దిగజారింది.

17వ శతాబ్ది మధ్యలో వచ్చిన డచ్చి దేశీయుడైన వేల్‌సర్ట్ సామాన్యులు పేదరికంలో నివసిస్తున్నారని, వారి నివాస స్థలాలు లేమికి, విషాదానికి ఆట పట్టులని, పూరిళ్ళలో నివసించే వారిని వాడుకునే మట్టి పాత్రలు తప్ప ఇతర వస్తువులేమీ ఇండ్లలో వుండవని తెలిపాడు. 1656 నుండి 1668 వరకు భారతదేశంలో పర్యటించిన బెర్నియర్ వ్యవసాయ స్థితిని పేర్కొంటూ ఇసుక తోను, ఖాళీగా వదిలేసిన విశాల స్థలాలు అనేకాలున్నాయని, దీనికి కారణం రైతులు, కూలీలు లేకపోవడమేనని తెలిపాడు. పంటలో అధిక భాగం భూమి పన్నుగా చెల్లిచడం వలన రైతులు పేదలయ్యారు. ఇదికాక వారు జిజియా, ఇంటిపన్ను, పుల్లరి, వగైరాలు చెల్లించవలసిని ఉండేది. ఈ భారం ధనిక హిందువులతో పాటు రైతులపై కూడా పడింది. మొగల్ పరిపాలనా లక్ష్యం క్రమబద్ధమయిన ఆదాయం పెరగడం అని ఇర్ఫాన్ హబీబ్ అన్నాడు. ఈ కాలంలో ధరలు చవకగానే ఉండేవి. అధిక ధరలు గల ఐరోపా ప్రాంతంలో అమ్ముకునే అవకాశం రవాణా లేవీ ఆనాడులేవు.

వర్షాధార వ్యవసాయం చేస్తున్న రైతులు పన్నులు చెల్లించలేనప్పుడు 'దివాన్-ఇ-ముస్త ఖరాజ్' శాఖ వారి వివరాలను తెలిపేది. మధ్యయుగ లక్ష్మణమైన కఠిన వసూలు వల్ల ఈ బాకీ చెల్లించవలసిన ఆదాయానికి జమ అయ్యేది. ఈ బాకీలను

పూర్తిగా వసూలు చేయలేని అమీలులను, కార్కూను శిక్షించే వారు. మొగల్ పాలనలో కూడా బాకీలు చెల్లించని వారిని జైళ్ళలో వేసే వారని, పారిపోయిన / చనిపోయిన రైతుల బాకీలను పొరుగు వారి నుంచి వసూలు చేసే వారని ఇర్ఫాన్ హబీబ్ 'ది అగ్రేరియన్ సిస్టం ఆఫ్ మొఘల్ ఇండియాలో పేర్కొన్నాడు.

## 1.11. కరువులు:

కరువులు తరుచుగా సంభవిస్తున్నప్పటికి ప్రభుత్వం సహకారం అనుకొన్నంత స్థాయిలో లబించేది కాదు. క్రీ.శ. 1398-99 లో తైమూర్ దండయాత్ర చేసి సింధూ నుంచి డిల్లీ వరకు క్రీ.శ. 1555-56 లలో డిల్లీ-ఆగ్రాలలో, క్రీ.శ. 1573లో గుజరాత్‌లో, క్రీ.శ. 1594-98 లలో లాహోర్, కాశ్మీరులలో కరువును, క్రీ.శ.1575లో బెంగాల్ కరువు, క్రీ.శ. 1630లో గుజరాత్ దక్కన్ ప్రాంతాలలో కరువును, క్రీ.శ. 1683లో కొంకణ ప్రాంతం కరువు ప్రజలను పీడించినప్పటికీ, నివారణ చర్యలు తీసుకొనడం జరగలేదు.

దక్షిణ భారతదేశంలో ఉత్తర భారతదేశంతో పోల్చితే వ్యవసాయ రంగంలో ప్రభుత్వ జోక్యం చాలా తక్కువగా ఉండేది. సాంకేతిక పరిజ్ఞానములో గాని, భూమిని సాగు చేసే విధానంలో గాని స్థానిక పద్ధతులే కొనసాగాయి. కరువు లాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులకు ఉపశమనం కలిగించడానికి పన్ను వసూలు సంస్థలే దిద్దుబాటు చర్యలను చేపట్టి పన్ను తగ్గించటం గాని, రద్దు చేయటం గాని చేసింది. ప్రజలు మూకుమ్మడిగా వలస వెళ్ళేటప్పుడు, తమ ఇబ్బందులను ప్రభుత్వాధికారులకు విన్నవించినపుడు ప్రభుత్వం జోక్యం చేసుకునేది.

కాకతీయులు అనేక అడవులను (ప్రత్యేకించి కర్నూలు మండలములో), మార్చి నూతన గ్రామాల ఏర్పాటుకు దోహదం చేశారు. వ్యవసాయం పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఈ ప్రాంతాలలో నివశించే రైతులకు పన్ను విధించే భాగంలో ఒక క్రమ పద్ధతిని పాటిస్తూ కాలక్రమంలో పెంచుకుంటూ వెళ్ళేవారు. దక్షణ దేశంలో పాలించిన కాకతీయులు, విజయనగర రాజులు నీటిపారుదలా సౌకర్యాలు కల్పించి రైతు క్షేమానికి కృషి చేశారు. కాకతీయులు, వారి సామంతులు తవ్వించిన చెరువులలో పాకాల చెరువు, జగత్కేసరి చెరువు, కాట సముద్రం, చౌద సముద్రం, రామప్ప చెరువు ముఖ్యమైనవి. రెడ్డి రాజులు నిర్మించిన తటాకాలలో సంతాన సాగరం, జగనొబ్బ గండ కాలువలు ముఖ్యమైనవి. వాగలాపురంలోని తటకాం, తుంగభద్రపై కట్టడాలు విజయనగర శక్తికి నిదర్శవాలు.

## 1.12. వ్యవసాయ ఉత్పత్తులు:

ప్రాచీన కాలం నుండి భారతదేశ భూమిలో వరి, గోధుమ, బార్లీ, జొన్న, రాగి, సజ్జ, పప్పు ధాన్యాలు, నూనె, వంట ఆహార పదార్థాలను పండించేవారు. వరి పండే ప్రదేశాలలో ముఖ్యంగా గంగా, బ్రహ్మపుత్ర, మహానది, గోదావరి, కృష్ణ, కావేరి డెల్టా, కోస్టల్ తీరం, పశ్చిమ కనుమలకు సముద్రానికి మధ్య ప్రాంతం, మిగిలిన ప్రదేశాలలో ముఖ్యమైనవి. బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రాంతాలలో కూడా వరి పండించేవారు. బెంగాల్, ఒరిస్సా, ఆంధ్ర, తమిళనాడు, కేరళ మరియు మైసూర్ ప్రాంతాలు ముఖ్యమైన ఆహారం వరి. మిగిలిన ప్రాంతాలలో కొద్దిమంది మాత్రమే వాటిని ఆహారంగా స్వీకరిస్తూ దేశ వ్యాప్తంగా 1/3 వంతు ప్రజలు వరిని ఆహారంగా తీసుకుంటారు.

గోధుమ పంట ప్రధానంగా పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్ మరియు గుజరాత్ రాష్ట్రాలలో ఎక్కువగా పండించేవారు. మిగిలిన ప్రాంతాలలో గోధుమ పంట చాలా తక్కువ. గోధము ముఖ్య ఆహారంగా తీసుకొనే ప్రాంతాలు

ఉత్తర భారతదేశం పూర్తిగా, బెంగాల్ నుండి దక్కన్ పీఠభూమి వరకు ఉన్నాయి. 18, 19వ శతాబ్దాల నాటికి భారతదేశము నుండి గోధుమలు ఐరోపా రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి.

వరిని ఎక్కువగా ఉపయోగించి మరికొన్ని ప్రాంతాలలో చిరుధాన్యాలు ఆహారంగా స్వీకరించేవారు. మహారాష్ట్ర, మైసూర్, తమిళనాడు, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ చిరుధాన్యాలు ఉత్పత్తి చేసే రాష్ట్రాలు. ఇతర ధాన్యాలలో ప్రధానమైనవి మొక్కజొన్న మరియు భార్లీ. మొక్కజొన్న ఏ వాతావరణంలో అయినా దేశవ్యాప్తంగా పండే పంట. మొక్కజొన్న ఉత్పత్తిలో పంజాబ్ రాష్ట్రం ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. భార్లీ పంట ఉత్తరప్రదేశ్‌తో పాటు ఉత్తర భారతదేశంలో మరికొన్ని ప్రాంతాలలో పండుతుంది. వరి, గోధుమ, మిల్లెట్స్, తరువాత ముఖ్యమైన ఆహార ధాన్యాలు, పప్పులు మరియు నూనె గింజలు, శనగలు, కందులు, పెసలు, బఠాని, కుంకుమపువ్వు, పప్పుధాన్యాలు ముఖ్యమైన రకాలు. ఇవి రబీ సీజన్‌లో పండే పంటలు. నూనె గింజలు, ఆవాలు, నువ్వులు, అవిసె గింజలు మరియు ఆముదం గింజలు విరివిగా పండించేవారు. వీటి ద్వారా వచ్చే నూనెలు భారతీయ ఆహార పదార్థాలలో విరివిగా వాడుతు ఉండడం వల్ల వ్యవసాయ ఉత్పత్తి కూడా అదేవిధంగా ఉండేది.

నీల మందు, నల్ల మందు, గసగసాలు, పసుపు, పత్తి, చెరకులలో విదేశీ వ్యాపారం ఎక్కువగా సాగింది. ఉత్తరప్రదేశ్, బెంగాల్, బీహార్‌లలో చెరకు పంట, అందునుండి బెల్లం కూడా తయారు చేసేవారు. ఉత్తర దక్షిణాలలో అక్కడ కూడా, గంగా యమునా సంగమ ప్రాంతమంతటా నీలి మందు, బెంగాల్, దక్కన్ గుజరాత్ ప్రాంతాలలో పత్తి విరివిగా పండేది. రాజస్థాన్‌లోని సంభార్ సరస్సు ప్రాంతాలలో పంజాబ్‌లో ఉప్పు పండేది.

## 1.13. సాంకేతిక పరిజ్ఞానము:

గ్రామంలో ఆర్థిక జీవనం ఆదిమ వ్యవసాయ పద్ధతిపై ఆధారపడి ఉండేది. కళాకారులు, పరిశ్రమలు చాలా తక్కువ స్థాయిలో ఎదుగుబోదుగు లోకుండా ఉండే గ్రామోత్పత్తి శక్తులకు ఎద్దులు, నాగలి, గ్రామ కళాకారులు అందించే పనిముట్లు మాత్రమే సాదవాలుగా ఉండేవి. ఈ ఉత్పత్తి విధానం వల్ల శ్రామికోత్పత్తి తక్కువగా ఉండేది. అదనపు ఉత్పత్తి ఉండేది కాదు. ప్రజల మనుగడకు అవసరమయిన మేరకు ప్రభుత్వం కోరే భూమి శిస్తు చెల్లింపు మినహా భౌతిక, సాంస్కృతిక జీవన ప్రామాణాలను ఉన్నత స్థాయికి తీసుకుపోయే సమయం కూడా ఉండేది కాదు.

ఉత్పత్తి విధానంలో ఎంత బలహీనత ఉన్ననూ వైజ్ఞానికి రంగంలో కూడా గ్రామస్థులలో అలాంటి బలహీనత ఉండేది. దానికి తోడు బయట ప్రపంచానికి ఆర్థికంగా మరొక విధానం లేదు కనుక రాకపోకల పద్ధతులు సరిగా లేకపోగా ఒంటరి రాకపోకలు సౌకర్యాలు సరిగా లేకపోవటంతో ప్రమాదకరమైన వరదలు సంభవించినప్పుడు పంటలు పోయినపుడు గ్రామం నాశనమయ్యేది. కాని బయట సహాయం లభించేది కాదు.

## 1.14. సారాంశము:

ఈవిధంగా బ్రిటీష్ పాలనకు ముందు ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇది ప్రజలకూ, ప్రభుత్వానికి కూడా ప్రధానమైన ఆదాయ వనరుగా రూపొందింది. ఈ వ్యవసాయాన్ని ప్రాచీన కాలంలో నిర్వహించిన మాదిరిగానే నిర్వహించినప్పటికీ సాగు చేయడంలోను, వ్యవసాయ పరికరాల్లోను చిన్న చిన్న మార్పులు చోటుచేసుకున్నాయి. సాగులో ఉన్న భూమి విస్తీర్ణంలో క్రమమైన పెరుగుదల ఏర్పడుతూ వచ్చింది. అయితే వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుదల మాత్రం మందకొడిగా ఉండేది.

## 1.15. నమూనా ప్రశ్నలు:

1) 18వ శతాబ్ద మధ్య కాలంలో భారతదేశంలో వ్యవసాయ రంగం యొక్క స్థితిగతులను వివరించుము?

2) ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి తెలుపండి?

2) భారతీయ ఫ్యూడలిజం–ఐరోపా ఫ్యూడలిజం గురించి వివరించుము?

3) 18వ శతాబ్ద మధ్య కాలంలో వ్యవసాయ ఉత్పత్తులను గురించి వ్రాయుము?

4) వ్యవసాయంలో ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానమును తెలుపుము?

## 1.16. ఆధార గ్రంథాలు:


1. P.N. Chopra, S.B. Puri, M.N. Das: A Social cultural and Economic History of India Vol. III.
2. K. Anil Kumar, Economic History of Modern India.
3. Rad Kamal Mukarzee: The Economic History of India.
4. Prof. V. Rama Krishna Reddy, Social & Economic History of Modern India (1757-1947) Telugu.


**- డాక్టర్ జి. సోమశేఖర**

## పాఠం - 2

# బ్రిటీష్ పాలనకు ముందు భారతదేశములోని పారిశ్రామిక, వ్యాపార రంగం పరిస్థితి

**2.0. లక్ష్యము:**

బ్రిటీష్ పరిపాలనకు పూర్వము భారతదేశము నందలి పారిశ్రామిక వ్యాపార రంగం గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయక్రమము:**


2.1. పరిచయము

2.2. పరిశ్రమలు

2.2.1. వస్త్ర పరిశ్రమ

2.2.2. చేనేత పరిశ్రమ

2.2.3. పట్టు పరిశ్రమ

2.2.4. ఉన్ని పరిశ్రమ

2.3. ఆభరణాల తయారీ పరిశ్రమ

2.4. ఇతర పరిశ్రమలు

2.5. వ్యాపారము

2.6. వ్యాపారాభివృద్ధికి కారణాలు

2.6.1. ద్రవ్య వినియోగం

2.6.2. వర్తక కులాలు

2.7. దేశీయ వర్తకం

2.8. రవాణా సౌకర్యాలు

2.9. విదేశీ వాణిజ్యం

2.10. ఐరోపా వర్తకులు

2.11. సారాంశము

2.12. నమూనా ప్రశ్నలు

2.13. ఆధార గ్రంథాలు


**2.1. పరిచయము:**

ప్రాచీన కాలంలోనూ, మధ్య యుగంలోనూ భారతదేశము సుసంపన్నమై. వైభవోపేతమై అలరారుతూ ఉండేదని

విదేశీ యాత్రికుల కథనం. వ్యవసాయంలో, వర్తక వాణిజ్యాలలో, పరిశ్రమలలో ముందంజ వైచిసర్వ సమృద్ధమై ఉన్నందననే మన దేశంలో వర్తకానికి పాశ్చాత్య దేశాలు ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయి. బ్రిటీష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశం ప్రపంచ పారిశ్రామిక వర్క్‌షాప్‌గా తన ఉనికిని పొందింది. ఇక్కడ నుండి వెలవడ్డ అన్ని రకాల వస్తూ ఉత్పత్తులు దీనిని ధృవపరుస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు సాంప్రదాయక పరిశ్రమలకు కేంద్రాలుగా నిలిచాయి. గ్రామీణ పరిశ్రమలు రైతులు, తదితర గ్రామీణుల అవసరాలను తీర్చగా, పట్టణ పరిశ్రమలు ప్రభువుల, సంపన్నుల అవసరాలకు విదేశి ఎగుమతులను సమకూర్చింది.

భారతదేశంలోని పరిశ్రమలు సామాన్య ప్రజల అవసరాలకు సంబంధించిన పరిశ్రమలు, ఉన్నత వర్గాల వారి అవసరాలకు సంబంధించిన పరిశ్రమలు అని రెండు విధాలుగా ఉండేవి. గ్రామ సీమలలోని ప్రజానీకానికి కావలసిన వస్తువులను తయారు చేసి సరఫరా చేసే పారిశ్రామిక వ్యవస్థ చాలా ప్రాధమిక దశలోని పద్ధతులపై ఏర్పడినట్టిది. ఈ పరిశ్రమలకు చెందిన వృత్తి కార్మికులు సంవత్సరములో కొంతకాలం సేద్యంలో నిమగ్నులై ఉండేవారు. వారు తయారు చేసే వస్తువులకు గిరాకి తక్కువ. శ్రీమంతుల అవసరాలకు సంబంధించిన పరిశ్రమలు పట్టణాలలోను, గ్రామాలలోను కూడా బాగా వికాసాన్ని పొందాయి. శ్రేష్టములైన వస్తువులను తయారు చేసే నైపుణ్యం అభివృద్ధికి వచ్చింది.

## 2.2. పరిశ్రమలు:

భారతదేశ పరిశ్రమలను గురించి సమకాలీన మధ్యయుగ సాహిత్యంలో అనేక వివరాలున్నాయి. డిల్లీ సుల్తానుల రాజ్య స్థాపనతో ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ కార్ఖానాలో తయారయ్యే వస్తువులలో చాలా భాగం ప్రభుత్వ ఉపయోగార్ధమే. వస్తువులు మిగిలితే వాటిని బహిరంగంగా విక్రయించేవారు. ఈ రాజ్య స్థాపనకు పూర్వం పరిశ్రమలన్నీ వ్యక్తుల, వర్తక సంస్థలు నడిపినవే. వీరి పాలనలోనూ, మొగలాయీ పాలనలోనూ, దక్షిణ భారతదేశంలో పరిశ్రమలు వ్యక్తిగతం గానూ, వర్తక సంస్థల ద్వారానూ నడిచాయి.

### 2.2.1. వస్త్ర పరిశ్రమ:

మధ్యయుగ భారతదేశంలో అనేక ప్రాంతాలలో వస్త్ర పరిశ్రమ వర్ధిల్లింది. చేనేత, పట్టు, ఉన్ని వస్త్రాలు ఖ్యాతి గాంచాయి.

### 2.2.2. చేనేత పరిశ్రమ:

సాంప్రదాయకంగా భారతదేశంలోని వస్త్ర పరిశ్రమ, వ్యవసాయం తర్వాత నైపుణ్యం కలిగిన మరియు నైపుణ్యం లేని కార్మికులకు భారీ ఉపాధి కల్పించిన ఏకైక పరిశ్రమ. టెక్స్‌టైల్ పరిశ్రమ భారతదేశంలో రెండవ అతి పెద్ద ఉపాధి కల్పన రంగంగా కొనసాగుతుంది.

పురావస్తు సర్వేలు మరియు అధ్యయనాలు నాలుగు వేల సంవత్సరాల క్రితం హరప్ప నాగరికత ప్రజలకు నేత మరియు పత్తి వడకడం గురించి బాగా తెలుసు. నేయడం మరియు స్పిన్నింగ్ పదార్థాలకు సంబంధించిన ప్రస్తావన వైదిక సాహిత్యంలో కనిపిస్తుంది. తొలి శతాబ్దాలలో భారతదేశంలో వస్త్ర వ్యాపారం ఉండేది. గుజరాత్ నుండి పత్తిశకలాలు ఈజిప్టులోని సమాధులలో కనుగొనబడ్డాయి. ఇది మధ్యయుగంలో ఈజిప్టుకు భారతీయ వస్త్రాల ఎగుమతి ఉనికి సూచిస్తుంది.

గ్రామ ప్రాంతాలలో నూలువడికి, బట్టలు నేసే పనులు జాతీయ పరిశ్రమలలాగా ప్రాచుర్య వ్యాప్తులనందుకున్నాయి. నూలువడికే పనిని స్త్రీలు ప్రధానంగా తమ తీరిక సమయాల్లో చేపట్టేవారు. నూలును వడకడంతో బాటు బట్టలుగా నేయడం

కూడా గ్రామీణ ప్రాంతాల్లో బహుళ ప్రాచుర్యంలో ఉంది. అయితే సిల్క్ వస్త్రాల కంటే నూలు వస్త్రాలను ఎక్కువగా నేయడం, నూలు వస్త్రాలలో కూడా నగర వాసులకు నాజూకు లేక మేలు రకం వస్త్రాలను నేయడం కంటే, స్థానికులైన గ్రామీణులు వాడే ముతక వస్త్రాలను ఎక్కువగా నేయడం జరిగింది.

రాజులు ఉపయోగించే అనేక రకాల దుస్తులను, వాటిని తయారు చేసే స్థలాల గురించి 'మానసోల్లాస' తెలుపుతున్నది. బెంగాల్, గుజరాత్ ప్రాంత వస్తువులు ఎక్కువగా ఎగుమతి అయ్యేవి. బెంగాల్‌లోని వస్త్ర పరిశ్రమను 14వ శతాబ్దం నాటి ఇబన్‌బతూతా కొనియాడాడు. అత్యంత సున్నితమైన క్యాబిట్లు నేత వస్త్రం అతి తక్కువ ధర అయిన రెండు వెండి నాణాలకు (దినార్లు) దొరుకుతున్నదని తెలిపాడు. 15వ శతాబ్దపు మాహ్యూయన్ పట్టరుమాళ్ళను, తలకు చుట్టుకొనే వస్త్రాలను బంగారు జరీతో నేసిన పట్టువస్త్రాలను, ఆరు రకాల మేలైన నేత వస్త్రాలను పేర్కొన్నాడు. బార్బోసా కాంబే గురించి తెలుపుతూ అక్కడ ముతక, మేలైన వస్త్రాలు, వెల్వెట్టులు, శాటిన్లు, టఫేటాలు, తివాసీలు తయారయ్యేవని తెలిపాడు. కాంబే వస్త్రాలు పశ్చిమ ఐరోపాకు, దక్షిణ ఆఫ్రికాలోని బంటూ రాజ్యానికి ఎగుమతి అయ్యేవి.

17వ మరియు 18వ శతాబ్దాల చివరిలో భారతీయ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలలో దేశీయ అవసరాలకు కాకుండా, పారిశ్రామిక విప్లవం సమయంలో యూరోపియన్ పరిశ్రమల అవసరాన్ని తీర్చడానికి పశ్చిమ దేశాలకు భారతీయ ప్రత్తి పెద్ద ఎత్తున ఎగుమతులు జరిగాయి.

18వ శతాబ్దం వరకు, అంతర్జాతీయ వాణిజ్యంలో మొగల్ సామ్రాజ్యం అత్యంత ముఖ్యమైన తయారీ కేంద్రంగా ఉండేది. 1750 వరకు భారతదేశం ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో 25% ఉత్పత్తి చేసింది. మొఘల్ సామ్రాజ్యంలో అతి పెద్ద తయారీ పరిశ్రమ వస్త్ర పరిశ్రమ: ప్రత్తి వస్త్రాల తయారీ, ఇందులో ముఖ్య వస్తువులు, కాలికొలు మరియు మస్లిన్‌ల ఉత్పత్తి ఉన్నాయి. 18వ శతాబ్దం ప్రారంభంలో ప్రపంచ వస్త్ర వ్యాపారంలో బెంగాల్ 25% వాటాను కలిగి ఉన్నది.

ప్రత్తి ఉత్పత్తిలో భారతదేశం ప్రముఖమైనది. ప్రత్తి పంట ముఖ్యంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు మరియు ఉత్తరప్రదేశ్ ప్రాంతాలలో పండిస్తారు. మిగిలిన ప్రాంతాలలో కూడా అక్కడక్కడా వ్యవసాయదారులు ప్రత్తి పంటను పండించేవారు. సాధారణంగా స్త్రీలు పొలం నుండి ప్రత్తిని సేకరిస్తారు. తరువాత చేతి ద్వారా కాని, చిన్న చేతి పరికరముల ద్వారా ప్రత్తిని, గింజను వేరుచేస్తారు. ప్రత్తిని శుద్ధి చేసి చెరక అనే యంత్రము ద్వారా దారాన్ని వడకడం జరుగుతుంది. ఈ దారం వడకడంలో స్త్రీలు ప్రధాన పాత్ర వహిస్తారు. తీరిక సమయల్లో స్త్రీలు ఈ దారం వడకడంలో గడపటమేగాక ఎంతో నాణ్యత కలిగిన దారాన్ని వడకడం జరుగుతుంది. 19వ శతాబ్దంలో యంత్రము ద్వారా వడికే నూలు కంటే ఈ స్త్రీలు చేతి ద్వారా వడికే దారం ఎక్కువ నాణ్యత కలిగివుంది.

ఈ దారాన్ని నేత కార్మికుడికి అందించడంతో అతను బట్ట తయారు చేస్తాడు. భారతీయ నేత కార్మికులు వివిధ రకాలైన బట్టలను తయారు చేసి అందిస్తారు. డాకా మంచి క్వాలిటి కలిగిన మస్లిన్ వస్త్రాలను తయారు చేయడంలో ప్రసిద్ధి గాంచింది. ఎంబ్రాయిడరీ వర్క్ కూడా డాకా ప్రసిద్ధి చెందింది. దోతీలు, శారీలు తయారు చేయడంలో శాంతి పూర మరియు చంద్రకోన ప్రముఖ పాత్ర వహిస్తాయి.

మేలు రకపు నాజూకైన వస్త్రాలు, తివాసీలు, కంబళ్ళు విలాసవంతమైనవి కనుక రాజ కుటుంబీకులు, ప్రభు వర్గీయులు, వర్తకులు, సంపన్నులు అవసారాలతో భాటుగా విదేశాలకు కూడా భారీగా ఎగుమతి అయ్యేవి. బెంగాల్‌లో తయారయ్యే కాలికొలు, కోరాలు, మద్రాసులో ఉత్పత్తి అయ్యే లుంగీలు, చీరలు, డాకాలో తయారు అయ్యే జరీ బట్టలు, చోటా నాగ్‌పూర్‌లో

తెరగుడ్డలు, స్త్రీల దుస్తులు విదేశీ మార్కెట్లనెంతగానో ఆకర్షించాయి.

భారతీయ వృత్తి పనివారు పనితనంలో, సాంకేతిక నైపుణ్యంలో ఏ మాత్రం తీసిపోలేదు. 20 గజాల పొడవు, గజం వెడల్పు గల మేలి రకపు మస్లిన్ బట్ట, చేతి ఉంగరం ద్వారా వెళ్ళగల్గేది. మోటుపల్లి రేవును దర్శించిన మార్కోపోలో అను వెనిస్ యాత్రికుడు, తానక్కడ చూసిన సన్నని, నాజూకైన బట్టను ప్రపంచంలో మరెక్కడా చూడలేదనే విషయాన్ని వెల్లడించాడు.

కాలికో అద్దకం, రంగుల అద్దకం, బుటేదారి పని వస్త్ర పరిశ్రమ నాశ్రయించనవే. ఆంధ్రలోని మచిలీపట్నం ప్రాంతంలో లభించే దుంప నుంచి తయారయ్యే ఎరుపు రంగు ప్రసిద్ధి పొందింది. ఈ కాలకోలు మన దేశానికి కావలసిన వస్త్రాలు గాక ఆఫ్రికా, అరేబియా, ఈజిప్టు, బర్మా, మలక్కా, పర్షియా, టర్కీ, సిరియా దేశాలకు ఎగుమతి చేయడానికి వీలైన మేలు రకాల వస్త్రాలు తయారయ్యేవి. మైపోలియా (మచిలీపట్నం) రాజులు సహితం గర్వించదగిన దుస్తులున్నట్లు మార్కోపోలో పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్నం కంబళీలు, ముఖమల్ వస్త్రాలు తయారయ్యేవి. విజయనగర యుగం నాటి వస్త్ర వర్ణనలు ఈ పరిశ్రమ ఉచ్చస్థితిని తెలుపుతాయి.

### 2.2.3. పట్టు పరిశ్రమ:

భారతదేశంలో పట్టుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. హరప్పా మరియు చన్హు-దారోలో ఇటీవలి పురావస్తు పరిశోధనలు, స్థానిక పట్టుపురుగు జాతుల నుండి అడవి పట్టు దారాలను ఉపయోగించే సెరికల్చర్, సింధు లోయ నాగరికత కాలంలో దక్షిణాసియలో ఉనికిలో ఉందని సూచిస్తున్నాయి.

సిల్క్ అనేది సహజ ప్రోటీన్ దారం. ఈ దారంతో బట్టలు నేస్తారు. ఈ ప్రాచీన దారం ముఖ్యంగా ఫైబ్రోయిన్‌తో తయారైనది. ఈ దారం కొన్ని పురుగల గుడ్ల నుండి తయారైన లార్వా నుండి ఉత్పత్తి అవుతుంది. ఈ లార్వా తన చుట్టూ ఒక దారాన్ని అల్లుకుని కకూన్‌ను తయారు చేసుకుంటుంది. ముఖ్యంగా పట్టు పురుగుల లార్వాతో ఏర్పడే సిల్క్‌ను ఎక్కువగా వస్త్రాల తయారీకి వాడుతున్నారు. దేశంలో ప్రధానంగా మల్బరీ, టస్సర, ముగ, ఎరి అనే నాలుగు రకాల పట్టు ఉత్పత్తి అవుతుంది. వీటిలో మల్బరీ పట్టు చాలా ప్రధానమైంది.

పట్టు పరిశ్రమకు ప్రసిద్ధిగాంచిన ప్రాంతాలు బెనారస్, ఆగ్రా, లాహోర్, పాటియాలా, అమృత్‌సర్, మాల్దా, ముర్షీదాబాద్, బీర్‌బమ్, బర్ధ్వాన్, బంకుర్, మిడ్నాపూర్. తసార్ శిల్క్ తయారీలో ముఖ్యమైన ప్రదేశాలు మనబమ్ మరియు సింగ్‌బమ్. ఎరిసిల్క్ ఉత్పత్తిలో హిమాలయా క్రింది ప్రాంతాలు, మూగా సిల్క్‌కు అస్సాం ప్రసిద్ధి గాంచాయి.

బెనారస్ మరియు ఆగ్రా ప్రాంతాలు బ్రహ్మాండమైన ఎంబ్రాయిడరీ సిల్క్ బట్టల తయారీలో ప్రసిద్ధి గాంచాయి. ఇంకా బళ్ళారి, మైసూర్ తానా ప్రాంతాలు కూడా పట్టు వస్త్రాల తయారీలో ముఖ్యమైన ప్రదేశాలు. అయితే ఈ పట్టు వస్త్రాలు ఖరీదు అవడం వల్ల ధనికులు, మధ్య తరగతి వర్గం వారు మాత్రమే ముఖ్యంగా వివాహాది శుభకార్యక్రమాలలో ఉపయోగించేవారు.

### 2.2.4. ఉన్ని పరిశ్రమ:

రాజస్థాన్‌లోని పశ్చిమ ప్రాంతాలు, కాశ్మీరులో ఉన్న పరిశ్రమ అభివృద్ధి చెందింది. ఉన్ని వస్తువుల తయారీలో అక్బర్ శ్రద్ధ కనబరచినట్లు అబుల్‌ఫజుల్ తెలిపాడు. ఎరుపు, తెలుపు రంగుల విలువైన ఉన్నిని ఇచ్చే 'టస్' అనే జంతువును అబుల్ ఫజుల్ పేర్కొంటూ, దానితో తయారైన శాలువాలు మెత్తగా, తేలికగానూ, వెచ్చగానూ ఉండేవని తెలిపాడు. మొదట కాశ్మీరులో మాత్రమే తయారయ్యే ఈ శాలువాలు త్వరలోనే అక్బర్ ఆదరణతో పంజాబ్, లాహోర్‌లో సహితం తయారయ్యేవి. గొర్రెల నుండి సేకరించిన ఉన్నిని ముడిసరుకుగా ఉపయోగించి ఉన్ని వస్త్రాలను తయారు చేస్తారు.

నాణ్యత కలిగిన కాశ్మీరు శాలువాలకు అవసరమైన మేలు రకానికి చెందిన ఉన్నిని టిబెట్, మధ్య ఆసియా దేశాల నుండి దిగుమతి చేసుకుంటారు. లాహోర్, లూధియానా, అమృత్‌సర్ ఉన్ని వస్త్రాల తయారీకి ప్రసిద్ధి గాంచినవి. బ్లాంకెట్స్, శాలువాలు, స్వెట్టర్స్, గ్లౌసస్, మఫ్లర్స్ లాంటి బట్టలు అన్నీ ఈ ఉన్నితో తయారు చేస్తారు. పంజాబ్, కాశ్మీర్ మరియు రాజస్థాన్ ప్రాంతాలలో స్త్రీలు ఎక్కువగా ఉన్ని వస్త్రాల తయారీలో ప్రధాన పాత్ర వహించేవారు.

## 2.3. ఆభరణాల తయారీ పరిశ్రమ:

గృహ పరిశ్రమలలో బంగారు వెండి పనులు, రత్నాభరణాల పనులు పేర్కొనదగినవి. ముత్యాలు, రత్నాలు మున్నగు వాని నాణ్యమును గురించి ఇండియాలో శిల్పులకు గల విజ్ఞానం ప్రపంచంలో మరెవ్వరికీ లేదు. బంగారు నగలు తయారు చేసేవారు, మనులకు సాన పెట్టేవారు. రత్న పరీక్షకులు ఉండేవారు. వీరికి ప్రత్యేకమైన వీధులు, దుకాణాలు ఏర్పడి ఉన్నాయి అని పైరార్డ్ అనే విదేశీయుడు వ్రాశాడు.

## 2.4. ఇతర పరిశ్రమలు:

రైతు కుటుంబాలు కాక గ్రామంలో పారిశ్రామిక కార్మికులుండేవారు. కమ్మరి, వడ్రండి, కుమ్మరి, నేత, చెప్పులు కుట్టేవారు, బట్టలు ఉతికేవారు, నూనే తీసేవారు, క్షురకర్మ చేసేవారు ఉండేవారు. వీరంతా గ్రామస్తుల అవసరాలు తీర్చే నిమిత్తం పని చేసేవారు. గ్రామ కళాకారుడు తనకు కావలసిన ముడి సరుకులలో కట్టె, మట్టి వంటివి స్థానికంగా సేకరించుకునేవాడు. గ్రామ పోలిమేరలలో ఉండే అడవులలో కట్టెలు లభించేవి. జంతువుల మృత కళేబరాల నుండి చెప్పులు కుట్టేవాడు తోళ్ళను సేకరించేవాడు. ఇనుము మాత్రం కొన్ని సమయాలలో దిగుమతి చేసుకునేవారు. గ్రామ సమాజ వృత్తులకు సంబంధించిన ముడి సరుకు అంతా స్వయం సమృద్ధి గానే లభించేది.

గ్రామ స్వయం సంపూర్ణత పూర్తిగా సమకూరటానికి ముడి సరుకు కూడా అందుబాటులో ఉండేది. గ్రామ ప్రాంతంలో పెరిగే చెట్టు కలపను ఇళ్ళకు, పరికరాలకు వాడేవారు. హస్త కళలన్నీ శతాబ్దాలుగా వంశపారం పర్యంగా వచ్చినవి. నాడు ప్రజలకు తెలిసిందల్లా సాధారణ వ్యవసాయ పరికరాలు, చేతి పనుముట్ల మాత్రమే. కొడవలి, నాగలి, రంపం, ఉలి రాట్నం, మగ్గం లాంటి పరికరాలన్నీ తక్కువ సమయంలో సాధారణంగా దొరికిన ముడి పదార్థంతో తయారు చేసినవి. ఇవి కొన్ని తరాల వరకు పని చేసేవి.

బ్రాహ్మణుడు మత కర్తవ్యాన్ని నిర్వహించేవాడు. పిల్లలకు చదవడమూ, రాయడమూ ఇసుకపై నేర్పేవాడు బడి పంతులు. ఏతలకు, కోతలకు మంచి చెడ్డలను చూసేవాడు జ్యోతిష్కులు. వడ్రంగి, కమ్మరి వ్యవసాయపు పనిముట్లను, గృహోపకరణాలను తయారు చేయడం, బాగు చేయడం కర్తవ్యంగా పెట్టుకున్నారు. గ్రామంలోని కుటుంబాలన్నిటికి కమ్మరి మట్టి పాత్రలను అందించేవాడు. క్షురకుడు, రజకుడు, విశ్వకర్మ గ్రామంలో అవసరాలు చూసేవారు. వీరందరూ సమాజ పోషణలో ఉండేవారు. వేతన కార్మికులు గాక స్వతంత్రంగా ఉత్పత్తి చేసే వస్తువులను చేతి వృత్తుల వారు తమకవసరమైన పనిముట్లను, ముడిసరుకును సమకూర్చుకొని తమ స్వస్థలాలలో తయారు చేసిన వస్తువులను అమ్మకానికి తెచ్చేవారు. మేకనాలపై ఆధారపడి పని చేసే కార్మికులు యజమానులిచ్చే ముడి సరుకుతో వస్తువులను తయారు చేసేవారు. వీరు యజమానుల నిర్ణయానుసారం మాత్రమే వస్తువులను తయారు చేసేవారే గాని మార్కెట్లను దృష్టిలో ఉంచుకుని మాత్రం కాదు

పట్టణ పరిశ్రమలో వస్తువుల ఉత్పత్తి చాలా పరిమితంగా ఉండటం పేర్కొనదగిన అంశం. ప్రజల నిత్యావసారాలకు గాక పైన పేర్కొన్న సంస్థలు, మరియు సమాజ వర్గాల కోసం మాత్రమే వస్తువులను తయారు చేసేవారు. కాబట్టి ఉత్పత్తి

స్వభావం పరిమితంగా ఉండేది. స్వయం సంపూర్ణ గ్రామాలలో నివసిస్తున్న ప్రజావసరాలకు స్థానిక ఉత్పత్తిదారులు గ్రామ పరిశ్రమల ద్వారానే తీరుస్తుండేవారు.

నగరాలలో పారిశ్రామిక వర్గాలు తమ ఉత్పత్తులను గ్రామాలకు తీసుకుని వెళ్ళలేకపోయాయి. దీనికి ప్రధాన కారణం గ్రామంలోని స్వయం సంపూర్ణత గల ఆర్థిక ప్రధానమే కారణం.

భారతదేశంలో వస్త్ర పరిశ్రమ ప్రధానమైనది. వివిధ రకాలైన బట్టలునేవళి, సిల్కువి అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయి. వాటి కోసం విదేశీయులు తపించేవారు. 13, 14, 15వ శతాబ్దాలలో లోహం, రాతి పనులు, జక్కర, నీలిమందు, తోళ్ళ పరిశ్రమలు, భారతదేశంలో పేరుగాంచాయి. అద్దకం దేశంలోని అనేక ప్రాంతాలలో ముఖ్య పరిశ్రమగా కొనసాగింది. చాలా కేంద్రాలలో జలతారు పని, వివిధ రకాలైన అంచుకుట్లు, పరిపూర్ణత సాధించాయి.

సీసం, పాదరసం, ఇనుప గనులు, చెప్పుకోదగిన ముఖ్యమైన పరిశ్రమలుగా ఉండేవి. గాజు వస్తువుల పరిశ్రమ దేశీయంగా ఎంతో ఉన్నత స్థాయితో ఉండేది. ఇనుప వస్తువుల మేలి గుణాలను యాత్రికులు మెచ్చుకునేవారు. రసాయనిక పరిశ్రమలు కూడా కొనసాగాయి. భారతదేశ దంతపు పరిశ్రమ కూడా విదేశీయుల పన్నులను పొందింది. వీటి నుండి తయారు చేసిన నగలు, ఉంగరాలు, పాత్రలు, పూసలు లాంటి వస్తువులు ఐరోపా వారిని ఆకర్షించాయి. విలువైన రాళ్ళపై చెక్కిన నగిషీలతో ఎంతో పనితనం కనిపించేది.

గ్రామంలోని పరిశ్రమల ఉత్పత్తి కేవలం గ్రామ ప్రజల అవసరం నిమిత్తం మాత్రమే తయారు చేయగా, నగరాలలోని పరిశ్రమల వస్తు ఉత్పత్తి సంపన్నులకు, సౌభాగ్యవంతమైన వర్తక వర్గానికి సరఫరా చేసేవి. సైన్యానికి అవసరమైన సామాగ్రిని సిద్ధం చేయటం, యుద్ధ సామాగ్రితో పాటు సైనిక కోటల నిర్మాణం వీరు చేపట్టేవారు. మహోన్నతమైన రాజ భవనాలు, గంభీరమైన దేవాలయాలు, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అరుదైన శిల్ప కళాఖండాలు వీరు నిర్మించారు. నీటి పారుదల సౌకర్యాల కోసం కాలువల తవ్వకం కూడా నగర పరిశ్రమే చేపట్టింది.

బ్రిటీష్ వారికి పూర్వం కొన్ని శతాబ్దాలుగా నగరాలలో ఉన్ని చేతి వృత్తులు చాలా ఉన్నత స్థాయికి చేరుకున్నాయి. వాటి ప్రాశస్త్యం, కళాత్మక లక్షణం, దూరదేశాలకు కూడా వ్యాపించింది. ఫలితంగా భారత పరిశ్రమలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. వి.ఎఫ్. కాల్వర్టన్ మాటలలో "ప్రాచీన కాలం నుండి భారతీయ వస్త్రాలు, తివాచీలు, ముత్యాలు, కప్పుల అలంకరణలు, ఎనామిల్ రంగులు, రోమ్ నగరంలోని ప్రభుత్వ ప్రయివేటు భవనాలకు వన్నె తెచ్చాయి. పారిశ్రామిక విప్లవం ఆరంభం వరకు కూడా భారతీయ వస్త్ర సామాగ్రి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

## 2.5. వ్యాపారము:

బ్రిటీష్ పాలనకు ముందు గల వర్తక, వాణిజ్యాలను జాతీయ వర్తకం, అంతర్జాతీయ వర్తకం అని రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటిది దేశం లోపల అంటే ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి మధ్య జరిగే వర్తక కార్యకలాపాలను సూచిస్తుంది. రెండోది ఇతర దేశాలతో ముఖ్యంగా పశ్చిమ, ఆగ్నేయాసియా దేశాలతో జరిగే వర్తక కార్యకలాపాలను సూచిస్తుంది.

అనంతమైన చిన్న, స్వయం సంపూర్ణ గ్రామాల మధ్య కొన్ని నగరాలు తలెత్తి కొనసాగినవి. ఈ నగరాలు మూడు విధానాలు: రాజకీయ ప్రాధాన్యం కలవి, మత ప్రాముఖ్యత కలవి, వాణిజ్య విలువలు ఉన్నవి.

## 2.6. వ్యాపారాభివృద్ధి కారణాలు:

మధ్య యుగంలో నగరాల సంఖ్య అమితంగా పెరిగింది. రాజకీయ ప్రాధాన్యం గల నగరాలు సామ్రాజ్య రాజధానులు.

అవి ప్రభుత్వ స్థానాలు గాను, యువరాజుల, రాజుల కేంద్ర ప్రాంతాలుగాను ఉంటుండేవి. వాటిలో ఉన్నత ప్రభువులు, సేవా ప్రముఖులు వివిధ రాజ్యాధికారులు ఉంటుండేవారు. చిత్తూరు, అజ్మీరు వంటి నగరాలు అక్కడ గల కీలకమైన కోటల ద్వారా ప్రసిద్ధి చెందాయి. కనోజ్, ధారా వంటి ప్రదేశాలు రాజధానులు కావడం వల్ల ప్రసిద్ధి పొందాయి. కాశి, మధుర, పూరీ, నాసిక్ మత, యాత్రా కేంద్రాలు కొన్ని ఉండేవి. యాత్రికుల అవసరాలు చూపే జనాభా ఇక్కడ నివసించేది. సముద్ర తీరాలలోను నౌకాయానానికి అనుకూలించే నదీ తీరాలలోను, వాణిజ్య రహదారి కూడలులలోను వాణిజ్యపు ప్రాధాన్యం కల నగరాలు ఉండేవి. కోస్తా ప్రాంతంలో గల కాంబే, బరోచ్, సోపారా, తామ్రులి మచిలీపట్నం వాణిజ్య నగరాలు.

ఈ నగరాలలో వివిధ చేతి వృత్తులు విలసిల్లినవి. 'కాల్వరవ' అభిప్రాయం ప్రకారం పాశ్చాత్య దేశాల కంటే బాగా అభివృద్ధి చెందిన, భారత పరిశ్రమల్ని నాటి మేధావులు, సుసిరత బుద్ధి జీవులు, సృజనాత్మక క్రియాశీలులు వీటిని స్థాపించారు. పశ్చిమ దేశాలలో నౌకాయానం ఇంకా పెంపొందక ముందు చాలా బరువుల్ని రవాణా చేయగల నౌకలను, తొలి శతాబ్దాలలోనే ఇక్కడ నిర్మించారు.

అనేక మంది రాజులు, సుల్తానులు నూతన నగరాలను నిర్మించారు. ఆజ్మీర్‌ను విజయరామ రాజు నిర్మించగా, ఫిరోజాబాద్‌ను ఫిరోజ్ తుగ్లక్ నిర్మించాడు. నాగాలాపురాన్ని శ్రీకృష్ణదేవరాయలు, ఫతేపూర్ సిక్రిని అక్బర్ నిర్మించాడు. ఇలా అనేక నగరాలతో పాటు ప్రజల యొక్క జీవన ప్రమాణం కూడా పెరగడం వల్ల అక్కడ వ్యాపార మార్కెట్‌లు ఆవిర్భవించాయి.

**2.6.1. ద్రవ్య వినియోగం:**

భారతదేశంలో లభించే వివిధ లోహాల నాణాలు మధ్యయుగంలో ద్రవ్య వినియోగం గురించి తెలియజేస్తాయి. ముస్లింలకు పూర్వం దీనారాలు, సువర్ణాలు, ద్రమ్మలు, ద్రమ్మార్థలు, రూపకాలు వాడుకలో ఉండేవి. రోమన్ డెనరియస్ నుంచి 'దీనారా' అనే పదాన్ని గ్రీక్ మాటైన డ్రబ్మా నుండి ద్రమ్మ అనే పేరు భారత్‌లో నాణెములకు కలిగింది. అలేకర్ అభిప్రాయంలో దినారానా బంగారు నాణెం బరువు 3/4 తులం ఉంటుందని పేర్కొన్నాడు. సువర్ణ లేదా నిష్క అని పిలువబడే బంగారు నాణెం 144 గింజల బరువు గల నాణెం. రాజస్థాన్, గుజరాత్‌లలో ఈ నాణెం క్రీ.శ. 1299 వరకు కొనసాగింది. వృషభ, వరాష్ మొదలయినవి ఇతర నాణాలు అన్నిటికంటే తక్కువ విలువగలది గవ్వ.

సుల్తానుల నాణాలలో ఇస్లాం సూక్తులు, చిహ్నాలు ఉండేవి. దిల్లీలో ప్రచారంలో గల నాణాలను జిటాలులనే పేరుతో సుల్తానులు కొనసాగించారు. అరేబియా దోపు నాణాల మాదిరి నాణాన్ని ఇల్‌తుత్ మిష్ తొలుతగా ముద్రించాడు. ఈ ఎంది టంకా అరబిక్ శాసనంను కలిగి ఉంది. మహ్మద్ భీన్ తుగ్లక్ క్రీ.శ. 1239–30లో రాగి, ఇత్తడి, కంచు ముద్రణ చేపట్టాడు. 13వ శతాబ్దంలో చైనాలో ఇటువంటి ప్రయోగం విజయం పొందడం వల్ల అతడు ఈ ప్రయత్నం చేశాడు. అయినా ఇది విఫలమే అయ్యింది.

16వ శతాబ్దంలో మొగల్ రాజైన బాబరు పర్షియా నాణెమయిన 'టుమన్' ను ప్రవేశపెట్టాడు. అక్బర్ నామా ప్రకారం ఈ నాణేనికి కాలక్రమంలో విలువ మారుతూ వచ్చింది. షేర్షా ప్రవేశపెట్టిన వెండి రూపాయి నాణెం బరువు 180 ధాన్యం గింజలు. అందులో 175 గింజల బరువు మేలిమి వెండి గల్గిన ఈ నాణేం ఆంగ్ల తూర్పు ఇండియా వర్తక కంపెనీ క్రీ.శ. 1835 వరకు ఆమోదించబడింది అక్బర్ నాణేలు శుద్ధ లోహ మిశ్రమానికి, సరిఅయిన తూనికలు, కళాత్మకతకు మారుపేరై ఉన్నవి. దిల్లీ, బెంగాల్, లాహోర్, జానాపూర్, అహ్మదాబాద్, పాట్నా ముద్రణాలయాల నుంచి అనేక నాణేలను ముద్రించడమైనది. 28 రకాల బంగారు, 9 రకాల వెండి నాణేలను ప్రవేశపెట్టారు.

భారతీయ నాణేలలో వెండి, బంగారు లోహాల బరువే అధికమని ఇతర లోహ మిశ్రమ భాగం తక్కువని, పేరొందాయి. బంగారు వెండికి విలువలో గల భేదం ఔరంగజేబు కాలానికి అధికమైంది. దక్షిణ భారతదేశంలో ప్రధానంగా మాడలు, గద్యాణములు, చిహ్నం, రూక, వరాహ, మెషరీలు, గవ్వలు మొదలైనవి. కాకతీయ యుగంలో నిష్క అనే నాణెం అమలులో ఉండేది. విజయనగర కాలంలో అనేక నాణేలు ఇష్టదైవాల్ ముద్రలతో ప్రచారంలో ఉండేవి. దక్షిణ భారతీయ నాణేలు బర్మాలో కూడా లభించాయి.

మధ్యయుగ భారతదేశంలో శక్తివంతమైన సంస్థలు ప్రసిద్ధి అధికంగా కనిపించింది. స్వదేశీయ, విదేశీయ వ్యాపారం వీటి ఆధ్వర్యంలోనే జరిగేది. 'నాన దేశాలు, పర దేశాలు' అనబడే వర్తక సంస్థలు కొనసాగినట్లు తెలుస్తుంది. నకరాలనే సంస్థలు వ్యాపారాభివృద్ధికి తోడ్పడ్డాయి. మధ్య యుగం నాటి భారత ప్రజలకు ధనంలో అధిక భాగాన్ని లాభసాటి పెట్టుబడిగా ఉపయోగించే పద్ధతులు తెలియవు. తమ వద్ద మిగులుగా ధనమున్నా దానిని లాభరహితంగా ఖర్చుపెట్టడమో లేదా ఎవరికి తెలయని స్థలంలో దాచడమో చేసేవారు. డబ్బులో లాభసాటి వ్యాపారం చేసేవారు. పెద్ద పరిశ్రమలను నెలకొల్పడం ప్రభుత్వం చేసేది. వడ్డీ వ్యాపారస్థులు మాత్రమే పెద్ద మొత్తాలను అప్పుగా ఇచ్చేవారు.

దక్షిణ భారతదేశంలో దేవాలయ సంస్థలు ప్రజల నుంచి మిగులు దనాన్ని అంగీకరించడం, వడ్డీలివ్వడం, అవసరమైనవి వారికి వడ్డీలివ్వడం చేసేవి.

### 2.6.2. వర్తక కులాలు:

వ్యాపారం చేసే వారిలో అధిక భాగం వైశ్యులు, చెట్టీలు, గుజరాతీలు, బంజారాలు, కేరళీయులు, బనియాలు, మహజన్‌లు, శ్రేష్టలు ఉండేవారు. మార్కోపోలో వర్తకుల గూర్చి పేర్కొంటూ మాఖారులోని వర్తకులు తమ 13 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు సహితం ధనం ఇచ్చి సముద్ర తీరానికిపోయి, జాలర్ల నుండి ముత్యాలను కొని, పెద్ద వర్తకుల వద్దకు వెళ్ళి కొంత లాభానికి అమ్మి, వ్యాపారం జ్ఞానం పెంచుకోమని చెప్పే వారిని వివరించడం జరిగింది.

అదేవిధంగా ప్రపంచంలోని అందరు వ్యాపారస్థుల కన్నా గుజరాతీ వర్తకులు నమ్మదగనివారని, విదేశీ వర్తకులకు వీరు 'కమీషన్' లేకుండా లాభం వచ్చేటట్లు వస్తువులను అమ్మే వారని, వారు సంతోషంతో ఇచ్చే సొమ్మేతప్ప వేరే అడిగే వారు కాదని పేర్కొన్నాడు.

## 2.7. దేశీయ వర్తకం:

గ్రామములో ఉత్పత్తి అయిన వస్తువుల మధ్య జరిగే మార్పిడి కూడా గ్రామానికి పరిమితమయ్యేది కనుక వస్తువుల విస్తృతి కూడా పరిమితంగానూ ఉండేది. ఉత్పత్తి అయినదంతా గ్రామంలోనే వినిమయమయ్యేది. గ్రామోత్పత్తి, మార్పిడి స్వభావాల గురించి హెలవంకర్ ఇలా చెప్పాడు. "వ్యక్తుల మధ్య మార్పిడి జరిగేదనడం అంతే సరికాదు. రైతులు అవసరమైనప్పుడు వ్యక్తిగతంగా కళాకారుల దగ్గరకు వెళ్ళేవారు. కాని కళాకారులు సేవకులకు బదులు ఇచ్చేది వ్యక్తిగతంగా విడివిడిగా అంచనా వేసేవారు కాదు. ఈ సేవలను దృష్టిలో పెట్టుకొని మార్పిడి సమయంలో కొంత ధాన్యాన్ని ఇవ్వడం లేదా కొంత భూమిని శాశ్వతంగా ఇచ్చి వేయటమే జరిగేది. ఈ విధంగా మార్పిడి విధానంలో రైతు ఒక వ్యక్తిగా కాక గ్రామంలో సమిష్టి వ్యవస్థగా పనిచేసేవాడు. ఇదేవిధంగా కళాకారులు కూడా ఉత్పత్తి విధానంలో వ్యక్తిగా కాకుండా గ్రామం నియమించిన ప్రజా సేవకులుగా వ్యవహరించేవారు".

ఈ విధంగా గ్రామంలో జరిగే మార్పిడికి బయట ప్రపంచానికి సంబంధాలు లేనందు వల్ల వాణిజ్యమంటూ ఏమి ఉండేది కాదు. స్థానిక ఉత్పత్తి అంతా స్థానిక శ్రమ శక్తితో తయారు కాగా స్థానికంగానే సంపద అంతా అనుభవించేవారు. గ్రామానికి బయట ప్రపంచానికి మార్పిడి అనల్పంగా ఉండేది. వర్తకం అంటూ ఉంటే సాధారణంగా వారానికి ఒకరోజు పెద్ద గ్రామంలో సంత ద్వారా వివిద వస్తువులను వివిధ కేంద్రాల నుండి సేకరించేవారు.

వర్తక వాణిజ్యాలు వృద్ధి చెందడం, వ్యవసాయేతర ఉత్పత్తులు పెరగడం, పట్టణ కేంద్రాలు వృద్ధి చెందడానికి దోహదపడింది. బ్రిటీష్ పాలనకు ముందు భారత దేశములోని పట్టణ కేంద్రములను పరిపాలనా, యాత్ర స్థలాలు, వాణిజ్య కేంద్రాలుగా విభజించవచ్చు. ఆగ్రా కేవలం పాలనాపరమైన కేంద్రంగానే కాకుండా వాణిజ్య కేంద్రంగా కూడా ఉండేది. 16, 17 శతాబ్దాలు పట్టణీకరణకు స్వర్ణ యుగం లాంటిది. ఈ కాలంలో పట్టణ సంస్కృతి భాగా వికసించి వాణిజ్యానికి అనుకూలమైన రాజకీయ పరిస్థితులు ఏర్పాటు చేయడం వల్ల ఇది సాధ్యమైంది. అదేవిధంగా అభివృద్ధి చెందిన పట్టణ కేంద్రాలు తిరిగి వాణిజ్యం విస్తరించడానికి దోహదం చేశాయి.

ఈ పట్టణ కేంద్రాలకు సంపద చేకూర్చి పెట్టిన నూలు వస్త్రాలు ఉత్పత్తిలో ఈ విషయం స్పష్టమవుతుంది. బెంగాల్‌లో డాక్కా, ముషీరాబాద్, గుజరాత్‌లోని సూరత్, అహ్మదాబాద్, బ్రోచ్, మహారాష్ట్రలో బర్హాంపూర్, ఉత్తరప్రదేశ్‌లో లక్నో, ఆగ్రా, పంజాబ్‌లో ముల్తాన్, కోరమాండల్‌లో మచిలీపట్నం, శ్రీకాకుళం, మద్రాసు, కోయంబత్తూర్, మదురైలు ప్రముఖ జౌళి పరిశ్రమల కేంద్రాలుగా రూపొందాయి.

ముస్లిం కులీనుల పట్టణ స్వభావం వర్తకంలో వారికున్న ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం వల్ల వారు నగరాల్లో నివసించేవారు. ఫలితంగా వారు ఎంతోమంది చేతి పనివాళ్ళను నగరానికి ఆకర్షించారు. ఉపాధి అన్వేషణలో ముకనంగా కార్ఖానాల్లో పనిచేయడానికి చేతి పనివారు నగరానికి రావడం సహజమైపోయింది.

## 2.8. రవాణా సౌకర్యాలు:

జాతీయ వర్తకానికి అత్యంత ఆవశ్యకమైనది రవాణా సౌకర్యం. ఆనాడు రెండు రకాల రవాణా సౌకర్యాలుండేవి. అవి భూ మార్గం, జల మార్గం. బ్రహ్మపుత్ర, గంగ, గోదావరి, కృష్ణ, కావేరి నదులలో జల రవాణా వ్యవస్థ ఉండేది. ఈ రవాణా వ్యవస్థ వల్ల విభిన్న ప్రాంతాల మధ్య అనుసంధానం సులభతరమైంది. పెద్ద పెద్ద బల్ల కట్టలను ఉపయోగించి సరుకులను ఒక చోట నుండి మరియొక చోటుకి తరలించేవారు. రోడ్డు రవాణా కొంత వ్యయభరితమైనందువల్ల జల రవాణా వైపు మక్కువ చూపేవారు. వివిధ రకాల రవాణా సుంకాలు వివిధ ప్రాంతాల్లో ఉండడం వల్ల ఈ రకం రవాణా వ్యయభరితమైనది. బంజారాలు కూడా చిడారుల ద్వారా అధిక మొత్తంలో సరుకులను ఒక చోట నుండి మరొక చోటుకి తరలించేవారు.

షేర్షా అనేక మార్గాలను వేయించి, వివిధ ప్రదేశాలను కలిపాడు. వీటిలో ముఖ్యమైనవి సోనర్గాల్ హిందు మార్గం, ఆగ్రా–జోద్‌పూర్ మార్గం, ఆగ్రా–బర్హాంపూర్, లాహోర్–ముల్తాన్ మార్గాలు. వర్తకులకు షేర్షా రక్షణ సదుపాయాలు కల్పించాడు. గ్రామాలలో జరిగే నేరాలకు దొంగతనాలకు గ్రామ పెద్దలదే భాధ్యత. నిర్ణీత కాలంలో కనుక గ్రామ పెద్దలు నేరస్థులను పట్టలేకపోతే, వారు శిక్షింపబడేవారు. ఈ విధానాన్ని ప్రశంసిస్తూ, పెరిస్తా వర్షాకాలంలో ప్రయాణికులు, వర్తకులు తమ ధనాన్ని దారిలోనే ఉంచి, దొంగతనం భయంలేక నిద్రించేవారని తెలిపాడు.

అక్బర్ కాలం నాటి వర్తక మార్గాలలో ప్రముఖమైనవి సూరత్ నుండి ఆగ్రా వరకు, ఆగ్రా నుండి అలహాబాద్, పాట్నాల మీదుగా బెంగాల్ వరకు గల మార్గాలు, సూరత్ నుంచి ఆగ్రా మార్గం, ఆగ్రా నుండి అయోధ్య మార్గం, ఆగ్రా నుండి

పర్షియా వరకు గల మార్గం, పాట్నా నుండి ఖాట్మండ్ వరకు గల మార్గం, ఆగ్రా నుంచి దౌలతాబాద్ మీదుగా గోల్కొండ మార్గం, గోల్కొండ నుండి మచిలీపట్నం మార్గం, మలబార్ నుండి కొబ్బరికాయలు, సుగంధ ద్రవ్యాలు, ఇనుము, తాటచక్కర, గంధం చెక్క మొదలైనవి డయ్యూకి ఎగుమతి అయ్యేవి. బెంగాల్‌లోని ఉన్ని వస్త్రాలు, చక్కర మలబార్, కంచి లకు ఎగుమతి చేయబడింది.

## 2.9. విదేశీ వాణిజ్యం:

బ్రిటీష్ పాలనకు ముందు భారతదేశానికి ఇతర దేశాలలో పటిష్టమైన వర్తక సంబంధాలు ఉండేవి. భూ మార్గం ద్వారా మధ్య ఆసియా, అరేబియాలతో సముద్ర మార్గం ద్వారా సింహళము, బర్మా, ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలుండేవి. ఐరోపా వర్తకులయిన పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీష్ వారి రాకతో వర్తక సంబంధాలు అభివృద్ధి చెంది భారతదేశం లాభాలార్జించేవి. రేవు పట్టణాలైన గోవా, భట్కల్, మద్రాస్, బొంబాయి, కలకత్తా, మచిలీపట్నం ఆధిక్యతను పొందాయి.

భారతదేశం నుండి ఎగుమతి అయ్యే ముఖ్య వస్తువులు వస్త్రాలు, ఆభరణాలు, విలాస వస్తువులు, సుగంధ ద్రవ్యాలు, దంతపు వస్తువులు, పరిమళ ద్రవ్యాలు మొదలయినవి. దిగుమతులలో ప్రధానమైనవి బంగారు, ముత్యాలు, డేట్స్, సాంబ్రాణి, ఉన్ని వస్త్రాలు, గుగ్గిలం, గుర్రాలు, నీలిమందును టర్కీకి, ఇతర ఐరోపా దేశాలకు ఎగుమతి చేసేవారు. అవద్, అలహాబాద్, ఆగ్రా, లాహోర్, ముల్తాన్, మాళ్వా, డిల్లీ, అజ్మీర్, సింధు, దక్కన్‌లలో నీలిమందు విస్తారంగా పండేది. బెంగాల్‌లో పండే నీలిమందును డచ్చి వారు మచిలీపట్నం రేవు నుండి ఎగుమతి చేసేవారు.

అరేబియా, మెసపటోమియా, పర్షియా దేశాలకు బెంగాల్ నుండి చక్కెర ఎగుమతి అయ్యేది. గసగసాలను పెగుకూ పంపేవారు. ఆగ్రా, అవధ్, అలహాబాద్, డిల్లీ, లాహోర్, ముల్తాను, మాళ్వా, అజ్మీరు, దక్కన్‌లలో ఎక్కువగా పండే ఈ గసగసాల నుండి నల్లమందు తీసేవారు. అడవులలో లభ్యమయ్యే జిగురైన లత్తుక వ్యాపార వస్తువులలో ప్రసిద్ధమైంది. ఇంటిలోని సామాగ్రికి, బొమ్మలకు, తలుపులకు, కిటికీలకు రంగు వేయటానికి దీనిని ఉపయోగించేవారు. గుజరాత్ లత్తుకకు ప్రసిద్ధమైన ప్రాంతము.

ఆంగ్లేయులు, డచ్చివారు ప్రతి ఏటా 150 పెట్టెలనిండా దీనిని కొని, వ్యాపారం చేసేవారు. దీనిని డచ్చివారు పర్షియాకు ఎగుమతి చేసేవారు. మలబారు ప్రాంతంలో సుగంధ ద్రవ్యాలు అధికముగా పండేవి. బిజాపూరు యలుక్కాయలకు పేరుగాంచినది. బిజాపూర్, మలబార్, కొచ్చిన్, బీహార్, బెంగాల్‌లో మిరియాలు అధికంగా ఉత్పత్తి అయ్యేవి. ఐరోపా వర్తకులు మన దేశానికి రావడానికి ఇవే ప్రధాన కారణము. లవంగాలకు, జాజికాయలకు సూరత్ ప్రసిద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడ నుండి ఇవి ఐరోపాకు ఎగమతి అయ్యేవి. కార్నిలియాన్ పూసలు కాంబే నుండి ఐరోపా, తూర్పు ఆఫ్రికాలకు పంపేవారు.

పోర్చుగీసు వారు గోవా రేవును గుర్రాల విక్రయ వ్యాపార స్థలంగా కొనసాగించారు. గుజరాత్‌లోని రాండర్ రేవు వద్ద చైనా, మలక్కాల నుండి తెచ్చిన వస్తువులను విక్రయించేవారు. దక్కను రేవు అయిన దబోల్‌లో విదేశీయ రాగిని దిగుమతి చేసుకునేవారు. డోమింగో ఫేస్ రచనల ద్వారా భట్కల్ నుండి విజయనగరం వరకు వ్యాపారం సంవృద్ధిగా జరిగేదని, ప్రతి సంవత్సరము ఐదు నుండి ఆరు వేల ఎడ్లబండ్లు పూర్తిగా సరుకుతో నిండి ప్రయాణము చేసేవని తెలుస్తున్నది. బార్బోసా రచనల ద్వారా విజయనగర రాజ్యం దక్కను నుండి వజ్రాలను పేగూసిలోన్‌ల నుండి ఖరీదయిన రాళ్ళను, అర్మజ్ కమాల్‌ల నుండి ముత్యాలను చైనా అలెగ్జాండ్రియా నుంచి జరీబుట్టా వస్త్రాలను దిగుమతి చేసుకునేవారని తెలిపాడు. తూర్పు తీర ప్రాంత వర్తకులు, మలబారు వర్తకులు సింహళములో లాభసాటి వ్యాపారం చేసేవారు.

మధ్యయుగ భారతదేశంలో అరేబియన్‌లు, ఐరోపా వాసుల వర్తకాన్ని అభివృద్ధి చేశారు. వీరి వర్తక స్థావరాలు బలపడి అరేబియన్‌లు గుర్రాలను భారతదేశంలో సరఫరా చేసి లాభాలను ఆర్జించారు.

ముల్తాను క్వేట్టా, కైబరు లోయ లాంటి భూమార్గాల ద్వారా ఆఫ్ఘనిస్తాన్, పర్షియాలతో భారతదేశానికి మధ్య ఆసియాతో వ్యాపార సంబంధాలు ఉండేవి. భారతీయ వస్తువులను అరేబియన్‌లు ఎర్ర సముద్రానికి అక్కడ నుండి డెమస్కస్, అలెగ్జాండ్రియాలకు తీసుకుని పోయేవారు. భారతీయ వస్తువులను మూరిస్ వర్తకులు తూర్పు ఆఫ్రికా, మలయా ద్వీపాలకు చైనాకు తీసుకుని పోయేవారు.

వస్తువులను పర్షియన్ గల్ఫ్, మెసపటోమియా వెళ్ళే మార్గం, ఈజిప్టుకు వెళ్ళే మార్గం నుండి వేరవుతుంది. ఫలితంగా ఈ మార్గాల వల్ల అర్మస్, ఏథెన్స్, జెడ్డాకీవ్‌లు ప్రముఖ వర్తక స్థావరాలుగా పేరుగాంచాయి. భారతదేశంలోని రేవుల ద్వారా బయలుదేరిన నౌకలు అర్మజ్, ఏథెన్స్‌లకు చేరేవి. ఇక్కడ కొందరు భారతీయ వర్తకులు స్థిర నివాసం ఏర్పరచుకుని వర్తక సంబంధాలను కొనసాగించేవారు. గుజరాత్ అరేబియాల మధ్య జరిగే వ్యాపారం గురించి మార్కోపోలో ఏడెన్ భారతీయ రేవుల వ్యాపారం గురించి బార్బోసా వర్ణించారు. అర్మజ్ రేవు నుంచి గోవాకు అధిక సంఖ్యలో గుర్రాలు ఎగుమతి అయ్యేవి.

అరేబియా దాకా వచ్చిన భారతీయ వస్తువులను ఇటలీ వర్తకులు, సూయాజ్ ద్వారా కైరో, అలెగ్జాండ్రియాకు, పశ్చిమ ఐరోపా దేశాలకు తీసుకెళ్ళేవారు. రాగి, పగడం, ఉన్ని, వెండిని ఐరోపా నుండి తెచ్చి ఏథెన్స్, జెడ్డాలలో భారతీయ వ్యాపారస్థులకు అమ్మేవారు.

16వ శతాబ్దంలో గుజరాత్, ఆఫ్రికాల వర్తకాన్ని గురించి బార్బోసా వర్ణించారు. కొంబే నుండి ఓడలు ఆఫ్రికా రేవు అయిన మక్డషాకు వస్త్రాలు, పరిమళ ద్రవ్యాలుతోను వచ్చేవని, భారతదేశానికి తిరిగి వెళ్ళేటప్పుడు ఓడల నిండా బంగారం, దంతాలతో నిండి ఉండేవని తెలియజేయడం జరిగింది. తూర్పు ఆసియాతోనూ, ఆగ్నేయాసియా దేశాలతోనూ వ్యాపార సంబంధాలు కొనసాగాయి. చైనా నుండి తరుచుగా నౌకలు మలబారు రేవులయిన ఎలి, కాలికట్, క్విలన్‌లకు పట్టు,రంగు టఫేటాలు, కోటన్లు, లవంగాలు, జాజికాయలు, పింగాణి సామాన్లు, బంగారు, వెండి వంటి లోహ సామాగ్రితో వచ్చేవి.

దక్షిణ భారత రాజవంశాలన్ని విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించాయి. తూర్పు చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర చక్రవర్తులు, విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించారు. మోటుపల్లిలోని కాకతీయ గణపతి దేవుని వీరభద్రేశ్వారాలయ శాసనం (క్రీ.శ. 1245) అభయ శాసనం, విదేశీ వర్తకులు చెల్లించవలసిన సుంకాలను ఇది తెలుపుతుంది. రెడ్డి వంశానికి చెందిన అనవాతారెడ్డి గణపతి దేవుని వల్లనే మోటుపల్లికి వచ్చి నౌకలకు అభయ శాసనం ఇచ్చాడు. 15వ శతాబ్దంలో వ్యాపారాన్ని పెద్ద ఎత్తున సాగించిన అవచిసెట్ల కుటుంబాన్ని శ్రీనాథుడు తన 'హరవిలాసం' లో పేర్కొన్నాడు.

విజయనగర చక్రవర్తి అయిన మొదటి దేవరాయల శాసనం కూడా మోటుపల్లిలో కనిపించింది. ఇది కూడా ఎగుమతి దిగుమతి సుంకాలనే తెలుపుతుంది. 16వ శతాబ్దం నుండి మోటుపల్లి రేవు ప్రాముఖ్యం తగ్గి ఆ స్థానాన్ని పులికాట్, మచిలీపట్నం, మద్రాస్‌లు ఆక్రమించాయి.

## 2.10. ఐరోపా వర్తకులు:

16, 17వ శతాబ్దాలలో ఐరోపా వర్తకులు భారతదేశంలో వర్తక స్థావరాల ఏర్పాటు చేసుకుని వ్యాపారం ప్రారంభించారు. పోర్చుగీసు వారు గోవా, మలక్క, ఆర్మజ్ ప్రాంతాలలో వర్తక స్థావరాలను స్థాపించుకున్నారు. కొచ్చిన్ ద్వారా మిరియాలు,

కొలంబో నుండి దాల్చిన చెక్క లాంటి వ్యాపారాన్ని వీరు కొనసాగించారు. డచ్చి వారు సూరత్, మచిలిపట్నం, పులికాట్‌ల వద్ద వర్తక స్థావరాలనేర్పరచి సుగంధ ద్రవ్యాల కోసం భారత్‌లో వ్యాపారం చేశారు.

ఆంగ్లేయులు మద్రాస్, బొంబాయి, మచిలీపట్నం, నిజాంపట్నం, బెంగాల్‌లలో స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఫ్రెంచి వారు పాండిచ్చేరి, నాగపట్నం, దక్కన్ కేంద్రాలుగా వర్తక ఆదిపత్యపు పోటీలో పాల్గొన్నారు. ఐరోపా వాసులందరిపై ఆంగ్లేయులు ఆధిక్యత పొందగలిగారు. ఐరోపా వారు వర్తక వాణిజ్యాలలో పాలుపంచుకోవడం ఇండో–యూరోపియన్ వర్తక పరిమాణం బాగా పెరిగిపోయింది.

## 2.11. సారాంశము:

భారతదేశానికి బ్రిటీష్ వారు రాక పూర్వం పారిశ్రామిక, వ్యాపార రంగం అత్యంత గొప్పగా ఉండేదని విదేశీ యాత్రికుల రచనల వల్ల తెలుస్తుంది. వర్తక వాణిజ్యాలలో, పరిశ్రమలలో ముందంజ వేసి ఉండటం వల్ల మన దేశంతో వర్తకానికి పాశ్చాత్య దేశాలు ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి. పరిశ్రమలకూ, ఆర్థిక వ్యవస్థ మీద వాటి ప్రభావానికి సంబంధించి అధ్యయనం వల్ల పెట్టుబడిదారీ విధానాల్లా అభివృద్ధి చెందే సామర్థ్యం భారతదేశానికి ఉండేదని విషయం విదితమవుతుంది. ఐరోపా వారి రాక ఉత్పత్తి అభివృద్ధి చెందడానికి దోహదపడింది. అయితే వలసల మధ్య జరిగిన పోరాటాలు, వారి మధ్య ఏర్పడిన పోటీ, మొగలుల పతనం తరువాత భారతీయ ప్రభుత్వాల మధ్య ఏర్పడిన బలహీనత బ్రిటీష్ వారి ఆదిపత్యానికి కారణం అయ్యింది. ఫలితంగా భారతదేశం కేవలం ఒక వలస స్థాయికి పడిపోయింది.

## 2.12. నమూనా ప్రశ్నలు:

1) బ్రిటీష్ పాలన నెలకొన్నప్పటి
భారతదేశంలో పారిశ్రామిక రంగాన్ని వివరింపుము?

2) బ్రిటీష్ వారికి పూర్వం భారతదేశ వ్యాపార, వాణిజ్యం గురించి వివరింపుము?

## 2.13. ఆధార గ్రంథాలు:


1. **Mohammad Habib:** A Comprehensive History of India
2. **D. Pant:** The Commercial Polity of Mughals.
3. **K.A.N. Sastri:** A History of Society India.
4. **Radhakamal Mukherjee:** The Economic History of India
5. **J.N. Sankar:** Studies in Economic Life in Mughal India.
6. **P.N. Chopra, B.B. Ravi, M.N. Das:** A Social Cultural and Economic History of India Vol-III.
7. **A.R. Desai (English), P. Satyanarayana (Telugu):** Bharata Jatiya Bhava Samajika Purva Rangam.
8. **Dr. P. Rama Lakshmi:** Bharata Samajika, Artika Charitra (1000-1707 A.D.)
9. **Prof. V. Rama Krishna Reddy:** Bharata Samajika, Artika Charitra (1757-1947).


**- డాక్టర్ జి. సోమశేఖర**

పాఠం - 3

# భారతదేశములో బ్రిటీష్ వలస విధానము

## 3.0. లక్ష్యము:

భారతదేశాన్ని దాదాపుగా బ్రిటీష్ వారు సుమారు 200 సంవత్సరములు పరిపాలించారు. అయితే పై పరిపాలనా కాలంలో వివిధ అంశాలతో కూడినటువంటి వ్యవస్థ ఏర్పడింది. బ్రిటీష్ వలస పరిపాలనా కాలంలోని ప్రతి దశను క్షుణ్ణంగా తెలుసుకోవలసిన అవసరం వుంది.

**విషయక్రమము:**


**3.1.** పరిచయము

**3.2.** వలస విధానము-దాని అర్థం

**3.3.** వలసవాద ఆర్థిక వ్యవస్థ: దశలు, లక్షణాలు

**3.4.** మొదటి దశ: 1600 నుండి 1857 A.D. వరకు

- **3.4.1. 1757కు ముందు కంపెనీ ఆర్థిక విధానము**
- **3.4.2. కంపెనీ రాజ్యాధికారం వ్యాపారంలో మార్పులు (1757-1813)**
- **3.4.3. ఇంగ్లాడ్ పారిశ్రామిక విప్లవం**
- **3.4.4. స్వేచ్ఛా వ్యాపార పారిశ్రామిక పెట్టుబడిదారీ దశ: 1813**

**3.5.** రెండవ దశ: 1858 నుండి 1905 వరకు

**3.6.** మూడవ దశ: 1905 నుండి 1940 వరకు

**3.7.** నాలుగవ దశ: 1940 నుండి 1947 వరకు

**3.8.** సారాంశము

**3.9.** నమూనా ప్రశ్నలు

**3.10.** ఆధార గ్రంథాలు


## 3.1. పరిచయము:

బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌలా, ఆంగ్లేయ కంపెనీ సైన్యాల మధ్య క్రీ.శ. 1757వ సంవత్సరంలో చరిత్రాత్మక ప్లాసి యుద్ధం జరిగింది. ఫలితంగా, బెంగాల్ ఆంగ్లేయుల వశం అయ్యింది. అప్పటినుండి క్రమక్రమంగా భారతదేశంపై బ్రిటీష్ వారి ఆధిపత్యం పెరిగి 1856వ సంవత్సరం నాటికి అది పూర్తి అయినది. దాదాపుగా రెండు శతాబ్దాల కాలం పాటు బ్రిటీష్ పాలన కొనసాగడం, ఆధునిక చరిత్రలో సంబంవించిన అత్యంత కీలక పరిణామం. ప్రాచీన కాలం నుండి అంటే ఆర్యుల నుండి మొగల్ చక్రవర్తుల వరకు పరిపాలించిన విదేశీయులు ఎవ్వరూ భారతీయ రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొన్నారే కాని బ్రిటీష్ వారి వలే ప్రజల ఆర్థిక, సామాజిక జీవనం, వ్యవస్థలను మార్చడానికి ప్రయత్నించలేదు. వ్యవసాయ దారులు, వృత్తి పనివారు, వ్యాపార వర్గం తమ కార్యకలాపాలను యదావిధిగా కొనసాగించారు. భారత ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మైన స్వయం

సమృద్ధి గ్రామీణార్థిక వ్యవస్థ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగింది. ఆంగ్లేయేతర దేశీయ పాలకులు భారతదేశాన్ని తమ దేశంగాను, ప్రజలను తమ ప్రజలుగా భావించి భారతీయ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో భాగాస్వాములయ్యారు.

బ్రిటీష్ పాలకులు భారతదేశాన్ని తమ దేశంగా ఎప్పుడూ భావించలేదు. భారతీయ ఆర్థిక, సామాజిక జీవన విధానం, వ్యవస్థలతో సమాధానపడలేదు. అంతేగాక తమ మాతృదేశ పరిశ్రమలు, వ్యాపారం, ఆర్థికాభివృద్ధి కొరకు భారతదేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయడానికి పూనుకొన్నారు. ప్రాచీన కాలం నుండి కొనసాగుతున్న స్వయం సంవృద్ధి గ్రామీణార్థిక వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించి వేయటం జరిగింది.

## 3.2. వలస విధానము-దాని అర్థం:

వలస విధానము అనగా కాలనీగా వున్న ప్రాంతాన్ని గాని లేక కొద్దిపాటి జనాభా కలిగినటువంటి విదేశీ ప్రాంతాన్ని గాని మాతృభూమి సహాయము ద్వారా సార్వభౌమత్వాన్ని హక్కుగా భావించి స్థానిక స్వపరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేయుటగా భావిస్తారు మరియు వలస విధానాన్ని ఖచ్చితమైన జాతీయతత్వాన్ని నెలకొల్పటం ద్వారా వివిధ ప్రాంతాల్ని ఆక్రమించుట ద్వారా తమ భాషను, తమ యొక్క వ్యవస్థను నెలకొల్పటం కూడా వలస విధానంలో భాగంగా పరిగణించబడుతుంది. ఒక విధంగా చెప్పాలంటే ఈ విధానంలో అల్ప సంఖ్యాక వర్గాల వారు అధిక సంఖ్యాక వర్గాల వారిపై రాజకీయ అధికారాన్ని నెలకొల్పటమే వలస విధానంగా చెప్పవచ్చు. అయితే ఈ వలస ప్రజలు తమ స్వంత నాగరికతను, వ్యవస్థలను ఈ క్రొత్త ప్రాంతాలలో నెలకొల్పడం అనేది సర్వసాధారణం.

### Encyclopedia of America:

వలస విధానాన్ని అభివృద్ధి చెందిన దేశాలు తమ రాజకీయ, ఆర్థిక పరమైన ప్రభావాన్ని బలహీనమైన దేశాలలో నెలకొల్పటంగా పేర్కొన్నది. దీనిని బట్టి వలస వాదము అనగా బలమైన వ్యక్తి బలహీనుడిపై ఆధిపత్యం నెలకొల్పటంగా భావించవచ్చు.

ఇందులో అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను తమ అవసరాలకు అనుగుణంగా వాడుకోవడం జరుగుతుంది.

భారతదేశంలో బ్రిటీష్ సుపరిపాలనా కాలాన్ని పరిశీలించినట్లయితే వారు ఉత్పత్తి చేసినటువంటి వస్తువులను, ఆహార పదార్థాలను భారతీయ అవసరాలను బట్టి అమ్మి తమ దేశ అభివృద్ధికి భారతదేశాన్ని ఒక పావుగా వాడుకోవడం జరిగింది. అంతేకాకుండా బ్రిటన్‌లోని పరిశ్రమలకు ముడి సరుకులు సప్లయ్ చేసే దేశంగా భారతదేశాన్ని మార్చివేసింది. బ్రిటీష్ ప్రభుత్వం చేయు ప్రతి పని సామ్రాజ్యవాద వ్యవస్థ పటిష్టత కోసమే. భారతదేశంలో పరిశ్రమలు నెలకొల్పి భారతదేశాన్ని పారిశ్రామిక దేశంగా మార్చడానికి ప్రయత్నించలేదు. ఐరోపాలో పెట్టుబడిదారి విజయం సందర్భంలో జరిగిన విధ్వంసక ప్రక్రియతో బాటు, నూతన ఆర్థిక, సామాజిక శక్తులావిర్భవించాయి. కాని భారతదేశంలో ఇలా జరగకపోవడం దురదృష్టకరం. ఇంకను భారతదేశములోని వ్యాపారం, బ్యాంకులు మరియు ఇతర ఆర్థికపరమైనటువంటి సంస్థలన్నీ దీర్ఘకాలము బ్రిటీష్ వాళ్ళ యొక్క చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి దోహదం చేసింది.

## 3.3. వలసవాద ఆర్థిక వ్యవస్థ: దశలు, లక్షణాలు

భారతదేశంలో ఆంగ్లేయుల అధికారం ప్రారంభముకావడముతో ఈ దేశ సంపద, వనరులు, శక్తులు, ప్రజల శ్రమ బ్రిటన్ దేశ ప్రజల సౌభాగ్యానికి సాధనాలవడంతో బాటు భారతదేశాన్ని ఒక వలస రాజ్య స్థాయికి నెట్టివేయడం జరిగింది.

బ్రిటీష్ పాలకులు ఇక్కడి ఆర్థిక వనరులను దోచుకోవడానికి అవసరమైన విధానాలను రూపొందించుకున్నారు. పాలనలో దేశ ప్రజలకు ప్రాతినిధ్యం లేకపోవడంతో పాలకులు బాధ్యతారహితంగా పరిపాలన సాగించారు. బ్రిటీష్ ప్రజలు, పౌరులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్థులపై ప్రభావం భారత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ప్రభలంగా వుంది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమ స్వార్థ ప్రయోజనాలను వలస ప్రజల సామాజిక, సాంస్కృతిక వ్యవస్థల రూపకల్పనలో కూడా మరువలేదు.

భారతదేశంలో బ్రిటీష్ వలస పరిపాలనా విధానాన్ని ముఖ్యంగా నాలుగు దశలుగా విభజించవచ్చు. ప్రతి దశకు కొన్ని విభిన్నమైన లక్షణాలను మనము గమనించవచ్చును.

## 3.4. మొదటి దశ: 1600–1857 A.D. వరకు

మొదటి దశలో బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో తమ వలస విధానాన్ని కొనసాగించిన దశ అనగా ఇది బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ స్థాపన నుండి 1858 విక్టోరియా మహారాణి ప్రకటన వరకు పేర్కొనవచ్చును. క్రీ.శ. 1600 సంవత్సరాల నాటికే కంపెనీకి ఆమోద పత్రం ఇచ్చినప్పటికీ, ప్లాసీ యుద్ధం తర్వాత అంటే 18వ శతాబ్దం ద్వితీయార్ధం నాటికి అసలైన ఆధిపత్యం భారతదేశంపై లభించింది. కేవలం వ్యాపార సంస్థ గానే కాకుండా, ఈ యుగంలో కంపెనీ, బెంగాల్ ఆక్రమణతో రాజ్యాధికారాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా భారతదేశంలో తిరుగులేని సామ్రాజ్యవాదశక్తిగా రూపొందింది.

ఆధునిక సాంకేతిక, సైనిక, విజ్ఞాన సామాగ్రితో బాటు సామాజిక–రాజకీయైక్యతను కలిగిన విదేశీ మధ్య తరగతి వర్గం, అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతున్న భారతీయ బూర్జువా వర్గాన్ని అణగద్రొక్కి ఎదురులేని శక్తిగా రూపొందింది. ఈ విదేశీ భూర్జువా వర్గం, ప్రభుత్వాధికారంతో, భారతదేశంలో ఆధునిక, స్వార్థపూరిత, పెట్టుబడిదారి దోపిడీని నిర్వహించింది.

### 3.4.1. 1757కు ముందు కంపెనీ ఆర్థిక విధానము:

ఈ దశలో ముఖ్యంగా బ్రిటీష్ వారు భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో తమ యొక్క వర్తక వాణిజ్య కేంద్రాలను నెలకొల్పి వాటి ద్వారా భారతదేశ వస్తువుతో బ్రిటీష్ వారు తమ వస్తువులను మార్పిడి చేయడం జరిగింది. ఈ విధానంలో బ్రిటీష్ వారు తమ వస్తువులను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేయటం జరిగింది. దీని ద్వారా వీరు భారతీయులను మరియు ఇతర ఐరోపా వ్యాపారస్థులను వీటిలో లేకుండా చేయటం జరిగింది. అయితే ఇది అంత తెలివైన పని కాదు. ఎందువలన అంటే బ్రిటీష్ వారి లాగానే మిగిలిన ఐరోపా వారు కూడా తమ శాయశక్తులను ఉపయోగించి బ్రిటీష్ వారిని ఎదుర్కొనటానికి ప్రయత్నించారు. కాని వారు బ్రిటీష్ వారి వలె బలమైన నౌకాదళము లేకపోవటం వలన రాణించలేకపోయారు. దానితో బ్రిటీష్ భారత దేశ వర్తక వాణిజ్యంపై గుత్తాధిపత్యం నెలకొల్పింది. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో వున్నటువంటి వాణిజ్య ప్రాంతాల నుండి భారతీయులను నెట్టివేసి వీరు చేజిక్కించుకున్నారు. దీనితో భారతీయులకు విదేశాలలో వర్తక వాణిజ్యము చేసే అవకాశము పూర్తిగా దెబ్బతిన్నది. అంతేగాకుండా భారతదేశములో వున్నటువంటి వ్యాపార ప్రత్యుత్తరాలను సైతము బ్రిటీష్ వారు అణిచివేయడం జరిగింది.

భారతీయులకు కావాల్సిన విలాస వస్తువులు, సీసం, రాగి, వెండి, బంగారం, దంతం మొదలగువాటిలో ఒక్క తప్ప మిగతా వస్తువులను వెంటనే బ్రిటన్ సరఫరా చేసే స్థితిలో లేదు. ఫలితంగా వెండిని విపరీతంగా సమర్పించుకోవలసి వచ్చింది. ప్రారంభంలో కంపెనీకి వెండి, బంగారాలలో సాలీనా $\pm$ 30,000 విలువ గల వస్తువులను ఎగమతి చేయడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. ఇది వర్తక పెట్టుబడిదారీ విధానానికి విరుద్ధమైనది. ఒక దేశం యొక్క సంపద, దాని బంగారు, వెండి నిల్వల మీద ఆధారపడుతుంది.

ఈ సమస్య పరిష్కారానికి తూర్పు ఇండియా వర్తకులు, బ్రిటీష్ వస్తుత్పత్తిదారులు అమెరికా, ఆఫ్రికా ఖండాల్లోని తమ వలసల నుండి దోచుకున్న సంపదను, ఇండియాలోని తమ కొనుగోళ్ళకు వినియోగించేవారు. బ్రిటన్‌లో ఇండియా నేత వస్త్రాలు ఆదరణ, గిరాకీలను పొందుతుండడం పట్ల, ఆంగ్లేయ ఉత్పత్తిదారులు అసూయతో భారతీయ వస్తువులను నిలిపివేసేందుకు ప్రభుత్వంపైన ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా రంగులుదిద్దిన ఇండియా నూలు వస్త్రాల వాడకాన్ని నిషేదిస్తూ 1720 నాటికి బ్రిటీష్ ప్రభుత్వం చట్టాలు కూడా చేసింది.

**3.4.2. కంపెనీ రాజ్యాధికారం వ్యాపారంలో మార్పులు (1757-1813):**

క్రీ.శ. 1757 నుండి భారతదేశంలో కంపెనీ రాజ్యాధికారాన్ని పొందడం ఈ దేశం పట్ల అది అనుసరిస్తున్న వాణిజ్య, ఆర్థిక విధానాల సరళిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అధికార బలం, దౌర్జన్యం, అణిచివేతల ద్వారా, దేశీయ రైతులను, వర్తకులను, వేతన పని వారి నుండి అతి స్వల్ప విలువకు కావలసిన ఉత్పత్తులను, సరుకులను కొనుగోలు చేస్తూ కంపెనీ ఉద్యోగులు, ఏజెంట్లు తమ సరుకులను రైతుల చేత బలవంతంగా రెట్టింపు ధరలకు కొనిపించేవారు.

నేతపనివారికి, రైతులకు, వర్తకులకు తమ ఉత్పత్తులను స్వేచ్ఛగా మార్కెట్‌లో అమ్ముకోవడానికి కాని, తమకు కావలసిన సరుకులను కొనడానికి గాని, స్వేచ్ఛ లేకుండా పోయింది. నేత పని వారు తాము నేసిన బట్టలను కంపెనీ ఏజెంట్లకు వారు నిర్ణయించి ధరకు అమ్మవలసి వచ్చేది. అయితే తమకు కావలసిన ముడి ప్రత్తిని గుత్తాధికారం పొందిన కంపెనీ నుండి వారు నిర్ణయించిన అధిక ధరకు కొనవలసివచ్చేది. ఈ విధంగా నేత పని వారు రెండు విధాలా దెబ్బతిన్నారు. వారికి హెచ్చు ధరలు, వేతనాలివ్వడానికి ముందుకొచ్చే దేశీయ, విదేశీయ వ్యాపారులను కంపెనీ తన అధికార బలం, బెదిరింపులతో వారిని కొననీకుండా చేసింది. ఇటువంటి సమయంలో ఇంగ్లండ్, ఇండియా వస్త్ర దిగుమతులపై అధిక సుంకాలను విధిస్తుండడం, దేశీయ వస్త్ర పరిశ్రమకు తీవ్ర విఘాతంగా పరిగణించింది.

బ్రిటీష్ వారు తమ వర్తక వాణిజ్య ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అవసరమైనటువంటి నావికా, సైనిక వ్యవస్థను కొనసాగించడానికి వివిధ రకాలైనటువంటి స్థానిక పన్నులను కూడా వసూలు చేయటం జరిగింది. ఇలాంటి పన్నులు ముఖ్యంగా బొంబాయి, కలకత్తా, మద్రాసు లాంటి వర్తక కేంద్రాలలో వసూలు చేయటం జరిగింది. 18వ శతాబ్దం ద్వితీయార్థం ఆరంభంనాటికి బ్రిటీష్ వారు వాణిజ్య వ్యవస్థ స్థాయి నుండి రాజకీయ అధికారం చేపట్టే స్థాయికి ఎదగటం జరిగింది. 1765లో అయోధ్య నవాబు నుండి బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాల మీద రెవెన్యూ వసూలు చేసుకునే అధికారాన్ని పొందటం జరిగింది. ఈ రాష్ట్రాల రెవెన్యూ ఆదాయాలలో కేవలం నాలుగోవంతు మాత్రమే ప్రభుత్వ ఖర్చులకు వినియోగించి, మరో నాలుగోవంతు బెంగాల్ నవాబ్, మొగల్ చక్రవర్తుల భరణం, కప్పానికి కేటాయించి, మిగిలిన సగ భాగాన్ని కంపెనీ తన లాభంగా దత్తం చేసుకోసాగింది.

మొదట ఆదాయం వచ్చేటటువంటి రెవెన్యూ అధికారాన్ని మాత్రమే తీసుకొని పరిపాలనా భాధ్యతను తిరస్కరించటం జరిగింది. తరువాత కేవలం రెవెన్యూ అధికారంతో తృప్తిచెందక బ్రిటీష్ ప్రభుత్వం బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో ప్రజలు తీవ్ర సంక్షోభంలో వున్నప్పుడు రాజకీయ అధికారాన్ని చేపట్టటానికి కూడా వెనుకడగు వేయలేదు. దీనివలన కొంత ఆర్థికపరమైనటు వంటి లాభాలను పొందడం జరిగింది. ముఖ్యంగా 1765-1770 మధ్య కాలంలో కంపెనీ బెంగాల్ నుండి రెవెన్యూ రూపంలో 33% వస్తువులను వసూలు చేయటం జరిగింది. అంతేకాకుండా కంపెనీ వారు భారతీయ వ్యాపారస్తుల నుంచి, అధికారుల నుండి, జమీందారుల నుండి కూడా అనేక విధాలుగా రెవెన్యూని వసూలు చేయడం జరిగింది. ఇలాంటి వసూళ్ళు కాలక్రమంగా బ్రిటీష్ వారికి రాజకీయ అధికారాన్ని నెలకొల్పడానికి దోహదం చేసినాయి.

ఇక్కడి నుండి మెళ్ళమెళ్ళగా భారతదేశంలోని వివిధ ప్రాంతాలపై అధికారాన్ని ఏర్పరచి చివరకు యావత్తు భారతదేశాన్ని బ్రిటీష్ ఆధిపత్యం క్రిందకు తీసుకురావడం జరిగింది. అయితే ఈ కాలంలో బ్రిటీష్ వాళ్ళు భారతదేశంలో పరిపాలనా వ్యవస్థలోను, న్యాయ వ్యవస్థలోను, రవాణా రంగంలోను, కమ్యూనికేషన్ రంగంలోను, వ్యవసాయం, పరిశ్రమలలో, వాణిజ్యం, విద్యా రంగాల్లో చెప్పుకోదగ్గ మార్పులు ఏమి చేయలేదు. ఈ కాలంలో తరతరాలుగా కొనసాగుతున్నటువంటి రాజరిక వ్యవస్థకు, బ్రిటీష్ పాలనకు పెద్ద తేడా ఏమీ కనిపించలేదు. కాకపోతే వ్యవసాయ రంగంలో మిగులు ఆదాయాన్ని వసూలు చేయడంలో కొంత మెరుగైన విధానాన్ని కంపెనీ కాలంలో తీసుకురావటం జరిగింది. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశ గ్రామీణ పరిపాలన వ్యవస్థలో పెద్దగా మార్పులు చేయలేదు. అయితే ఉన్న స్థాయిలోనే రెవెన్యూ అధికారాలలో కొన్ని మార్పులు చేసింది.

**3.4.3. ఇంగ్లాడ్ పారిశ్రామిక విప్లవం:**

18వ శతాబ్ద మధ్య భాగం వరకు కూడా ఇంగ్లాండ్ ప్రధానంగా వ్యవసాయాధారంగానే ఉండేది. అయితే 1760 నుండి త్వరితగతిన ఇంగ్లాండ్‌లో పలు పరిణామాలు చోటు చేసుకొని పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. భారీ యంత్రాంగ పరిశ్రమలకు కావల్సిన భారీ పెట్టుబడులు, ప్లాసీ యుద్ధం తరువాత భారతదేశంలో కంపెనీ వారు నిరంతరం దోచుకొన్న సంపద వారికి సహాయపడింది. ఆఫ్రికా, పశ్చిమ ఇండియా దీవులు, దక్షిణ అమెరికా, భారతేతర ఆసియా వలసల నుండి బ్రిటన్‌కు వచ్చిన సంపద కన్నా ఇండియా నుండి వచ్చిందే చాలా ఎక్కువ. బ్రూక్స్ ఆడమ్స్ చెప్పినట్లుగా, 1694–1757 మధ్య బ్రిటన్ వలస దనం నెమ్మదిగా పెరిగితే, 1760–1815 మధ్య ఇది అత్యంత వేగంగా, అద్భుతమైన రీతిలో పెరిగింది. సంపద భూస్వాముల చేతుల్లోకి బదులుగా, వర్తకులు, పారిశ్రామికుల చేతుల్లో కేంద్రీకృతం కాసాగింది. మొదట వర్గం వైభవోపేత జీవితం గడిపేందుకు వెచ్చిస్తే, ద్వితీయ వర్గం వారు అధిక లాభార్జనకై తమ ధనాన్ని వ్యాపార, పరిశ్రమల్లో పెట్టుబడిగా ఉపయోగించేవారు.

పారిశ్రామిక విప్లవ ఫలితంగా బ్రిటన్ ఉత్పత్తి రంగం ఉన్నత స్థాయిని చేరుకుంది. ఫలితంగా ఉత్పత్తి పెరగటంతో బ్రిటీష్ వారికి క్రొత్త మార్కెట్లు అవసరం అయ్యాయి. అదేవిధంగా పరిశ్రమలకు ముడి సరుకులు అవసరం అయ్యాయి. ఫలితంగా భారతదేశాన్ని వ్యాపార కేంద్రంగా మార్చివేసింది.

ఇంగ్లాండ్ పారిశ్రామిక విప్లవ ప్రధాన సంకేతంగా నిలిచిన వస్త్ర పరిశ్రమ విషయంలో, ఈ ఏర్పాటు అక్షరాల ప్రతిఫలించింది. వలస రాజ్యాల వ్యాపారంపై బ్రిటన్ గుత్తాధిపత్యం నడిచింది. అధికోత్పత్తికి అవసరం అయ్యే సాంకేతిక ఆవిష్కరణలు కూడా, ఇంగ్లాండ్‌లో 1760 తరువాత శరవేగంలో ఆవిర్భవించాయి. ప్రప్రథమంగా వస్త్ర పరిశ్రమకు సంబంధించిన పలు విప్లవాత్మక యంత్రాలు కనుగొనబడ్డాయి. ఫలితంగా వస్తూత్పత్తి వందల రెట్టు పెరగటంతో బాటు, ఇవి చౌకగా సులభంగా లభ్యమయ్యాయి.

ఇంగ్లాండ్‌లో పారిశ్రామిక విప్లవ ఫలితంగా విపరీత సంఖ్యలో తయారయ్యే వస్తువులకు కొనగోలు కేంద్రాలు లేదా మార్కెట్లను కనుగొనే సమస్య ప్రధానంగా ఉత్పన్నమైంది. ఆర్థిక విధానంలో విప్లవాత్మక మార్పుకు దారితీసింది. వ్యాపార పెట్టుబడిదారి దశ నుండి స్వేచ్ఛా వ్యాపార పెట్టుబడిదారీ దశకు పయనం సాగింది. నూతనావసరాల ప్రకారం, భారతదేశంలో వ్యాపార గుత్తాధిపత్యానికి బదులుగా, స్వేచ్ఛా మార్కెట్‌ను ఏర్పరచవలసి వచ్చింది. ఇంగ్లాండ్‌తో సహా మొత్తం ప్రపంచానికి నూలు బట్టలను ఎగుమతి చేసే భారతదేశాన్ని, నూలు బట్టలను దిగుమతి చేసుకునే దిశగా మార్చవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

### 3.4.4. స్వేచ్ఛా వ్యాపార పారిశ్రామిక పెట్టుబడిదారీ దశ: 1813

1813వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక చట్టం చేసింది. అంతవరకు ఈష్టిండియా కంపెనీ గుత్తాధిపత్యంగా ఉన్న వ్యాపారాన్ని రద్దు చేసి అందరికి భాగాస్వామ్యాన్ని కలిగించింది. బ్రిటీష్ ప్రజలు తమ ఉత్పత్తులను భారతదేశానికి ఉచితంగా గాని లేక మినిమమ్ టారిఫ్‌లో తీసుకుని వెళ్ళవచ్చు. అదేవిధంగా 1833వ సంవత్సరంలో మరొక చట్టం చేసి దాని ప్రకారం బ్రిటీష్ ప్రజలు భారతదేశంలో భూములను కొనడానికి, స్థిర నివాసాలు ఏర్పరచుకోవడానికి, తేయాకు, కాఫీ, నీలమందును, రబ్బరు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిచ్చింది.

బ్రిటీష్ పెట్టుబడిదారులు భారతదేశానికి వచ్చి తమ పెట్టుబడిని వివిధ రంగాల్లో పెట్టడం అందుకొరకు దేశవ్యాప్తంగా పెద్ద పెద్ద మార్కెట్లు, పట్టణాలను కలుపుతూ రైలు మార్గాలు ఏర్పాటు చేశారు. వ్యాపార అభివృద్ధి కొరకు పోస్టల్, టెలిగ్రాఫ్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దీనికొరకు పన్నులను పెంచడం జరిగింది. న్యాయవ్యవస్థలో మార్పులు తీసుకువచ్చారు. క్రొత్త 'కోడ్' లను ఏర్పాటు చేశారు. స్వేచ్ఛా వ్యాపారాన్ని అమలు చేసి బ్రిటన్ నుండి వస్తువులు భారతదేశానికి స్వేచ్ఛగా రావడం జరిగింది. భారత్ వస్తువులు మీద మాత్రం పన్నులు అధికము చేసి వ్యాపారాన్ని దెబ్బతీసారు. దీనితో బ్రిటీష్ వస్తువుల పోటీలో ఇండియా వస్తువులు నిలువలేకపోయాయి. 1840వ సంవత్సరంలో కస్టమ్స్ సుంకాన్ని ఎత్తివేశారు. అయితే అప్పటికే భారతదేశంలో బ్రిటీష్ వస్తువుల ప్రాముఖ్యత పెరిగింది,.

ఈ సందర్భంలో లభ్యమయ్యే సుంకాల రేట్లు, ఎగుమతి, దిగుమతుల వ్యాప్తిని పరిశీలిస్తే, వాటి పరిస్థితి అర్ధమవుతుంది. భారతదేశానికి దిగుమతైన బ్రిటీష్ నూలు, సిల్కు వస్త్రాలు 31/2 శాతం సుంకాన్ని, ఉన్ని వస్త్రాలు 2 శాతం సుంకాన్ని చెల్లిస్తే, బ్రిటన్‌కి ఎగుమతైన భారతీయ నూలు వస్త్రాలపై 10 శాతం సుంకాన్ని సిల్కు వస్త్రాల మీద 20 శాతం సుంకాన్ని, ఉన్ని వస్త్రాల మీద 30శాతం సుంకాన్ని చెల్లించినట్లు 1840 పార్లమెంట్ పరిశీలనలో తేలింది.

బ్రిటీష్ పారిశ్రామిక పెట్టుబడి దారీ విధానం కారణంగా, భారతదేశ ఆర్థిక వ్యవస్థ పూర్వ వైభవ, పటిష్టతలను కోల్పోయి, నిస్సహాయ, దుర్భరస్థితికి చేరుకుంది. బ్రిటీష్ యంత్రాగార సరుకులు స్వేచ్ఛగా, పెద్దిపెట్టున భారతదేశానికి దిగుమతి అవుతుండడం, భారతీయ ఉత్పత్తులపై బ్రిటన్ విపరీత దిగుమతి సుంకాలను, పూర్తి నిషేధాలను విదించడంతో, భారతీయ పరిశ్రమలు, వ్యవసాయం గ్రామీణార్థిక వ్యవస్థ సర్వనాశనమయ్యాయి. ఆనాటి నుండి గ్రామ, పట్టణ ప్రాంతాల్లో కోట్లాది ప్రజలకు జీవనోపాధిని కలిపిస్తూ వచ్చిన నూలు వడుకు, బట్టలు నేసే కళలు, పూర్తిగా మూలనపడ్డాయి.

బట్టల పరిశ్రమతో బాటు, తోళ్ళు, లోహాలు, ఇనుము-ఉక్కులాంటి ఇతర భారతీయ పరిశ్రమలు కూడా, విదేశీ భారీ యంత్రాగార ఉత్పత్తుల పోటీకి తట్టుకోలేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక పతనం చెందాయి. స్థానిక ఇత్తడి, రాగి పాత్రల స్థానంలో, ఐరోపా నుండి దిగుమతైన పింగాణి, అల్యూమినియమ్ గృహోపకరణాలు వాడుకలోకి వచ్చాయి. దేశీయ ఇనుము ఉక్కు పరిశ్రమ, చౌకైన విదేశీ ఇనుప లోహం రైల్వేల సాయంతో దేశం నలుదిక్కులా సరఫరాకావడంతో, పోటీకి తట్టుకోలేక, ప్రోత్సాహం మృగ్యమై అంతరించిపోయింది.

## 3.5. రెండవ దశ: 1858-1905 వరకు

1857 తిరుగుబాటు ప్రభావము వలన బ్రిటీష్ వారి యొక్క ఆక్రమణలకు అడ్డుకట్ట వేయబడింది. ఈ బ్రిటీష్ వారు భారతీయుల అభివృద్ధికి తోడ్పడడానికి నిర్ణయించింది. పరిపాలనా బాధ్యతను డైరక్టుగా క్రౌన్ పరిపాలన క్రిందకు తీసుకురావడం జరిగింది. పరిపాలనా భాధ్యత తీసుకున్న తరువాత ఇంగ్లాండ్ మహారాణి 1858లో ఒక ప్రకటన చేశారు. దానిని విక్టోరియా

మహారాణి ప్రకటన అంటారు. దీని ద్వారా భారతీయులకు భాద్యత ప్రభుత్వాన్ని అందిస్తామని, ప్రజల యొక్క స్వేచ్చా స్వాతంత్ర్యాలకు, మత విశ్వాసాలకు, నమ్మకాలకు ఎటువంటి భంగము కలిగించకుండా ఉండునట్లు ప్రభుత్వము ప్రకటించింది. దీని ద్వారా 1861 ఇండియన్ కౌన్సిల్ యాక్ట్ ప్రకారము భారతీయులకు గవర్నర్ కౌన్సిల్‌లో సభ్యత్వము ఇవ్వడం జరిగింది.

అయినప్పటికి బ్రిటీష్ వారి రాజకీయ ఆదిక్యత, ఆర్థిక దోపిడి కొనసాగింది. బ్రిటీష్ వారి యొక్క భారీ పెటుబదులు అయిన రైల్వేల నిర్మాణము, ప్లాంటేషన్స్, బొగ్గ గనులు, జనప నార, వ్యాపారము, బ్యాంకింగ్ లాంటి రంగాలకు రక్షణ కల్పించారు. బ్రిటీష్ పారిశ్రామిక పెట్టుబడిదారి విధానం ఫలితంగా, భారతీయ పారిశ్రామిక, వ్యాపార కేంద్రాలు, పట్టణాలు, కళాకారులు, నేత పనివారు, చేతి వృత్తుల వారు, చావు దెబ్బతినడమేకాకుండా, స్వయం సంవృద్ధి గ్రామీణార్థిక వ్యవస్థ కూడా చిన్నాభిన్నమైనది. ప్రజలకు జీవనోపాధి కల్పించే వ్యవసాయము, కుటీర పరిశ్రమలు రెండూ సర్వనాశనం కావడంలో, వీటి మీద ఆధారపడినవారు మరియు పట్టణ పరిశ్రమల్లో దెబ్బతిన్నవారు జీవనోపాధికై వ్యవసాయాన్ని ఆశ్రయించడం జరిగింది. ఫలితంగా వ్యవసాయం మీద భారం పడింది. జనాభాలోని అధిక శాతం వ్యవసాయం మీద ఆధారపడడం కారణంగా సంభవించిన భయంకర పరిణామం తరచుగా క్షామాలు వచ్చి, విపరీతంగా ప్రాణ నష్టం జరిగింది.

భారీ సైన్యాన్ని సమీకరించుకొని ఇతర దేశాలైన ఆఫ్రో–ఆసియన్ దేశాలకు తమ ఆధిపత్యాన్ని విస్తృతపరిచే స్వార్ధంతో బలపడినారు. ఈ సైన్య నిర్వహణకు అవసరమైనటువంటి వ్యయాన్ని భారతదేశ ఆదాయము నుండి చెల్లించారు. తద్వారా భారతీయులపైన అధిక పన్ను భారము పెరిగి అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడింది.

రెండవ దశలో బ్రిటీష్ వారి సామ్రాజ్యవాద వలసవాదమును కాపాడుకోవడానికి భారతదేశాన్ని పూర్తి స్థాయిలో అధునికరించడానికి వ్యతిరేకంగా అనేక చర్యలు చేపట్టారు. వాటిలో ముఖ్యంగా లార్డ్ లిట్టన్ కాలంలో భారతీయులను అదుపు చేయడానికి ప్రవేశపెట్టిన ఆయుదాల చట్టం, స్థానిక పత్రిక చట్టాలను మరియు కర్జన్ కాలములో బ్రిటీష్ వ్యతిరేక విధానాలను అణిచివేయడానికి భారతీయ విశ్వవిద్యాలయాల చట్టం, కలకత్తా కార్పోరేషన్ చట్టం లాంటివి ప్రవేశపెట్టడం జరిగింది. ఇవి పైకి అగుపించే పరిపాలనా సౌలభ్యం కొరకు ప్రవేశపెట్టినట్లు ప్రకటించినప్పటికి అంతర్లీనంగా ఇవి భారతీయులను పరిపాలనా అనుభవం నోచుకోకుండా దూరంగా ఉంచడానికి చేసినటువంటి చర్యలుగా చెప్పవచ్చు.

## 3.6. మూడవ దశ: 1905 నుండి 1940 వరకు

మూడవ దశ మింటో మార్లె సంస్కరణతో ప్రారంభమై 1940 వరకు కొనసాగింది. ఈ దశలో బ్రిటీష్ ప్రభుత్వం విభజించు పాలించు సిద్ధాంతానికి కట్టుబడింది. దీనికి ముఖ్యంగా బెంగాల్ విభజన ముఖ్య ఉదాహరణ. తర్వాత మింటోమార్లె సంస్కరణలను కమ్యూనల్ సిద్ధాంతాన్ని మతప్రాతిపదికపై ప్రవేశపెట్టిన ఎన్నిక విధానంలో పూర్తి రూపాన్ని తెచ్చింది.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో బ్రిటీష్ వారు భారతీయుల సహాయాన్ని వినియోగించుకొనడానికి ఆగష్టు 20, 1917 లో భారత వ్యవహారాల కార్యదర్శి అయిన మాంటెగు ప్రభువు భారతీయులకు యుద్ధం తర్వాత భాధ్యతాయుత ప్రభుత్వాన్ని ప్రసాదించడానికి ఒక ప్రకటన చేయడం జరిగింది. దీని ద్వారా కాలక్రమములో స్థానిక స్వపరిపాలనా వ్యవస్థలో శిక్షణ ఇవ్వబడతుందని అది భాధ్యతాయుతమైనటువంటి భారతీయ పౌరులకు బ్రిటీష్ సామ్రాజ్యంలో స్థానం కల్పించినట్లుగా అతను తన ప్రకటనలో వెలిబుచ్చడం జరిగింది. అయితే ఈ భాధ్యాతాయుత ప్రభుత్వం ఒకసారి ప్రసాధించడం సాధ్యం కాదని దశల వారిగా మాత్రమే వీలవుతుందని మాంటేగు పేర్కొన్నాడు.

యుద్ధం తరువాత బ్రిటీష్ ప్రభుత్వం తన వాగ్ధానాన్ని నిలబెట్టుకోకపోగా ద్వంద్వ ప్రభుత్వం ప్రవేశపెట్టడం ద్వారా

పాక్షిక ప్రభుత్వాన్ని ఇవ్వడం జరిగింది. దీనితో తృప్తి చెందని భారతీయులు నిజమైన భాద్యాతాయుత ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టమని కోరడం జరిగింది. దీని యొక్క పర్యవసానం జలియన్‌వాలాబాగ్ 1919వ సంవత్సరంలో జరిగిన దురంతాలకు కారణం అయ్యింది. ఈ సంఘటనలతో భారతీయులను శాంతింపచేయడానికి సంబంధించి 1927వ సంవత్సరంలో సైమన్ కమీషన్ రిపోర్ట్ ఆధారంగా 1935 భారతదేశ కౌన్సిల్ యాక్ట్‌ను ప్రవేశపెట్టి దాని ద్వారా రాష్ట్రాల్లో పూర్తి భాధ్యతాయుత ప్రభుత్వ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగింది. అయినను ఈ చట్టం కూడా రాష్ట్రాలకు సంబంధించినట్టువంటి తుది నిర్ణయాధికారాలను గవర్నర్ జనరల్‌కు ఇవ్వటం ద్వారా రాష్ట్రాలను అదుపు ఆజ్ఞలో ఉంచింది.

ఈ దశలో ఆర్థిక పెట్టుబడిదారీ విధాన ప్రభావం కారణంగా అన్న కీలక ఆర్థిక రంగాలపై బ్రిటీష్ గుత్తాధిపత్యం ఏర్పడింది. బ్యాంకింగ్, వాణిజ్యం, మారకం, భీమా, నౌకాయానం, రైల్వేలు, తేయాకు, కాఫీ, రబ్బర్, తోటలు, జనపనార పరిశ్రమలో బ్రిటీష్ పెట్టుబడి సంపూర్ణ ఆధిక్యతలో ఉంది. బ్రిటీష్ ప్రభుత్వ రాజకీయాధికారం సర్వత్రా దీని సాధన, కొనసగింపుకై ఉపయోగించింది. భారతీయ పెట్టుండికి ప్రధాన నిలయమైన నేత పరిశ్రమలో కూడా మేనేజింగ్ ఏజెన్సీ విధానం ద్వారా, మామూలుగా కంటే కూడా అధికమైన అజమాయిషీని బ్రిటీష్ పెట్టుబడి సంపాదించింది. భారతీయ, ఆంగ్లేయ మేనేజింగ్ సంస్థలు రెండూ రంగంలో ఉన్నప్పటికీ, ఎక్కువ శక్తివంతమైనవి, ప్రభుత్వంలో పటిష్టమైన సంబంధాలు కలవిగా బ్రిటీష్ సంస్థలు వ్యవహరించాయి. ఉదాహరణకు, 1929 నాటి బొంబాయికి చెందిన నూలుమిల్లులోనే 50.3% పెట్టుబడిని ఆంగ్లేయ మేనేజింగ్ ఏజెన్సీలు సమకూర్చాయి. ఆర్థిక విషమ పరిస్థితిలో ఈ విదేశీ ఏజెన్సీల నియంత్రణ మరింత బలపడి, భారతీయ వాటాదార్లు, తమ పెట్టుబడి ధనాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

### 3.7. నాలుగవ దశ: 1940 నుండి 1947 వరకు

1940 నుండి 1947 వరకు ఉన్న కాలాన్ని నాలుగవ దశగా గుర్తించవచ్చు. ఈ దశలో బ్రిటీష్ వారు తమ సామ్రాజ్య భద్రతను మరియు భారతీయుల్లో పెరుగుతున్నటువంటి స్వాతంత్రపేక్షకు న్యాయం చేకూర్చడానికి తీసుకున్నటువంటి చర్యలుగా తీసుకోవచ్చు. అయితే రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటీష్ వారు భారతదేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా భారతదేశాన్ని బ్రిటీష్ పక్షంలో ప్రవేశపెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వాలన్ని రాజీనామా చేసాయి. అయితే భారతీయులను తమకు అనుగుణంగా మార్చుకోవడానికి యుద్దం తరువాత అనేక అధికారాలు ఇవ్వడానికి ప్రలోభ పెట్టడం జరిగింది. బ్రిటీష్ వారు యుద్ధం వలన జరిగిన నష్టంతో భారతదేశానికి పూర్తి స్వాత్రంత్యాన్ని ఇవ్వడానికి పూనుకొన్నారు. ఇంకా ఎక్కువ కాలం భారతదేశం నుండి ఆర్థికపరమైన లాభం పొందలేమని బ్రిటీష్ ప్రభుత్వం నుండి 1947 భారతదేశాన్ని ఇండియా, పాకిస్థాన్‌గా విభజించి చివరిగా 1947 అర్థరాత్రి నుండి వెనుదిరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధ కాలం, అనంతరం కూడా, భారతీయ పరిశ్రమల వాణిజ్యం పైన బ్రిటీష్ పెట్టుబడి పట్టు కొనసాగింది. యుద్ధ కాలంలో అనేక విదేశీ కంపెనీలు తమ సహాయ శాఖలను ఇండియాలో నెలకొల్పాయి. భారీ ప్రమాణంలో, భారతీయ పరిశ్రమలను వెనుకకు నెట్టివేసి, అగ్గిపెట్టెలు, సిగిరెట్లు, సబ్బులు, బూట్లు, చెప్పులు, రబ్బర్, రసాయనాలను, ఇవి ఉత్పత్తి చేశాయి. దీనిమూలంగా, భారతీయ భారీ పరిశ్రమలతో బాటు చిన్న పరిశ్రమలు కూడా దెబ్బతిన్నాయి. ఆర్థిక సహాయం, సుంక విధింపులో ఈ విదేశీ పరిశ్రమలకు కావల్సినంత బ్రిటీష్ ఇండియా ప్రభుత్వ సహాయ ప్రోత్సాహకాలు లభించాయి.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం దేశ ఆర్థిక పరిస్థితులలో కొన్ని మార్పులు సంభవించాయి. విపరీత యుద్ధ లాభాల

కారణంగా, భారతీయ పారిశ్రామికుల చేతుల్లో విస్తారమైన పెట్టుబడి ధనం సమకూరడంతో, వీరిలో ఆత్మవిశ్వాసము పెరిగి, స్వతంత్ర ఆర్థిక యోజనకు దారితీసింది. బ్రిటీష్ ప్రభుత్వ ఆర్థిక పెట్టుబడిదారీ విధానం, భారతీయ ప్రభుత్వ స్థాపన వరకు, విజయవంతంగా కొనసాగింది. ఇటువంటి అడ్డుగోడలను తొలగించుకొని, స్వతంత్ర భారతావని సంపూర్ణ, సమగ్ర పారిశ్రామికీకరణను చేపట్టి, సాధించడం బృహత్తర, క్లిష్ట సమస్యగా పరిణమించింది.

సుమారు రెండు శతాబ్దాల ఆర్థిక దోపిడికి తోడుగా, రాజకీయ, సామాజిక సాంస్కృతిక రంగాల్లో కూడా భారతీయులు అసంతృప్తి, అనాదరణ, అప్రాధాన్యతకు గురిఅయ్యారు. ఫలితంగా బ్రిటీష్ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని భారతీయులు ప్రతిఘటించి నిలిచారు. భారత జాతీయ ప్రభుత్వ స్థాపన, వలసవాద ఆర్థిక వ్యవస్థకు చరమగీతాన్ని పాడింది.

### 3.8. సారాంశము:

పైన వివరించిన వివిధ దశలను బట్టి మనం క్షుణ్ణంగా పరిశీలించినట్లయితే భారతదేశాన్ని ఆర్థికపరంగా దోచుకోవడానికి బ్రిటీష్ వారు ఒక ఆయుధంగా ఉపయోగించారు. వ్యాపారం కోసం వచ్చినటువంటి కంపెనీ వారు తర్వాత భారతదేశంలో ఒక సువిశాల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి కారకులైనారు. దీనికి వారికి చక్కగా దోహదం చేసిన అంశం ఆర్థిక పరమైనటువంటి దోపిడీ విధానము మాత్రమే.

### 3.9. నమూనా ప్రశ్నలు:

1) వలసవాదం అర్థమును, దాని ముఖ్య లక్షణాలను వివరింపుము?

2) వలసవాద వివిధ దశలను చర్చింపుము?

### 3.10. ఆధార గ్రంథాలు

**1. Prof. V. Rama Krishna Reddy:** Social & Economic History of Modern India. (Telugu)

**2. K. Krishna Reddy:** Indian History Modern Age. (Telugu)

**3. Radhakamal Mukharjee:** Economic History of India.

**4. K. Anil Kumar:** Economic History of Modern India.

**5. A.R. Desai (English), P. Satyanarayana (Telugu):** Bharata Jatiya Bhava Samajika Purva Rangam.

**6. Dr. P. Rama Lakshmi:** Bharata Samajika Arthika Charitra.

**- డాక్టర్ జి. సోమశేఖర**

## పాఠం - 4

# బ్రిటీష్ వారి పాలనలో వ్యవసాయము (1747-1947)

### 4.0. లక్ష్యము:

▲ 1757-1857 మధ్య ఈస్టిండియా పాలన గురించి తెలుసుకొనుట.

▲ ఈస్టిండియా కంపెనీ పాలనలో ఏర్పడిన క్షామాలు, కంపెనీ తీసుకున్న చర్యలను తెలుసుకొనుట.

**విషయక్రమము:**

**4.1.** పరిచయము

**4.2.** ఆంగ్లేయుల పాలనలో వ్యవసాయ విధానం

**4.2.1.** ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన (1757-1857)

**4.2.2.** బ్రిటీష్ వారి పాలన (1860-1880)

**4.2.3.** బ్రిటీష్ వారి పాలన (1880-1895)

**4.2.4.** బ్రిటీష్ వారి పాలన (1895-1914)

**4.2.5.** బ్రిటీష్ వారి పాలన (1914-1919)

**4.2.6.** బ్రిటీష్ వారి పాలన (1920-1939)

**4.2.7.** బ్రిటీష్ వారి పాలన (1939-1947)

**4.3.** బ్రిటీష్ వారి వ్యవసాయ విధాన ఫలితాలు

**4.3.1.** క్షామాలు

**4.3.2.** నీటిపారుదల

**4.3.3.** వాణిజ్య పంటలు

**4.3.4.** వ్యవసాయక ఋణ గ్రస్తత

**4.3.5.** ఇతర సమస్యలు

**4.4.** ముగింపు

**4.5.** నమూనా ప్రశ్నలు

**4.6.** ఆధార గ్రంథాలు

### 4.1. పరిచయము:

19వ శతాబ్దం వరకు భారతదేశంలో వ్యవసాయక పరిస్థితులలో చెప్పుకోదగ్గ మార్పులు సంభవించలేదు. రైతులు సాంప్రదాయక పద్ధతులను అనుసరించటం, వారిణి ఋణగ్రస్తత, క్షామాలు, నీటి పారుదుల కొరత, పేదరికం మొదలగు పరిస్థితులతో వ్యవసాయం బాగా దెబ్బతిన్నది. వ్యవసాయ ఉత్పత్తులు కుటుంబ అవసరాలకు మాత్రమే సరిపోయేవి. మిగులు ధాన్యాన్ని స్థానికంగా విక్రయించేవారు. దూరప్రాంతాలకు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొనిపోదగిన రవాణా సౌకర్యాలు,

రహదారులు ఆనాడు లేవు.

## 4.2. ఆంగ్లేయుల పాలనలో వ్యవసాయ విధానం:

1757-1857 మధ్య కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశ వ్యవసాయ రంగాన్ని తమ మాతృదేశ అభివృద్ధి కొరకు, కంపెనీ అభివృద్ధి కొరకు సాధనంగా (మార్కెట్టు కేంద్రంగా) భావించినది. ఈ క్రమంలో భారతదేశ వ్యవసాయ రంగంలో వచ్చిన ప్రధాన మార్పులు : (అ) వ్యవసాయం - వాణిజ్యంగా మారటం

(ఆ) రైతు మరింత ఋణగ్రస్తుడు కావటం.

### 4.2.1. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన (1757-1857):

భారతీయ వ్యవసాయక ఉత్పత్తులైన నీలిమందు, ప్రత్తి, జనుము, నూనెగింజలను విదేశాలకు ఎగుమతి చేయదగిన అవకాశాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ 18వ శతాబ్దం చివరలో గుర్తించింది. పారిశ్రామిక విప్లవం వల్ల ప్రత్తి, జనుము వంటి ముడిసరుకుల అవసరం ఇందుకు దోహదం చేసింది. ఇండియా నుండి ఇంగ్లండుకు ఎగుమతి అయ్యే తయారీ వస్తువులపై, బ్రిటీష్ ప్రభుత్వం ఆంక్షలు విధించడం వల్ల వాటికి బదులుగా వ్యవసాయక ఉత్పత్తులను ఎగుమతి చెయ్యవలసిన అవసరం కూడ కంపెనీ వారికి ఏర్పడింది. తత్ఫలితంగా 1830వ సంవత్సరంలో బెంగాల్‌లో జనుము ఉత్పత్తి, 1840వ సంవత్సరంలో దక్కన్‌లో ప్రత్తి రకాల ఉత్పత్తి వ్యాపించింది. ఇంతకు మించి 1850వ సంవత్సరం వరకు కంపెనీ పాలనలోని ఇండియాలో వ్యవసాయ పద్ధతుల్లో గాని, ప్రభుత్వ వ్యవసాయ విధానంలో గాని పెద్ద మార్పులేవీ జరగలేదు. 1850 తరువాత దేశం లోపలి భాగాల్లో రోడ్ల నిర్మాణం, రైల్వేలైన్ల నిర్మాణం, సముద్ర యానంలో ప్రగతి మున్నగు కారణాల వల్ల వ్యవసాయ రంగంలో గొప్ప మార్పులు సంభవించాయి.

### 4.2.2. బ్రిటీష్ వారి పాలన (1860-1880):

1861 - 1865 నడుమ జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాల అంతర్యుద్ధ ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థలో గొప్ప మార్పులు తెచ్చింది. 1870 నుండి ఇండియా రైతులు ఒడిదుడులకు లోనైనారు. 1860లో వచ్చిన లాభాలతో జీవన ప్రమాణం పెంచి అప్పుల పాలైనారు. ప్రపంచమంతటా ఉన్న ఆర్థిక మాంద్యానికి తోడు కరువులు, కాటకాలు, పన్నుల భారం తోడైనాయి. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పన్నులు పూర్తి కావడంతో, నిరుద్యోగం ప్రబలింది. ప్రభుత్వం వారు తేయాకు, బంగాళాదుంపలు, సింకోనా మున్నగు క్రొత్త పంటల రకాలను ప్రవేశపెట్టటానికి 1866వ సంవత్సరంలో బొటానికల్ గార్డెన్స్‌ను నెలకొల్పింది. 1870వ సంవత్సరంలో వ్యవసాయ శాఖను నెలకొల్పి 1878వ సంవత్సరంలో రద్దు చేసింది. వ్యవసాయంలో క్రొత్త పద్ధతులను ప్రవహించటానికి వ్యవసాయ కేంద్రాలను నెలకొల్పింది.

### 4.2.3. బ్రిటీష్ వారి పాలన (1880-1895):

ఈ 15 సంవత్సరాల కాలం భారతీయ రైతులను అనుకూలంగా పరిణమించింది. 1850-1870 మధ్య కాలంలో నిర్మించిన రోడ్డు, రైల్వేలు 1869వ సంవత్సరంలో సూయజ్ కాలువ నిర్మాణం యొక్క ఫలితాలు రైతులకు ఈ కాలంలో బాగా ఉపకరించాయి. ముడిసరుకులు ఎగుమతి బాగా అనుకూలించింది. ఈ కాలంలో కరువులు రాకపోవడం కూడా అనుకూలించింది. వ్యవసాయ ఉత్పత్తులలో అంతర్జాతీయ వ్యాపారం ముమ్మరమైంది. వివిధ ప్రాంతాలలో ప్రత్యేకమైన పంటలు పండించసాగారు. దేశీయ విదేశీ వ్యాపారం వల్ల నగదు పంటలు ధరలు పెరిగాయి. ఈ కాలంలో నీటి పారుదల సౌకర్యాలు, బంజరు భూముల

సాగుదల పెరిగాయి. నీటి పారుదల రవాణా సౌకర్యాల వల్ల జనుము, ప్రత్తి, నూనె గింజలు, చెరకు మొదలగు పారిశ్రామిక పంటలు అధికమయ్యాయి. బీహార్‌లో ప్రత్తి, దక్కన్‌లో చెరుకుతోట పంటలు స్థానికీకరణ పొందాయి. ఈ కాలంలో 1883, 1884 చట్టాల ద్వారా రైతులకు తక్కువ ఋణాలు ప్రభుత్వం మంజూరు చేసింది. రైతులు అజ్ఞానం వల్ల, అధికారుల జాప్యం వల్ల తగిన ఫలితాలు యివ్వలేదు.

**4.2.4. బ్రిటీష్ వారి పాలన (1895-1914):**

1897, 1900 సంవత్సరాలలో భయంకరమైన కరువులు వచ్చి ప్రాణ నష్టం, పశు నష్టం సంభవించినది. ధరల పెరుగుదల వల్ల సౌకర్యాలు పెంపుదల వల్ల, కాలువ నీటి ద్వారా వ్యవసాయం అభివృద్ధి పొందింది. 88% సాగుబడి పొలంలో ఆహార పంటలే పండింపబడేవి. దేశ జనాభాకు సరిపోయేవి. కాని రైతుల ఋణభారం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వం వారు 1901వ సంవత్సరంలో వ్యవసాయ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను నియమించారు. వ్యవసాయ పరిశీలన కేంద్రాన్ని, వ్యవసాయ కళాశాలలు నెలకొల్పింది. వ్యవసాయ శాఖలకు పద్దులను కేటాయించినది. ప్రతి నాణ్యతను పెంచడానికి మేలురకపు విత్తనాలను పంపిణీ చేసింది. గోదాములో వివిధ రకాలను ప్రవేశపెట్టింది. వరి, వేరుశెనగలలో కొత్త వంగడాలను ప్రవేశపెట్టింది. తేలిక రకం ఇనుప నాగళ్ళను, చిన్న నీటి పంపులను ప్రవేశపెట్టింది. 1904వ సంవత్సరం నుండి సహకార సంఘాలను ప్రోత్సహించింది.

**4.2.5. బ్రిటీష్ వారి పాలన (1914-1919):**

ఈ కాలంలో రైతులు ఒడిదుడుకులకు లోనైనారు. 1918-20 సంవత్సరాలలో అనావృష్టి వల్ల కాటకం సంభవించినది. యుద్ధానంతరం ధరల హెచ్చు-తగ్గుల వల్ల రైతులు భాదలను అనుభవించారు. 90% పొలాల్లో ఆహార పంటలు పండించబడ్డాయి. నూనె గింజల ఎగుమతులు తగ్గిపోయాయి. నగదు పంటలలో ప్రత్తి హెచ్చు ధరల వల్ల ప్రాధాన్యం వహించినది. ప్రభుత్వం వారు ఈ కాలంలో గోధుమ, ప్రత్తి, జనుము, వేరుశెనగ, చెరకులలో మేలురకం వంగడాలను ప్రవేశపెట్టింది. విత్తన శుద్ధికి ప్రత్యేక కేంద్రాలు నెలకొల్పారు.

**4.2.6. బ్రిటీష్ వారి పాలన (1920-1939):**

ఈమధ్య కాలంలో నెలకొన్న ఆర్థిక మాంద్యం వల్ల రైతుల ఆదాయం బాగా పడిపోయింది. ఎనిమిది రాష్ట్రాలలో ముఖ్యమైన పంటల ధరలు 1928 నుండి 1933 నాటికి సగానికి పడిపోయినాయి. ఈ కాలంలో ముఖ్యముగా వ్యవసాయక ఉత్పత్తులను ఎగుమతి చేసి, తయారీ వస్తువులను దిగుమతి చేసుకున్నది. ఆదాయం తగ్గిపోయినప్పటికి, భూమి శిస్తులో గాని, కౌలు పరిమాణంలో గాని, వడ్డీ రేటులో గాని మార్పులు లేకపోవడం వల్ల రైతులు ఋణభారాలు భరింపజాలక బంగారం అమ్ముకోవలసి వచ్చింది. ఈ కాలంలో కేంద్రంలోని ఆంగ్ల ప్రభుత్వం రైతుల దుస్థితిని తొలగించడానికి ఎట్టి చర్యలు తీసుకోలేదు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు శిస్తును తగ్గించరు. కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల ఋణభారం తగ్గించడానికి కొన్ని శాసనాలు చేసింది. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం మెరుగుపరిచింది.

**4.2.7. బ్రిటీష్ వారి పాలన (1939-1947):**

అధిక ఆదాయం కొరకు రైతులు ఈ కాలంలో ప్రత్తి, జనుము, వేరుశెనగ వంటి వాణిజ్య పంటలు పండించినారు. కాని రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో వీటి గిరాకీ తగ్గిపోయింది. ఆహార పంటలకు గిరాకీ పెరిగింది. కాని రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడం వల్ల, యుద్ధ సమయంలో సైనిక అవసరాల వల్ల, 1942 బర్మా నుండి బియ్యం దిగుమతి

ఆగిపోయినందు వల్ల రైతులు, వర్తకులు ధాన్యం దాచివేశారు. ఫలితంగా 1944 నాటికి వాణిజ్య పంటల సాగు తగ్గి ఆహార పంటల సాగు పెరిగింది. గ్రామీణ ఆదాయం పెరిగి భూస్వాములు బాగుపడ్డారు. ధరల పెరుగుదల వల్ల గ్రామీణ ఋణభారం తగ్గింది. ప్రభుత్వం వారు 1942వ సంవత్సరంలో జరిపిన ఆహారోత్పత్తి సమావేశము ఆహారోత్పత్తి పెంపుదలకు ప్రణాళిక సిద్ధపరిచింది. 1943వ సంవత్సరంలో బెంగాల్ కరువు తరువాత ఆహార ధాన్య విధాన కమిటీ సిఫారసులననుసరించి ధాన్యం సప్లయ్‌ని మెరుగుపరచి రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ధరలను అదుపులో పెట్టడానికి కంట్రోల్‌ను ప్రవేశపెట్టారు.

## 4.3. బ్రిటీష్ వారి వ్యవసాయ విధాన ఫలితాలు:

### 4.3.1. క్షామాలు:

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో జలధారలు పాడుపడిపోయాయి. కంపెనీ ప్రభుత్వ కాలంలో ఎన్నో క్షామాలు సంభవించాయి. ఉదా: ఆంధ్ర ప్రాంతంలో 1805, 1811, 1823, 1832, 1839 సంంత్సరాలలో కరువు వచ్చి జన నష్టం, పశు నష్టం సంభవించినది. ఈ కరువులను నివారించడానికి కంపెనీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 1858వ సంవత్సరంలో కంపెనీ పాలన తొలగి చక్రవర్తి పాలన ఏర్పడిన పిమ్మట రవాణా సౌకర్యాలు, నీటి పారుదల సౌకర్యాలు ప్రవేశపెట్టబడినప్పటికి అవి ఎంత మాత్రము సరిపోక దుర్భరమైన క్షామాలు సంభించాయి. 1866వ సంవత్సరంలో ఒరిస్సా, బెంగాల్‌లోను; 1868వ సంవత్సరంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో; 1876వ సంవత్సరంలో బొంబాయి, మద్రాసులలో, 1890వ సంవత్సరంలో పంజాబు, ఉత్తరప్రదేశ్, కశ్మీర్‌లలో; 1896వ సంవత్సరంలో ఉత్తరప్రదేశ్, మద్రాస్, బొంబాయి, మధ్యప్రదేశ్‌లలోను; 1899వ సంవత్సరంలో బొంబాయి, మధ్యప్రదేశ్, విదర్భ, పంజాబ్, అజ్మీరులలో వచ్చిన క్షామాలు లక్షలాది జనాలను బలిగొన్నాయి. ఆ తరువాత కూడ అక్కడక్కడ క్షామ పరిస్థితులు నెలకొన్నప్పటికి 1943వ సంవత్సరంలో సంభవించిన బెంగాల్ క్షామము మిక్కిలి దారుణమైనది. అందులో 40 లక్షల మంది మరణించారు. ఆంగ్ల ప్రభుత్వం చేపట్టిన క్షామ నివారణ పథకాలు కేవలం నామమాత్రమై కంటితుడుపుకు ఉపయోగించారు.

### 4.3.2. నీటిపారుదల:

క్షామ నివారణ పథకాల క్రింద ప్రభుత్వం నీటిపారుదల సౌకర్యాలను కల్పించడంలో పీడ ప్రజలకు జీవనోపాధి కల్పించబడింది. నదులకు ఆనకట్టలు కట్టి కాలువలు త్రవ్వడం ద్వారా రైతులు అనావృష్టికి భయపడవలసిన అవసరం లేకపోయింది. కాలువ నీటి ద్వారా బంజరుభూమి సాగు అధికరించింది. ప్రభుత్వం వారు పాత బావులను, చెరువులను బాగు చేయించారు. బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన నీటి పారుదల సౌకర్యాలలో సింధునదిపై సుకూబర్ బ్యారేజి, కావేరి నదిపై మెట్టూరు ఆనకట్ట, కృష్ణా, గోదావరి నదలు నుండి త్రవ్విన కాలువలు ముఖ్యమైనవి. నీటిపారుదల, రవాణా సౌకర్యాలు రెండు ఉత్పత్తి దాయకములే. అయినప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వం రైల్వే నిర్మాణం వైపు ఎక్కువగా మొగ్గు చూపింది. ఇండియాలో నీటిపారుదల సౌకర్యాలు చెందడం వారికి లాభదాయకం కాకపోవమే ఇందుకు కారణం.

### 4.3.3. వాణిజ్య పంటలు:

క్షామాలు నీటి పారుదల సౌకర్యాల ఏర్పాటుకు దారితీస్తే నీటిపారుదల సౌకర్యాలు వాణిజ్య పంటల వృద్ధికి దారితీశాయి. రైతులు ఆహారపంటలతో తృప్తిపడక ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే వాణిజ్య పంటలు పండించడం ఆరంభించారు. స్థానికావసరాలకు సంబంధం లేని పంటలు పండించడంలో గ్రామీణ వ్యవస్థలోని స్వయంపోషకత్వం దెబ్బతిన్నది. హెచ్చుతున్న

నీటి తీరువా, భూమి శిస్తు, కౌలు పరిమాణాలకు తగినట్లు వాణిజ్య పంటలు హెచ్చాయి. పంటల స్థానికీకరణ కూడా ఏర్పడింది. రవాణా సౌకర్యాలు వాణిజ్య పంటలకు దోహదం చేశాయి. అయితే వాణిజ్యంలో లాభనష్టాలున్నట్లు, వాణిజ్య పంటలు కూడా రైతలు లాభనష్టాలకు కారణమైనాయి.

**4.3.4. వ్యవసాయక ఋణ గ్రస్తత:**

ఆంగ్ల ప్రభుత్వం రైతుకు భూమిపై ప్రసాదించిన ఆస్తి హక్కు అతని పాలిట శాపంగా పరిణమించింది. పరిశ్రమలు నశించి ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడడం వల్ల భూమిపై ఒత్తిడి పెరిగింది. పొలం విలువ అధికం కావడంతో రైతుకు సులభంగా అప్పు పుట్టే అవకాశం లభించింది. షావుకార్లు, భూమి తనఖాపై అప్పు యివ్వసాగారు. అప్పు తీర్చలేని రైతుల పొలాలను వారు చట్టబద్ధంగా ఆక్రమించుకొని అన్యాక్రాంతం చేయసాగారు. ఈ విధానం పట్ల దేశమంతటా ధనికులకూ, దరిద్రులకూ మధ్య గల అంతరం పెరిగింది. దేశం మొత్తం మీద 75% రైతులు ఋణగ్రస్తులై ఉన్నారని 1880 విచారణలో తేలింది. ఋణదాతల నుండి ఋణ గ్రస్తులైన రైతులను రక్షించడానికి ప్రభుత్వం చేసిన శాసనాలు ఫలించలేదు. 1904 చట్ట ప్రకారం సహకార ఋణ సంఘాలు ఏర్పడినాయి. రైతలు నిరక్షరాస్యత, ప్రభుత్వ విముఖత వల్ల సహకారోద్యమం బలపడలేదు. రైతులు తనఖా బ్యాంకుల నుండి దీర్ఘకాలిక ఋణాలు పొందారు. కాని ఈ ఋణ విధానం కూడా రైతుల ఋణగ్రస్తతను తొలగించలేకపోయింది.

**4.3.5. ఇతర సమస్యలు:**

దేశంలో తగినంత మార్కెటింగ్ సౌకర్యము, రవాణా సౌకర్యము లేనందున మధ్య వర్తులు రైతులను, వాడకం దార్లను దోచుకున్నారు. ఈ పరిస్థితిని సరిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరియైన మార్కెటింగ్ విధానాన్ని, తూనికలు కొలతలలో ప్రామాణీకతను ప్రవేశపెట్టింది. వివిధ ప్రాంతాలలోని భూమి శిస్తు విధానాల అసమానతలు, కౌలుదారీ విధానాలు ప్రజలలో అసంతృప్తికి కారణభూతమైనాయి. కౌలుదారీ సంరక్షణ చట్టాలు సక్రమంగా పని చేయలేదు. వ్యవసాయ కూలీల పరిస్థితి రానురాను దుర్భరంగా తయారైంది. బ్రిటీష్ ఆర్థిక విధానంలో పరిశ్రమలు నశించడం వల్ల చేతి వృత్తుల వారు క్రమంగా వ్యవసాయ కూలీలుగా మారారు. వీరికి ఏడాదిపొడవునా పని ఉండదు. పైగా నియమితమైన కూలీ రేటు లేకపోవడం వల్ల వీరి శ్రమను, భాగస్వామ్యంను దోచుకోవడానికి అవకాశం చిక్కింది.

**4.4. ముగింపు:**

1857-1947 మధ్య ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలోను, బ్రిటీష్ రాజ్య పాలనలోను భారతదేశ రైతు పరిస్థితి మాత్రం మెరుగుపడలేదు. 1857కు ముందు సాంప్రదాయక పద్ధతులు అద్వానం, సాంప్రదాయక నీటివసతులు మొదలగు వాటి వల్ల రైతులు సమస్యలు ఎదర్కొనగా బ్రిటీష్ వారి కాలంలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ఋణాలు, రహదారి, రవాణా సౌకర్యాలు, నీటిపారుదల వసతులు అభివృద్ధి చెందిన వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. కాని అవి భారతదేశ రైతుకు ఉపయోగపడలేదు. అదేవిధంగా భారతదేశ సమాజానికి ఉపకరించలేదు. కారణం అధిక పన్నుల వల్ల, ఋణ భారం వల్ల రైతులు, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పండించటం వల్ల ఆహార ధాన్యాల కొరత వల్ల భారతదేశం యిబ్బందులకు గురిఅయినది. దీనికి తోడు క్షామాలు దక్కన్‌లో 1791-1858 వరకు, 1866 నుండి 1943 వరకు ఉత్తర భారతదేశంలో సంభవించిన కరువులు, రెండు ప్రపంచ యుద్ధాల ప్రభవంతో భారతదేశ వ్యవసాయ రంగం కుదేలైనది.

**4.5. నమూనా ప్రశ్నలు:**

**వ్యాసరూప ప్రశ్నలు:**

1) భారతదేశంలో 1757-1857 వరకు వ్యవసాయ పరిస్థితులను వివరించుము?

2) 1857-1947 వరకు భారతదేశంలోని వ్యవసాయ స్థితిగతులను తెలియజేయుము?

**4.6. ఆధార గ్రంథాలు:**


**1. Bipin Chandra** : Modern History, NCERT.

**2. Bipin Chandra** : Rise and Growth of Economic Nationalism in India, Delhi, 1986.

**3. R.C. Majumdar** : Advanced History of India, Oxford, 1966.

**4. Dr. BRAOU** : History of Modern India, B.A., 1987.

**5. తెలుగు అకాడమి** : ఆధునిక భారతదేశ చరిత్ర, హైదరాబాదు, 1989.


**- డాక్టర్ కృష్ణ ప్రసాద్ బాబు. జె**

# పాఠం - 5

# బ్రిటీష్ వారి కాలం నాటి భూమి శిస్తు పద్ధతులు (1757-1947)

**5.0. లక్ష్యము:**

- ▲ 1757-1947 మధ్య కాలంలో బ్రిటీష్ వారి శిస్తు విధానాలను అవగాహన చేసుకొనుట.
- ▲ బ్రిటీష్ వారి వివిధ భూమి శిస్తు విధానాల వల్ల భారతదేశంలో కలిగిన ప్రభావమును అర్థం చేసుకొనుట.

**విషయక్రమము:**


**5.1.** పరిచయము

**5.2.** బ్రిటీష్ వారి కాలంలో భూమి శిస్తు విధానాలు

**5.2.1.** శాశ్వత శిస్తు విధానం (జమీందారీ పద్ధతి)

**5.2.1.1.** జమీందార్లు-భూమి శిస్తు

**5.2.1.2.** కంపెనీ విలువ - వేలం పాట విధానం

**5.2.1.3.** కారన్ వాలిస్ - శాశ్వత శిస్తు విధానం

**5.2.1.4.** జమీందారీ వర్గాలు

**5.2.1.5.** జమీందార్ల శాశ్వత హక్కు

**5.2.1.6.** శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి వల్ల కలిగిన లాభ-నష్టాలు:

**5.2.1.7.** రైతులకు కలిగిన నష్టం

**5.2.1.8.** జమీందారీ పద్ధతి విస్తరణ

**5.2.1.9.** జమీందారీల రద్దు

**5.3.** మహల్వారీ పద్ధతి

**5.4.** రైతు వారీ పద్ధతి

**5.4.1.** భూమిపై ఆస్థి హక్కు

**5.4.2.** థామస్ మన్రో పాత్ర

**5.4.3.** రైతు వారీ పద్ధతి

**5.4.4.** వివిధ ప్రాంతాలలో రైతు వారీ పద్ధతి అమలు

**5.4.4.1.** మద్రాసు రాష్ట్రం

**5.4.4.2.** బొంబాయి రాష్ట్రం

**5.5.** రైతులపై అధిక శిస్తుల భారం

5.6. పన్నుల వసూలులో ఉద్యోగుల అమానుషత్వం

5.7. రైతులపై ఋణభారం

5.8. వ్యవసాయం వెనుకంజ

5.9. అస్తవ్యస్తమైన భూస్వామ్య పద్ధతులు

5.10. భూమి శిస్తు భారం

5.11. కౌలుదారీ సమస్య

5.12. ముగింపు

5.13. నమూనా ప్రశ్నలు

5.14. ఆధార గ్రంథాలు


## 5.1. పరిచయము:

భారతదేశంలో అనాదిగా ప్రజానీకానికి వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉండేది. అందువల్ల భూమి శిస్తు ద్వారానే ఆదాయం ఎక్కువగా ఉండేది. అయితే భూమిశిస్తును వసూలు చేసే విషయంలో అన్నీ ప్రాంతాలలో ఒకే పద్ధతి ఉండేది కాదు. ప్రాచీన కాలంలో భూస్వాములు, మొగలుల కాలంలో జాగీర్దారులు ఈ పన్నుల వసూలు భాధ్యతను నిర్వర్తించగా, బ్రిటీష్ వారి కాలంలో భూమి శిస్తు 3 రకాలుగా అమలు చేశారు. అవి:

1. శాశ్వత శిస్తు – జమీందారీ పద్ధతి
2. మహోల్వారీ పద్ధతి
3. రైతువారీ పద్ధతులను అనుసరించినారు.

ఈ పద్ధతులను వివిధ ప్రాంతాలలో అమలు పరిచినారు.

## 5.2. బ్రిటీష్ వారి కాలంలో భూమి శిస్తు విధానాలు:

### 5.2.1. శాశ్వత శిస్తు విధానం (జమీందారీ పద్ధతి):

ఈ విధానం బెంగాల్, బీహార్, ఒరిస్సా ఉత్తర ప్రదేశ్‌లలో 1793వ సంవత్సరంలో కారన్ వాలీస్ చేత ప్రవేశపెట్టబడినది. ఈ ప్రాంతాలలో బ్రిటీష్ వారికి పూర్వం కూడ జమీందార్లు ఉండేవారు. వీరు భూమి శిస్తులను వసూలు చేసే అధికారులు మాత్రమే. భూములపై వీరికి ఎలాంటి హక్కు లేదు.

#### 5.2.1.1. జమీందార్లు–భూమి శిస్తు:

మొగల్ సామ్రాజ్య క్షీణ దశలో వివిధ ప్రాంతాలలోని మొగల్ సుబేదార్లు భూమి శిస్తు వసూలకై జమీందార్లకు ఫార్మాలిచ్చారు. క్రమేణ ఈ జమీందార్లు వంశపారంపర్యంగా హక్కుగా మారిపోయింది. ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు బెంగాల్‌ను వశపరచుకునే నాటికి ఆ రాష్ట్రంలో ఇట్టి జమీందార్లు నెలకొని ఉన్నారు. వీరు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రైతుల నుండి శిస్తును వసూలు చేసి, వసూలు చేసిన మొత్తంలో ఒక భాగాన్ని తమ ఖర్చుల క్రింద వినియోగించాలని, తక్కువ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తుండేవారు. జమీందార్లు కేవలం శిస్తును వసూలు చేసే అధికారుల మాత్రమే.

**5.2.1.2. కంపెనీ విలువ – వేలం పాట విధానం:**

1757 ప్లాసీ యుద్ధం వల్ల బెంగాల్ రాష్ట్రం కంపెనీ ఆధీనంలోకి రాగా, 1764 బాక్సర్ యుద్ధం 1765 అలహాబాద్ సంధితో భూమి శిస్తు వసూలు చేసే అధికారం కంపెనీకి లభించినది. బెంగాల్ గవర్నరైన వారన్ హేస్టింగ్స్ కంపెనీ ఆదాయం పెంచే దిశగా 1772వ సంవత్సరంలో భూమి శిస్తు వసూలు చేసే పద్ధతిలో గొప్ప మార్పు చేశాడు. ఒక్కొక్క జమీందారులు వసూలు చెయ్యదగిన మొత్తాన్ని వేలం వేసి, ఎక్కువ మొత్తానికి ఎవరు వేలం పాడితే వారికి శిస్తు వసూలు చేసే అధికారాన్ని ఇచ్చాడు. ఇది విఫలమైనది. ఈ పద్ధతి 1772–1783 వరకు ఈ పద్ధతి కొనసాగింది.

**5.2.1.3. కారన్ వాలిస్ – శాశ్వత శిస్తు విధానం:**

1786వ సంవత్సరంలో కారన్ వాలిస్ గవర్నర్ జనరల్‌గా వచ్చే నాటికి బెంగాల్‌లోని భూమి శిస్తు పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారైనాయి. కారన్ వాలిస్ బ్రిటన్‌లోని భూస్వామిక వర్గానికి చెందినవాడు. భారతదేశంలో భూమిపై ఆస్తి హక్కులు గల ఒక భూస్వామ్య వర్గం ఏర్పడితే దాని మూలంగా వ్యవసాయం బాగుపడుతుందని, మరికొన్ని లాభాలు కలుగుతాయని కారన్ వాలిస్ విశ్వాసం. ఈ నేపథ్యంలో వ్యవసాయ పద్ధతులకు, భూమి శిస్తు విధానాలకు సంబంధించిన ఒక కమిటీని నియమించాడు. కమిటీ అధ్యక్షుడైన జాన్‌షోర్ 1789వ సంవత్సరంలో తన నివేదికను సమర్పించినాడు. “భూములపై భూస్వాములకు గల హక్కు వంశపారంపర్యంగా వచ్చిందే. దీనిని భారతదేశ మత ధర్మ శాస్త్రాలు అంగీకరించాయి” అని ఈ అధికారాన్ని తొలగించడం అసంబద్ధమని తన నివేదికలో స్పష్టం చేశారు. దీనిని ఆధారంగా చేసుకుని కారన్ వాలిస్ తన అధికార ముద్రను వేసి 1793వ సంవత్సరం నుండి శాశ్వత శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టాడు.

ప్రతి సంవత్సరం భూమి శిస్తును వసూలు చేసే అధికారాన్ని వేలం వేయడం మూలంగా ప్రభుత్వానికి ఒక నిర్ణీత ఆదాయం లభించకపోవడం ఒక పెద్ద లోపంగా కారన్ వాలిస్ గుర్తించాడు. ఆదాయంలో ప్రతి సంవత్సరం మార్పులు జరగడానికంటే ఏదో ఒక నిర్ణీత మొత్తం కొంచెం తక్కువైనా లభించడం పరిపాలనకు అవసరమని గ్రహించాడు. అందుచేత ‘వేలం పద్ధతిని’ రద్దు చేసి ప్రతి సంవత్సరం జమీందారు ప్రభుత్వానికి చెల్లింపవలసిన మొత్తాన్ని శాశ్వత ప్రాతిపదికపైన నిర్ణయం చేశాడు. అందువల్లనే దీనికి ‘శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి’ అని పేరు వచ్చినది. దీనిని జమీందారు పద్ధతి అని కూడా అంటారు.

**5.2.1.4. జమీందారీ వర్గాలు:**

శాశ్వత శిస్తు విధానం అమలులోకి వచ్చే నాటికి బెంగాల్‌లో నాలుగు జమీందారీ వర్గాలు ఏర్పడినవి. అవి:

1) మొగల్ పరిపాలకులకు భూమి శిస్తు రూపంలో కప్పం చెల్లిస్తూ తమ సంస్థానాలను నిలుపుకొని ఉండిన కరాచ్, బీహార్, అస్సాం, త్రిపుర రాజులు.

2) స్వతంత్ర సర్దారుల రీతిగా పరిపాలకులకు శిస్తు చెల్లిస్తూ ప్రాచీన కాలము నుండి స్థిరపడి వుండిన రాజ్‌షాహీ, బర్ద్వాన్ దినాజ్‌పూర్ రాజ కుటుంబం వారు.

3) శిస్తు వసూలు చేయడానికై మొగల్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యక్తులు. వీరు వంశపారం పర్యంగా వస్తున్నందువలన వీరు స్థిరపడినారు.

4) ఈస్ట్ ఇండియా కంపెనీకి దివానీ లభించిన పిమ్మట భూమి శిస్తు వసూలు చేయడానికై కంపెనీ వారు నియమించిన వ్యక్తులు వీరిని కంపెనీ సాధారణంగా ‘జమీందార్లు’ అని పిలిచేవారు.

వేలం పాటలో గుత్తగా పాడి జమీందారీలను గుత్తగా తీసుకున్న కలకత్తా బినామీలు, కంపెనీ ఉద్యోగలు బినామీలు ఈ వర్గానికి చెందినవారు.

"శిస్తు పరిష్కారం చేయవలసి వస్తే మొదటి రెండు వర్గాల వారికి బలమైన హక్కు ఉండేది. మూడవ వర్గానికి గల హక్కు సాధారణం. నాల్గవ వర్గానికి ఏ మాత్రం హక్కు లేదు" అని "ఫౌడ్" కమీషన్ అభిప్రాయ పడింది.

**5.2.1.5. జమీందార్ల శాశ్వత హక్కు:**

1793 నాటికి జమీందార్లుగా గుర్తింపు పొందినవారు. క్రొత్త వారితో కలిపి కంపెనీ ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం జమీందార్లకు అంతకుముందు లేని 'భూమిపై హక్కు' కొత్తగా లభించినది. వీరికి తమ జమీందారీలలో భూములపై శాశ్వత ఆస్తి హక్కు ఏర్పడింది. బ్రిటన్‌లోని ఫ్యూడల్ వర్గంతో కొంతవరకు పోల్చదగిన ఒక వర్గం భారతదేశంలో ఏర్పడినది. ప్రభుత్వానికి చెల్లించే మొత్తం కంటే వీరు రైతుల నుండి ఎక్కువగా వసూలు చేసి లాభించారు. తొలిదశలో వీరు బాగా నష్టపోయి కంపెనీకి తమ భాగాలు కూడా యివ్వవలసి వచ్చినది. కొన్ని ప్రాంతాలలో ఈ పద్ధతి జమీందార్ల తిరుగుబాటుకు దారితీసినది.

**5.2.1.6. శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి వల్ల కలిగిన లాభ-నష్టాలు:**

**బ్రిటీష్ వారి లాభ-నష్టాలు:**

1) ఈ విధానం అమలులోనికి వచ్చిన తరువాత ఎన్నడూలేని ఉన్నత స్థాయిలో శిస్తు బేరీజు నిర్ణయింపబడినది. భూమి శిస్తు అంచనా మొత్తంలో 89% బ్రిటీష్ వారికి చెందగా, 11% మాత్రమే జమీందార్లకు మిగిలినది.
2) అంతకుముందు శిస్తు వసూలు చేసే తహసీల్దార్లు, కానుంగ్‌లు, పట్వారీలను రద్దు చేయడం వల్ల ఖర్చు ఆదా అయినది.
3) మొగలుల కాలంలో జమీందార్లు రాజకీయ అధికారం కలిగివుండి రాజకీయ సంక్షోభం ఏర్పడినప్పుడు వీరు కీలక పాత్ర పోషించారు. ఈ పద్ధతిలో వీరికి రాజకీయ అధికారం తొలగింపబడి కేవలం ఆర్థిక అధికారం మాత్రమే యివ్వబడటం వల్ల కంపెనీ రాజకీయాలకు జమీందార్ల భయం లేదు.
4) జమీందార్లకు భూములపై శాశ్వత హక్కు కల్పించి ఆర్థిక బలం పెంచడం వల్ల కంపెనీ - జమీందార్లు ఒకరు రాజకీయ అధికారం, మరొకరు ఆర్థిక అధికారంతో పరస్పర సహకారంతో ఒక కూటమిగా ఏర్పడ్డాయి.

అయితే కాలక్రమేణ వ్యవసాయ ఉత్పత్తులు, ధరలు విపరీతంగా పెరగడం వల్ల శిస్తు పెరగకపోవడం వల్ల సంవత్సరానికి 3 కోట్ల రూపాయలకు పైగా కంపెనీ నష్టపోయింది. కంపెనీ వారితో జమీందార్లకు తగాదాలు కలహాలు ఏర్పడినాయి.

**5.2.1.7. రైతులకు కలిగిన నష్టం:**

శాశ్వత శిస్తు విధానం వల్ల జమీందార్లకు ఆస్తి హక్కు శాశ్వతంగా లభించినందున వారు బ్రిటీష్ భూస్వామిక వర్గం వలెనే వ్యవసాయ వృద్ధిలో శ్రద్ధ వహిస్తారని కారన్ వాలస్ ఆశించారు. కాని అది జరుగలేదు. జమీందార్లు తమ దృష్టినంతా శిస్తు వసూలుపైనే కేంద్రీకరించారు. దీని వల్ల వ్యవసాయ అభివృద్ధి కుంటుపడింది.

అంతకు పూర్వం రైతులకు తన పంట రాబడిపై ఎంతవరకు చెల్లించారో అనే అవకాశం వుండేది. ఇప్పుడు జమీందార్లే ఈ పని చేయటం వల్ల రైతు తన స్వేచ్ఛను, హక్కును కోల్పోయారు. కష్టపడి పనిచేసే వారు రైతు. ఫలితం అనుభవించేవారు

జమిందారు. పన్ను చెల్లించేవారు రైతుల భూములను జమిందార్ లాక్కునేవాడు. భూములన్ని జమిందార్‌వే కావడంతో రైతు వేరే భూమిని సాగుచేసే అవకాశం కూడా లేదు. ఈ పరిస్థితులలో జమిందార్ శిస్తును ఎంత విధిస్తే అంత చెల్లించవలసి వచ్చేది.

కారన్ వాలిస్ ప్రకారంగా శాశ్వత శిస్తు పద్ధతిని ప్రవేశపెట్టనపుడు జమిందార్ రైతులకు శాశ్వత పట్టాలను ఇవ్వాలని అభిప్రాయపడినారు. కాని చట్టం చేయలేదు. పట్టాలు యివ్వలేదని రైతులు న్యాయస్థానాలకు వెళ్ళలేకపోయినారు. కారణం అర్థిక స్థోమత.

ఈ పరిస్థితులలో జమిందార్లు రైతుల నుండి ప్రతి సంవత్సరం వసూలు చేసే ముక్తాలు (శిస్తు) పెరిగిపోయాయి. ఈవిధంగా రైతులు దెబ్బతినడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనది. నూతన సామాజిక వర్గాలు ఏర్పడినవి.

### 5.2.1.8. జమిందారీ పద్ధతి విస్తరణ:

కంపెనీ ప్రభుత్వ పాలనలో కారన్ వాలిస్, సర్‌జాన్‌షోర్, వెల్లస్లీ, విలియం బెంటింక్ మొదలగు గవర్నర్ జనరల్స్ లందరూ జమిందారీ పద్ధతిని భారతదేశంలోని యితర ప్రాంతాలకు కూడా విస్తరింపజేయాలని ఆశించారు. 1795వ సంవత్సరంలో బెంగాల్, 1802, 1805వ సంవత్సరాలలో మద్రాసు రాష్ట్రం ఉత్తర సరుకులలో ఈ పద్ధతిని విస్తరింపజేశారు. 1883వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం ఈ పద్ధతిని తిరస్కరించినది.

### 5.2.1.9. జమిందారీల రద్దు:

భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడినప్పటి నుండి జమిందారీ పద్ధతిని వ్యతిరేకిస్తూ వచ్చినది. ఈ విధానం రైతుల ప్రయోజనాలకు అడ్డంకి అని వారించినది. 1937వ సంవత్సరంలో రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత రైతుల హక్కుల సంరక్షణకు ప్రయత్నాలు జరిగాయి. స్వాతంత్ర్యం లభించిన 1950వ సంవత్సరంలో బెంగాల్‌తో సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జమిందారీ పద్ధతిని, శాశ్వత శిస్తు నిర్ణయ విధానాన్ని రద్దు చేశాయి. జమిందార్లకు నష్ట పరిహారం చెల్లించగా రెండు కోట్ల మంది రైతులకు, కౌలుదారులకు తాము సాగుచేసే భూమిపై హక్కు ఏర్పడింది.

## 5.3. మహల్వారీ పద్ధతి:

ఈ పద్ధతిలో ఒక గ్రామంలోని భూమి అంతా గ్రామస్థులందరికి చెందిన ఆస్తిగా పరిగణించి మొత్తం భూమి మీద ప్రభుత్వం శిస్తు విధించేది. శిస్తు చెల్లించే భాధ్యతను గ్రామస్థులు ఉమ్మడిగాను, వ్యక్తిగతంగాను వహించేవారు. గ్రామ పెద్ద వ్యక్తుల నుండి శిస్తు వసూలు చేసి ప్రభుత్వానికి అందజేస్తారు. రోసివకు ప్రతివిలవుక అతడు కొంత కమీషన్ పొందుతాడు. ఈ పద్ధతి తాలుక ఆగ్రా, అయోధ్యలలో అమలులోకి వచ్చినది. తరువాత పంజాబ్, రాజస్థాన్‌కు వ్యాపించినది. ఒక రకంగా ఈ పద్ధతి రైతువారీ పద్ధతిని పోలినది. ఉమ్మడి యాజమాన్యం పేరుకు మాత్రమే ఉండేది. క్రమంగా శిస్తును వ్యక్తుల కమతాల మీద వేరువేరుగా విధించటం జరిగినది. వ్యవసాయదారులు వారి వారి భూములు మేరకు మాత్రమే శిస్తును చెల్లించడానికి బాధ్యత వహించేవారు.

## 5.4. రైతు వారీ పద్ధతి:

### 5.4.1. భూమిపై ఆస్థి హక్కు:

సాంప్రదాయనికి భారతదేశ గ్రామీణంలో హక్కులు అనేవి కాక కుటుంబ పోషణ అవసరాల కొరకు, చేయగలిగినంత

భూమిని సాగు చేసుకుంటూ రైతు వ్యవసాయం చేస్తుండేవారు. దీనికి విరుద్ధంగా బ్రిటీష్ పాలకులు తమ దేశ సాంప్రదాయాన్ని అనుసరించి భూమిపై, ఆస్తిపై హక్కు అనే క్రొత్త సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టినారు. బెంగాల్‌లోను, ఉత్తర సర్కారులలోను ఈ హక్కు కల్పించారు. అధిక సంఖ్యాకులైన రైతుల ప్రయోజనాలను విస్మరించి స్వల్ప సంఖ్యాక వర్గానికి భూమిపై హక్కును ప్రసాదించి ధనికులు మరింత ధనికులు కావటానికి తోడ్పడటం అన్యాయమని క్రమంగా ఆంగ్లేయులు గ్రహించి రైతుకు పొలంపై ఆస్తి హక్కు ఉండాలని రెండవ దశలో వారు నిర్ణయించారు. దీనినే రైతువారీ విధానం అంటారు.

### 5.4.2. థామస్ మన్రో పాత్ర:

ప్రప్రథమంగా కెప్టెన్ రీడ్ మద్రాసు రాష్ట్రంలో బారామహల్ జిల్లాలో 1792వ సంవత్సరంలో రైతువారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుపరచినారు. రీడ్‌కు అసిస్టెంటుగా వుండి మద్రాసు రాష్ట్ర గవర్నరైన థామస్ మన్రో ఈ విధానాన్ని మద్రాసు రాష్ట్రమంతా ప్రవేశపెట్టాడు. రీడ్ మన్రో ఇరువురూ శాశ్వత శిస్తు నిర్ణయాన్ని విమర్శించడమేకాక, ఇతర ప్రాంతాలలో దీనిని ప్రవేశపెట్టడం అసమంజసమని భావించారు. 1813 ఛార్టర్ చట్టం రైతువారీ విధానానికి అనుకూలంగా పరిణమించినది.

రైతువారీ పద్ధతి వల్ల ప్రజా శ్రేయస్సు సాధ్యమవుతుంది. ఆస్తి చిన్న చిన్న ముక్కలుగా విభజింపబడి పోతూ ఉండటం వల్ల త్రపి వారు రైతుగా మారిపోక తప్పదు. రైతునే భూస్వామిగా గ్రహించి అతను నుండి ప్రభుత్వం స్వయంగా పన్నును వసూలు చేయవలసి వచ్చింది. పన్నులు వసూలు చేసే అధికారికి, రైతుకు మధ్య జమీందారు వంటి వేరొక వ్యక్తి ఉండవలసిన అవసరం లేదు. రైతుకు, ప్రభుత్వానికి ఈ పద్ధతి లాభదాయకమైనది. రైతు భూమికి యజమానిగా ఉన్నప్పుడే దానిని బాగుపరచుకోవాలనే సంకల్పంతో రైతు వ్యవసాయం చేస్తాడు అని మన్రో అభిప్రాయపడ్డాడు. భారతదేశంలో అనాది నుండి వున్నది రైతువారీ విధానమే అని, నూతన పద్ధతులు ఎంత భిన్నంగా కనబడినా తుదకు రైతువారీ విధానంగా మారిపోవడం తప్పదనీ అతడు వాదించాడు.

### 5.4.3. రైతు వారీ పద్ధతి:

రైతు వారీ పద్ధతిలో పొలాన్ని సాగుచేసే రైతు దాని ఆస్తిదారుడుగా ఉంటాడు. ప్రభుత్వానికి, అతనికి మధ్య శిస్తు వసూలు చేయడంలో జమీందార్ల వంటి మధ్యవర్తులు ఎవరూ ఉండరు. ప్రభుత్వమే కలెక్టర్లకు, తహశీల్దార్ మొదలగు ఉద్యోగులను నియమించి రైతుల వద్ద నుండి ప్రత్యక్షంగా పన్నులు వసూలు చేసింది. ప్రభుత్వానికి, రైతులకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఏర్పడడం మూలాన ప్రజల స్థితిగతులను తెలుసుకోవడానికి సకాలంలో సమస్యలు చక్కబెట్టడానికి ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. పొలంపై ఆస్తి హక్కు తనదే కావడం చేత, కష్టపడి సాగుచేసిన పక్షంలో ఎక్కువ ఫలితం సంపాదించి తానే అనుభవించడం సాధ్యమని విశ్వసించడం చేత రైతువారీ విధానంలో వ్యవసాయాభివృద్ధికి ఎక్కువ అవకాశం వుంది.

### 5.4.4. వివిధ ప్రాంతాలలో రైతు వారీ పద్ధతి అమలు:

#### 5.4.4.1. మద్రాసు రాష్ట్రం:

థామస్ మన్రో పట్టుదల వల్ల మద్రాసు రాష్ట్రంలో రైతువారీ విధానం ప్రవేశపెట్టబడింది. కాని భూసారమును బట్టి విభజన, పన్ను మొదలైన సర్వే కార్యకలాపాలున్న 1855 నాటికి గానీ పూర్తిగా లేదు. పంట నికర విలువలో సగభాగం భూమి శిస్తు గాను, 30 ఏళ్ళకు ఒక మారు మదింపు చేయవలసిందిగా 1864వ సంవత్సరంలో నిర్ణయించడం జరిగినది. రైతుకు భూమిపై గల ఆస్తి హక్కు వంశపారం పర్యంగా సంక్రమిస్తుంది. రైతు తన పొలాన్ని అమ్ముకోవచ్చు, తాకట్టు పెట్టుకోవచ్చు.

కరువులు లేని 20 సంవత్సరాలు సగటు పంటను బట్టి పన్ను మదింపు వుంటుంది. అన్నీ ఖర్చులు పోను మిగిలిన పంటలో సగం విలువను నగదు రూపంలో పన్నుగా రైతు చెల్లించాలి.

**5.4.4.2. బొంబాయి రాష్ట్రం:**

1819వ సంవత్సరంలో బొంబాయి రాష్ట్ర గవర్నరైన ఎల్ఫిన్‌స్టన్ తన రాష్ట్రంలో భూములను సర్వే చేయించి మదింపు చేయించాడు. భూమి శిస్తు విధింపులో భూసారములోని తేడాలను పరిగణలోనికి తీసుకున్నారు. పొలాల సరిహద్దుల నిర్ణయం, సర్వే నంబర్ల నిర్ణయం మొదలగు విషయాలలో మద్రాసు రాష్ట్ర విధానాన్నే అనుసరించినారు. భూసార నిర్ణయంలో అణావారీ పద్ధతిని అనుసరించారు. అత్యుత్తమమైన సారవంతమైన పొలాన్ని 16 అణాలు పొలంగాను, అందులో సగం పొలం సారం గలిగిన పొలాన్ని 8 అణాల పొలంగాను, వ్యవసాయ పద్ధతులు మొదలగునవి ఆధారంగా తాలుకాలుగా విభజించారు. శిస్తు కూడా భూసారాన్ని బట్టి నిర్ణయించారు. 16 అణాల పొలానికి 10 రూపాయలు శిస్తు అయితే నాలుగు అణాల పొలానికి ఎకరానికి 21/2 రూపాయలు శిస్తుగా విధించారు.

## 5.5. రైతులపై అధిక శిస్తుల భారం:

ఈ విధానంలో కూడా రైతులు యిబ్బంది పడ్డారు. మొదటి దశలో భూముల సర్వే గాని, తదనంతరం వాటి విభజన గాని జరగలేదు. అధికారులకు తోచినట్లు రైతులు చెల్లించవలసిన భూమి శిస్తు నిర్ణయించబడినది. ఆంగ్ల ప్రభుత్వం పన్నులు ఎక్కువగా వసూలు చేయవలెనని లక్ష్యంగా వుండటం చేత పన్నులు విపరీతంగా విధించారు. ప్రకృతి అనుకూలించని పరిస్థితులలో కూడా పన్నులు చెల్లించవలసి వచ్చేది. సకాలంలో చెల్లించని పక్షాన వారి భూములను వేలం వేసే పద్ధతి అమలులోనికి వచ్చింది. ఇంతేకాక బ్రిటీష్ వారు రైతుల నుండి నగదు రూపంలోనే పన్నులు వసూలు చేసేవారు. దీనివల్ల రైతులు కొన్ని చిక్కులు ఎదుర్కొనేవారు. ధాన్యపు ధరలు పడిపోయినపుడు వారి పంటలో ఎక్కువ భాగాన్ని విక్రయించి శిస్తులను చెల్లించవలసి వచ్చింది. ఋణ బాధ ఎక్కువై వారి జీవితం దుర్భరమైనది.

## 5.6. పన్నుల వసూలులో ఉద్యోగుల అమానుషత్వం:

పన్నులను వసూలు చేయడంలో ఆంగ్ల ఉద్యోగులు అమానుష చర్యలకు పాల్పడేవారు. జాన్‌షోర్ 1836వ సంవత్సరంలో వీటిని వివరిస్తూ ఇలా రాశాడు "శిస్తును బకాయి పెట్టిన రైతుకు ఒక కుమార్తె ఉన్న పక్షంలో ఎక్కువ కన్యాశుల్కాన్ని ఇవ్వడానికి సిద్ధపడిన ఒక తక్కువ కులం వాడికైనా ఆమెను అంటగట్టేటట్లు తండ్రిని నిర్బందించేవారు. ఆవిధంగా లభించిన శుల్కం నుండి వెంటనే శిస్తు మొత్తాన్ని తీసుకోవడమే కాక లంచాల క్రింద మరికొంత మొత్తాన్ని తీసుకుని ఏదైనా మిగిలితే దానిని తండ్రికి యిచ్చేవారు. ఒక్కొక్కప్పుడు రైతుల ఇళ్ళలోని చరాస్తులను జప్తు చేసి వారి వంట పాత్రలను, ఆడవారు ఉపయోగించే రాట్నాలను కూడా తీసుకుని పోయేవారు" ఇట్టి చర్యలతోపాటు శిస్తులు వసూలు చేసే తహసీల్దారులతో పోలీసు వారు వచ్చి రైతులను చిత్రహింసలకు గురి చేసేవారు. రైతులకు ఇట్టి దుర్భరజీవితం సర్వసాధారణమైంది. ఆంగ్ల పాలనకు పూర్వం రైతులు ఏనాడు ఇట్టి బాధలకు గురికాలేదు.

## 5.7. రైతులపై ఋణభారం:

రైతు వ్యవసాయాన్ని నమ్ముకొని వుండటం వల్ల అప్పులు చేసి ప్రభుత్వానికి శిస్తులు చెల్లించటం పరిపాటి అయినది. అప్పులిచ్చి షావుకార్లు వారిపై, దావా వేసి, న్యాయస్థానాల నుండి డిక్రీలను పొంది రైతుల భూములను స్వాధీనం చేసుకునేవారు.

అప్పు చేసిన వారు భూమి పోగొట్టుకోవడం భారతదేశానికి కొత్త ఆంగ్లేయులు ఇంగ్లండ్ పరిస్థితిననుసరించి చట్టాలు చేసి దీనిని ప్రవేశపెట్టినారు. ఈ చట్టాలననుసరించి న్యాయస్థానాలు తీర్పులు చెప్పే సాంప్రదాయం ఏర్పడింది. ఈ చట్టాలు న్యాయస్థానాలు షావుకార్లుకు అనుకూలంగాను, రైతులకు ప్రతికూలంగానూ పరిణమించాయి. ఆంగ్ల పాలనలో భూమిపై ఆస్తి హక్కుల విషయంలో జరిగిన మార్పుల కారణంగా రైతులు, షావుకార్లు అనే రెండు వర్గాల మధ్య అంతకు పూర్వం ఎన్నడూ లేని సంఘర్షణ ఏర్పడింది. భూమిపై రైతుకు ఆస్తి హక్కు ప్రసాదించడం చేత, దానివల్ల భూమిని అమ్మడానికి తాకట్టు పెట్టడానికి, ఇతర విధాల అన్యాక్రాంతం చేయడానికి అతనికి స్వేచ్ఛ లభించడం చేత, అప్పులు చేయడానికి అతనికి స్వేచ్ఛ కలగడం చేతను, ఆస్తి హక్కులు అప్పులు చేయడానికి ఒక విధానంగా రూపొందింది. షావుకార్లు ఆ స్థానం యొక్క విలువను గ్రహించి అడగగానే అప్పులివ్వడానికి సిద్ధపడ్డారు. ఒక పర్యాయం ఋణ గ్రస్థుడైన రైతు వడ్డీ రేట్లకు ఒక పద్ధతిని కారణంగా, ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలన్ని రాత పూర్వకంగా జరగడం చేత, రైతుకు అక్షర జ్ఞానం లేకపోవడం చేత యావజ్జీవ ఋణగ్రస్థుడిగా ఉండే స్థితికి వచ్చారు. తత్ఫలితంగా గ్రామ ప్రాంతాలలో షావుకారు వర్గం వడ్డీ వ్యాపారం ద్వారా ధనం కూడ పెట్టుకునే అవకాశం ఎన్నో రెట్లు పెరిగింది.

## 5.8. వ్యవసాయం వెనుకంజ:

ఇటువంటి దర్భుర పరిస్థితులలో భారతదేశంలో వ్యవసాయం వెనుకబడింది. కంపెనీ కాలంలో క్రొత్త జలధారలు నిర్మాణం జరగకపోగా ఉన్న వాటికి కూడా ఏ కాలంలో మరమ్మత్తులు జరుగక పాడుపడిపోయాయి. పేదలైన రైతులు బావులు త్రవ్వించలేక పోయారు. ఈ కాలంలో ఎన్ని క్షామాలు సంభవించాయి. ఆంధ్ర ప్రాంతంలో 1805, 1811, 1813, 1832, 1839 సంవత్సరంలో క్షామాలు సంభవించి ప్రజలు అనేక కష్టాలకు లోనయ్యాయి. లక్షలాది జనులు మరణించినారు. పశు సంపద నశించింది. పొలాలు బీడుబడి కొన్ని సంవత్సరాల కాలం వ్యవసాయ యోగ్యం కాలేదు. స్వలాభమే పరమావధిగా భావించిన కంపెనీ అధికారులు దయాదాక్షిణ్యాలు చూపకపోవడం వల్ల రైతులు రైతువారీ పద్ధతిలో కూడా నరకయాతలు అనుభవించారు.

## 5.9. అస్తవ్యస్తమైన భూస్వామ్య పద్ధతులు:

ఆంగ్లేయులు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ రకాలైన భూమిశిస్తు విధానాలను ప్రవేశపెట్టిన ఎక్కువగా జమిందారీ విధాన లక్షణాలు కనిపించాయి. రైతువారీ విధానంలో కూడా కమతాలను కౌలుకు యివ్వడం, కౌలును విపరీతంగా పెంచడం మొదలైనవి. అదేవిధంగా మహల్వారీ పద్ధతిలో కూడా జమిందారీ లక్షణాలు కనిపించాయి.

## 5.10. భూమి శిస్తు భారం:

1880 నుండి భూమి శిస్తు పెద్దగా భారంగా అనిపించకపోయినా, 1929-1939 ల మధ్య ఆర్థిక మాంద్యం కాలంలో వ్యవసాయక ధరలు బాగా పెరగడం వల్ల భూమి శిస్తు భారంగా కనిపించింది.

## 5.11. కౌలుదారీ సమస్య:

జమిందారీ ప్రాంతాలలోనే కాక రైతువారీ ప్రాంతాలో కూడా భూస్వాములు తమ భూములను కౌలుకిస్తూ వచ్చారు. కౌలుదార్లు తిరిగి కౌలుకు యిస్తూవుంటారు. ఈవిధంగా రాయితీ హక్కులు కలిగిన కౌలుదార్లు, రాయితీ హక్కులేని కౌలుదార్లు వుండటం వల్ల కౌలుదారీల సమస్య ఏర్పడింది.

## 5.12. ముగింపు:

భారతదేశంలో బ్రిటీష్ ఇండియా ప్రాంతాలలో సారవంతమైన ప్రాంతాలలో జమీందారీ విధానం వల్ల, మెట్ట, ఎర్ర రేగడి మొదలగు ప్రాంతాలలో రైతువారీ విధానం వల్ల, మిగిలిన ప్రాంతాలలో మహల్వారీ పద్ధతులలో ప్రవేశపెట్టి బ్రిటీష్ వారు రైతులను ఆదుకున్నప్పటికీ దోచుకున్నారు. ముఖ్యంగా జమీందారీ వ్యవస్థతో రైతులు రైతుకూలీలుగా మారిపోయారు.

## 5.13. నమూనా ప్రశ్నలు:

1) జమీందారీ పద్ధతిని నిర్వచించి, ముఖ్యాంశాలను, ఫలితాలను వివరింపుము?

2) రైతువారీ పద్ధతిని నిర్వచించి, ప్రయోజనాలను తెలుపుము?

3) బ్రిటీష్ వారి భూమి శిస్తు విధానల గుణ దోషాలను వివరింపుము?

## 5.14. ఆధార గ్రంథాలు:


**1. Bipin Chandra** : Modern History, NCERT.

**2. R.C. Majumdar** : Advanced History of India, Oxford, 1966.

**3. Dr. BRAOU** : History of Modern India, B.A., 1987.

**4. T. Abraham** : A Text Book of Economic History

**5. తెలుగు అకాడమి** : ఆధునిక భారతదేశ చరిత్ర, హైదరాబాదు, 1989.


**- డాక్టర్ కృష్ణ ప్రసాద్ బాబు. జె**

పాఠం - 6

# భారతదేశంలో వ్యవసాయ వాణిజ్యీకరణ వృద్ధి-ఫలితాలు

**6.0. లక్ష్యము:**

▲ బ్రిటీష్ వారు భారతదేశంలో వ్యవసాయ రంగంలో చేసిన మార్పులను తెలుసుకొనుట.

▲ వ్యవసాయ వాణిజ్యీకరణను వాటి ఫలితాలను తెలుసుకొనుట.

**విషయక్రమము:**


**6.1.** పరిచయము

**6.2.** గ్రామీణ వ్యవస్థ - వ్యవసాయం

**6.3.** వ్యవసాయపు వాణిజ్యీకరణ

**6.4.** వ్యవసాయ వాణిజ్యీకరణ - కారణాలు

**6.4.1.** రవాణా సౌకర్యాలలో విప్లవాత్మకమైన మార్పు

**6.4.2.** సూయజ్ కాలువ నిర్మాణం

**6.4.3.** నౌకా పరిశ్రమలో మార్పులు-మాంద్యం

**6.4.4.** అమెరికా సంయుక్త రాష్ట్రాల అంతర్యుద్ధం

**6.4.5.** నగదు అవసరం

**6.4.6.** సాగునీటి సౌకర్యాల పెంపు

**6.4.7.** వాణిజ్య మధ్యవర్తుల కార్యకలాపాలు

**6.5.** వాణిజ్య పంటలు

**6.6.** వాణిజ్యీకరణ ఫలితాలు

**6.6.1.** గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

**6.6.2.** భారతదేశ వ్యవసాయ ఉత్పత్తుల గిరాకీ

**6.6.3.** చేతివృత్తు వారు నిరుద్యోగులగుట

**6.6.4.** ఆహార ధాన్యాల అమ్మకం

**6.6.5.** నగదు పంటల వ్యాప్తి

**6.6.6.** రైతుల ఋణభారం

**6.7.** ముగింపు

**6.8.** నమూనా ప్రశ్నలు

**6.9.** ఆధార గ్రంథాలు

## 6.1. పరిచయము:

1760వ సంవత్సరంలో ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన తరువాత బ్రిటీష్ ప్రభుత్వం, కంపెనీ పాలనలో ఇంగ్లండఎ పరిశ్రమల అవసరాల కొరకు ముడిసరుకుల నిమిత్తము భారతదేశ వ్యవసాయ రంగ ఉత్పత్తులపై ప్రభావం చూపినది. ఈ నేపథ్యంలో వ్యవసాయరంగ ఉత్పత్తులు, ఆహార పంటల కొరకు కాక, వాణిజ్య పంటలకు మార్పు చెందటమే "వ్యవసాయం వాణిజ్యీకరణ" గా పిలవడం జరిగింది.

## 6.2. గ్రామీణ వ్యవస్థ - వ్యవసాయం

19వ శతాబ్దం వరకు భారత గ్రామీణ వ్యవస్థ స్వయం పోషకమైవుండేది. గ్రామంలోని భూములపై గ్రామస్థులందరికి సామూహిక ఆస్తి హక్కు ఉండేది. వ్యవసాయానికి తగిన సదుపాయాలన్ని సామూహికంగా నిర్వహించేవారు. గ్రామంలోని చేతివృత్తుల వారు తాము తయారు చేసిన వస్తు సామాగ్రిని రైతులకు అందచేసి వాటికి బదులుగా రైతుల నుండి ధాన్యాధులను గ్రహించి తమ జీవితం సాగించేవారు. వ్యవసాయానికి సంబంధించినంత వరకు చెప్పుకోదగిన వాణిజ్యం జరిగేది కాదు. అడపాదడపో ధాన్య వర్తకుడో, వస్త్ర వర్తకుడో ఒక గ్రామము యొక్క మిగులు ఉత్పత్తిని మరొక గ్రామానికి అందజేయటం తప్ప గ్రామానికి బయట ప్రపంచంతో పెద్ద సంబంధం ఉండేది కాదు. అయితే, ప్రత్తి, చెరకు అన్ని ప్రాంతాల్లోను ఉండేవి కాదు. గనుక ఆ రెండు ఉత్పత్తులపై వాణిజ్యం కొన్ని ప్రాంతాలకు పరిమితమైన ఉండేది. అట్టి స్వయం సమృద్ధమైన వ్యవస్థలకు డబ్బు అవసరం పెద్దగా ఉండేది కాదు. సాధారణంగా ద్రవ్య వినిమయానికి బదులు ధాన్య వినిమయం జరుగుతూ ఉండేది.

## 6.3. వ్యవసాయపు వాణిజ్యీకరణ:

1813వ సంవత్సరంలో కంపెనీ వారి ఏకస్వామ్యం రద్దయిన పిమ్మట బ్రిటీష్ వ్యక్తిగత ఉద్యమదారుల ద్వారా బ్రిటీష్ మూలధనం భారతదేశంలోకి ప్రవేశించింది. ఇంగ్లండ్ నుండి దిగుమతి అవుతున్న వస్తువులకు పోటీగా పరిశ్రమలను ఇండియాలో స్థాపించడమూ, అట్టువానిలోధనాన్ని పెట్టుబడి పెట్టడమూ నిషేధింపబడింది. కనుక ఇంగ్లండ్ నుండి వచ్చే మూలధనమంతా నీలిమందు, తేయాకు, కాఫీ తోటల పెంపకం పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడం జరిగింది. భారతదేశపు వ్యవసాయ వాణిజ్యీకరణ ఈ తోటల పెంపకంతో ప్రారంభమైనదని చెప్పవచ్చు. అయితే 1860 తరువాత అనేక కారణాల వల్ల భారతీయ గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం యొక్క లక్ష్యం వాణిజ్యం వైపు వెళ్ళింది. నీలిమందు, తేయాకు, కాఫీ, జనుములకు తోడు పొగాకు, వేరుశెనగ, బంగాళదుంప వంటి క్రొత్త రకం పంటలు వాణిజ్య ప్రయోజనం నిమిత్తమై దేశంలో ప్రవేశించాయి. వాణిజ్య పంటలే ఎక్కువ లాభదాయకమని గుర్తించారు. పూర్వ కాలంలో గ్రామ ప్రజలకు సరిపడ ఆహార ధాన్యం పండించి తరువాత వాణిజ్య పంటలు పండించేవారు. 1860 తరువాత పంటల స్థానికీకరణ వాణిజ్యీకరణతో పాటు పెరిగింది. సాగునీటి సౌకర్యం కల్పించబడిన దక్కన్‌లో చెరకు, బీహార్‌లో ప్రత్తి, బెంగాల్‌లో జనుము, పంజాబు కాలువ కాలనీలో గోధుమ వాణిజ్య ప్రయోజనాల నిమిత్తము స్థానికీకరణ పొందాయి.

## 6.4. వ్యవసాయ వాణిజ్యీకరణ - కారణాలు:

### 6.4.1. రవాణా సౌకర్యాలలో విప్లవాత్మకమైన మార్పు:

రవాణా సౌకర్యాలలో విప్లవాత్మకమైన మార్పులు రావటం వల్ల వ్యవసాయ వాణిజ్యీకరణకు దోహదం ఏర్పడి అంతర్జాతీయ వ్యాపార వాణిజ్యాలకు ప్రోత్సాహమేర్పడింది. రైల్వేల నిర్మాణం త్వరితగతిన పెరిగిపోయింది. 1859వ సంవత్సరంలో 432 మైళ్ళకు, వ్యాపించిన రైలు మార్గాలు 1881 నాటికి 190 మైళ్ళకు, 1901 నాటికి 25,363 మైళ్ళకు విస్తరించింది. బొంబాయి నుండి ఆగ్రా వరకు, బెనారస్ నుండి ఢిల్లీ వరకు జాతీయ రహదారుల నిర్మాణం 1853 నాటికి పూర్తయింది. వీటివల్ల వ్యవసాయ ఉత్పత్తులు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సురక్షితంగా, వేగంగా సరఫరా అయ్యాయి.

### 6.4.2. సూయజ్ కాలువ నిర్మాణం:

1869వ సంవత్సరంలో సూయజ్ కాలువను రవాణాను, ప్రయాణాలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కాలువ నిర్మాణం ఇండియా–ఇంగ్లండ్‌ల మధ్య సముద్ర మార్గాన్ని మూడువేల మైళ్ళకు పైగా తగ్గించింది. లండన్ నుండి కలకత్తాకు ప్రయాణ కాలంలో 36 రోజులు తగ్గించింది. ఇది ఇండియా విదేశీ వాణిజ్యానికి బాగా ఉపకరించింది.

### 6.4.3. నౌకా పరిశ్రమలో మార్పులు–మాంద్యం:

1869 నుండి నౌకాయానమునకు స్టీమర్ల్ ఉపయోగం హెచ్చు దూర ప్రయాణాలకు బాగా ఉపకరించింది. సూయజ్ కాలువ ప్రారంభించిన తరువాత 12 సంవత్సరాలలో కలకత్తా నుండి లండన్‌కు రవాణా చార్జీలు టన్నుకు 55 షిల్లింగుల నుండి 27 షిల్లింగులకు పడిపోయింది.

### 6.4.4. అమెరికా సంయుక్త రాష్ట్రాల అంతర్యుద్ధం:

1860–1865 మధ్య కాలంలో వచ్చిన అంతర్యుద్ధం వల్ల అమెరికాలో ప్రత్తి సరఫరా ఆగిపోయినందువల్ల భారతదేశంలోని ప్రత్తికి గిరాకీ పెరిగింది. దీనితో ఇండియాలో పత్తి 5 లక్షల బేళ్ళ నుండి 12 లక్షల బేళ్ళకు పెరిగింది.

### 6.4.5. నగదు అవసరం:

బ్రిటీష్ వారికి పూర్వము రైతులు తమ పంటను గ్రామం వెలుపల అమ్మి లాభాలను గడించేవారు కాదు. బ్రిటీష్ వారు పన్నులను నగదు రూపంలోనే చెల్లించమనటం వల్ల రైతులు యితర ప్రాంతాలకు అమ్మటమే, షావుకారుకు, వడ్డీ వ్యాపారులకు తమ ధాన్యాన్ని అమ్మి నగదు రూపంలోనే సంపాదించటం మొదలుపెట్టారు.

### 6.4.6. సాగునీటి సౌకర్యాల పెంపు:

బ్రిటీష్ వారు ఏర్పరచిన నీటి పారుదల సౌకర్యాలు కూడా వ్యవసాయ వాణిజ్యీకరణకు దోహదం చేసినది. మాములు పంటల కంటే చెరకు మొదలగు వాణిజ్య పంటల వల్ల లాభాలు గడించవచ్చని తెలిసింది.

### 6.4.7. వాణిజ్య మధ్యవర్తుల కార్యకలాపాలు:

వాణిజ్య మధ్యవర్తుల వర్గం వివిధ వ్యవసాయక ఉత్పత్తులను కొనగోలు చేస్తూ రైతులకు లాభదాయకమైన వాణిజ్య పంటలను ప్రోత్సహించారు. వీరు వాణిజ్య పంటకై రైతులకు అడ్వాన్సు యిచ్చేవారు. వాణిజ్య పంటలను అమ్మగా వచ్చిన నగదుతో కుటుంబ అవసరాలకు తగిన ధాన్యాన్ని కొనేవారు.

## 6.5. వాణిజ్య పంటలు:

వాస్తవానికి వాణిజ్య పంటలు ఉత్పత్తి 18వ శతాబ్దంలోనే ప్రారంభమైనది. ఇది తొలుత నీలి మందుతో ప్రారంభమైనది, తరువాత తేయాకు, జనుము, పొగాకు, ప్రత్తి, కాఫీ, చెరకు, నూనెగింజలు మొదలైనవి వ్యాప్తి చెందాయి. ఈ విధంగా ప్రత్తి, నీలిమందు, నల్లమందు, కాఫీ, తేయాకు, మొదలగు పంటలను విస్తరించడం జమీందార్లకు, సామాన్య వర్తకులకు కూడా లాభదాయకమైనదని రాజారామ మోహన్‌రాయ్ వంటి ప్రముఖులు ప్రశంసించారు.

## 6.6. వాణిజ్యీకరణ ఫలితాలు:

### 6.6.1. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం:

వ్యవసాయ వాణిజ్యీకరణ వల్ల గ్రామం తనకు కావలసిన ఆహారధాన్యాలు ఇతర జీవితావసరాలకై, స్వయం సమృద్ధిగా ఉండవలసిన అవసరం లేకపోయింది. రైతులు తమ పంటలను నగదుకు అమ్మి తమకు అవసరమైన వస్తువులను కొని తెచ్చుకునే జాతీయ మార్కెట్లు ఏర్పడినాయి. దీనికి రైళ్ళు, రహదారి మార్గాల అభివృద్ధి దోహదం చేసింది.

### 6.6.2. భారతదేశ వ్యవసాయ ఉత్పత్తుల గిరాకీ:

భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు విదేశాలలో గిరాకీ వుండటం వల్ల వస్తువుల ధరలు క్రమంగా పెరగసాగాయి. 1860వ సంవత్సరంలో ఇండియా ఎగుమతులు 2 కోట్ల రూపాయలుండగా, 1880వ సంవత్సరంలో 69 కోట్లు, 1907వ సంవత్సరంలో 166 కోట్లకు పెరిగింది.

### 6.6.3. చేతివృత్తు వారు నిరుద్యోగులగుట:

బ్రిటీష్ వారి పారిశ్రామిక విప్లవం వల్ల విపరీతంగా ఇంగ్లండ్‌లో పరిశ్రమలు రావడం, వస్తు ఉత్పత్తి పెరిగి భారతదేశంలో వాటికి డిమాండ్ పెరగటంతో, స్థానిక ఉత్పత్తులకు డిమాండ్ పడిపోయి నష్టాలు రావడం, మిల్లుల పోటీకి చేతి వృత్తుల వారు నిలబడక పోవడం వల్ల చేతి వృత్తుల వారు తమ తమ వృత్తులను మానుకోవలసి వచ్చింది. ఈ విధంగా చేతి వృత్తుల వారు నిరుద్యోగులైనారు.

### 6.6.4. ఆహార ధాన్యాల అమ్మకం:

పూర్వం ఆహార ధాన్యాలలో తినగా మిగిలిన వాటిని పాతర్లలోను, గరిసెలలోను దాచివుంచేవారు. వాణిజ్యీకరణ వల్ల, ఆహారధాన్యము కూడా కళ్ళాలలోనే అమ్మసాగారు. ఫలితంగా కరువు సమయాలలో అహారపు కొరత ఏర్పడి ప్రజలు భాదలు పడ్డారు6.

### 6.6.5. నగదు పంటల వ్యాప్తి:

నగదు పంటల వల్ల లాభాలు హెచ్చుగా రావడం వల్ల రైతులు ఆ పంటలనే విరివిగా పండింపసాగాయి. 1896 నుండి 1946 లోపల నగదు పంటలు 85% వృద్ధి పొందాయి. వాణిజ్య పంటల యెడ వహించిన శ్రద్ధ కారణంగా క్రొత్త వంగడాలు, రసాయనానికి ఎరువులు, మేలు రకం విత్తనాలు ప్రవేశించాయి.

### 6.6.6. రైతుల ఋణభారం:

నగదు పంటలు లాభదాయకమైనా వాటి సాగుకు కొంత పెట్టుబడి అవసరమై రైతులు ఋణదాతలను ఆశ్రయించక తప్పలేదు. రైతుల అవసరాలను బట్టి ఋణదాతలు వడ్డీరేట్లను కూడా పెంచి వ్యవసాయక ఆదాయాన్ని దోచుకున్నారు.

## 6.7. ముగింపు:

భారతదేశపు వ్యవసాయ రంగంలో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కాలంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీనిలో ప్రధానమైనవి వ్యవసాయ వాణిజ్యీకరణ. దీని ప్రభావం ఆహార పంటలపై పడి ఆహార ఉత్పత్తులు తగ్గిపోయాయి. ఉత్పత్తి తగ్గటం వల్ల ధరలు విపరీతంగా పెరిగి కరువు కాటకాలకు దారితీసినది. వ్యవసాయ వాణిజ్యీకరణ వల్ల భారతదేశంలోనికి నూతన పంటలు ఉదాహరణకు తేయాకు, చెరకు, పొగాకు, నీలిమందు, గంజాయి, కాఫీ మొదలగునవి ప్రవేశ పెట్టబడ్డాయి. వీటిని అమ్మటం వల్ల రైతులకు ద్రవ్య సౌకర్యం కలిగింది. అదే సమయంలో బ్రిటీష్ వారి శిస్తులు అధికంగా వుండటం, నగదు రూపంలోనే శిస్తులు తీసుకోవటం, బ్రిటీష్ దళారుల దోపిడీ వల్ల రైతుకు ఎలాంటి ఆదాయం రాకపోగా రైతు ఎల్లప్పుడూ ఋణ గ్రస్థుడిగా వుండిపోయినాడు.

## 6.8. నమూనా ప్రశ్నలు:

### వ్యాసరూప ప్రశ్నలు:

1) వ్యవసాయ వాణిజ్యీకరణకు కారణాలు వ్రాయండి?

2) వ్యవసాయ వాణిజ్యీకరణ ఫలితాలను రాయండి?

3) బ్రిటీష్ వారు రాక పూర్వం, వచ్చిన తరువాత గ్రామీణ వ్యవస్థ గురించి రాయండి?

## 6.9. ఆధార గ్రంథాలు:

**1. Bipin Chandra** : Modern History, NCERT.

**2. Bipin Chandra** : Rise and Growth of Economic Nationalism in India.

**3. K.N. Raj** : Essays on the Commercialisation of Indian Agriculture.

**- డాక్టర్ కృష్ణ ప్రసాద్ బాబు. జె**

పాఠం - 7

# భారతదేశంలోని బ్రిటీష్ ప్రభుత్వం యొక్క నీటిపారుదల, తోటల (ప్లాంటేషన్) పెంపకం

**7.0. లక్ష్యము:**

▲ భారతదేశంలో బ్రిటీష్ వారు చేపట్టిన వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకొనుట.

▲ బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన నీటి పారుదల సౌకర్యాలు, తోటల (ప్లాంటేషన్) పెంపకమును తెలుసుకొనుట.

**విషయక్రమము:**


7.1. పరిచయము

7.2. నీటిపారుదల సౌకర్యాల పూర్వ రంగము

7.3. ఈస్ట్ ఇండియా కంపెనీ కృషి

7.4. ప్రైవేటు కంపెనీల ప్రయత్నాలు

7.5. బ్రిటీష్ రాజరిక పాలనలో చేపట్టిన కార్యక్రమాలు

7.6. రైల్వే లైనుల సమస్య

7.7. సర్ ఆర్థర్ కాటన్, జాన్‌బ్రెట్‌ల కృషి

7.8. ఫామిన్ కమీషన్ల సిఫారసులు

7.9. ప్రభుత్వ ఉదాసీనత

7.10. 19వ శతాబ్దంలోని ఇరిగేషన్ సౌకర్యాలు

7.11. 20వ శతాబ్దంలోని ఇరిగేషన్ సౌకర్యాలు

7.11.1. ఇరిగేషన్ పనులు

7.11.2. ప్రభుత్వ ప్రోత్సాహం

7.11.3. ముఖ్యమైన ప్రాజెక్టులు

7.11.4. స్వాతంత్ర్యానంతర ప్రగతి

7.12. నీటిపారుదల ఫలితాలు

7.13. ఇండియాలో బ్రిటీష్ మూల విధానము-పరిశ్రమ

7.13.1. ప్లాంటేషన్ విస్తరణ

**7.13.2.** నీలిమందు తోటలు

**7.13.2.1.** నీలిమందు పెంపకం, వ్యాపారం

**7.13.2.2.** నీలిమందు తోటల అభివృద్ధి

**7.13.2.3.** నీలిమందు తోటల నిర్వహణ

**7.13.3.** తేయాకు ప్లాంటేషన్

**7.13.3.1.** ప్లాంటేషన్ ఆవిర్భావం

**7.13.3.2.** ప్లాంటేషన్‌ల విస్తరణ

**7.13.3.3.** రెండు ప్రపంచ యుద్ధ కాలాల్లో తేయాకు పరిశ్రమ

**7.13.3.4.** ప్లాంటేషన్ కార్మికుల పరిస్థితులు

**7.13.4.** కాఫీ ప్లాంటేషన్

**7.13.5.** రబ్బర్ ప్లాంటేషన్

**7.14.** ముగింపు

**7.15.** నమూనా ప్రశ్నలు

**7.16.** ఆధార గ్రంథాలు

## 7.1. పరిచయము:

ఈస్ట్ ఇండియా కంపెనీ క్రీ.శ. 1600వ సంవత్సరంలో భారతదేశంలో అడుగు పెట్టినప్పటి నుండి వారి దృష్టి భారతదేశ ముడి సరుకుల మీద సంపద మీద దానిని ఎలా దోచుకోవాలి అనే ఆలోచనతో వుండటం వల్ల వారు పరిశ్రమలకు, వ్యాపారులకు వాటికి ఉపయోగపడే రవాణా, రహదారి, టెలిగ్రాఫ్, టెలిఫోన్, పోస్టు, రైల్వేలు మొదలగు వాటిపై దృష్టి కేంద్రీకరించారే కాని వ్యవసాయాభివృద్ధికి చేపట్టవలసినంత పనులు చేయలేదు. పూర్వపు బావులు, చెరువులు, కాలువలు మొదలగు వాటిని మరమ్మత్తు చేయడం మాత్రమే చేశారు. దీనికి తోడు క్షామాలు, కరువులు, ఏర్పడటం వల్ల తరువాత కాలంలో వీటికి సంబంధించి చర్యలు తీసుకోవటం జరిగింది. వీటినే నీటి పారుదల సౌకర్యాలు అని అంటారు.

1760వ సంవతసరంలో ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభంకావటం, 1764వ సంవత్సరంలో బక్సర్ యుద్ధం తరువాత 1765వ సంవత్సరంలో జరిగిన అలహాబాద్ సంధితో లభించిన 'దివానీ' హక్కులతో ఈస్ట్ ఇండియా కంపెనీకి భారతదేశంపై పట్టు లభించింది. పారిశ్రామిక విప్లవం, ఆవిర్భావం, ఈస్ట్ ఇండియా కంపెనీకి భారతదేశంపై అధికారం దాదాపు ఒకే పర్యాయం రావటంతో ఈస్ట్ ఇండియా ఆలోచన భారతదేశాన్ని తమ కంపెనీలకు ముడి సరుకులు అందించి ఉత్పత్తి అయిన వస్తువులను కొనుగోలు చేసే మార్కెట్లుగా భావించి దీనికి తగ్గట్లుగా వ్యవసాయ వాణిజ్యీకరణ జరగడంతో పాటు కాఫీ, తేయాకు, నీలిమందు, రబ్బరు మొదలగు తోటల పెంపకం బహు ప్రాచుర్యం పొందినాయి.

## 7.2. నీటిపారుదల సౌకర్యాల పూర్వ రంగము:

ప్రాచీన, మధ్య యుగాలలో రాజులు, నవాబులు క్షామాలు, కరువులు ఏర్పడకుండా చెరువులు, బావులు వంటి జలాధారాలను నిర్మించేవారు. ఉదా: అశోకుడు సుదర్శన తటాకం, కాకతీయులు రాయప్ప చెరువులు, కరికాళ చోళులు కావేరీ నదిపై ఆనకట్టల నిర్మాణం మొదలగునవి. డిల్లీ సుల్తానులు గంగా, యమునా నదీ ప్రాంతాలలో ఎన్నో కాలువలు త్రవ్వించారు. వీటి సంరక్షణ కొరకు మాన్యాలు యిచ్చి తగిన ఏర్పాట్లు చేసేవారు.

## 7.3. ఈస్ట్ ఇండియా కంపెనీ కృషి:

1757 నుండి 1821 వరకు ఈస్ట్ ఇండియా కంపెనీ నీటి పారుదల సౌకర్యాల పట్ల అశ్రద్ధ వహించిన 1821 నుండి కొంత ప్రయత్నాలు చేశారు.

- 1821వ సంవత్సరంలో జనరల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇరిగేషన్‌ను నియమించారు.
- 1823వ సంవత్సరంలో పశ్చిమ యమున కాలువను మరమ్మత్తు చేశారు.
- 1830వ సంవత్సరంలో తూర్పు యమున కాలువ మరమ్మత్తు చేశారు.
- 1842వ సంవత్సరంలో గంగానది కాలువ నిర్మాణం ప్రారంభమైంది.
- 1846వ సంవత్సరంలో గోదావరి నదికి, 1855వ సంవత్సరంలో కృష్ణానదికి ఆనకట్టల నిర్మాణం జరిగింది.

ఇవికాక దేశంలోని వివిధ ప్రాంతాలలో చిన్న, చిన్న కాలువలు త్రవ్వించారు.

## 7.4. ప్రైవేటు కంపెనీల ప్రయత్నాలు:

1858వ సంవత్సరంలో ఇరిగేషన్ పనుల బాధ్యతను ప్రైవేటు కంపెనీలకు యివ్వటానికి నిశ్చయించినది. పాల్గొన్న ప్రైవేటు కంపెనీలు రెండు. అవి:

1) 1858 ఈస్ట్ ఇండియా ఇరిగేషన్ అండ్ కెనాల్ కంపెనీ

2) 1882 మద్రాసు ఇరిగేషన్ కంపెనీ

1858వ సంవత్సరంలో ఏర్పడిన కంపెనీ ఒరిస్సాలో నీటి పారుదల సౌకర్యాలు చేపట్టటానికి పూనుకొని విఫలమైనది.

## 7.5. బ్రిటీష్ రాజరిక పాలనలో చేపట్టిన కార్యక్రమాలు:

బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం 1862–1882 లోపల లోన్‌వర్క్స్ పేరి నీటిపారుదల సౌకర్యాలపై ఐదు బృహత్పథకాలను చేపట్టింది. దానిలో:

అ) పంజాబ్‌లో – సర్ హిండ్ కాలువ

ఆ) గంగానది నుండి త్రవ్విన – ఆగ్రా కాలువ

ఇ) ఇప్పటి పాకిస్థాన్ లోని – దిగువ స్వాత్ ప్రాజెక్ట్

ఈ) పూనా లోని – ఖరగ్ పస్లా ఆనకట్ట మొదలగునవి.

1880వ సంవత్సరం నాటికి ఇరిగేషన్ పనులకూ 12 మిలియన్ల పౌన్లు వ్యయమైనాయి. 20 మిలియన్ ఎకరాలు సాగునీటి క్రిందకు వచ్చాయి. కాని దక్కన్,మధ్య పరగణాలలో నీటి పారుదల సౌకర్యాలు దాదాపు లేవని చెప్పవచ్చు. క్షామ

నివారణకు నీటి పారుదల కన్న రైల్వే విస్తరణ ఉపయోగకరమని ప్రభుత్వం భావించడమే యిందుకు కారణం.

## 7.6. రైల్వే లైనుల సమస్య:

1880వ సంవత్సరం నాటికి రైల్వేల మీద జరిగిన వ్యయం 12 మిలియన్ల పౌన్లు కాగా, నీటిపారుదల అభివృద్ధి కోసం 10 మిలియన్ పౌన్లు మాత్రమే వ్యయం చేయటం జరిగింది. ఈ సమయంలో కాటన్, బ్రైట్‌ల వాదనలు కొంతమేలు చేసినవి.

## 7.7. సర్ ఆర్థర్ కాటన్, జాన్‌బ్రైట్‌ల కృషి:

**సర్‌ఆర్థర్ కాటన్:**

1872వ సంవత్సరంలో సెలక్ట్ కమిటీ ముందు కాటన్ తన అభిప్రాయాన్ని తెలిపాడు. "రైల్వేలు ఏటా 3 మిలియన్ పౌన్‌లు నష్టం కలిగిస్తుండగా, నీటిపారుదల వల్ల అరమిలియన్ పౌన్‌ల లాభం కలుగుతుంది. రైల్వేల నిర్మాణం కంటే నీటిపారుదల వ్యయం మంచిది. నీటిపారుదల విస్తరణ కోసం 30 మిలియన్ పౌన్‌లు వ్యయం చేయాలని ప్రతిపాదించాడు" దీనిని బ్రైట్ సమర్థించారు.

**జాన్‌బ్రైట్:**

అరమిలియన్ వున్న మాంచెస్టర్ నగరంలో నీటి వసతి కోసం 5.5 మిలియన్ల పౌనుల వ్యయాన్ని ఖర్చుపెట్టగా, 200 మిలియన్ జనాభా వున్న భారతదేశంలో నీటిపారుదల కోసం 30 మిలియన్ పౌనులు ఖర్చు చేయడం అవసరమని వాదించాడు. కాని ప్రయోజనం లేకపోయింది.

## 7.8. ఫామిన్ కమీషన్ల సిఫారసులు:

తరచుగా ఏర్పడే క్షామాలను నివారించాలనే ఆలోచనతో 1880, 1897, 1900 సంవత్సరాలలో ఫామిన్ కమీషన్లను నియమించడం జరిగింది. దేశంలో తక్షణం సాగునీటి సౌకర్యాలను కల్పించి ఆహార ఉత్పత్తిని పెంపొందించాలని, ప్రాజెక్టు నిర్మాణాల ద్వారా కరువు ప్రాంతాలలోని ప్రజలకు పనిపాటలు కల్పించాలని కమీషన్లు సూచించాయి. అయినప్పటికి ప్రభుత్వం నీటిపారుదల వసతుల కల్పనకై సత్వర చర్యలు చేపట్టలేదు.

## 7.9. ప్రభుత్వ ఉదాసీనత:

నీటిపారుదల విషయంలో బ్రిటీష్ ప్రభుత్వం ఉదాసీనంగా వుండటానికి కారణం ఇంగ్లండ్‌లోని పారిశ్రామిక వేత్తలకు భారతదేశంలో విస్తృతమైన మార్కెట్లు కావలసియున్నది. ఈ ప్రయోజనం రైల్వే విస్తరణ వల్ల జరుగుతుంది. ఈ విస్తరణ కొంతవరకు నీటిపారుదల వల్ల దెబ్బతింటుంది.

## 7.10. 19వ శతాబ్దంలోని ఇరిగేషన్ సౌకర్యాలు:

ఏట్టకేలకు బ్రిటీష్ ప్రభుత్వం నీటిపారుదల సౌకర్యాల కార్యక్రమాలను చేపట్టక తప్పలేదు.

- 1800-1900 లోపల పంజాబ్, బెంగాల్, బొంబాయి, సింధు ప్రాంతాలలో ఇరిగేషన్ పథకాలకు కొనసాగించినది.
- సంయుక్త పరగణాలలో రక్షణ కార్యక్రమం క్షామ నిధితో దక్కన్‌లో నీరా, పెరియార్, మ్వవద్ కాలువలు, సింధ్ ప్రాంతాలలో జమ్‌రావ్, పశ్చిమ నారా కాలువలు త్రవ్వబడ్డాయి.

ఈ సాగు నీటి సౌకర్యాల వల్ల 1880వ సంవత్సరంలో 10.6 మిలియన్ ఎకరాలుగా వున్న సాగు పొలం, 1900వ సంవత్సరంలో 15.5 మిలియన్ ఎకరాలకు పెరిగింది.

## 7.11. 20వ శతాబ్దంలోని ఇరిగేషన్ సౌకర్యాలు:

1901వ సంవత్సరంలో నియమింపబడిన ఇరిగేషన్ కమీషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం రక్షక నిర్మాణాల ద్వారా క్షామ ప్రాంతాలకు సహాయం చేయటమేకాక, తక్కువ ఋణాలు కల్పించింది.

### 7.11.1. ఇరిగేషన్ పనులు:

ఇరిగేషన్ పనులను ప్రభుత్వ పనులు, ప్రైవేటు పనులు అని రెండు భాగాలు: ప్రభుత్వ పనులను మేజర్, మైనర్ ఇరిగేషన్ పనులుగా ఏర్పరచినారు. మేజర్ ఇరిగేషన్ పనులు ఉత్పాదకములని, రక్షకములని రెండు విధాలు. మేజర్ ఇరిగేషన్ పనులలో అధిక భాగం ఉత్పాదకములే అనగా పంటల ఉత్పత్తికి సహకరించేవి. కరువు సమయాలలో పేద ప్రజలకు పని కల్పించటానికి ప్రభుత్వం చేపట్టేవి రక్షక పనులు.

ఉదాహరణ: బుందేల్‌ఖండ్, దక్కన్‌లో ఇట్టి పనులు చేపట్టినారు. మైనర్ ఇరిగేషన్ పనులను స్థానిక సంస్థలు చేపట్టినాయి. గ్రామీణ తటాకాలు త్రవ్వకం, మరమ్మత్తులు ఈ కోవలోనికి వస్తాయి.

### 7.11.2. ప్రభుత్వ ప్రోత్సాహం:

భారతదేశమంతటా సన్నకారు రైతులు సేద్యానికి ఉపయోగించే బావులు ప్రైవేటు పనులలో ముఖ్యమైనవి. కౌలు రేట్లు పెంచకుండా రక్షణ కల్పిస్తూ తక్కువే ఋణాలు యిస్తూ ప్రభుత్వం వీటిని ప్రోత్సహించింది. వరద నీటికి భూసారం కొట్టుకొని పోకుండా కట్టలు వేయడం కూడా యిందులో భాగమే.

### 7.11.3. ముఖ్యమైన ప్రాజెక్టులు:

1919వ సంవత్సరంలో మాంటెగ్-చేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రకారం ఇరిగేషన్ రాష్ట్ర శాఖగా మారిన తరువాత నీటి పారుదల సౌకర్యం పెరిగింది. ఆహార ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం పెద్ద ప్రాజెక్టులు నిర్మించింది. పంజాబ్‌లో మూడు నదులపై నిర్మించిన మూడు కాలువల ప్రాజెక్టు 1917వ సంవత్సరంలో పూర్తి అయినది. సింధు ప్రాంతంలో బ్రహ్మాండమైన సుక్కూరు బ్యారేజి నిర్మాణం 1932వ సంవత్సరంలో పూర్తి అయినంది. సట్లేజ్, కావేరీ రిజర్వాయర్ స్కీమ్ విజయవంతంగా నెరవేరాయి.

అనుత్పాదక పనులలో గోదావరి కాలువలు (1919) మహారాష్ట్రలోని భాందర్ దరా, భట్‌గర్ ఆనకట్టలు 1928వ సంవత్సరంలో పూర్తి అయినాయి. 1940వ సంవత్సరం నాటికి సాగునీటి పొలం 244 మిలియన్ల ఎకరాలు అయినది.

### 7.11.4. స్వాతంత్ర్యానంతర ప్రగతి:

దేశ విభజన ఫలితంగా 82% జనాభా కలిగిన ఇండియన్ యూనియన్‌కు 69% సాగునీటి పొలం లభించింది. ఈ సమస్య నుండి గట్టెక్కడానికి స్వతంత్ర భారత ప్రభుత్వ పంచవర్ష ప్రణాళికలో ఇరిగేషన్‌కు మిక్కిలి ప్రాధాన్యత కల్పించింది. మొదటి మూడు ప్రణాళికలలో మొత్తం 1300 కోట్ల రూపాయలు వెచ్చించి 295 మేజర్, మైనర్ ఇరిగేషన్ పనులను చేపట్టింది. దీని ఫలితంగా సాగు నీటి పొలం విస్తీర్ణం 1951 నాటికి 56 మిలియన్ ఎకరాలుండగా అది 1966 నాటికి 87 మిలియన్

ఎకరాలకు పెరిగింది. భారీ ఎత్తున తలపెట్టిన భాక్రానంగల్, దామోదర్ లోయ, హీరాకుడ్, కోసి, కోయనా, కృష్ణా, చంబల్, రిహాండ్, తుంగభద్ర, మయూరాక్షి, దిగువ భవానీ ప్రాజెక్టులు పూర్తి చేసింది.

### 7.12. నీటిపారుదల ఫలితాలు:

- సాగునీటి సౌకర్యాల పెరుగుదల వల్ల క్షామభయం తొలగింది.
- క్షామ నివారణ పథకాల ఆవశ్యకత, శిస్తు మాఫీ అవసరం వుండదు.
- సాగునీటి సౌకర్యం వల్ల పంట దిగుబడి హెచ్చి పొలం విలువ పెరుగుతుంది.
- నీటి సౌకర్యం బాగా వున్న ప్రాంతాలలో రెండు మూడు పంటలు పండించవచ్చు.
- నగదు పంటలు హెచ్చి వ్యవసాయ వాణిజ్యీకరణ సంభవించినది.
- నీటి తీరువా వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగింది.
- బహుళార్ధ ప్రాజెక్టుల వల్ల నీటిపారదలేకాక విద్యుచ్ఛక్తి కూడా లభించింది.

దీని ద్వారా పరిశ్రమలు పెరుగుతాయి.

### 7.13. ఇండియాలో బ్రిటీష్ మూల విధానము-పరిశ్రమ:

భారతదేశాన్ని ఒక మార్కెట్టుగా భావించిన ఈస్ట్ ఇండియా కంపెనీ తన ఏకాస్వామ్యం నిలుపుకోవడానికి యితర యూరోపియన్ వర్తకులను, పారిశ్రామికులను ఇండియాలో నిషేధించినది. 1813 కంపెనీ ఛార్టర్ ప్రకారం ఈస్ట్ ఇండియా కంపెనీ ఏకస్వామ్యం రద్దు అయిన తరువాత బ్రిటీష్ వ్యక్తిగత ఉద్యమదారుల ద్వారా బ్రిటీష్ మూలధనం భారతదేశంలోకి ప్రవేశించే అవకాశం లభించినది. కాంట్రాక్ట్‌కు సంబంధించిన స్వేచ్ఛ, శాంతి భద్రతల కొరకు వ్యవస్థానాల స్థాపన, భూమికొనే హక్కు, వ్యాపారానికి సంబంధించిన ఆటంకాలు తొలగించుట మొదలైనవి సదుపాయాలు ఈ ఉద్యమదారులకు లభించాయి.

#### 7.13.1. ప్లాంటేషన్ విస్తరణ:

పై సదుపాయాల వల్ల అనేక పరిశ్రమలు ఇంగ్లండ్‌లో పోటీగా భారతదేశంలో స్థాపించడానికి ముందుకు వచ్చాయి కాని వాటిని నిషేధించటం వల్ల ఇంగ్లండ్ నుండి వచ్చే మూలధనముతో కాఫీ, తేయాకు, నీలిమందు, రబ్బరు మొదలగు తోటల పెంపకం పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడం జరిగింది. దీనిని 'ప్లాంటేషన్ పరిశ్రమలు' అని అంటారు. పై ఉత్పత్తుల ఐరోపా శీతోష్ణస్థితికి చాలా అవసరం కాబట్టి వాటిని ఇండియా మొదలగు తూర్పు దేశాలలోనే పండించవలసి రావటం వల్ల బ్రిటీష్ వారు పెట్టుబడులకు నిర్ణయించారు. భారతదేశంలో కార్మికులు చౌకగా లభించడంతో మరింత అవకాశం ఏర్పడింది.

#### 7.13.2. నీలిమందు తోటలు:

#### 7.13.2.1. నీలిమందు పెంపకం, వ్యాపారం:

1498వ సంవత్సరంలో వాస్కోడగామా భారతదేశానికి సముద్ర మార్గం కనిపెట్టటంతో ఐరోపా దేశస్థులు భారతదేశంలో నీలిమందు తోటలను ప్రోత్సహించారు. ఒకవైపు చెరకు, ప్రత్తి, పొగాకు మొదలైన వ్యాపార పంటలు అభివృద్ధి చెందుతున్న ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగులు బెంగాల్‌లోని కొన్ని జిల్లాలలో నీలిమందు తోటల పెంపకాలను ప్రవేశపెట్టారు.

**7.13.2.2. నీలిమందు తోటల అభివృద్ధి:**

1800–1850 వరకు ఈ పరిశ్రమ బెంగాల్‌లో బాగా అభివృద్ధిలోనికి వచ్చింది. 1850 నాటికి నీలిమందు భారతదేశ ముఖ్య ఎగుమతులలో ఒకటిగా రూపొందింది.

**7.13.2.3. నీలిమందు తోటల నిర్వహణ:**

నీలిమందు రైతులు తమ పొలాలను నీలిమందు తోటలుగా మార్చడానికి కారణం నీలిమందు లాభదాయకమైన వాణిజ్య పంట. దీనితో రైతులు జమీందార్ల వద్ద, ధనవంతులు. వడ్డీ వ్యాపారలు వద్ద అప్పులు తీసుకుని పంటలు పండించారు. అయితే అప్పు యిచ్చిన పాలికాపులు ఏ ధరకు విక్రయించాలో, నిర్ణయించి తమే కొనటం వల్ల రైతుల లాభాలు పొందలేకపోగా వడ్డీలు కట్టలేక వంశపారంపర్యంగా బానిసలుగా బ్రతకవలసి వచ్చింది. ఈ వెట్టి చాకీరిని వర్ణిస్తూ దీనబందు మిత్ర 'నీల దర్పణ్' అనే నాటకం వ్రాశాడు. ప్రభుత్వం వారు నెలకొల్పిన నీలిమందు కమీషన్ ప్లాంటర్ల దమన నీతిని బట్టబయలు చేసింది. జర్మన్ శాస్త్రజ్ఞుల కృత్రిమ నీలిమందును కనిపెట్టిన తరువాత 19వ శతాబ్ద అంతానికి ఈ పరిశ్రమ నశించింది.

**7.13.3. తేయాకు ప్లాంటేషన్:**

**7.13.3.1. ప్లాంటేషన్ ఆవిర్భావం:**

1835వ సంవత్సరంలో వారు ఒక ప్రయోగాత్మక తేయాకు తోటను నెలకొల్పారు. తరువాత దానిని అస్సాం తేయాకు కంపెనీకి అమ్మివేశారు. ఆ కంపెనీయే మొట్టమొదటి భారతీయ తేయాకు కంపెనీ. భారతీయ తేయాకును మార్కెట్టులోనికి తెచ్చే ప్రయత్నాలు విజయవంతమైనాయి. తేయాకు ప్లాంటేషన్ అభివృద్ధి 1852 వరకు పుంజుకోలేదు. 1852వ సంవత్సరంలో ఒక ప్రైవేటు తేయాకు తోట ప్రారంభించమైనది. ఈ తేయాకు పరిశ్రమ తరువాత బెంగాల్, నీలగిరి, తిరువన్కూర్ ప్రాంతాలలో కూడా వేగంగా వ్యాపించింది.

**7.13.3.2. ప్లాంటేషన్‌ల విస్తరణ:**

1860 నాటికి ప్లాంటేషన్లు బాగా విస్తరించాయి. తోటల పెంపకంలో మేలైన విధానాలను అవలంభించుట వల్ల 19వ శతాబ్ద అంతానికి భారతీయ తేయాకు బ్రిటన్ మార్కెట్ల నుండి చైనా తేయాకును గెంటి వేయగలిగినది. 1899వ సంవత్సరంలో భారతీయ తేయాకు సంఘం స్థాపించబడింది. తేయాకులో నాణ్యత, ప్రామాణికత పెంపొందించాలని ఈ సంఘం ప్రయత్నించింది. 1903వ సంవత్సరంలో తేయాకు సెస్ చట్ట ప్రకారం దేశంలో తేయాకు అమ్మకం పైనా, విదేశాలకు ఎగమతి పైనా సెస్సు విధించబడినది. 1914 సంవత్సరం నాటికి భారతీయ తేయాకు పరిశ్రమ మంచి స్థితిలోనికి వచ్చినది.

**7.13.3.3. రెండు ప్రపంచ యుద్ధ కాలాల్లో తేయాకు పరిశ్రమ:**

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో తేయాకు ధరలు బాగా పెరిగిపోవడంతో తోటల పెంపకం కూడా అధికమైనది. 1919–21 మధ్య తీవ్ర మాంద్యానికి గురి అయినది. 1933, 1938వ సంవత్సరాలలో కంపెనీలన్ని ఒప్పందం కుదుర్చుకొని తేయాకు పరిశ్రమను కాపాడుకున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో యూరోపియన్ మార్కెట్లు చేజారిపోవడం వల్ల బారత తేయాకు పరిశ్రమ తీవ్ర నష్టానికి గురి అయినది. 1941వ సంవత్సరంలో జపాన్, చైనా, ఇండోనేషియాలను ఆక్రమించిన పిమ్మట ఇండియా తేయాకుకు అమెరికా, బ్రిటన్, అరబ్బు దేశాలు, ఆస్ట్రేలియాలలో గిరాకీ పెరిగి ధరలు కూడా పెరిగాయి.

**7.13.3.4. ప్లాంటేషన్ కార్మికుల పరిస్థితులు:**

తేయాకు పరిశ్రమ యంత్రాలపై ఆధారపడినది కాదు. ఇది మానవ శ్రమతో కూడుకున్నది. తేయాకు పెంచడం స్త్రీలు, పిల్లలు చేతితో చేయవలసిన పని. ఇందుకు పెద్ద సంఖ్యలో కార్మికులు అవసరం. 1887 నాటికి 2,75,000 ఎకరాల తేయాకు తోటలలో 5 లక్షల భారతీయ కూలీలు పనిచేస్తుండేవారు. కరువు, క్షామ, ప్రాంతాల నుండి అస్సాం తేయాకు తోటలలోని పని కొరకు వచ్చిన కార్మికులును దోచుకున్నారు. వీరిని రవాణా చేసే పద్ధతి అమానుషంగా ఉండేది. ఈ కార్మికులు బానిసల్లాగా చూడబడినారు.

**7.13.4. కాఫీ ప్లాంటేషన్:**

అరేబియా వర్తకులు 17వ శతాబ్దంలో తొలిసారిగా కాఫీ మొక్కలను ఇండియాకు తెచ్చారు. దక్షిణ భారతదేశంలో చాలా చోట్ల కాఫీ తోటలు వేశారు. 1823వ సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారు కాఫీ పంటల విషయంలో శ్రద్ధ వహించారు. 1840వ సంవత్సరంలో ఒక ఆంగ్ల పారిశ్రామికులు మొదటి కాఫీ తోటను పెంచాడు. 1860 తరువాత మైసూరు, కూర్గు, తిరువన్కూర్, నీలగిరులలో కాఫీ ప్లాంటేషన్ ముమ్మరంగా ప్రారంభమైనది. 1879 వరకు బాగా అభివృద్ధి చెందిన 1879వ సంవత్సరం తరువాత 1888 వరకు మాంద్యం చోటు చేసుకున్నది. పైగా బ్రెజిల్ కాఫీకి ఇండియన్ కాఫీ తట్టుకోలేక పోయినది. 1924వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యల వల్ల కాఫీ ధరలు పడిపోలేదు.

**7.13.5. రబ్బర్ ప్లాంటేషన్:**

తెగుళ్ళ వల్ల నాశనమైన కాఫీ తోటల స్థానంలో 19వ శతాబ్ద ప్రారంభంలో రబ్బరు ప్లాంటేషన్ ప్రవేశపెట్టబడినది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో రబ్బరు ఉత్పత్తి బాగా విస్తరించినది. రబ్బరు ఉత్పత్తులు బాగా ఎగుమతి అయ్యాయి. 1914వ సంవత్సరంలో రబ్బరు ఎగుమతి విలువ 2.6 మిలియన్ పౌన్లు ఉండగా అది 1920 నాటికి 14 మిలియన్లకు, 1930వ సంవత్సరం ఆనటికి 23 మిలిమన్లుకు పెరిగి ధరలు తగ్గిపోయాయి. 1939 దాకా రబ్బర్ ప్లాంటేషన్ పరిశ్రమ పరిస్థితి అనిశ్చితంగా వుండినది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో రబ్బరు ప్రాముఖ్యం పూర్తిగా గుర్తింపబడినది.

## 7.14. ముగింపు:

ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలో భారతదేశంలో నీటి పారుదల సౌకర్యాల కొరకు ప్రారంభంలో నిర్లక్ష్యం వహించిన, తరువాతి కాలంలో ప్రణాళికలతో, వివిధ కమీషన్ల పథకాలలో నీటి పారుదల సౌకర్యాల కొరకు శ్రద్ధ చూపడమే కాక బడ్జెట్ కేటాయించడం కూడా జరిగింది. దీనికి తోడు సర్ ఆర్థర్ కాటన్, జాన్ బ్రైట్ మొదలగు ఇంజనీర్ల అద్భుత ఆలోచనలతో ప్రాజెక్టులు ప్రారంభమైనాయి. అయితే కొంతకాలం రైల్వే నిర్మాణ ప్రాజెక్టులు రావడంతో నీటిపారుదల ప్రాజెక్టులు మందకొడిగా కొనసాగినాయి. ప్రైవేటు సంస్థలు కూడా ప్రవేశించడంతో స్వాతంత్ర్యం నాటికి ప్రాజెక్టులు పెరిగాయి.

ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటీష్ ప్రభుత్వాల వల్ల భారతదేశ వ్యవసాయ రంగంలో పెక్కు మార్పులు సంభవించాయి. మొదటిగా వ్యవసాయ పంటల స్థానంలో వ్యాపార పంటలు చేరి వ్యవసాయ వాణిజ్యీకరణ జరగగా, రెండవదిగా వ్యాపార పంటల స్థానంలో వ్యాపార తోటలు కాఫీ, తేయాకు, రబ్బరు, నీలిమందు మొదలగునవి క్రొత్తగా చేరినవి. వీటివల్ల ఈస్ట్ ఇండియా కంపెనీకి, బ్రిటీష్ ప్రభుత్వానికి లాభాలు వచ్చినా, ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన మార్పుల వల్ల, నష్టాలు కూడా చోటు చేసుకున్నాయి. అయిన భారతదేశానికి కాఫీ, తేయాకు, రబ్బరు, నీలిమందు మొదలగు తోటల పెంపకం, పరిచయం కూడా అభివృద్ధి చెందాయి.

## 7.15. నమూనా ప్రశ్నలు:

### వ్యాసరూప ప్రశ్నలు:

1) ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలో నీటిపారుదల సౌకర్యాల చర్యలను వివరింపుము?

2) నీటిపారుదల (ఇరిగేషన్) సౌకర్యాలలో ప్రైవేటు సంస్థల పాత్రను వివరింపుము?

3) భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన ప్లాంటేషన్‌ల విధానాలను వివరింపుము?

## 7.16. ఆధార గ్రంథాలు:


**1. Peter Robb** : Agrarian Development in Colonial India.

**2. Sagwan Press** : Canals of Irrigation in India.

**3. Mufakharul Islam** : Irrigation, Agriculture and the Raj.

**4. S. Ginappa** : Plantation Economy in India.

**5. A.R. Desai** : Socio-Economic Histroy of India.


**- డాక్టర్ కృష్ణ ప్రసాద్ బాబు. జె**

## పాఠం - 8

# భారతదేశంలో చిన్న, కుటీర పరిశ్రమల క్షీణత

**8.0. లక్ష్యము:**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులలో ఆంగ్లేయులు అధికారాన్ని స్థాపించిన తర్వాత దేశంలోని చిన్న, కుటీర పరిశ్రమలు ఏవిధంగా క్షీణించాయో తెలుసుకోగలుగుతారు.

**విషయక్రమము:**


**8.1.** పరిచయము

**8.2.** ఐరోపా వారు భారతదేశంకు వచ్చే నాటికి దేశ పరిశ్రమల స్థితి

**8.3.** గ్రామీణ పరిశ్రమలు

**8.4.** పట్టణ పరిశ్రమలు

**8.5.** భారతీయ పరిశ్రమల క్షీణత

**8.6.** దేశపరిశ్రమల రక్షణకు ఇంగ్లాండ్ ప్రభుత్వ చర్యలు

**8.7.** పారిశ్రామిక విప్లవ ప్రభావం

**8.8.** భారతీయ పరిశ్రమలపై ఆంక్షలు

**8.9.** ప్రభుత్వ చర్యలు

**8.10.** దేశీయ పరిశ్రమల క్షీణతకు కారణాలు

**8.10.1.** మార్కెట్ల ఏర్పాటులో భారతీయుల అనాసక్తి

**8.10.2.** భారతదేశ పాలకుల ఉదాసీనత

**8.10.3.** సంస్థానాధీశుల పోషణ లేకుండా పోవడం

**8.10.4.** ఇంగ్లాండ్ నౌకాదిపత్యం

**8.10.5.** విదేశీ వస్తువుల పోటీ

**8.10.6.** ప్రభుత్వం వస్తుసామాగ్రిని దిగుమతి చేసుకోవడం

**8.10.7.** ప్రభుత్వ విధానాలు

**8.10.8.** కార్మిక, పారిశ్రామిక సంఘాలు లేకపోవడం

**8.10.9.** పారిశ్రామిక వేత్తలు లేకపోవడం

**8.10.10.** విదేశీ వస్తువుల పట్ల మక్కువ

**8.11.** భారతీయ పరిశ్రమల క్షీణత ఫలితాలు

**8.12.** సమీక్ష

**8.13.** నమూనా ప్రశ్నలు

**8.14.** ఆధార గ్రంథాలు

## 8.1. పరిచయము:

భారతదేశానికి వ్యాపారంకోసం వచ్చిన ఐరోపా దేశాలకు చెందిన వారి మధ్య ఏర్పడిన పోటీ, ఆంగ్లేయులు, ఫ్రెంచి వారు స్థానిక రాజకీయాలలో జోక్యం చేసుకోవడం, వారిమధ్య అధికారం కోసం పోటీ ఏర్పడి, చివరకు ఆంగ్లేయులది పైచేయి అయింది. క్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆంగ్లేయులు వ్యాపారం మీద గుత్తాధిపత్యాన్ని సాధించారు. తర్వాత ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం సంభవించి యాంత్రిక పరిశ్రమలు ఏర్పడి ఉత్పత్తులు పెరిగాయి. వాటిని విక్రయించేందుకు భారతదేశం గొప్ప మార్కెట్ అని భావించిన ఆంగ్లేయులు తమ మార్కెట్ కోసం భారతీయ కుటీర, చిన్న పరిశ్రమలను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేసి విజయం సాధించారు. దీనితో భారతదేశంలోని చిన్న కుటీర పరిశ్రమలు క్షీణించి పోయాయి.

## 8.2. ఐరోపా వారు భారతదేశంకు వచ్చే నాటికి దేశ పరిశ్రమల స్థితి:

భారతదేశానికి 1498వ సంవత్సరంలో పోర్చుగల్ నావికుడు అయిన వాస్కోడగామా సముద్ర మార్గాన్ని కనుగొన్న తర్వాత ఐరోపా దేశాలకు చెందిన వారు వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చి దేశంలోని వివిధ ప్రాంతాలలో వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. వారు భారత దేశంలోని ఉత్పత్తులను కొనుగోలు చేసి తమతమ దేశాలకు ఎగుమతి చేయడం ప్రారంభించారు. ఈ సమయంలో భారత దేశంలో అనేక పరిశ్రమలు వుండేవి. చిన్న, కుటీర పరిశ్రమలైనా వీటికి మంచి గుర్తింపు ఉండడంతో పాటు బాగా ఆదాయాన్ని పొందేవి. ఈ సమయంలో భారతదేశం "ప్రపంచపు కార్ఖానా" అనే పేరు పొందింది. ఐరోపా ఖండంలో ప్రధానంగా లండన్, పారిస్, డమస్కస్ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉండేది.

## 8.3. గ్రామీణ పరిశ్రమలు:

ప్రతి గ్రామం లోను గ్రామ వాడుక నిమిత్తం సామాన్య వస్తువులను తయారు చేసే పరిశ్రమలు ఉండేవి. నేత, కమ్మర, కుమ్మర, తోళ్ళ పరిశ్రమ మొదలయిన వాటిని ఆయా కులాలవారు కులవృత్తి పరిశ్రమలుగా, కుటీర పరిశ్రమలుగా నిర్వహిస్తూ వుండేవారు. వీరికి మాన్యాలు ఉండటంచేత వీరు గ్రామాలలో నివసిస్తూ ఉత్పత్తిని చేస్తూ ఉండేవారు. ఇందులోని ఉత్పత్తిలో ఆయా కుటుంబాలలోని సభ్యులంతా భాగస్వాములుగా వుండేవారు. ఈ విధంగా ఆయా గ్రామాలకు చెందినవారు గ్రామానికి, అందులో వివిధ పనులు చేసేవారికి అవసరమైన వస్తువులన్నింటిని ఆ గ్రామాల్లోనే ఉత్పత్తి చేసుకునే వారు. దీనితో ఈ సమయంలో గ్రామాలు స్వయం సమృద్ధమై వుండేవి.

## 8.4. పట్టణ పరిశ్రమలు:

సంపన్నుల కోసం అవసరమైన వస్తువులను తయారు చేసే పరిశ్రమలు రాజధాని నగరాలలోను, ఇతర పట్టణాలలోను ఉండేవి. ఇక్కడ కూడా వస్తు తయారీధారులు నివసిస్తూ వస్తు ఉత్పత్తి చేస్తూ వుండేవారు. అందువల్ల వివిధ పట్టణాలు పారిశ్రామిక పట్టణాలుగా పేరుపొందాయి. ప్రధానంగా వారణాసి, మధుర, కంచి మొదలైన నగరాలు ఇలాంటి పరిశ్రమలకు కేంద్రాలుగా ఉండేవి. ఇక రాజ కుటుంబానికి అవసరమైన బంగారు, వెండి వంటి లోహాలను ఉపయోగించి వివిధ ఆభరణాలు వస్తువులు తయారు చేసేవారు కూడా గొప్ప నైపుణ్యం కలిగినవారిగా పేరుపొందారు. వీటితో పాటు పాలకులకు, సైన్యానికి దేశ రక్షణకు అవసరమైన కత్తులు, ఈటెలు, విల్లంబులు, డాలు, కవచాలు వంటివి కూడా పట్టణాలలో తయారు చేస్తూ వుండేవారు.

ఈ విధంగా ఆంగ్లేయులు భారత దేశం వచ్చేనాటికి గ్రామీణ, పట్టణ పరిశ్రమలు లాభదాయకంగా విరాజిల్లుతూ వుండేవి. నిత్యం వాడకంకు అవసరమైన వస్తువులను తయారు చేయడంలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించింది. వీటన్నింటి ఫలితంగా 17, 18 శతాబ్దాలలో భారతీయ పరిశ్రమలు పేరు ప్రఖ్యాతులు సంపాదించి ఇతర దేశాల కంటే ఉన్నతంగా గుర్తింపు పొందాయి. అందువల్లనే అనాదిగా భారతదేశ నేత వస్త్రాలు, పట్టు వస్త్రాలు, అద్దకపు వస్త్రాలు వంటి వాటికి విదేశాలలో ఎంతో గిరాకీ ఉండేది. వస్త్ర పరిశ్రమల తోపాటు ఇతర పరిశ్రమలు కూడా భారతదేశంలోఅభివృద్ధి చెందాయి.

## 8.5. భారతీయ పరిశ్రమల క్షీణత:

ఆంగ్లేయులు భారత దేశంలో ఆధిపత్యాన్ని సంపాదించడంతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. దీనికితోడూ ఆ తర్వాత ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత ఈ పరిస్థితుల్లో పూర్తిగా మార్పులు చోటు చేసుకున్నాయి. పారిశ్రామిక విప్లవానికి ముందు తయారైన వస్తువులను ఎగుమతి చేసుకున్న ఆంగ్లేయులు విప్లవం తర్వాత ముడిసరుకులను ఎగుమతి చేసుకుని ఇంగ్లాండ్ లో వస్తువులను తయారు చేసి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయించడం ప్రారంభించారు. దీనివల్ల సాంప్రదాయికమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడం ప్రారంభం అయింది.

## 8.6. దేశపరిశ్రమల రక్షణకు ఇంగ్లాండ్ ప్రభుత్వ చర్యలు:

భారతదేశంలో తయారైన వస్త్రాలకు ఇంగ్లాండ్ దేశంలో డిమాండ్ అధికంగా వుండేది. 1670వ సంవత్సర ప్రాంతములో ఇంగ్లాండ్ ప్రజల వస్త్రధారణ అభిరుచులలో మార్పులు కలగడం వల్ల, భారతీయ నూలు వస్త్రాలకు ఒక్కసారిగా ఇంగ్లాండ్‌లో డిమాండ్ ఏర్పడింది. దీనితో 1684వ సంవత్సరంలో ప్రజల కోసం ఇంగ్లాండ్ ప్రభుత్వం భారతదేశం నుంచి దిగుమతి అయ్యే వస్త్రాలపైనా దిగుమతి పన్నును రద్దు చేసింది. దీనితో భారతీయ వస్త్రాలకు ఇంగ్లాండ్ దేశంలో డిమాండ్ మరింత అధికమైంది. అప్పటికరకూ ప్రధానంగా సుగంధద్రవ్యాల వ్యాపారం చేస్తున్న ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతీయ వస్త్రాలను ఇంగ్లాండ్ దేశానికి దిగుమతి చేయడం పట్ల ఆసక్తి కనబరిచి వస్త్రాలను అధికంగా దిగుమతి చేయసాగింది. అంతేకాకుండా భారత దేశంలో కొన్ని ప్రాంతాలలో నేత పనివారిని పెట్టి వస్త్రాలను నేయించడం కూడా చేయసాగారు. ఈ వ్యాపారాన్ని ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ బాగా లాభసాటిగా భావించింది. ఈ సమయంలో భారతీయ నేత పనివారు కూడా సంతోషించారు. వారి జీవన విధానంలో కూడా కొంత మెరుగుదల కనిపించింది. అయితే ఈ స్థితి ఎంతోకాలం నిలబడలేదు.

వస్త్ర వ్యాపారంలో వచ్చిన ఈ స్థితి వల్ల ఇంగ్లాండులోని వెండి, బంగారులతో పాటు సంపద భారతదేశానికి తరలిపోతున్నదనే భావన ఇంగ్లాండ్ దేశంలోని వాణిజ్యవాదులలో ప్రారంభమైంది. ఈ విషయాన్ని ఇంగ్లాండ్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో పాటు వారు ఆందోళన వెలిబుచ్చారు. అంతేకాకుండా భారతీయ నూలు వస్త్రాల దిగుమతి వల్ల ఇంగ్లాండ్ దేశంలోని ఉన్ని, పట్టు పరిశ్రమలకు డిమాండ్ తగ్గి ఆ పరిశ్రమలు క్షీణించి పోయి ఆ వస్త్రాలను తయారు చేసే నేత పనివారికి జీవనోపాధి లేకుండా పోతోందని ఇంగ్లాండ్ దేశంలోని పారిశ్రామిక వేత్తలు ఆందోళన చెందసాగారు. దీనితో ఇంగ్లాండ్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు మద్దతును ఇవ్వడం ప్రారంభించింది.

దేశంలోని ఉన్ని, పట్టుపరిశ్రమల రక్షణకు చర్యలు చేపట్టింది. ఈ చర్యలు ఆంగ్లేయులు భారతదేశంలో ప్లాసీ యుద్ధంలో విజయం సిద్ధించేదుకంటే ముందే అంటే 1757వ సంవత్సరంకు పూర్వమే తీసుకోవడం విశేషం. ఈ రక్షణ చర్యల

ప్రకారం ఇంగ్లాండ్ దేశంలో ప్రజలు భారతీయ వస్త్రాల వాడకం పై ఆంక్షలు విధింపబడ్డాయి. అయితే ఇంగ్లాండ్ దేశంలోని ప్రజలలో భారతీయ వస్త్రాలపై మోజు పెరిగిందేగాని తరగలేదు. దీనితో ఇంగ్లాండ్ ప్రభుత్వం మరింత కఠిన చర్యలకు పూనుకుంది. అందులో భాగంగా 1720వ సంవత్సరంలో ఒక చట్టం చేసింది. భారతదేశం నుంచి దిగుమతి అయ్యే అద్దకపు వస్త్రాలను ధరించిన వారిపై 5 పౌనులు జరిమానాను విధింపబడుతుందని, అంతేకాకుండా అటువంటి వస్త్రాలను విక్రయించిన విక్రయదారుపైన 20 పౌనులు జరిమానా విధింపబడుతుందని ఈ చట్టంలో పేర్కొనబడింది. ఇంగ్లాండ్ పారిశ్రామిక వేత్తలలో భారతీయ వస్త్రాలపై కలిగిన ఆందోళన మిగతా ఐరోపా దేశాలలో కూడా కలగడంతో భారతీయ వస్త్రాలపైన ఆంక్షలు విధించడంతో క్రమంగా ఐరోపా ఖండ దేశాలకు భారతీయ వస్త్రాల దిగుమతి తగ్గిపోయింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ దేశం తన దేశంలో వస్త్ర పరిశ్రమను అభివృద్ధి చేయడానికి నడుం కట్టింది. దీనితో 18వ శతాబ్దం మధ్య ప్రాంతానికి ఇంగ్లాండ్ దేశంలో వస్త్ర పరిశ్రమ వేళ్లూనుకొనడంతో భారతదేశ వస్త్ర పరిశ్రమకు చెడురోజులు ప్రారంభం అయ్యాయి.

## 8.7. పారిశ్రామిక విప్లవ ప్రభావం:

18 వ శతాబ్దం ద్వితీయ అర్ధ భాగంలో ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం ప్రారంభం అయింది. వస్త్రాలను, వివిధ వస్తువులను చేతితో తయారు చేయడానికి బదులు యంత్రాల సహాయంతో చేయడం ప్రారంభం అయింది. ఆవిరి యంత్రాలు విరివిగా అమలులోకి వచ్చి వాటి సహాయంతో నడిచే యంత్రాలతో వివిధ వస్తువులు, వస్త్రాల తయారీ ప్రారంభం అయింది. ఇంగ్లాండ్ దేశంలో ప్రధానంగా యంత్రాల సహాయంతో నూలు వడకడం. వస్త్రాలు తయారు చేయడం అమల్లోకి వచ్చింది. దీని ఫలితంగా ఇంగ్లాండ్ దేశంలోని పారిశ్రామిక వేత్తలు తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో సాధించ గలిగారు. ఈ ఉత్పత్తులలో నూలు వస్త్రాలకు అధిక ప్రాధాన్యం లభించింది. ఈ విధంగా పెరిగిన ఉత్పత్తులకు మార్కెట్ అవసరమైంది. అంతేకాకుండా వాటికి మార్కెట్లు లభించి విరివిగా వాటిని విక్రయిస్తేనే తిరిగి ఉత్పత్తికి అవకాశం కలుగుతుంది. కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. ఇలాంటి స్థితిలో భారత దేశానికి ఇంగ్లాండ్ దేశంలో తయారైన వస్త్రాలను, వస్తువులను దిగుమతి చేయడం ప్రారంభించింది.

అయితే ఆంగ్ల పారిశ్రామిక వేత్తలు ఆశించిన ఫలితాలు భారత దేశంలో కలుగలేదు. అందుకు అనేక పరిస్థితులు కారణం అయ్యాయి. ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా ప్రభుత్వం అంతకముందే లాభార్జన ధ్యేయంతో భారతదేశంలోకి దిగుమతి అయ్యే వస్త్రాలు, వస్తువులపైన దిగుమతి పన్నులను అధికంగా విధించి వుండడం వల్ల ఇంగ్లాండ్ వస్త్రాలపై దిగుమతి పన్ను చెల్లించాల్సి వచ్చింది. దీనితో భారతదేశంలో తయారైన వస్త్రాలు, వస్తువులకంటే ఇంగ్లాండ్ వస్తువులు, వస్త్రాల ధర అధికంగా ఉండండంవల్ల అవి భారతీయ ఉత్పత్తులను ఎదుర్కొని నిలబడలేక పోయాయి.

## 8.8. భారతీయ పరిశ్రమలపై ఆంక్షలు:

ఆంగ్లేయులు ఊహించిన లాభాలు లేకపోవడంతో భారత దేశంలోని ఆంగ్ల ప్రభుత్వం తమ మాతృదేశంలో ఉత్పత్తి అయిన వస్త్రాలు, వస్తువులకు మార్కెట్లో అనుకూలమైన పరిస్థితులను కలిగించేందుకు, భారతీయ పరిశ్రమలను అణచి వేసేందుకు తన రాజకీయ అధికారాన్ని ఉపయోగించి కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అందులో భాగంగా దేశంలోని పరిశ్రమల పైన అనేక ఆంక్షలు, పన్నులు విధించింది. వీటి వల్ల భారతీయ చిన్న కుటీర పరిశ్రమలకు ఇబ్బందికరమైన పరిస్థితులు ప్రారంభం అయ్యాయి.

## 8.9. ప్రభుత్వ చర్యలు:

1. ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తయారైన వస్త్రాలకు బదులు ముడి పదార్థాలను కొనుగోలు చేయడం ప్రారంభించింది. దీనికి తన అధికారాన్ని ఉపయోగించడం వల్ల దేశీయ పరిశ్రమలకు తగినంత ముడిసరుకు లభ్యత జరగలేదు. అంతేకాకుండా ముడిసరుకుల ధరలను తారుమారు చేయడం ద్వారా భారతీయ కుటీర పరిశ్రమలకు ముడిసరుకులు లభ్యత కాకుండా చేసింది.
2. భారతదేశంలో తయారైన ఉత్పత్తులపైన ఎగుమతి పన్నులను పెంచడం ద్వారా ఎగుమతులను నిరుత్సాహ పరిచింది.
3. ఇంగ్లాండ్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులు, వస్త్రాలపై పన్నును తగ్గించడం లేదా పూర్తిగా తీసివేయడం చేసింది. దీనివల్ల విదేశాలనుంచి దిగుమతి అయిన వస్త్రాలు, వస్తువుల ధరలు తగ్గాయి. దేశంలో తయారైన వస్తువులకంటే విదేశీ వస్తువుల ధర తక్కువగా వుండడం వల్ల మార్కెట్లో వాటికి డిమాండ్ పెరిగింది. స్వదేశీ వస్తువులకు డిమాండ్ తగ్గింది.
4. ప్రభుత్వం వద్ద గుర్తింపు పొందిన నేత పనివారు కంపెనీ వద్ద తప్ప ఎక్కడా పనిచేయరాదు అనే నిబంధన విధించింది.
5. భారతదేశంలోని మగ్గాలపైనా మొతుర్ఫా అనే పేరుతో పన్నును విధించింది.

ఈ విధంగా వస్త్ర పరిశ్రమతో పాటు భారతదేశంలోని చిన్న కుటీర పరిశ్రమలన్నీ ఇలాంటి ప్రభుత్వ విధానాలు, చట్టాల వల్ల క్రమంగా క్షీణించి పోయాయి.

## 8.10. దేశీయ పరిశ్రమల క్షీణతకు కారణాలు:

భారతదేశాన్ని పరిపాలించిన ఆంగ్లేయ కంపెనీ విధానాలు, ఇంగ్లాండ్ దేశంలో జరిగిన పారిశ్రామిక విప్లవం వంటివి భారతదేశంలో చిన్న కుటీర హస్తకళల పరిశ్రమలు క్షీణించి పోవడానికి ప్రధాన కారణం అయినా మరికొన్ని కారణాలు కూడా అందుకు దోహదం చేశాయి.

### 8.10.1. మార్కెట్ల ఏర్పాటులో భారతీయుల అనాసక్తి:

భారతీయ చిన్న పరిశ్రమలు చేతివృత్తుల వారు మొదటి నుంచి తాము తయారు చేసిన వస్తువులు వస్త్రాలను తమ దగ్గరికి వచ్చి కొనుగోలు చేసే వారికే విక్రయించే వారు తప్ప వారు ప్రత్యేకంగా విక్రయించుకోవడం పట్ల ఆసక్తి కనబరచలేదు. కేవలం వ్యాపారుల మీదనే వారు ఆధార పడ్డారు. ఆంగ్లపాలనకు పూర్వం కూడా భారతదేశ వస్త్ర వాణిజ్యం సమస్తమూ విదేశీయుల హస్తగతమై ఉండేది. వ్యాపారులు తమ లాభాల పట్లనే దృష్టి పెట్టారు తప్ప ఈ ఉత్పత్తి స్వదేశమా లేదా విదేశామా అని చూడలేదు. దీనితో ఉత్పత్తికి ప్రత్యేక మార్కెట్లు లేకపోవడం కూడా స్వదేశీ పరిశ్రమల క్షీణతకు ఒక కారణం అయింది.

### 8.10.2. భారతదేశ పాలకుల ఉదాసీనత:

భారతీయ పాలకులు ఎప్పుడూ కూడా జాతీయవాణిజ్య విధానాన్ని ఏర్పరచలేదు. దీనికి తోడు భారతదేశాన్ని మొగల్ సుల్తానులు పరిపాలిస్తున్న కాలంలో ఐరోపా దేశాల వారు భారతదేశానికి వాణిజ్యం కోసం వచ్చారు. ఈ సమయంలో కూడా మొగల్ చక్రవర్తులు పాశ్చాత్య వాణిజ్యనీతిని అధిగమించి జాతీయ వాణిజ్య విధానాన్ని ఏర్పరచలేదు. ఐరోపా దేశాలకు

చెందిన వారు చేస్తున్న వాణిజ్య చర్యలను చూస్తూ వూరుకున్నారు. వారు భారతదేశంలో వాణిజ్యం విషయమై, భారతీయ మార్కెట్లను తమ వశం చేసుకునేందుకై పోటీ పడి పరస్పరం కలహించుకుంటూ వున్నా చూస్తూ వుండిపోయారే తప్ప మొగల్ చక్రవర్తులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. విదేశీయులతో సంబంధాలు ఏర్పడిన తర్వాత కూడా మొగల్ చక్రవర్తులు ఇంగ్లాండ్ తదితర దేశాలలో తమదేశ పరిశ్రమల రక్షణకు ఆయా దేశాల పాలకులు తీసుకుంటున్న చర్యలు చూసి కూడా దేశ వాణిజ్య, పరిశ్రమల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విధంగా భారతీయ పాలకులు ఆర్థిక సమస్యలను రాజకీయ ప్రయోజనాల దృష్టితో చూడకపోవడం కూడా భారతీయ చిన్న కుటీర పరిశ్రమలు క్షీణించడానికి కారణమైంది.

**8.10.3. సంస్థానాధీశుల పోషణ లేకుండా పోవడం:**

మొగల్ సామ్రాజ్యం బలహీనమైన తర్వాత దేశంలో చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. ఆంగ్లేయులు అధికారం పొందిన తర్వాత వారు సంస్థానాధీశులుగా పేరుపొందారు. వీరు కొంతవరకు దేశీయ చేతివృత్తుల పరిశ్రమలను ప్రోత్సహించారు. సైన్యానికి యుద్ధానికి అవసరమైన సామాగ్రిని తయారు చేయించడం వంటివి చేసేవారు. అయితే సంస్థానాదీశులు కూడా చివరకు ఆంగ్లేయుల వశంలోకి వెళ్ళడం లేదా వారి ప్రభావానికి లోనుకావడం వంటి వాటివల్ల వారికీ యుద్ధ సామాగ్రి అవసరం లేకుండా పోవడంతో వారు కూడా ఏమీ చేయలేక పోయారు.

**8.10.4. ఇంగ్లాండ్ నౌకాధిపత్యం:**

భారతదేశంలో ప్రాచీన కాలం చిన్న, కుటీర, హస్తకళల పరిశ్రమలే వున్నా, దేశం పారిశ్రామికంగా ఉత్పత్తులను బాగా సాధించడం వల్ల దేశం నుంచి విదేశీ ఎగుమతులు బాగా జరుగుతూ ఉండేవి. ఈ విదేశీ ఎగుమతుల వ్యాపారాన్ని అధికంగా ఇతరులే చేసేవారు. తమ ఉత్పత్తులను తామే ఎగుమతి చేసుకునేందుకు పెద్దగా శ్రద్ధ కనబరిచేవారు కాదు. భారత దేశంకి రహదారి మార్గం మూసివేయబడిన తర్వాత జలమార్గం ద్వారా భారతదేశానికి వచ్చిన ఐరోపా దేశాలలో ఆంగ్లేయులకు వున్న సముద్రాధిపత్యం వల్ల వీరు తమదేశంలో సాధించిన ఉత్పత్తులను భారతదేశానికి సులభంగా చేరవేశారు. దీనితోడు దేశంలో 19 వ శతాబ్దం ద్వితీయ అర్ధభాగం నుంచి రైల్వే వ్యవస్థ అమల్లోకి రావడం వల్ల మారుమూల గ్రామాలకు సైతం తమ ఉత్పత్తులను తీసుకువెళ్ళి మార్కెట్ చేసుకోగలిగారు. భారతీయులకు నౌకాబలం లేకపోవడం కూడా కొంత భారతీయ పరిశ్రమలకు ఇబ్బంది కరంగా తయారైంది. ఆంగ్లేయులకు వున్న నౌకబలం, సముద్రాదిపత్యం కూడా భారతీయ పరిశ్రమలు క్షీణించి పోవడానికి ఒక కారణం అయింది.

**8.10.5. విదేశీ వస్తువుల పోటీ:**

ఇంగ్లాండ్ దేశంలో యంత్రాల సహాయముతో వస్తువులు తయారుచేయడం పారిశ్రామిక విప్లవ ఫలితంగా ప్రారంభం అయింది. దీనితో తక్కువ సమయంలో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తులను సాధించేందుకు వీలు కలిగింది. దీనితో ఆ వస్తువల ధరలు తక్కువ అయ్యాయి. వాటిని ఆంగ్లేయులు భారతదేశానికి దిగుమతి చేసి మార్కెట్లలో విక్రయం మొదలు పెట్టారు. సహజంగానే భారతదేశంలో కుటీర పరిశ్రమల ద్వారా ఉత్పత్తి అయిన వస్తువుల ధర అధికంగా ఉంటుంది. దీనికితోడు తమకు వున్న రవాణా సాధనాల ద్వారా అంగ్లేయులు మారుమూల ప్రాంతాలకు సైతం తమ ఉత్పత్తులను చేరవేసేవారు. భారతీయ తయారీ వస్తువులు, వస్త్రాల ధరకంటే విదేశీ దిగుమతి వస్తువులు, వస్త్రాల ధర తక్కువగా ఉండడం వల్ల సహజంగానే భారతదేశంలోని ప్రజలు వాటి పట్ల ఆకర్షితులు అయ్యారు. ఫలితంగా స్వదేశీ వస్తువులకు గిరాకీ తగ్గిపోవడంతో

భారతీయ పరిశ్రమలు క్రమంగా క్షీణించాయి.

**8.10.6. ప్రభుత్వం వస్తు సామాగ్రిని దిగుమతి చేసుకోవడం:**

సాధారణంగా ఏదేశంలో అయినా ప్రభుత్వ కార్యకలాపాలకు అవసరమైన వస్తు సామాగ్రిని ఆదేశ పరిశ్రమల నుంచి కొనుగోలు చేయడం ద్వారా ఆ దేశంలోని ప్రభుత్వం పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. అయితే భారతదేశంలో ఆంగ్ల పాలనాకాలంలో అది మృగ్యమైంది. ఆంగ్ల ప్రభుత్వం తన కార్యకలాపాలకు అవసరమైన వస్తు సామాగ్రిని ఇంగ్లాండ్ దేశం నుంచి దిగుమతి చేసుకొనేది. దీనితో భారతీయ పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండా పోయింది. ఇది కూడా భారతదేశం పరిశ్రమల క్షీణతకు ఒక కారణం అయింది.

**8.10.7. ప్రభుత్వ విధానాలు:**

భారతదేశంలోని ఆంగ్ల ప్రభుత్వ విధానాలు భారతదేశం పరిశ్రమలకు గొడ్డలి పెట్టుగా తయారైంది. పారిశ్రామిక విప్లవం తర్వాత దేశంలో కుటీర పరిశ్రమలు నాశనం అవుతూ ఉంటే ఆ స్థానంలో ఆధునిక పరిశ్రమలు దేశంలో స్థాపించేందుకు ప్రభుతం అవలంభించిన విధానం ప్రతిబంధకంగా మారింది. ఇంగ్లాండ్ దేశంలోని పరిశ్రమలతో పోటీ పడగల పరిశ్రమలు భారతదేశంలో స్థాపింపబడడం ప్రభుత్వానికి ఎంతమాత్రం ఇష్టం లేకపోగా భారతీయుల చేత ఇంగ్లాండ్ లో తయారైన వస్తువులను కొనిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అయింది. అందువల్ల భారతదేశంలో ఆధునిక పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రయత్నించక పోగా ముందుకు వచ్చిన భారతీయ పారిశ్రామికవేత్తలకు తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వలేదు. అయినా భారతదేశంలో కొన్ని ఆధునిక పరిశ్రమలు స్థాపింప బడినా వాటిలో అధిక భాగం ఇంగ్లాండ్ పెట్టుబడి దారులు స్థాపించినవి కావడం వల్ల భారతీయులకు ఒరిగింది ఏమీలేదు. అంతేకాకుండా ఇంగ్లాండ్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులకు దిగుమతి పన్నులు తీసివేయడం, స్వేచ్ఛా వ్యాపార విధానం కూడా భారతీయ పరిశ్రమలు దెబ్బతినేలా చేశాయి.

**8.10.8. కార్మిక, పారిశ్రామిక సంఘాలు లేకపోవడం:**

భారతదేశంలో కుటీర పరిశ్రమలు వుండడం, ఆ కుటీర పరిశ్రమలు ఒక సంఘంగా ఏర్పడడం చేశాయి, కానీ కార్మిక సంఘాలు భారతదేశంలో ఏర్పడలేదు. అంతేకాకుండా వివిధ పరిశ్రమల వారందరూ కలిసి కూడా ఒక సంఘంగా ఏర్పాటు కాలేదు. దీనితో విదేశీ వస్తువులు దేశ మార్కెట్లోకి ప్రవేశించి దేశ తయారీల మార్కెట్‌లను నాశనం చేస్తున్న సమయంలో దానిని ఎదుర్కొనే కార్మిక వ్యవస్థ కానీ, పారిశ్రామిక సంఘాలు కానీ లేకుండా పోవడం కూడా భారతీయ పరిశ్రమల క్షీణతకు కారణం అయింది.

**8.10.9. పారిశ్రామిక వేత్తలు లేకపోవడం:**

భారతదేశంలో తొలినుంచి కుటీర పరిశ్రమల వ్యవస్థ అమలులో ఉండడం వల్ల ప్రత్యేకంగా పారిశ్రామికవేత్తల వర్గం తయారు కాలేదు. దీనివల్ల అవసరమైన సమయంలో అంటే కుటీర పరిశ్రమల క్షీణత ప్రారంభమైన సమయంలో వాటికి ప్రత్యామ్నాయంగా యాంత్రిక పరిశ్రమలను స్టాపించే వ్యవస్థ భారతదేశంలో లేకుండా పోయింది. విదేశీ అంతర్జాతీయ వ్యాపారం ద్వారా సంపన్నులైన వారు పరిశ్రమల స్థాపనకు ప్రయత్నాలు ప్రారంభించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది. అంతేకాకుండా పరిశ్రమల స్థాపనకు ఎవరైనా ముందుకు వచ్చినా అవసరమైన యంత్ర సామాగ్రి భారతదేశంలో లభించకపోవడం, వాటిని విదేశాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం, వాటి నిర్వహణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం

లేకపోవడం కూడా వారికి ఇబ్బందికరంగా తయారైంది.

### 8.10.10. విదేశీ వస్తువుల పట్ల మక్కువ:

ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చి పరిపాలన చేయడం ప్రారంభం అయిన తర్వాత భారతీయులలో ప్రధానంగా సంపన్న, అధికార వర్గాల వారు ఆంగ్లేయుల వేష భాషలను, జీవన విధానాన్ని అనుకరించడం ప్రారంభించారు. ఆంగ్లేయులు దేశంలో ఆంగ్ల విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఈ అనుకరణ మరింత అధికమైంది. దీనివలన తమను ఆంగ్లేయులు గౌరవిస్తారనే భావం కలగడం దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఆంగ్లేయులు తమకు కావలసిని వస్తు సామాగ్రిని ఇంగ్లాండ్ దేశం నుంచి తెప్పించుకొనే వారు. వారిని చూసి ఈ వర్గాల భారతీయులు కూడా ఇంగ్లాండ్ నుంచి వస్తువులను తెప్పించుకొనడం చేశారు. ఈ వర్గాలకు ఈవిధంగా విదేశీ వస్తువుల పట్ల మక్కువ ఏర్పడింది. ఈవిధంగా భారతీయులలో ఆంగ్ల వస్తువుల పట్ల ఏర్పడిన మక్కువ వల్ల స్వదేశీ పరిశ్రమలకు ఉత్పత్తులకు ఆదరణ తగ్గి చివరకు అవి క్షీణించడానికి కారణం అయింది.

ఈ కారణాలన్నింటి వల్ల భారతదేశంలో చిన్న కుటీర పరిశ్రమలు క్షీణించి పోయాయి.

## 8.11. భారతీయ పరిశ్రమల క్షీణత ఫలితాలు:

పారిశ్రామిక విప్లవం జరిగిన తర్వాత చిన్న కుటీర పరిశ్రమలు చాలా దేశాలలో పతనం అయ్యాయి. అయితే వాటి స్థానంలో ఆధునిక యాంత్రిక పరిశ్రమలు స్థాపింపబడడం వల్ల కుటీర పరిశ్రమలలో ఉపాధి కోల్పోయిన వారు ఆధునిక పరిశ్రమలలో ఉపాధి పొందగలిగారు. అయితే ఆ పరిస్థితి భారతదేశంలో లేకుండా పోయింది. భారతదేశంలో కుటీర పరిశ్రమల స్థానంలో యాంత్రిక పరిశ్రమలు స్థాపింపబడలేదు. దీనివల్ల అనాదిగా కుటీర పరిశ్రమల మీద ఆధారపడి జీవించిన వారు జీవనోపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందుల పాలు అయ్యారు. వారిలో కొందరు వ్యవసాయ కూలీలుగా మారగా మరికొందరు నిరుద్యోగులుగా నిలిచిపోయి వారి బతుకు దుర్భరంగా మారింది. దీనికంతటికీ ఆంగ్ల పాలననే కారణం అనే భావం వారిలో బయలుదేరి ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఏర్పడింది. క్రమంగా ఈ అసంతృప్తి జాతీయ భావానికి దోహదం చేసింది.

## 8.12. సమీక్ష:

ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం సంభవించి యాంత్రిక పరిశ్రమలు ఏర్పడి ఉత్పత్తులు పెరిగాయి. వాటిని విక్రయించేందుకు భారతదేశం గొప్ప మార్కెట్ అని భావించిన ఆంగ్లేయులు తమ మార్కెట్ కోసం భారతీయ కుటీర, చిన్న పరిశ్రమలను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేసి విజయం సాధించారు. ప్రభుత్వ విధానాలతో పాటు అనేక కారణాలు భారతీయ పరిశ్రమలు దెబ్బతినేందుకు కారణమయ్యాయి. దీనికి తోడూ ఆధునిక పరిశ్రమలు స్థాపించడానికి అనువైన ప్రభుత్వ విధానం కానీ, దేశీయ పారిశ్రామిక వేత్తలు కూడా పెద్దగా లేకపోవడంతో చివరికి భారతదేశంలోని చిన్న కుటీర పరిశ్రమలు క్షీణించి పోయాయి. అందువల్ల కుటీర పరిశ్రమల వల్ల ఉపాధి పొందుతూ వున్నవారు ఉపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందుల పాలు అయ్యారు. చివరకు తమ పరిస్థితికి ప్రభుత్వమే కారణం అనేభావం వారిలో ఏర్పడి చివరకు అది ప్రభుత్వంపట్ల అసంతృప్తికి, వ్యతిరేకతకు కారణమై జాతీయ భావం జనించేందుకు దోహదం చేసింది.

**8.13. నమూనా ప్రశ్నలు:**

1. భారతదేశంలో చిన్న కుటీర పరిశ్రమలు ఏవిధంగా క్షీణించాయో వివరించండి?
2. భారతదేశంలో చిన్న కుటీర పరిశ్రమలు క్షీణతకు కారణాలు వివరించండి?

**8.14. ఆధార గ్రంథాలు:**


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.
2. Bipin Chandra - Essays on Colonialism.
3. R.P. Dutt - India Today
4. D.R. Gadgil - The Industrial Evolution of India (1860-1939)
5. Sumit Sarkar - Modern Indian Economic History
6. Sabyasachi Bhattachrya - Essays of Modern Indian Economic History
7. Aladi Valdehi - History of Freedom Movement in India
8. KK Datta - A Social History of Modern India
9. తెలుగు అకాడమీ ప్రచురణ - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


**– డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

పాఠం - 9

# రవాణా మరియు సమాచార వ్యవస్థ

## 9.0. లక్ష్యము:

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులలో ఆంగ్లేయులు అధికారాన్ని స్థాపించిన తర్వాత దేశంలో వారు అభివృద్ధి చేసిన రవాణా మరియు సమాచార వ్యవస్థలను గురించి తెలుసుకోగలుగుతారు.

**విషయక్రమము:**


9.1. పరిచయము

9.2. రవాణా వ్యవస్థ

9.2.1. రహదార్లు, మోటార్ రవాణా

9.2.2. మోటార్ వాహనాల చట్టం-1939

9.2.3. నిబంధనలు

9.2.4. భారతదేశంపై ప్రభావం

9.3. సమాచార వ్యవస్థ

9.3.1. తపాలా వ్యవస్థ

9.3.2. టెలికమ్యూనికేషన్స్

9.3.3. రేడియో

9.4. రైల్వేలు

9.4.1. రైల్వేల అభివృద్ధిలో ఆంగ్లేయుల లక్ష్యాలు

9.4.2. రైల్వేల నిర్వహణ

9.4.3. అక్వర్త్ సంఘం

9.4.4. రైల్వేల ప్రభావం

9.5. సమీక్ష

9.6. నమూనా ప్రశ్నలు

9.7. ఆధార గ్రంథాలు


## 9.1. పరిచయము:

భారతదేశానికి వ్యాపారం కోసం వచ్చిన ఐరోపా దేశాలకు చెందిన వారిమధ్య అధికారం కోసం పోటీ ఏర్పడి, చివరకు ఆంగ్లేయులది పై చేయి అయింది. క్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆంగ్లేయులు వ్యాపారం మీద

గుత్తాధిపత్యాన్ని సాధించారు. తర్వాత ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం సంభవించి యాంత్రిక పరిశ్రమలు ఏర్పడి ఉత్పత్తులు పెరిగాయి. వాటిని విక్రయించేందుకు భారతదేశం గొప్ప మార్కెట్ అని భావించిన ఆంగ్లేయులు తమ ఉత్పత్తులను భారత దేశానికి దిగుమతి చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు చేరవేయడం ప్రారంభించారు. రాను రాను తమ పాలన పట్ల అసంతృప్తి కలిగి ప్రజలలో వ్యతిరేకత వస్తుందని గ్రహించిన ఆంగ్ల పాలకులు తమ వస్తువులను చేరవేయడానికి, సైన్యం పోలీసులను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయడం ప్రారంభించారు. అంతేకాకుండా దేశంలో జరిగే విషయాలను త్వరితగతిన తెలుసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు వీలుగా సమాచార వ్యవస్థను కూడా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించారు.

## 9.2. రవాణా వ్యవస్థ:

భారతదేశంలో తమ వ్యాపారం వృద్ధి చెందాలన్నా, తమ అధికారం కలకాలం వర్ధిల్లాలన్నా రవాణా వ్యవస్థ బాగా వుండాలని భావించిన ఆంగ్లేయ ప్రభుత్వం అందుకు పూనుకుంది. రహదారి వ్యవస్థను అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నించింది.

### 9.2.1. రహదార్లు, మోటార్ రవాణా:

ఆంగ్లేయ ప్రభుత్వం తమ అవసరాల కోసం రైల్వేల విస్తరణతోబాటు, కంకర రోడ్ల విస్తరణ కూడా కొనసాగించింది. మారుమూల సుదూర గ్రామాలను రైల్వే లైన్లతో కలపడానికి, రహదారుల నిర్మాణం అనివార్యమైంది. రైల్వేలను ఏవిధంగా అయితే వీలైనంత త్వరితగతిన ఏర్పాటు చేసుకుందో వీటిపైన కూడా అంతే శ్రద్ధ ప్రభుత్వం కనబరచింది.

కాగా, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో మోటార్ రవాణా ఆవిర్భవించడంతో, రవాణా పరిస్థితిలో విప్లవాత్మక మార్పు రాసాగింది. మోటార్ రవాణా అభివృద్ధి, కావడం రహదారుల పైన తీవ్ర ప్రభావాన్ని కనబరిచింది. ప్రధానంగా మోటారు వాహనాల ఆవిర్భావం, వాడకం అనేవి ప్రభుత్వాలు రహదారుల అభివృద్ధి పట్ల దృష్టి సారించేందుకు దోహదం చేశాయి. దీనితో ప్రభుత్వాలు వెంటనే రహదార్ల పరిస్థితిపై దృష్టిని ప్రసరింపజేసింది. రహదార్ల నిర్మాణం, వాటి నిర్వహణలకోసం ప్రభుత్వాలు అధిక మొత్తాలను వ్యయం చేసేందుకు వీలు కల్పించింది. రహదారుల విస్తరణ కోసం ప్రభుత్వం నూతన పథకాలను అనుసరించడం ప్రారంభించింది.

ఇలాంటి స్థితిలో 1927వ సంవత్సరంలో భారతీయ రహదార్ల అభివృద్ధి సంఘం ఈ విషయాన్ని పరిశీలించి ప్రభుత్వానికి అనేక సూచనలను చేసింది. ప్రభుత్వం పెట్రోల్ పై ప్రత్యేక పన్నును విధించి, దీని నుండి వచ్చే ఆదాయం సమగ్ర రహదార్ల అభివృద్ధి పథకం అమలుకై రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిణీ చేయాలని సూచన చేసింది. ఈ సూచనను అనుసరించి ప్రభుత్వం 1929-30 ఆర్థిక సంవత్సరంలో రహదార్ల అభివృద్ధి నిధి ఏర్పాట చేసింది.

అయితే, ఈ నిధి ఏర్పాటు చేయబడకముందే, రహదార్ల అభివృద్ధి మీద రాష్ట్రాల వ్యయం బాగా పెరిగింది. 1929వ సంవత్సరంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం సమయంలో రహదార్ల నిర్మాణం వాటి నిర్వహణలపైన పెట్టె వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. భారతదేశంలో పురపాలకేతర కంకర రహదారులు 1930వ సంవత్సరం నుంచి 1939వ సంవత్సరం వరకు వున్న సమయంలో కేవలం నాలుగు వేల మైళ్ళ రహదారి నిర్మాణం జరగడం అందుకు ఉదాహరణ. 1930వ సంవత్సరంలో 60,000 మైళ్ల రహదారులు వుండగా అవి 1939వ సంవత్సరం నాటికి 64,000 మైళ్ల వరకు మాత్రమే పెరిగాయి.

### 9.2.2. మోటార్ వాహనాల చట్టం-1939:

ఆర్థిక మాంద్యం ఫలితంగా, మోటార్ రవాణా పెరుగుదల, క్రమబద్ధీకరణ సమస్య ప్రారంభం అయింది. రహదారులలో కొన్ని రైల్వే లైన్లకు సమాంతరంగా ఉండడంవల్ల ఈ సమస్య ఏర్పడింది. ఆర్థిక మాంద్యంవల్ల దెబ్బతిన్న తమ ఆదాయాలు, ఇలాంటి సమాంతర రహదారుల వల్ల మరింత అధికంగా దెబ్బతింటున్నట్లు రైల్వేలు ఆరోపించాయి. దీనికి తోడూ ప్రయాణీకుల భద్రత, చిన్న నిర్వాహకుల మధ్య తీవ్ర పోటీనివారణ వంటి వాటి వల్ల మోటార్ రవాణా క్రమబద్ధీకరణ ఆవశ్యకత ఏర్పడింది. దీనితో ప్రభుత్వం వీటిని అనేక విధాలుగా అధ్యయనం చేసి చివరకు 1939 వ సంవత్సరంలో మోటార్ వాహనాల చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం అనేక నిబంధనలు అమలులోకి వచ్చాయి.

### 9.2.3. నిబంధనలు:

1. ప్రమాదాలకు వ్యతిరేకంగా భీమా తప్పనిసరి.
2. రాష్ట్రప్రభుత్వాలు ప్రాంతీయ రవాణా సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వడమైంది.
3. ప్రయాణికులకు, వస్తువులను రవాణా చేసేందుకు పర్మిట్లను జారీ చేసే అధికారం ప్రాంతీయ రవాణా సంస్థలకు ఇవ్వబడింది.
4. ప్రయాణీకుల పర్మిట్లు ప్రత్యేక రూట్లకు ఇవ్వబడతాయి.
5. సామాను పర్మిట్లు ఒక ప్రాంతానికి మాత్రమే వర్తిస్తాయి.
6. పర్మిట్ దారుల కార్యక్రమాలను నియంత్రించేందుకు, పలు షరతులను విధించేందుకు ప్రాంతీయ రవాణా సంస్థలకు అధికారం ఇవ్వబడింది.

### 9.2.4. భారతదేశంపై ప్రభావం:

రహదారుల నిర్మాణం, మోటార్ రవాణా గ్రామీణార్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని కనబరిచింది. భారతీయ గ్రామీణ జీవితంపై, రైల్వేల కంటే రహదారుల ప్రభావం ప్రత్యక్షంగా పడింది. రహదారుల కారణంగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వారాంతం మార్కెట్లు మరియు స్థానిక సంతల ప్రాధాన్యత పెరిగింది. అదే సమయంలో రైల్వేలు, రహదారుల సహాయంతో ఆంగ్లేయులు మార్కెట్లు, సంతలలో విదేశీ వస్తువుల పంపిణీ, విక్రయంలను సులభంగా అభివృద్ధి చేసుకునే వీలు కలిగింది. ఫలితంగా గ్రామాలు స్వయంసమృద్ధాన్ని క్రమంగా కోల్పోసాగాయి. దీనికి తోడు వ్యవసాయంలో కూడా మార్పులు చోటు చేసుకోవడం ప్రారంభం అయింది. ముఖ్యంగా వీటన్నింటి ఫలితంగా మార్కెట్లో డిమాండ్, ధరలను అనుసరించి పంటలను పండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా రహదారుల విస్తరణ అనేది భారతదేశం పై తీవ్ర ప్రభావాన్ని కనబరిచింది.

## 9.3. సమాచార వ్యవస్థ:

భారతదేశంలో తమ అధికారం కలకాలం వర్ధిల్లాలంటే దేశంలో జరుగుతున్నా విషయాలు ఎప్పటికప్పుడు తెలియాలని భావించడంతో పాటు ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు, చర్యలు క్రింది స్థాయి అధికారులకు ఉద్యోగులకు తెలియాలంటే సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండడం అవసరం అని భావించిన ఆంగ్లేయ ప్రభుత్వం సమాచార వ్యవస్థ ఏర్పాటు అభివృద్ధికి తీవ్రంగా కృషి చేసింది. ఇందులో భాగంగా తపాల, టెలిగ్రాఫ్, టెలిఫోన్ వ్యవస్థలతో పాటు రేడియో అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంది.

**9.3.1. తపాలా వ్యవస్థ:**

భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం 1764-1766 సంవత్సరాల మధ్య కాలంలో మొట్ట మొదటగా బొంబాయి, కలకత్తా, మద్రాసు నగరాల మధ్య తపాల వ్యవస్థను ఏర్పాటు చేసి పోస్టాఫీసులు ప్రారంభించింది. వారెన్ హేస్టింగ్స్ గవర్నర్‌గా వున్న సమయంలో ఆంగ్ల ప్రభుత్వం కేవలం ప్రభుత్వ అవసరాలకు మాత్రమే కాకుండా ప్రజలందరికీ కూడా తపాలా సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. 1830వ సంవత్సరం నాటికి తపాల సేవలు దేశవ్యాప్తంగా విస్తృతం కావడంతో వివిధ సర్కిళ్ళుగా తపాల వ్యవస్థను ఏర్పాటు చేసింది.

1839వ సంవత్సరంలో వాయువ్య తపాల సర్కిల్ ఏర్పాటు చేయబడింది. తర్వాత 1860వ సంవత్సరంలో పంజాబ్ సర్కిల్, 1861వ సంవత్సరంలో బర్మా సర్కిల్, 1866వ సంవత్సరంలో సెంట్రల్ సర్కిల్, 1869వ సంవత్సరంలో సింద్ సర్కిల్ ఏర్పాటు చేయబడ్డాయి. తరువాతి కాలంలో 1870వ సంవత్సరంలో అవధ్, 1871వ సంవత్సరంలో రాజ్ పుట్, 1873వ సంవత్సరంలో అస్సాం, 1877వ సంవత్సరంలో బీహార్ , 1878వ సంవత్సరంలో తూర్పు బెంగాల్ 1879వ సంవత్సరంలో మధ్య భారత తపాల సర్కిళ్ళు ఏర్పాటు చేయబడ్డాయి. 1914వ సంవత్సరం నాటికి భారతదేశంలో మొత్తం 13 తపాలా సర్కిళ్ళు ఏర్పాటు అయ్యాయి.

కాగా తపాలా బిళ్ళలు 1 జూలై 1852వ సంవత్సరంలో సింధ్ జిల్లాలో మొదలయ్యాయి. వీటిని ఈస్ట్ ఇండియా కంపెనీ ముద్రించేది. కానీ అమ్మేవారు కాదు. అన్ని తపాలా బిళ్ళలు కలకత్తాలో ముద్రించబడేవి. వీటన్నింటి పైనా విక్టోరియా మహారాణి బొమ్మ ముద్రింపబడేది.

**9.3.2. టెలికమ్యూనికేషన్స్:**

టెలికమ్యూనికేషన్స్ లో టెలిగ్రాఫ్ మరియు టెలిఫోన్ వ్యవస్థలు ప్రధానమైనవి. ఆంగ్ల ప్రభుత్వ పాలనా కాలంలో 1850వ సంవత్సరంలో డల్హౌసీ గవర్నర్ జనరల్‌గా వున్న సమయంలో మొదటిసారిగా లో, కలకత్తా మరియు డైమండ్ హార్బర్ మధ్య ప్రయోగాత్మకంగా విద్యుత్ టెలిగ్రాఫ్ లైన్ ప్రారంభింపబడింది. ఈ లైన్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఉపయోగం కోసం ప్రారంభింపబడింది. 1853వ సంవత్సరం నవంబర్ నెల నాటికి దేశంలో 4,000 మైళ్ల టెలిగ్రాఫ్ లైన్ల నిర్మాణం ప్రారంభమైంది. కలకత్తా, పెషావర్, సింధు, బొంబాయి, మద్రాస్, బెంగళూరు. ఉదక మండలం వంటి ప్రాంతాలను అనుసంధానం చేస్తూ టెలిగ్రాఫ్ లైన్లను ఏర్పాటు చేశారు. మొదట టెలిగ్రాఫ్ వ్యవస్థ పబ్లిక్ వర్క్స్ శాఖలో భాగంగా వుండేది. రాను రాను ఇది అభివృద్ధి చెందడంతో 1854వ సంవత్సరంలో ప్రత్యేక విభాగం ఏర్పాటుచేయబడింది. తర్వాత తంతి వ్యవస్థ తపాల శాఖలో విలీనం చేయబడింది.

భారతదేశంలో 1880వ సంవత్సర ప్రాంతం నుంచి టెలిఫోన్ సేవలు అమలులోనికి రావడం ప్రారంభమైంది. 1880వ సంవత్సరంలో ది ఓరియంటల్ టెలిఫోన్ కంపెనీ లిమిటెడ్ మరియు ది ఆంగ్లో-ఇండియన్ టెలిఫోన్ కంపెనీ లిమిటెడ్ అనే రెండు టెలిఫోన్ కంపెనీలు భారతదేశంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ని స్థాపించడానికి భారతదేశంలోని ఆంగ్లేయ ప్రభుత్వాన్ని సంప్రదించాయి. అయితే టెలిఫోన్ల ఏర్పాటు ప్రభుత్వ గుత్తాధిపత్యమని, ప్రభుత్వమే పనులు చేపడుతుందనే కారణంతో ప్రభుత్వం అనుమతిని ఇవ్వలేదు.

అయితే 1881వ సంవత్సరంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. కలకత్తా, బొంబాయి, మద్రాస్ మరియు అహ్మదాబాద్‌లలో టెలిఫోన్ ఎక్స్ఛేంజీలను ప్రారంభించేందుకు ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఓరియంటల్ టెలిఫోన్ కంపెనీ

లిమిటెడ్‌కు లైసెన్స్ మంజూరు చేసింది.

1882వ సంవత్సరంలో భారతదేశంలో మొట్టమొదటి అధికారిక టెలిఫోన్ సేవలు ప్రారంభం అయ్యాయి. 1882వ సంవత్సరం జనవరినెల 28 వ తేదిన భారత గవర్నర్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు మేజర్ ఇ.బారింగ్ కలకత్తా, బొంబాయి మరియు మద్రాసులలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లను ప్రారంభించినట్లు ప్రకటించారు. కలకత్తాలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కి "సెంట్రల్ ఎక్స్ఛేంజ్" అనే పేరు పెట్టబడింది. ప్రారంభ దశలో ఇందులో మొత్తం 93 మంది సభ్యులు ఉన్నారు. సంవత్సరం తరువాత బొంబాయిలో కూడా ఒక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రారంభింప బడింది. తర్వాత మద్రాస్, అహమ్మదాబాద్ లతో పాటు దేశంలోని ప్రధాన నగరాలలో క్రమంగా టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు ప్రారంభింపబడి టెలిఫోన్ సేవలు అమలులోకి వచ్చాయి.

1913-1914వ సంవత్సరంలలో మొదటి ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ సిమ్లాలో స్థాపించబడింది. 1933వ సంవత్సరంలో ఇంగ్లాండ్ మరియు భారతదేశం మధ్య రేడియో టెలిఫోన్ వ్యవస్థ ప్రారంభింపబడింది.

### 9.3.3. రేడియో:

భారతదేశంలో మొదటి రేడియో ప్రసారాలు 1923వ సంవత్సరం జూన్ నెలలో "రేడియో క్లబ్ ఆఫ్ బొంబాయి" ద్వారా ప్రసారం చేయబడ్డాయి. దీని తరువాత 'బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ' ఏర్పాటు చెయ్యబడింది. ప్రయోగాత్మకంగా జూలై 1927వ సంవత్సరంలో కలకత్తా, బొంబాయి నగరాలలో 'ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ' ప్రసారాలు చేసింది. అయితే 1930వ సంవత్సరం నాటికి ప్రసార బాధ్యత ప్రభుత్వం స్వీకరించింది. దీనితో ఇండియన్ బ్రాడ్ కాస్టింగు కంపెనీ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రసారాలు చేయడం ప్రారంభించింది. 1936వ సంవత్సరములో రేడియో ప్రసార వ్యవస్థ పూర్తి ప్రభుత్వ సంస్థగా అవతరించింది. అంతక పూర్వము ప్రైవేటు రేడియో క్లబ్బులు ఉండేవి. 1937వ సంవత్సరంలో దీనికి "ఆల్ ఇండియా రేడియో" గా పేరు పెట్టారు.

## 9.4. రైల్వేలు:

ఇంగ్లాండు దేశంలో తొలి రైళ్లు ప్రవేశపెట్టబడ్డ కొద్ది సంవత్సరాలకే, 1831-32 సంవత్సరాలలో భారతదేశంలో రైల్వేల నిర్మాణ ప్రతిపాదన మొదటిసారిగా ముందుకొచ్చింది. మైదానాలు, తక్కువ ఖర్చు, భూమి చౌకగా ఉండడం, కూలీలు తక్కువ వేతనాలకు లభించడం, నిర్మాణ సామాగ్రి లభ్యానికి గల సౌకర్యాలు వంటి వసతులు భారతదేశంలో రైలు మార్గాలను ప్రవేశపెట్టేందుకు దోహదం చేశాయని చెప్పవచ్చు.

భారతదేశంలో రైలు మార్గాల కొరకు మొదటిసారిగా 1832వ సంవత్సరంలో ప్రణాళిక ప్రవేశపెట్ట బడినప్పటికీ, ఆ తరువాత మరో దశాబ్దం వరకూ ఎటువంటి పురోగతి సాధించలేదు. 1837వ సంవత్సరం లో రెడ్ హిల్స్ నుండి చింతప్రేట్ వంతెన వరకు నడిచింది. దీనిని 'రెడ్ హిల్ రైల్వే' అని పిలుస్తారు. విల్లియం అవేరీచే తయారు చేయబడిన రోటరీ స్టీమ్ లోకోమోటివ్‌ను ఉపయోగించారు. ఈ రైల్వే సర్ ఆర్థర్ కాటన్‌చే నిర్మింపబడింది. ప్రధానంగా మద్రాసులో రహదారి నిర్మాణ పనుల కొరకు గ్రానైట్ రాళ్ళను రవాణా చేయడానికి ఉపయోగించబడింది. 1844వ సంవత్సరం లో గవర్నర్ జనరల్ హార్డింజ్ రైల్వే వ్యవస్థను నెలకొల్పేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతి ఇచ్చాడు. రెండు కొత్త రైల్వే కంపెనీలను స్థాపించి, వాటికి సహాయపడవలసిందిగా ఈస్ట్ ఇండియా కంపెనీని అదేశించాడు. ఇంగ్లండులోని పెట్టుబడిదారుల ఆసక్తి కారణంగా తరువాతి కొద్ది సంవత్సరాలలో రైల్వే వ్యవస్థ త్వరితగతిన ఏర్పడింది.

1849వ సంవత్సరం ఆగష్టు నెలలో ఈస్టిండియా కంపెనీ, ఈస్టిండియా రైల్వేలు, గ్రేట్ ఇండియా పెనిన్సులర్ రైల్వే కంపెనీల మధ్య భారతదేశంలో రైల్వే నిర్మాణ విషయమై ఒప్పందం కుదిరి సంతకాలయ్యాయి. అనంతరం 1850వ సంవత్సరంలో నిర్మాణం పని మొదలై బొంబాయి నుండి థాణా వరకు తయారైన ప్రథమ ప్రయోగాత్మక రైలుమార్గం 1853వ సంవత్సరంలో ప్రారంభింపబడింది. 1853వ సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన మొదటి ప్రయాణీకుల రైలు బొంబాయి, థాణేల మధ్య నడుపబడింది. ఈ ప్రయాణం మొత్తం దూరం 34 కి.మీ. కాగా, సాహిబ్, సుల్తాన్, సింధ్ అనే ఇంజిన్లను వినియోగించారు. ఒక విధంగా ఈ సంఘటన భారత రైల్వేలకు అంకురార్పణ చేసిందని చెప్పవచ్చు.

**9.4.1. రైల్వేల అభివృద్ధిలో ఆంగ్లేయుల లక్ష్యాలు:**

జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో రైల్వేలు పారిశ్రామికాభివృద్ధి కొరకు ప్రవేశపెట్టబడ్డాయి. అయితే భారతదేశంలో మాత్రం, ప్రధానంగా ఆంగ్లేయ పాలకుల రాజకీయ, వాణిజ్య లక్ష్యాల సాధన కోసం రైల్వే నిర్మాణం చేపట్టబడిందని చెప్పవచ్చు. సైనికులు, వారి ఆయుధాలు, సామాగ్రి వంటి వాటిని సుదూర ప్రాంతాలకు చేరవేయటంలో రైల్వేల తోడ్పాటు వల్ల రాజకీయంగా భారతదేశంపై ఆంగ్లేయ అధికార పటిష్టత వీలైంది. భారతదేశం నుండి ఇంగ్లాండ్ దేశానికి అవసరమైన ప్రత్తి, ఆహార పదార్థాల వంటి ముడి సరుకుల ఎగుమతులు, ఇంగ్లాండ్‌లో తయారై భారతదేశానికి దిగుమతయ్యే నూలు, ఉన్ని యంత్రసామాగ్రిని భారతదేశంలోని అన్ని ప్రాతాలకు చేరవేయడానికి రైల్వే వ్యవస్థ ఎంతో దోహదం చేయడంవల్ల వాణిజ్య పరంగా లాభాలు గడించేందుకు వీలు కలిగింది. పంపిణీ, రైల్వేల ద్వారా గొప్పగా పెంపొందించడానికి వీలైంది. వీటి కోసమే ఆంగ్ల ప్రభుత్వం భారతదేశంలో రైల్వే వ్యవస్థను ఏర్పాటు చేసింది కాని భారతదేశంలో ప్రజా క్షేమాన్ని కాంక్షించలేదు. ఒకవేళ ప్రజా క్షేమాన్ని కాంక్షించి వుంటే ఆర్యులు నుండి మొగల్ వరకు వున్న ప్రభుత్వాలన్నీ చేసినట్లుగా వ్యవసాయాభివృద్ధికి తోడ్పతే నీటిపారుదల సౌకర్యాల పెంపుదలకు ప్రధానంగా ఆంగ్లేయ ప్రభుత్వం పాటుపడి ఉండేదని చెప్పవచ్చు. ఆంగ్లేయ ప్రభుత్వం 1900వ సంవత్సరంల వరకు రైల్వేల మీద 22,50,000 పౌండ్ల ధనాన్ని ఖర్చు పెట్టి, సేద్యపు నీటి పన్నుల మీద కేవలం 2,50,000 పౌండ్ల ధనాన్ని మాత్రమే వ్యయం చేయడం అందుకు తార్కాణం. వీటన్నింటిని బట్టి భారతదేశంలో రైల్వేల అభివృద్ధిలో ప్రధానంగా అధికారాన్ని పటిష్టం చేసుకోవడం, వాణిజ్యపరంగా లాభాలను పొందడమే లక్ష్యాలుగా కనిపిస్తాయి.

**9.4.2. రైల్వేల నిర్వహణ:**

1869వ సంవత్సరం వరకు రైల్వేల నిర్మాణం ప్రైవేట్ కంపెనీలకు అప్పగించింది. రైల్వేపై పెట్టే పెట్టుబడి సొమ్ము మీద 5% వడ్డీ గ్యారంటీ ఇవ్వడమైంది. ఇలాంటి 5% పై బడి వచ్చిన లాభాలను, కంపెనీలు, ప్రభుత్వం సమంగా పంచుకుంటాయి. ఇలాంటి రైలు మార్గాలను 25 లేదా 50 సంవత్సరాల అనంతరం కొనుగోలు చేసే హక్కును ప్రభుత్వం ఉంచుకుంది. ఈ విధానం వల్ల నష్టాలు ఎదురయ్యాయి. ప్రతి సంవత్సరం, వడ్డీ గ్యారంటీ క్రింద ప్రభుత్వం కంపెనీలకు పెద్ద మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చింది. గ్యారంటి కారణంగా, రైల్వేల నిర్వహణలో కంపెనీలు పొదుపుగా ఉండాల్సిన అవసరం లేకుండా పోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో 1869వ సంవత్సరంలో రైల్వే వ్యవస్థను ప్రభుత్వమే చేపట్టింది1879వ సంవత్సరం వరకు ప్రభుత్వమే రైల్వేల నిర్మాణాన్ని చేపట్టింది. అయితే, 1879వ సంవత్సరం నుండి ప్రైవేట్ కంపెనీలు మళ్లీ రంగ ప్రవేశాన్ని చేశాయి. ఈ నూతన కంపెనీలకు వడ్డీ గ్యారంటీ ఇవ్వలేదు. అయితే, వీటికి కావాల్సిన ధన సహాయాన్ని చేస్తూ, ప్రభుత్వం వీటికి భూమిని కూడా ఉచితంగా ఇచ్చింది. ఈ కంపెనీలతోపాటు, ప్రభుత్వం, దేశీయ రాష్ట్రాలు, రైల్వేల నిర్మాణాన్ని చేపట్టడంతో

భారతదేశంలో రైల్వేల విస్తరణ బాగా జరిగింది.

ఆంగ్లేయ పాలకులు దేశంలోని పెద్ద నగరాలను, కలకత్తా, బొంబాయి, మద్రాస్ లాంటి పెద్ద రేవు పట్టణాలతో, ట్రంక్ మార్గాల ద్వారా కలిపారు. దీనికి తోడు, ఈ మార్గాలు, పత్తి వంటి ఎగుమతయ్యే వ్యావసాయిక పంటలను ఎక్కువగా పండించే ప్రదేశాలను కలుపుకుంటూ వెళ్లాయి. అంటే, స్వదేశీ పరిశ్రమలు, వాణిజ్యావసరాల కోసం కాకుండా కేవలం ఆంగ్లేయ పరిశ్రమల, వ్యాపారుల, పెట్టుబడిదార్ల ప్రయోజనాలకై, భారతీయ రైలు మార్గాల నిర్మాణం జరిగినట్లుగా స్పష్టం అవుతుంది. అందువల్ల రాను రాను రైల్వేలు అనేక సమస్యలను, నష్టాలను ఎదుర్కొనాల్సి వచ్చింది. ప్రధానంగా మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి.

**9.4.3. అక్వర్త్ సంఘం:**

ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ రైల్వేల నిర్వహణ, పనితీరులో ఏర్పడ్డ ఇబ్బందులు, సమస్యల పరిష్కారం కోసం భారత రాజ్య కార్యదర్శి 1920వ సంవత్సరంలో అక్వర్త్ సంఘం ఏర్పాటు చేశాడు. ఈ సంఘం 1921వ సంవత్సరంలో నివేదికను సమర్పించి కొన్ని సూచనలు చేసింది.

**సూచనలు:**

1. సాధారణ బడ్జెట్ నుండి రైల్వే బడ్జెట్‌ను వేరు చేయడం,
2. రైల్వేల చీఫ్ కమిషనర్ నియామకం,
3. రైల్వే బోర్డ్ ఏర్పాటు, విధుల్లో మార్పులు,
4. రేట్స్ బ్యూనల్, రైల్వే సలహా మండళ్ల ఏర్పాటు.

అక్వర్త్ సంఘ సూచనలు అమోదించబడడంతో పాటు ప్రభుత్వం రైల్వేలపై ప్రభుత్వ యాజమాన్యానికి మొగ్గు చూపింది. దీనితో రైల్వే విస్తరణ వేగవంతం అయింది. 1924–1932 సంవత్సరాల మధ్య 5,300 మైళ్ల నూతన రైలు మార్గాల నిర్మాణం జరిగింది. అయితే, ఆర్థిక మాంద్యం ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో రైల్వే విస్తరణకు అంతరాయ మేర్పడింది.

**9.4.4. రైల్వేల ప్రభావం:**

రైల్వేల ప్రభావం, రాజకీయ, పాలన, సామాజిక, ఆర్థిక రంగాలపై తీవ్రంగా వుంది. దేశ వివిధ భాగాలను, మారుమూల ప్రాంతాలను, పల్లెలను రైల్వేలు కలపడంతో, రాజకీయ, పాలనా ఐక్యతలు, పటిష్టత ఏర్పడ్డాయి. భారతదేశంలో ఆంగ్లేయ అధికారానికి మూల స్తంభాలైన సైన్యం సివిల్ పాలనా సమర్థత, శక్తి పెంపొందాయి.

ఆర్థికంగా పరిశీలిస్తే రైల్వేలు ఆధునిక పారిశ్రామికాభివృద్ధికి మార్గాన్ని ఏర్పర్చాయి. కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నా, బొగ్గు, నూలు ఉన్ని మిల్లులు, పంచదార, తోలు పరిశ్రమలు వంటి కర్మాగారాలు అభివృద్ధి చెందాయి. అయితే ఈ అభివృద్ధి భారతీయుల కంటే, ఆంగ్లేయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదార్లకు ప్రయోజనాన్ని కలిగించింది. ఆర్థిక రంగంలో పరిశ్రమలతో పాటు వ్యాపారం అభివృద్ధి చెందింది. దేశీయ, విదేశీయ వ్యాపారాలకు ప్రోత్సాహం లభించింది. వ్యావసాయక ముడిసరుకుల ఉత్పత్తి ఎగుమతి, అధికమైంది.

రైల్వేల వల్ల ఆధునిక సమాజావతరణకు అంకురార్పణ జరిగింది. సాంప్రదాయకత, మూఢత్వం, కులతత్వం

వంటివి తొలగిపోవడం ప్రారంభం అయింది. ఛేదించబడి, బీటలు పారసాగాయి. దూర ప్రయాణాలు సులభమై, భిన్న ప్రాంతాల ప్రజల మధ్య సామాజిక సంబంధాలు పెరిగి, వారి భావాలు, అలవాట్లు, ఆలోచనల మధ్య అవగాహన ఏర్పడడంతో పాటు జాతీయ ఐక్యతకు దోహదం చేశాయి.

## 9.5. సమీక్ష:

ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం సంభవించి యాంత్రిక పరిశ్రమలు ఏర్పడి ఉత్పత్తులు పెరిగాయి. వాటిని విక్రయించేందుకు భారతదేశం గొప్ప మార్కెట్ అని భావించిన ఆంగ్లేయులు తమ ఉత్పత్తులను భారత దేశానికి దిగుమతి చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు చేరవేయడం ప్రారంభించారు. రాను రాను తమ పాలన పట్ల అసంతృప్తి కలిగి ప్రజలలో వ్యతిరేకత వస్తుందని గ్రహించిన ఆంగ్ల పాలకులు తమ వస్తువులను చేరవేయడానికి, సైన్యం పోలీసులను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయడం ప్రారంభించి రహదారులు, రైల్వే లను అభివృద్ధి చేశారు. అంతేకాకుండా దేశంలో జరిగే విషయాలను త్వరితగతిన తెలుసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు వీలుగా సమాచార వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రయత్నించి టెలిగ్రాఫ్, టెలిఫోన్, తపాల వ్యవస్థలతో పాటు రేడియో ను కూడా ఏర్పాటు చేశారు.

## 9.6. నమూనా ప్రశ్నలు:

1. భారతదేశంలో ఆంగ్ల పాలనా కాలంలో జరిగిన రహదారులు, కమ్యూనికేషన్ వ్యవస్థల అభివృద్ధిని వివరించండి?
2. భారతదేశంలో రైల్వేల అభివృద్ధిని వివరించండి?

## 9.7. ఆధార గ్రంథాలు:


| | |
|---|---|
| 1. Bipin Chandra | - Nationalism and Colonialism in Modern India. |
| 2. Bipin Chandra | - Essays on Colonialism. |
| 3. R.P. Dutt | - India Today. |
| 4. D.R. Gadgil | - The Industrial Evolution of India (1860-1939). |
| 5. Sumit Sarkar | - Modern Indian Economic History. |
| 6. Sabyasachi Bhattachrya | - Essays of Modern Indian Economic History. |
| 7. Aladi Valdehi | - History of Freedom Movement in India. |
| 8. KK Datta | - A Social History of Modern India. |
| 9. తెలుగు అకాడమీ ప్రచురణ | - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర. |


- డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

## పాఠం - 10

# భారతదేశంలో విదేశీ పెట్టుబడులు

### 10.0. లక్ష్యము:

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులలో ఆంగ్లేయులు అధికారాన్ని స్థాపించిన తర్వాత వారు పరిశ్రమల స్థాపనకు అనుసరించిన విధానం ఫలితంగా భారతదేశ పరిశ్రమలలో విదేశీ పెట్టుబడులను గురించి తెలుసుకోగలుగుతారు.

### విషయక్రమము:


**10.1.** పరిచయము

**10.2.** పరిశ్రమల పట్ల భారతీయుల అనాసక్తి

**10.3.** భారతదేశంలో విదేశీ పెట్టుబడుల వృద్ధికి కారణాలు

**10.4.** భారతదేశంలో వివిధ పరిశ్రమలు-విదేశీ పెట్టుబడులు

- **10.4.1.** రైల్వేలు
- **10.4.2.** నీటిపారుదల
- **10.4.3.** బ్యాంకింగ్ వ్యవస్థ
- **10.4.4.** తోటల పరిశ్రమ
- **10.4.5.** బొగ్గు గనుల పరిశ్రమ
- **10.4.6.** జనపనార పరిశ్రమ
- **10.4.7.** ఇనుము, ఉక్కు పరిశ్రమ
- **10.4.8.** పంచదార పరిశ్రమ
- **10.4.9.** కాగితం పరిశ్రమ
- **10.4.10.** చర్మ పరిశ్రమ
- **10.4.11.** అగ్గిపెట్టెల తయారీ పరిశ్రమ
- **10.4.12.** ఇతర పరిశ్రమలు

**10.5.** విదేశీ పెట్టుబడుల ప్రభావం

**10.6.** సమీక్ష

**10.7.** నమూనా ప్రశ్నలు

**10.8.** ఆధార గ్రంథాలు


### 10.1. పరిచయము:

వివిధ ప్రాంతాలలో వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకుని భారతదేశంలోని ఉత్పత్తులను కొనుగోలు చేసి తమ

తమ దేశాలకు ఎగుమతి చేయడం ప్రారంభించారు. వారి మధ్య ఏర్పడిన పోటీ, ఆంగ్లేయులు, ఫ్రెంచి వారు స్థానిక రాజకీయాలలో జోక్యం చేసుకోవడం, వారిమధ్య అధికారం కోసం పోటీ ఏర్పడి, చివరకు ఆంగ్లేయులది పైచేయి అయింది. క్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆంగ్లేయులు వ్యాపారం మీద గుత్తాధిపత్యాన్ని సాధించారు. తర్వాత ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం సంభవించి యాంత్రిక పరిశ్రమలు ఏర్పడి ఉత్పత్తులు పెరిగాయి. వాటిని విక్రయించేందుకు భారతదేశం గొప్ప మార్కెట్ అని భావించిన ఆంగ్లేయులు తమ మార్కెట్ కోసం భారతీయ కుటీర, చిన్న పరిశ్రమలను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేసి విజయం సాధించింది. ఇలాంటి స్థితిలో గతంలో వ్యాపారం, అంతర్జాతీయ వాణిజ్యం ద్వారా లాభాలను ఆర్జించి సంపన్నులైన కొందరు భారతీయులు భారతదేశంలో ఆధునిక యాంత్రిక పరిశ్రమలను స్థాపించడం ప్రారంభించారు. దీనిని గమనించిన కొందరు విదేశీయులు ప్రధానంగా ఇంగ్లాండ్ దేశానికి చెందిన వారితో పాటు ఇతరదేశాల వారు భారతదేశంలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసి అక్కడ లభించే ముడిపదార్థాలను ఉపయోగించి ఉత్పత్తులను సాధించి అధికలాభాలు పొందవచ్చు అని భావించారు. దీనితో విదేశీయులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. దీనితో భారతదేశంలో విదేశీ పెట్టుబడులు ప్రారంభమయ్యాయి. అవి క్రమంగా వృద్ధి చెందాయి.

## 10.2. పరిశ్రమల పట్ల భారతీయుల అనాసక్తి:

దీనికి తోడు భారతదేశంలో ఆంగ్లేయులు పరిపాలన ప్రారంభం అయ్యాక ధనవంతులైన మహమ్మదీయ ప్రభు వర్గీయులు తమ ధనాన్ని చాలా వరకు కోల్పోయారు. కాని వర్తకులు తమ తమ వ్యాపారాలను యధావిధిగా కొనసాగించారు. ఈస్టిండియా కంపెనీ తొలి రోజులలో రాజకీయ ఒడుదుడుకుల కారణంగా ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. కాని 1770వ సంవత్సరం తర్వాత స్థానిక వ్యాపారులు వాణిజ్య విషయాలలో ఎక్కువ ఆసక్తి చూపారు. కానీ పరిశ్రమల స్థాపన, నిర్వహణ పట్ల శ్రద్ధ కనబరచలేదు. యాంత్రిక పద్ధతిలో తయారైన ఉత్పత్తులు అధికమగుటచేత స్వదేశీ పెట్టుబడి తగ్గుముఖం పట్టింది. ఈ శతాబ్దారంభంలో నమోదైన జాయింట్ స్టాక్ కంపెనీలలో స్వదేశీ పెట్టుబడి 37 కోట్ల రూపాయలకు మించి వుండిందని అంచనా.

## 10.3. భారతదేశంలో విదేశీ పెట్టుబడుల వృద్ధికి కారణాలు:

19వ శతాబ్దంలో ఆంగ్లేయులు తమ పెట్టుబడికి భారతదేశం అనువైన ప్రాంతమని భావించారు. అందుకు అనేక కారణాలు దోహదం చేశాయి.

1. విదేశీయులు భారతదేశంలో తమ పెట్టుబడికి అమిత లాభాలు పొందవచ్చునని భావించడం.
2. తమ దేశంతో పోలిస్తే భారతదేశంలో కార్మికులు తక్కువ వేతనాలకు లభించడం.
3. ముడి సరుకులు గూడ సులభంగా దేశంలోనే లభ్యం అవ్వడం.
4. ముడిసరుకులు సరసమైన ధరకు లభించడం.
5. ఉత్పత్తులకు దేశంలోగాని ప్రక్క దేశాలలో గాని సులభంగా మార్కెట్లు లభించడం.
6. భారతదేశంలోని వలస పాలన విదేశీ పెట్టుబడిదారులకు సహాయం చేయడంతో పాటు ప్రోత్సహించడం.

ఈ కారణాలన్నీ విదేశీయులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి దోహదం చేశాయి. దీనితో వివిధ

పరిశ్రమలలో విదేశీయులు పెట్టుబడి పెట్టారు. ప్రధానంగా రైల్వేలు నీటి పారుదలా ప్రాజెక్ట్‌లు, తోటల పెంపకం, వివిధ కర్మాగారాల స్థాపన, గనులు వంటి రంగాలలో విదేశీయులు పెట్టుబడులు పెట్టారు.

## 10.4. భారతదేశంలో వివిధ పరిశ్రమలు–విదేశీ పెట్టుబడులు:

ఇంగ్లాండ్ దేశంలో జరిగిన పారిశ్రామిక విప్లవం వల్ల తమ దేశంలో ఉత్పత్తి అయిన వస్తువులను అమ్ముకునేందుకు ఆంగ్లేయులు తమపాలనలో వున్న భారతదేశం మంచి మార్కెట్ అని భావించారు. అయితే అప్పటికే భారతదేశంలో వున్న చిన్న కుటీర పరిశ్రమలను నాశనం చేసేందుకు వివిధ మార్గాలను అనుసరించారు. చిన్న కుటీర పరిశ్రమలు నాశనం కావడంతో అప్పటికే అంతర్జాతీయ వాణిజ్యం చేసి సంపాదించిన కొందరు భారతీయులు ఆధునిక యాంత్రిక పరిశ్రమల స్థాపనకు నడుం బిగించారు. ఈ సమయంలో భారతదేశంలో ఆధునిక పరిశ్రమల స్థాపన ప్రారంభం అయ్యాక విదేశీయులు వివిధ పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచారు.

### 10.4.1. రైల్వేలు:

భారతదేశంలో సత్వర సైన్య సమీకరణ కోసం, ప్రభుత్వ తిరుగుబాట్లను వెంటనే అణచివేసేందుకు, సమర్థవంతమైన యుద్ధ నిర్వహణకు, భారతదేశంలో సామ్రాజ్య రక్షణకు రైల్వేల నిర్మాణం అవసరం అని 1848వ సంవత్సరంలో గవర్నర్ జనరల్ హార్డింజ్ ఇంగ్లాండ్ ప్రభుత్వానికి నివేదిక అందజేశాడు. తర్వాత వచ్చిన గవర్నర్ జనరల్ డల్హౌసీ భారతదేశంలో రైల్వే వ్యవస్థకు శ్రీకారం చుట్టాడు. డల్హౌసీ ఇంగ్లాండ్ నుంచి దిగుమతి అయిన ఇంగ్లాండ్ వస్తువులను భారతీయ మార్కెట్లలోకి విస్తారంగా సరఫరా చేయడానికి, భారతీయ ముడిపదార్థాలను ఎగుమతి చేయడానికి సాధనంగా రైల్వే వ్యవస్థను తయారు చేసేందుకు కృషి చేశాడు. కనుక మొదట ఆంగ్ల ప్రభుత్వ పెట్టుబడితో రైల్వే వ్యవస్థ ప్రారంభించినా ప్రైవేటు రంగంలోనే నడిచింది. అంతేకాకుండా రైల్వేలలో పెట్టే పెట్టుబడికి ప్రభుత్వం 5 శాతం వడ్డీ గ్యారంటీ ఇవ్వడంతో, విదేశీ పెట్టుబడిదారులు ముఖ్యంగా ఆంగ్ల పెట్టుబడిదారులు తమ మిగులు ధనాన్ని భారతదేశంలోని రైల్వేలలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపారు.

### 10.4.2. నీటిపారుదల:

విదేశీ పెట్టుబడిని ఆకర్షించిన మరొక రంగం – నీటివనరులు, ప్రాజెక్టులు మొదలైనవి. ఎగుమతులపై పంటలు పండించు ప్రాంతాలకు మాత్రమే పరిమితమై యుండుట గమనించతగ్గది. రైల్వేలు గాని, నీటి ఆంగ్లేయుల అధీనంలో కొనసాగాయి. అందువల్ల విదేశీయులు ప్రధానంగా ఆంగ్లేయులు ఇందులో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు.

### 10.4.3. బ్యాంకింగ్ వ్యవస్థ:

భారతదేశంలోని విదేశీ పెట్టుబడులలో బ్యాంకింగ్ రంగం కూడా ప్రధానమైంది. ఐరోపా పెట్టుబడి, ముఖ్యంగా ఇంగ్లాడ్ దేశ పెట్టుబడి మరియు ఇంగ్లాండ్ దేశ ప్రభుత్వ సహాయంతో మొట్టమొదట భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ ప్రారంభింపబడింది. ఇంగ్లాండ్ పెట్టుబడితో భారతదేశంలో భారత దేశంలోని ప్రెసిడెన్సీ బ్యాంకులు స్థాపింప బడ్డాయి. ఈ బ్యాంకులు ప్రభుత్వ కార్యాకలాపాలపై గుత్తాధికారాన్ని పొందాయి. అయితే, 1868వ సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో కొన్ని నిబంధనలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ నిబంధనల ప్రకారం విదేశీ మారకద్రవ్య విషయంలో స్వంతంగా వ్యవహరించేందుకు, ఆరు నెలలకు పైబడి ధనం అప్పుగా ఇవ్వటానికి, స్థిరాస్తిపై ధరావత్తును స్వీకరించేందుకు ఈ బ్యాంకులకు అధికారం లేదు. దీనితో స్వదేశీయులు ఎవరూ బ్యాంకుల స్థాపనకు ముందుకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. తర్వాతి

కాలంలో కొన్ని ఎక్స్ఛేంజి బ్యాంకులు ప్రారంభం అయినా అవి కూడా విదేశీ బ్యాంకుల శాఖలుగా ఉండడం వల్ల అందులో కూడా విదేశీ పెట్టుబడులే ఉండేవి. అయితే 1900వ సంవత్సరం నాటికి భారతదేశంలో కొన్ని దేశీయ బ్యాంకులు ప్రారంభమయ్యాయి. అంతవరకూ పూర్తిగా బ్యాంకింగ్ వ్యవస్థ విదేశీ పెట్టుబడులతోనే సాగింది.

**10.4.4. తోటల పరిశ్రమ:**

19వ శతాబ్దారంభం నుంచి తేయాకు భారతదేశపు ప్రధాన తోటల పరిశ్రమైంది. బెంటింక్ ఆధ్వర్యంలో 1935 సంవత్సరంలో ప్రభుత్వం ఒక ప్రయోగాత్మక క్షేత్రాన్ని స్థాపించడం ద్వారా ఇందులో ప్రభుత్వ పెట్టుబడి ప్రారంభం అయింది. 1852వ సంవత్సరంలో మొట్టమొదటి తేయాకు తోట ప్రభుత్వేతర రంగంలో స్థాపించబడింది. ఇది విదేశీ పెట్టుబడితో ప్రారంభం అయింది. అనంతరం అనేకమంది విదేశీ పెట్టుబడిదారులు ఈ రంగంలో ప్రవేశించిన కారణంగా తేయాకు తోటలు విశేషంగా పెరిగాయి. శతాబ్దాంతానికి తేయాకు పరిశ్రమ బహుళంగా విస్తరించి భారతదేశ తేయాకు, చైనా దేశాన్నుండి అంతవరకు దిగుమతి చేసుకొన్న తేయాకు కంటే శ్రేష్ఠమైనదనే పేరు గడించింది.

కాఫీ మొక్కలు మొదటిసారిగా 16వ శతాబ్దంలో భారతదేశంలో ప్రవేశపెట్టబడినా కాఫీ తోటల పెంపకం భారతదేశంలో 1830వ సంవత్సరం తర్వాత మాత్రమే విస్తృతమైంది. మైసూర్, కూర్గ్, తిరువాన్కూర్, వైనాడ్, నీలగిరి మొదలైన ప్రాంతాలలో ఆంగ్ల పెట్టుబడితో తోటల పెంపకం జరిగింది.

నీలిమందు తోటల పెంపకం చాలా కాలం క్రితంనుంచి భారత దేశంలో సాగుతూ వున్నా ఆంగ్లేయులు భారత దేశానికి వచ్చిన తర్వాత ఈస్టిండియా కంపెనీ ఈ వాణిజ్యంలో ఎక్కువ శ్రద్ధ చూపడం వల్ల అధికమైంది. కంపెనీ ప్రభుత్వం పశ్చిమ ఇండియాదీవులలోని ఆంగ్ల వ్యాపారులను ప్రోత్సహించి, వారి ద్వారా పెట్టుబడులు పెట్టించి బెంగాల్ లో నీలిమందు తోటల పెంపకాన్ని అభివృద్ధి పరచింది. 1850వ సంవత్సరం వరకు నీలిమందు విపరీతంగా ఉత్పత్తి చేయబడింది. ఐరోపా భూస్వాములు రైతులకు ఋణాలనిచ్చి వారి భూములలో కొంతభాగం తప్పనిసరిగా నీలిమందును పండించి, ఆంగ్ల వర్తకులకు ఇవ్వాలనే నిబంధన విధించబడింది. ఇందులో కూడా విశేషంగా విదేశీయులు పెట్టుబడులు పెట్టడం విశేషం.

భారతదేశంలో రబ్బర్ తోటల పెంపకం చాలాకాలం తర్వాత అభివృద్ధి చెందింది. 19వ శతాబ్దపు అంతిమ దశలోను, 20వ శతాబ్దపు ప్రారంభంలోను ఇది వ్యాప్తి చెందింది. కేరళ, మద్రాస్, కూర్గ్ మొదలైన ప్రాంతాలు రబ్బర్ ఉత్పత్తికి ఆంగ్లేయులు పెట్టుబడులు పెట్టారు.

**10.4.5. బొగ్గు గనుల పరిశ్రమ:**

పశ్చిమ దేశాలలో సంభవించిన పారిశ్రామిక విప్లవం బొగ్గు ఆధారంగా గల శక్తి పైన ఆధారపడింది. చిరు బొగ్గు పరిశ్రమ 1820వ సంవత్సరంలో రాణిగంజ్ గనుల త్రవ్వకాలతో ప్రారంభమైందని చెప్పవచ్చు. మొదట బొగ్గుగనులను ప్రారంభించుటలో పెట్టుబడి పూర్తిగా ఐరోపా నుంచి మాత్రమే వచ్చింది. రైల్వేలు ప్రారంభమయ్యే వరకు ఉపయోగం ఎక్కువ లేదు. రైలు రోడ్ల వ్యాప్తితో బొగ్గు గిరాకీ దేశవ్యాప్తంగా పెరిగింది. దీనితో రైల్వేలలో పెట్టుబడులు పెట్టిన విదేశీయులు బొగ్గుగనుల్లో కూడా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచారు. బెంగాల్ బొగ్గు గనులలో 1857వ సంవత్సరంలో ఉత్పత్తి 3 లక్షల టన్నులు కాగా 1880వ సంవత్సరం నాటికిది 10 లక్షల టన్నులకు పెరిగింది. 1914వ సంవత్సరం నాటికి దేశంలో బొగ్గు ఉత్పత్తి 165 లక్షల టన్నులైంది.

### 10.4.6. జనపనార పరిశ్రమ:

ప్రాచీన కాలం నుంచి బెంగాల్ జనపనార ప్రసిద్ధిగాంచింది. దారాలు, సంచులు, ప్రధానంగా జనపనార నుంచి తయారు చేసేవారు. బెంగాల్ ప్రాంతంలో జనపనార పరిశ్రమ మిక్కిలి అభివృద్ధి చెందడానికి ఆ ప్రాంతంలో ముడి జనుము అధికంగా లభించడం ప్రధాన కారణం. దీనితో జనపనార మిల్లులను నడపడానికి మంచి సామర్థ్యం గల స్కాట్లండ్ పెట్టుబడిదారులు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టారు. దీనితో జనపనార పరిశ్రమలో విదేశీ పెట్టుబడులు ప్రారంభం అయ్యాయి. ఆంగ్ల ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా ప్రారంభంనుంచి దీనిపై దృష్టి పెట్టడంతో విదేశీ పెట్టుబడులు ఇందులో అధికం అయ్యాయి. భారతదేశంలోని సేరం పూర్ వద్ద 1855వ సంవత్సరంలో జార్జ్ ఆక్లండ్ అనే స్కాట్లాండ్ దేశీయుడు మొట్టమొదటి యాంత్రిక జౌళి మిల్లును ప్రారంభించాడు. 1882వ సంవత్సరం నాటికి భారతదేశంలో 20 యాంత్రిక జౌళి మిల్లులు స్థాపింప బాడగా అందులో అధికభాగం విదేశీ పెట్టుబడులతో ప్రారంభం కావడం విశేషం.

20వ శతాబ్ద ప్రారంభంలో మొదటి ప్రపంచ యుద్ధ సమయానికి జనపనార పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెంది, 1924వ సంవత్సరం నాటికి 64కు పైగా మిల్లులు స్థాపించబడ్డాయి. ప్రపంచ యుద్ధ సమయంలో ఇసుక సంచుల గిరాకి పెరిగిన కారణంగా జనపనార పరిశ్రమకు మంచి ప్రోత్సాహం లభించింది. లాభసాటిగా పరిశ్రమ సాగడం వల్ల విదేశీ పెట్టుబడులు ఈ పరిశ్రమలో అధికం కావడం విశేషం. దీనికి తోడూ సైన్యావసరాలకు జనపనార సంచులు అధిక అవసరం కనుక ప్రభుత్వ ప్రోత్సాహం కూడా లభించింది. సైన్యంలో ఇసుక బస్తాల కోసం జనపనార సంచులను వాడేవారు. అంతేకాకుండా సైన్యానికి బట్టలుగా కూడా జనపనార వస్త్రాలను ఉపయోగించారు. వీటన్నింటి వల్ల రెండవ ప్రపంచయుద్ధంలో విశేషంగా ఈ పరిశ్రమ అభివృద్ధి చెందింది.

### 10.4.7. ఇనుము, ఉక్కు పరిశ్రమ:

ఇనుమును కరిగించి పోత పోయడం వంటి పద్ధతులు భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి అమల్లో ఉండేవి. అయితే ఆధునిక పాశ్చాత్య పద్ధతులలో ఇనుము కరిగించు విధానం 19వ శతాబ్ధం ప్రారంభంలో భారతదేశంలో ప్రవేశ పెట్టబడింది. ఇంగ్లాండ్ దేశానికి చెందిన జోసయా మార్సెల్ హీల్ మొట్టమొదట ఆధునిక పద్దతుల్లో ఇనుము ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించాడు. 1830వ సంవత్సరంలో జోసయా మార్సెల్ హీల్ మద్రాస్ రాష్ట్రంలోని దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని పోర్టోనోవో అనే ప్రాంతంలో ఇనుము కర్మాగారాన్ని స్థాపించాడు. కాని అతని కృషి పెద్దగా ఫలితాలనివ్వలేదు. దీనితో పరిశ్రమలకు ఉత్తరభారతదేశం అనుకూలమైందని విదేశీయులు భావించారు. దీనికి తోడూ అప్పటికే బెంగాల్ లో జనపనార వంటి పరిశ్రమలు అభివృద్ధి చెందడం. అక్కడ విరివిగా కార్మికులు లభిస్తూ ఉండడం, ఆ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందడంతో బెంగాల్ రాష్ట్రం అనుకూలంగా ఉంటుందని భావించి విదేశీయులు ఇనుము ఉక్కు పరిశ్రమను బెంగాల్ రాష్ట్రంలో స్థాపించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఫలితంగా 1875వ సంవత్సరంలో బేకర్ ఇనుప పరిశ్రమ బెంగాల్‌లో ప్రారంభించబడింది. అయితే అది కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే నడిచింది.

### 10.4.8. పంచదార పరిశ్రమ:

పంచదార పరిశ్రమ భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి కూడా వుండేది. స్వదేశీ పద్ధతులలో కొనసాగింది. పంచదార కర్మాగారాలు చిన్నవిగా వుండేవి. వాటిల్లో ఉపయోగించే యంత్రాలు చిన్నవి కావడంతో పాటు పరిశ్రమల్లో

ఉపయోగించే పద్దతులు చాలా పాతవిగా వుండడం వల్ల ఉత్పత్తిలో అధికంగా వృధా అయ్యేది. దీనికి తోడూ నేరుగా చెరుకు రసం నుంచి కాకుండా బెల్లం తయారు చేసి దాని నుంచి పంచదారను తయారుచేసేవారు. అయినా భారతదేశం నుంచి 17,18 శతాబ్దాలలో ఖండసార ప్రపంచంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేయబడేది. మన దేశంలో తయారైన పంచదారకు ఐరోపాలలోను ఆసియా దేశాలలోన అధికంగా గిరాకిన వుండేది. ఐరోపావారు భారతదేశానికి వచ్చిన తర్వాత ఈస్టిండియా కంపెనీ అనేక సంవత్సరాలు బెంగాల్ నుంచి చక్కెరను ఎగుమతి చేసింది. అయితే 1850వ సంవత్సరంల తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చింది. విదేశాలలో ఆధునిక పద్దతులలో చక్కర తయారు చేయడం ప్రారంభం కావడంతో నాణ్యమైన చక్కరను దిగుమతి చేయడం ప్రారంభం కావడంతో భారతీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. చెరుకు పండించే రైతులు సంయుక్త రాష్ట్రం, పంజాబ్ రాష్ట్రం, బీహార్, ఒరిస్సా ప్రాంతాలలో అధికంగా వుండేవారు. వారు తీవ్ర కష్టాలను, నష్టాలను ఎదుర్కొన్నారు. చెరుకు ధరలు బాగా పడిపోయాయి. ఇలాంటి స్థితిలో విదేశీయులు పంచదార పరిశ్రమపై దృష్టి సారించారు. విదేశాలనుంచి ఆధునిక యంత్రాలను దిగుమతి చేసుకుని కాన్పూర్, కోయంబత్తూర్, బెంగాల్, పంజాబ్ ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించారు. మొదట విదేశీ పెట్టుబడితోనే చాలాకాలం పంచదార పరిశ్రమలు నడిచాయి. తర్వాత భారతీయ పారిశ్రామిక వేత్తలు దృష్టి సారించారు.

**10.4.9. కాగితం పరిశ్రమ:**

కాగితం పరిశ్రమ 1930వ సంవత్సరం వరకు పూర్తిగా విదేశీయుల పెట్టుబడితోనే నడిచింది. 1930వ సంవత్సరం తర్వాతే భారతీయ పెట్టుబడిదారులు ఈ పరిశ్రమపై దృష్టి సారించారు. గూడి 19వ శతాబ్దాంతానికి అమితంగా అభివృద్ధి గాంచింది. 1870వ సంవత్సరంలో దేశంలో మొట్టమొదటి కాగితం తయారీ కర్మాగారం హుగ్లీ నదీ తీరంలో స్థాపింపబడింది. ఈ కర్మాగారానికి 'బాలీమిల్లు' అని పేరు. తర్వాత భారతదేశంలో భారతదేశపు : మొదటి కాగితపు మిల్లు హుగ్లీ నదీ తీరంలో స్థాపించబడింది. దానికి 1882వ సంవత్సరంలో టిటాఘర్ కాగితం మిల్లు, 1894వ సంవత్సరంలో ఇంపీరియల్ కాగితం మిల్లు స్థాపించబడ్డాయి. ఈ రెండు కాగితపు మిల్లులను కూడా ఇంగ్లాండ్ దేశానికి చెందిన పెట్టుబడిదారులే స్థాపించారు. విదేశీ పెట్టుబడితో 1927-28వ సంవత్సరంలో కర్ణాటక పేపర్ మిల్లు ప్రారంభింప బడింది. అయితే 1936వ సంవత్సరం మే నెల 20 వ తేదిన మైసూరు మహారాజు కృష్ణ రాజ వడయార్ భద్రావతిలో మైసూరు పేపర్ మిల్‌ను స్థాపించాడు. ఈ మిల్లు 1937వ సంవత్సరంలో ఉత్పత్తిని ప్రారంభించింది. అప్పటి నుంచి భారతీయ పెట్టుబడీ దారుల దృష్టి కాగితం పరిశ్రమపై పడింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో భారతీయ పెట్టుబడులతో అనేక కాగితం పరిశ్రమలు దేశంలోని అనేక ప్రాంతాలల్లో ప్రారంభం అయ్యాయి.

**10.4.10. చర్మ పరిశ్రమ:**

భారతదేశంలోని పశుసంపద, చర్మ పరిశ్రమలు ప్రాచీన కాలం నుంచి వున్నా ముడి చర్మాలు ఇతర దేశాలకు ఎగుమతి చేయబడుతూ వచ్చాయి. స్వదేశీ పద్ధతిలో ధర్మాలను శుద్ధిచేసే విధానం మధ్య యుగంలో అనుసరించబడినా అధునాతన పద్ధతిలో దిగుమతి చేయబడిన రసాయనిక పదార్థాలతో చర్మాలను శుద్ధిచేయు విధానం మాత్రం 19 వ శతాబ్దం ద్వితీయ అర్ధభాగంలోనే ప్రారంభం అయింది. భారతదేశంలో మొట్టమొదటి ఆధునిక చర్మ శుద్ధి కర్మాగారం 1860వ సంవత్సరంలో కాన్పూర్ లో ప్రారంభం అయింది. దీనిని భారతదేశంలోని ఆంగ్ల ప్రభుత్వం స్థాపించింది. ప్రభుత్వం కర్మాగారం స్థాపించడంతో విదేశీయులు ఈ పరిశ్రమలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరచడంతో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయబడ్డాయి.

ప్రపంచ యుద్ధంలో సైనికులకు అవసరమైన పాదరక్షలు మొదలైన వాటి తయారీ ఎక్కువైనందున చర్మ శుద్ధి పరిశ్రమ అమిత ప్రోత్సాహాన్ని పుంజుకున్న సమయంలో భారతీయ పెట్టుబడిదారులు దీనిపై దృష్టి సారించారు. అంతవరకూ విదేశీ పెట్టుబడులే ఈ పరిశ్రమలో అధికం.

### 10.4.11. అగ్గిపెట్టెల తయారీ పరిశ్రమ:

అగ్గిపెట్టెలను తయారు చేయడం ప్రాచీన కాలంనుంచి మనదేశంలో ప్రధానంగా దక్షిణ భారతదేశంలో కుటీర పరిశ్రమగా వుండేది. అయితే దేశంలో మొట్టమొదటిసారిగా అగ్గిపెట్టెల తయారీ పరిశ్రమ 1895వ సంవత్సరంలో అహమ్మదాబాద్‌లో ప్రారంభించబడింది. కానీ పెద్దగా అభివృద్ధి చెందలేదు. తర్వాత 1926వ సంవత్సరంలో స్వీడన్ దేశంలోని పశ్చిమ ఇండియా అగ్గిపెట్టెల కంపెనీ ద్వారా భారతదేశంలో అగ్గిపెట్టెల పరిశ్రమ స్థాపితమైంది. దీనితో కలిసి విదేశీ పెట్టుబడి దారులు అస్సాం అగ్గిపెట్టెల కంపెనీని స్థాపించారు. వీరి ఆధ్వర్యంలో 1940వ సంవత్సరం నాటికి ఐదు పరిశ్రమలు స్థాపింప బడ్డాయి. ఈ పరిశ్రమలో ప్రధానంగా ప్రపంచంలో ఆధిక్యంలో వున్న విదేశీయులు పెట్టుబడులు పెట్టడం విశేషం.

### 10.4.12. ఇతర పరిశ్రమలు:

ఈ ప్రధాన పరిశ్రమలకు తోడూ గాజు, సిమెంట్, నూనె మిల్లులు, రసాయనిక, ఇంజినీరింగ్ పరిశ్రమలలో కూడా విదేశీ పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టారు.

## 10.5. విదేశీ పెట్టుబడుల ప్రభావం:

భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధిలో విదేశీ పెట్టుబడులు, నిర్వహణల పాత్ర పూర్తి ఆధిక్యంలో కొనసాగింది. నీలిమందు, తేయాకు, కాఫీ వంటి తోటల పరిశ్రమలన్నీ విదేశీ పెట్టుబడిదారుల చేతనే ప్రారంభింపబడ్డాయి. వీటిలో భారతీయ పెట్టుబడి కొద్దిగా ఉన్నప్పటికీ ఇవి ప్రధానంగా విదేశీయుల యాజమాన్య, నిర్వహణల కిందనే నడిచాయని చెప్పవచ్చు. ఉన్నాయి. జనపనార తయారీకి సంబంధించి కూడా ఇదే పద్ధతి కొనసాగింది. జార్జ్ ఆక్లాండ్ అనే స్కాట్లాండ్ దేశస్థుడు ఈ పరిశ్రమకు సంబంధించిన మొదటి మల్లును 1855వ సంవత్సరంలో స్థాపించాడు. 19వ శతాబ్దాంతం వరకు కూడా ఈ పరిశ్రమలో భారతీయ పెట్టుబడి చాలా స్వల్పంగా ఉండేది. గనుల త్రవ్వకం కూడా పూర్తిగా విదేశీయుల చేతుల్లో ఉండేది. ఈ పరిశ్రమలన్నీ విదేశీయుల గుత్తం కావడంతో, దేశీయ పెట్టుబడికి పారిశ్రామిక రంగంలో అవకాశం నామమాత్రమైంది. నేత పరిశ్రమ ఒక్కటే భారతీయ పెట్టుబడిదార్ల ప్రాబల్యంలో ఉన్న పెద్ద పరిశ్రమగా నిలిచింది.

ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఉమ్మడి రంగంలో, ఆంగ్లేయుల ఆధిక్యత స్పష్టంగా కనిపిస్తుంది. వీరి భారతదేశ పాలనకు చెందిన చివరి సంవత్సరంలో కూడా విదేశీయుల పెట్టుబడి భారతీయ పెట్టుబడి కంటే రెట్టింపు ఉన్నట్లుగా చెప్పబడింది. పట్టిక సూచిస్తుంది. దీనికి రెండు కారణాలు. మరియ దేశ పారిశ్రామిక పరిణామ తొలి దశల్లో విదేశీ పెట్టుబడి విపరీత ప్రమాణంలో వుండడం కారణంగా కనిపిస్తుంది. సాధారణంగా విదేశీ పెట్టుబడుల వల్ల తొలి దశల్లో పారిశ్రామిక ప్రగతి సాధ్యమైనప్పటికీ, దేశీయ పరిశ్రమలు అభివృద్ధిని పుంజుకోవడంతో విదేశీ పెట్టుబడి స్థానాన్ని దేశీయ పెట్టుబడులు దక్కిన్చుకుంటాయి. అయితే భారత దేశం విషయంలో ఇది సాధ్యం కాకపోవడం వల్ల విదేశీ పెట్టుబడులదే పై చేయి అయింది.

## 10.6. సమీక్ష:

ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం జరిగిన తర్వాత ఆంగ్ల ప్రభుత్వం భారతదేశంలో అనుసరించిన వాణిజ్య,

పారిశ్రామిక విధానాల ఫలితంగా భారతదేశంలోని సాంప్రదాయికమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడంతో భారతదేశంలో ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భవించింది. ఈ పరిశ్రమలలో భారతీయ పెట్టుబడి దారులు పెట్టుబడి పెట్టినా వారికంటే అధికంగా విదేశీయులు పెట్టుబడులు పెట్టారు.

## 10.7. నమూనా ప్రశ్నలు:

1. భారతదేశంలో విదేశీ పెట్టుబడులను గురించి వివరించండి?
2. భారతదేశంలో విదేశీ పెట్టుబడులకు కారణాలు వివరించి వారు ఏ పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టారో వివరించండి?

## 10.8. ఆధార గ్రంథాలు:


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.
2. Bipin Chandra - Essays on Colonialism.
3. R.P. Dutt - India Today.
4. D.R. Gadgil - The Industrial Evolution of India (1860-1939).
5. Sumit Sarkar - Modern Indian Economic History.
6. Sabyasachi Bhattachrya - Essays of Modern Indian Economic History.
7. Aladi Valdehi - History of Freedom Movement in India.
8. KK Datta - A Social History of Modern India.
9. తెలుగు అకాడమీ ప్రచురణ - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


– డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

## పాఠం - 11

# ఆధునిక పరిశ్రమలు - నూలు, ఇనుము, ఉక్కు మరియు పంచదార పరిశ్రమలు

### 11.0. లక్ష్యము:

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా ఆంగ్లేయులు భారతదేశానికి రాకముందు వున్న పరిశ్రమలు, వారు అనుసరించిన విధానాల వల్ల చిన్న కుటీర పరిశ్రమలు నాశనం అయితే ఆ స్థానంలో భారతదేశంలో స్థాపింపబడిన ఆధునిక యాంత్రిక పరిశ్రమలను గురించి తెలుసుకోగలుగుతారు.

**విషయక్రమము:**

- **11.1.** పరిచయం
- **11.2.** భారతదేశంలో ఆధునిక పరిశ్రమల స్థాపన
- **11.3.** భారతదేశ పరిశ్రమల పట్ల ఆంగ్లేయుల వైఖరి
- **11.4.** నూలు పరిశ్రమ
  - **11.4.1.** బొంబాయి
  - **11.4.2.** అహ్మదాబాద్
  - **11.4.3.** భారతదేశంలో నూలు పరిశ్రమాభివృద్ధి
  - **11.4.4.** ఉత్పత్తిలో వృద్ధి
  - **11.4.5.** నూలు ఎగుమతి, దిగుమతులు
  - **11.4.6.** నూలు పరిశ్రమ విస్తృత అభివృద్ధికి ఆటంకాలు
- **11.5.** ఇనుము - ఉక్కు పరిశ్రమ
  - **11.5.1.** బెంగాల్ ఇనుము కంపెనీ
  - **11.5.2.** టాటా ఇనుము ఉక్కు కర్మాగారం
  - **11.5.3.** ఎగుమతి దిగుమతులు
- **11.6.** పంచదార పరిశ్రమ
- **11.7.** సమీక్ష
- **11.8.** వ్యాసరూప ప్రశ్నలు
- **11.9.** ఆధార గ్రంథాలు

### 11.1. పరిచయం:

ఆంగ్లేయులు భారతదేశానికి వ్యాపారం కోసం రాకముందు భారతదేశంలో అనేక పరిశ్రమలు వుండేవి. చిన్న, కుటీర

పరిశ్రమలైనా వీటికి మంచి గుర్తింపు ఉండడంతో పాటు బాగా ఆదాయాన్ని పొందేవి. ఈ సమయంలో భారతదేశం 'ప్రపంచపు కార్ఖానా' అనే పేరు పొందింది. ఐరోపా ఖండంలో ప్రధానంగా లండన్, పారిస్, డమస్కస్ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉండేది. కాని ఐరోపా వర్తక సంఘాలు భారతదేశంలో ప్రవేశించడం, క్రమంగా ఆంగ్లేయులు భారత దేశంలో అధికారాన్ని పొందడంతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత ఈ పరిస్థితుల్లో పూర్తిగా మార్పులు చోటు చేసుకున్నాయి. పారిశ్రామిక విప్లవానికి ముందు తయారైన వస్తువులను ఎగుమతి చేసుకున్న ఆంగ్లేయులు విప్లవం తర్వాత ముడి సరుకులను ఎగుమతి చేసుకుని ఇంగ్లాండ్‌లో వస్తువులను తయారు చేసి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయించడం ప్రారంభించారు.

సాంప్రదాయికమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడంతో మరో పరిణామం చోటు చేసుకొంది. అదే ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భావం.

## 11.2. భారతదేశంలో ఆధునిక పరిశ్రమల స్థాపన:

విద్య ద్వారా పాశ్చాత్య శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో ప్రవేశం ఏర్పడటం ఆ దేశాల నుంచి నిపుణులను పంచుకోడానికి అవకాశం కలగడం మొదలయిన కారణాల వల్ల కొంతమంది భారతీయులు, ఐరోపా వారు కొద్దిపాటి పెట్టుబడులతో 19వ శతాబ్దం మధ్య భాగంలో ప్రత్తి, జనపనార పరిశ్రమలను ప్రారంభించారు.

ఇంగ్లాండ్‌లో తయారయిన వస్తువులకు భారతదేశం మార్కెట్‌లో గిరాకీ పెరిగేలా చేస్తూ ఆంగ్ల ప్రభుత్వం ఇంగ్లాండ్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రూపొందించిన పన్నుల విధానం భారత పరిశ్రమలను దోపిడీ చేయడంతో పాటు భారత స్వదేశీ పరిశ్రమలు దెబ్బ తినేలా చేసింది. కానీ భారత వ్యాపారాన్నీ, పరిశ్రమలను పూర్తిగా దెబ్బ తీయలేకపోయింది. భారతీయులకు విదేశాలతో వున్న ప్రత్యక్ష వ్యాపార సంబంధాలు, దేశంలో వాణిజ్య పంటల అభివృద్ధి, విదేశీ మార్కెట్లతో సంబంధాలు, దేశంలో శాంతి భద్రతలు ఏర్పడడం వంటి కారణాలు భారతీయ వ్యాపారం, వాణిజ్యం విస్తరించి భారత పరిశ్రమలు అభివృద్ధి చెందేందుకు దోహదం చేశాయి. దీనికి తోడూ ఈ ప్రాంత వర్తకులు విదేశాలతో సంబధాలను ఏర్పాటు చేసుకోవడం కూడా అందుకు కారణం అయింది. ప్రధానంగా పార్సీలు, సంపన్న వర్గాల వారు విదేశాలతో సంబంధాలను ఏర్పరుచుకొన్నారు. భారతదేశంలో ఈ వర్గాల వారే మొదటగా ఆధునిక పరిశ్రమలను ఏర్పాటు చేశారు. తర్వాతి కాలంలో ఇతర వర్గాల వారు కూడా ఇందులోకి ప్రవేశించారు. మొదట్లో ఎగుమతులు, దిగుమతుల వ్యాపారం చేసిన కొందరు తమకు ఆ వ్యాపారం ద్వారా లభించిన లాభాలను ఉపయోగించి పరిశ్రమలను స్థాపించడం ప్రారంభించారు.

ఇలాంటి స్థితిలో ఆధునిక పరిశ్రమలు భారతదేశంలో కూడా స్థాపించబడ్డాయి. అంతకముందు భారతదేశంలో చేతి వృత్తుల పరిశ్రమలు వుండగా ప్రస్తుతం ఆధునిక పరిశ్రమలు యంత్రాలతో నడిచే పరిశ్రమలు కావడం విశేషం. పారిశ్రామిక రంగంలో 19వ శతాబ్దం ద్వితీయ అర్ధ భాగంలో సంభవించిన ప్రధాన మార్పు యంత్రాల సహాయంతో నడిచే పరిశ్రమల స్థాపన. ప్రధానంగా నూలు, జౌళి, బొగ్గు గనులు, ఇనుము ఉక్కు, పంచదార వంటి యాంత్రిక పరిశ్రమలు ఈ సమయంలో భారతదేశంలో స్థాపింపబడి అభివృద్ధి చెందాయి.

## 11.3. భారతదేశ పరిశ్రమల పట్ల ఆంగ్లేయుల వైఖరి:

19వ శతాబ్దం ద్వితీయ అర్ధభాగంలో భారత దేశంలో స్థాపింపబడిన పరిశ్రమలలో ఆంగ్లేయులు నీలిమందు, కాఫీ, తేయాకు, రబ్బరు వంటి తోట పరిశ్రమలను ప్రోత్సహించారు. అయితే నూలు, జౌళి, బొగ్గు గనులు, ఇనుము, ఉక్కు,

పంచదార వంటి యాంత్రిక పరిశ్రమలను ఆంగ్లేయులు ప్రోత్సహించలేదు. ప్రధానంగా భారత దేశంలో స్థాపింప బడిన ఈ పరిశ్రమలు తమదేశంలోని పరిశ్రమలకు పోటీగా నిలుస్తాయనీ, తమదేశంలో ఉత్పత్తి అయిన వస్తువులకు భారతదేశంలో మార్కెట్ ఉండదనే భయం వల్ల ఆంగ్లేయులు ప్రోత్సహించలేదని చెప్పవచ్చు. ఈ పరిశ్రమలన్నీ ప్రైవేటుగానే స్థాపింపబడి వృద్ధి చెందడం విశేషం.

## 11.4. నూలు పరిశ్రమ:

19వ శతాబ్ధం ద్వితీయ అర్థభాగంలో భారత దేశంలో స్థాపింపబడిన పరిశ్రమలలో అన్నీ విధాలుగా పెద్ద పరిశ్రమ నూలు పరిశ్రమ. పెట్టుబడి, ఉత్పత్తి, కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య వీటన్నింటి పరంగా నూలు పరిశ్రమను పెద్ద పరిశ్రమ అని చెప్పవచ్చు. ఈ పరిశ్రమ ప్రైవేట్ రంగంలో నెలకొల్పబడింది.

ఈ పరిశ్రమ ప్రధానంగా భారతదేశ పశ్చిమ భాగంలో కేంద్రీకరింపబడింది. బొంబాయి, అహ్మదాబాద్, సూరత్ ఈ పరిశ్రమ ప్రధాన కేంద్రాలు. వీటితో పాటు సంయుక్త రాష్ట్రంలోని కాన్పూర్, మద్రాస్ రాష్ట్రంలోని మధురై, కోయంబత్తూరు, బెంగాల్ రాష్ట్రంలో 24 పరగణాలు, హౌరా జిల్లాలో కూడా నూలు మిల్లులు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రధానంగా బొంబాయి, అహమ్మదాబాద్ లలోని నూలు మిల్లులు గొప్పగా అభివృద్ధి చెందాయి. ఈ ప్రాంతంలో పత్తి అధికంగా పండడం, గ్రామీణ ప్రాంతాలలో పనులు లేకుండా వున్న వారు అధిక సంఖ్యలో వచ్చి కర్మాగారాల్లో కార్మికులుగా చేరడం అందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. వీటన్నింటికీ తోడు బొంబాయి వర్తకులు విదేశీ వాణిజ్యం చేసి అధిక లాభాలు గడించడం వల్ల పరిశ్రమల స్థాపనకు అవసరమైన పెట్టుబడి ధనం వారి వద్ద వుండడం కూడా కారణం. వీటన్నింటితోపాటు ఇక్కడ ఉత్పత్తి అయిన నూలు, వస్త్రాలకు భారతదేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు చైనా వంటి దేశాల మార్కెట్లలో బాగా గిరాకీ ఉండడం కూడా కారణం.

### 11.4.1. బొంబాయి:

భారతదేశంలో స్థాపింపబడిన మొట్టమొదటి నూలు మిల్లు "బొంబాయి స్పిన్నింగ్ వీవింగ్ కంపెనీ లిమిటెడ్". ఇది బొంబాయిలో స్థాపింపబడింది. దీనిని 1851వ సంవత్సరంలో బొంబాయికి చెందిన కవాస్జీ నానాభాయ్ దవార్ స్థాపించాడు. ఇతను పార్శీ వ్యాపారవేత్త. ఈ కర్మాగారం 1854వ సంవత్సరంలో పనిచేయడం ప్రారంభించింది. ఈ కర్మాగారంలో 5 వేల కుదురులు (Spindles) వుండేవి. ఈ కర్మాగారం ఉత్పత్తిని ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే లాభాలను గడించడంతో అనేక ధనిక వ్యాపారుల దృష్టి నూలు కర్మాగారాలపై పడింది. ఫలితంగా బొంబాయిలో అనేక నూలు మిల్లులు స్థాపింపబడ్డాయి. 1851వ సంవత్సరం మొదలు 1915వ సంవత్సర కాలం వరకు ఒక్క బొంబాయి నగరంలోనే సుమారు 30 లక్షల కుదురులు, 52 వేల మగ్గాలు, ఒక లక్షా పదివేలకు పైగా కార్మికులతో 7.66 కోట్ల రూపాయల పెట్టుబడితో 96 మిల్లులు ప్రారంభం అయ్యాయి. ఇదే సమయంలో ఇందుకు సంబంధించిన 73 వాణిజ్య సంస్థలు ప్రారంభం కావడం విశేషం.

### 11.4.2. అహ్మదాబాద్:

భారతదేశంలో బొంబాయి తర్వాత నూలు కర్మాగారాల ఏర్పాటు అహ్మదాబాద్‌లో అధికంగా సాగింది. బొంబాయిలో ప్రారంభమయిన నూలు మిల్లులను చూసిన అహ్మదాబాద్ సంపన్న వ్యాపారులు నూలు కర్మాగారాలను ఏర్పరచడానికి ఆసక్తిని

కనబరిచారు. 1859వ సంవత్సరంలో అహ్మదాబాద్‌లో మొదటి నూలు మిల్లు స్థాపింపబడింది. ఈ మిల్లు 1861వ సంవత్సరంలో మే నెల 30 వ తేదీన ఉత్పత్తిని ప్రారంభించింది. "ది అహమ్మదాబాద్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ కంపెనీ లిమిటెడ్" అనే పేరుతో అహ్మదాబాద్‌లోని ఈ మొదటి మిల్లును రాంచోడ్ లాల్ చోటాలాల్ అనే వ్యాపార వేత్త ప్రారంభించాడు. అప్పటి నుంచి 1914 వ సంవత్సరం నాటికి అహ్మదాబాద్‌లో 50 నూలు మిల్లులు స్థాపింపబడ్డాయి. వీటిలో సుమారు 10 లక్షల కుదురులు, 20 వేల మగ్గాలు వుండేవి. ఈ మిల్లులన్నీ కూడా భారతీయ వ్యాపారవేత్తలు, సంపన్నులు స్థాపించడం విశేషం.

ఈ విధంగా బొంబాయి, అహ్మదాబాద్‌లలోని నూలు మిల్లులను భారతీయ వ్యాపారవేత్తలు, సంపన్నులు ప్రారంభించగా అందుకు భిన్నమైన పరిస్థితులు కాన్పూర్, మద్రాస్ ప్రాంతంలోని మిల్లుల స్థాపనలో వుండడం గమనించదగ్గ విషయం. కాన్పూర్, మద్రాస్ వంటి ప్రాంతాలలో నూలు మిల్లులను ఆంగ్లేయ వ్యాపారులు స్థాపించారు.

**11.4.3. భారతదేశంలో నూలు పరిశ్రమాభివృద్ధి:**

భారతదేశంలో నూలు మిల్లులు స్థాపింపబడడం ఇంగ్లాండ్‌లోని నూలు మిల్లుల ప్రధానకేంద్రమైన లంకషైర్‌లోని నూలు మిల్లుల యజమానులకు ఇష్టం లేదు. అందువల్ల వారు భారతదేశంలోని నూలు మిల్లులకు ఎటువంటి ప్రోత్సాహకాలు లభించకుండా ఆంగ్ల ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేవారు. ఈ స్థితి 20వ శతాబ్దం తొలి అర్థ భాగం వరకు కొనసాగింది. భారతదేశంలోని ఆంగ్ల ప్రభుత్వం భారతదేశంలోని నూలు కర్మాగారాలకు ఎటువంటి ప్రోత్సాహకాలు గానీ రక్షణ గానీ ఇవ్వలేదు. అయినా దేశంలో నూలు పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందడం విశేషం.

1875-76వ సంవత్సరంలో 47 నూలు మిల్లులు దేశంలో వుండగా ఈ సంఖ్య 1929 నాటికి 344 అయింది. 1945 నాటికి దేశంలో నూలు మిల్లుల సంఖ్య 417 కు చేరుకుంది. అలాగే 1875-76వ సంవత్సరంలో11లక్షల కుదురులు వుండగా ఈ సంఖ్య 1929 నాటికి 90 లక్షలకు, 1945 నాటికి సుమారు 103 లక్షలకు చేరాయి. ఇక మగ్గాలు 1875-76వ సంవత్సరంలో 91 వేలు వుండగా 1929 నాటికి ఒక్క లక్షా 75 వేలకు 1945 నాటికి సుమారు రెండు లక్షలకు పైగా చేరాయి. అలాగే 1875-76వ సంవత్సరం నాటికి నూలు మిల్లులలో పనిచేసే కార్మికుల సంఖ్య రోజువారీగా సుమారు 50 వేలు వుండగా 1929 నాటికి ఈ సంఖ్య 3 లక్షలా 47 వేలకు పెరిగింది. 1945 నాటికి 5 లక్షలకు పైగా కార్మికులు భారతదేశంలోని నూలు కర్మాగారాల్లో పనిచేస్తూ వున్నారంటే ప్రభుత్వ ప్రోత్సాహం లేకున్నా నూలు పరిశ్రమ ఎంత వేగంగా అభివృద్ధి చెందినదో స్పష్టమవుతోంది.

**11.4.4. ఉత్పత్తిలో వృద్ధి:**

భారతదేశంలో నూలు కర్మాగారాల సంఖ్య ఏ విధంగా వృద్ధి చెందుతూ వచ్చిందో అదేవిధంగా ఉత్పత్తిలో కూడా దేశంలోని నూలు మిల్లులు వృద్ధిని సాధించాయి. నూలు దారంతో పాటు వస్త్ర ఉత్పత్తిలో కూడా వృద్ధి జరిగింది. 1900-1901 సంవత్సర ప్రాంతంలో భారతదేశం 353 మిలియన్ పౌండ్ల నూలు దారాన్నిఉత్పత్తి చేయగా ఇది 1947 నాటికి 1,330 మిలియన్ పౌండ్లకు పెరిగింది. అలాగే 1900-1901 సంవత్సర ప్రాంతంలో 22 మిలియన్ గజాల వస్త్రాన్ని ఉత్పత్తి చేయగా, 1947 వ సంవత్సరం నాటికి ఈ ఉత్పత్తి 3,770 మిలియన్ గజాలకు పెరిగింది.

**11.4.5. నూలు ఎగుమతి, దిగుమతులు:**

భారతదేశంలో నూలు మిల్లుల పెరుగుదల, నూలు దారం, వస్త్ర ఉత్పత్తుల పెరుగుదల భారతదేశ ఎగుమతి

దిగుమతులమీద తీవ్ర ప్రభావాన్ని కనబరిచింది. ఉత్పత్తి పెరగడం వల్ల భారతదేశం నుంచి వస్త్ర ఎగుమతి పెరిగింది. 1900-01 సంవత్సర ప్రాంతంలో 111 మిలియన్ గజాల వస్త్రాన్ని ఎగుమతి చేస్తే 1947-48లలో ఇది 192 మిలియన్ గజాల మేరకు పెరిగింది. అంతేకాకుండా భారతదేశానికి దిగుమతి చేసుకునే వస్త్ర పరిమాణం కూడా ఉత్పత్తి పెరుగుదల వల్ల తగ్గడం విశేషం. 1900-01 సంవత్సర ప్రాంతంలో ఇతర దేశాల నుండి భారతదేశం 1.875 మిలియన్ గజాల వస్త్రాన్ని దిగుమతి చేసుకోగా, 1947-48లో ఇట్టి దిగుమతులు 26 మిలియన్ గజాల మేరకు పడిపోయాయి.

### 11.4.6. నూలు పరిశ్రమ విస్తృత అభివృద్ధికి ఆటంకాలు

నూలు మిల్లుల ఏర్పాటులో వృద్ధి, ఉత్పత్తిలో పెరుగుదల, ఎగుమతుల్లో అభివృద్ధి, దిగుమతుల్లో తగ్గుదల ఉన్నా భారతదేశంలో నూలు పరిశ్రమ అనుకున్నంతగా అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు. అందుకు అనేక కారణాలు దోహదం చేశాయి.

### 11.4.6.1. అంతర్జాతీయ మార్కెట్ పోటీ:

జపాన్, మాంచెస్టర్ల నుండి వచ్చే దిగుమతులను, అంతర్జాతీయ మార్కెట్లో వీటి పోటీని, భారతీయ నూలు మిల్లులు ఎదుర్కొనలేకపోయాయి. అందుకు అనేక కారణాలు వున్నా, ప్రధానంగా విదేశాలలో తయారైన వస్త్రం భారతదేశంలో ఉత్పత్తి అయిన వస్త్రం కంటే తక్కువ ధరను కలిగివుండడం ఒక కారణంగా చెప్పవచ్చు. భారతదేశ వస్త్రం అధిక ధర కలిగివుండడానికి, విదేశీ వస్త్రం తక్కువ ధరను కలిగివుండడానికి అనేక కారణాలు కనిపిస్తాయి.

1. 20వ శతాబ్ద ప్రారంభంలో నూలు దారం, వస్త్ర ఉత్పత్తి నైపుణ్యంలో భారతీయ కార్మికుల కంటే తక్కువ స్థాయిలో ఉన్నట్లుగా భావించబడ్డ జపాన్ కార్మికులు, 1920 దశకం చివరినాటికి భారతీయ నూలు మిల్లు కార్మికుల కంటే ఎంతో నిపుణులుగా తయారయ్యారు. 1930 ప్రారంభం నాటికి ఒక జపాన్ నేత కార్మికుడు ఆరు మగ్గాలను నడపగలిగితే, బొంబాయిలోని నేత కార్మికుడు కేవలం రెండు మగ్గాలను మాత్రమే నడపగలిగేవాడు. ఇది జపాన్ దేశంలో ఉత్పత్తి ఖర్చు తగ్గటానికి దోహదపడింది. దీనితో వస్త్రం ధర భారతదేశ వస్త్రంకంటే తక్కువగా వుండడం.
2. నూలు కర్మాగారాలకు అవసరమైన యంత్రాలను భారతదేశం ఇంగ్లాండ్ వంటి దేశాలనుంచి దిగుమతి చేసుకునేది. జపాన్ తమదేశంలోని నూలు కర్మాగారాలకు అవసరమైన యంత్రాలను తామే తయారు చేసుకోవడం వల్ల కూడా నాణ్యతలో ఉత్పత్తి ఖర్చులో తేడా వుండి భారతీయ వస్త్రానికంటే చౌకగా లభించడం.
3. జపాన్ దేశంలోని కేంద్రీకృత వాణిజ్య వ్యవస్థ, సరళీకృత మార్కెటింగ్ పద్ధతులు, కార్మికుల విద్య, సాంకేతిక శిక్షణ వంటివి కూడా జపాన్ వస్త్ర నాణ్యతకు దోహదం చేశాయి. ప్రమాణాలు, జపాన్ పరిస్థితిని మెరుగుపరచాయి.

### 11.4.6.2. ప్రభుత్వ విధానాలు:

1. భారతదేశంలో నూలు మిల్లులు స్థాపింపబడడం ఇంగ్లాండ్లోని నూలుమిల్లుల ప్రధాన కేంద్రమైన లంకషైర్లోని నూలు మిల్లుల యజమానులకు ఇష్టం లేదు. అందువల్ల వారు భారతదేశంలోని నూలు మిల్లులకు ఎటువంటి ప్రోత్సాహకాలు లభించకుండా ఆంగ్ల ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేవారు. ఫలితంగా నూలుమిల్లులకు ఆంగ్ల ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహకాలు అందించలేదు. రక్షణ చర్యలు తీసుకోలేదు.

2. ఆంగ్ల ప్రభుత్వ వాణిజ్య విధానాలు ఆర్థికవిధానాలు కూడా భారతీయ నూలు మిల్లుల ప్రగతికి అవరోధంగా తయారయ్యాయి. 1878 లో విదేశీ దిగుమతి వస్త్రాలమీద దిగుమతి పన్నులను రద్దుచేయడం భారతీయ వ్యాపారానికి తీవ్ర అవరోధంగా తయారైంది. తర్వాత దిగుమతి పన్నును విధించినా భారతీయ ఉత్పత్తి పైన పన్నును అధికం చేయడం వల్ల ఏమీ ఉపయోగం లేకుండా పోయింది.

వీటన్నింటి వల్ల భారతదేశంలో నూలు పరిశ్రమ అనుకున్నంత ప్రగతి సాధించలేక పోయింది.

## 11.5. ఇనుము – ఉక్కు పరిశ్రమ:

ఆధునిక కాలంలో ఒక దేశంలోని ఇనుము ఉక్కు తలసరి వాడకం ఆ దేశ ఆర్థిక ప్రగతికి కొలబద్దగా తీసుకోబడుతోంది. ప్రతి పరిశ్రమకు అవసరమైన యంత్రాలు ఇనుము ఉక్కుతో తయారుచేయబడడం అందుకు కారణం. అందువల్ల దేశంలో సుస్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే అందుకు తగ్గట్టుగా దేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమల అభివృద్ధి అవసరం అయ్యింది.

భారతదేశంలోని ఆంగ్ల ప్రభుత్వ పాలనలోని రాజకీయ, ఆర్థిక పరిస్థితుల ప్రభావ ఫలితంగా, భారతదేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమల స్థాపన జరగడానికి చాలా కాలం పట్టింది.

### 11.5.1. బెంగాల్ ఇనుము కంపెనీ:

"బెంగాల్ ఇనుము – ఉక్కు కంపెనీ" 1875వ సంవత్సరంలో బరాకర్ స్థాపించాడు. ఆధునిక పద్ధతుల్లో దుక్క ఇనుము ఉత్పత్తికి ఈ కంపెనీ శ్రీకారం చుట్టింది. తర్వాత 1919వ సంవత్సరంలో బెంగాల్ ఇనుము – ఉక్కు కంపెనీ "బెంగాల్ ఇనుము కంపెనీ"గా పేరు మార్చుకుంది. ఈ కంపెనీ 1907 వ సంవత్సరం నాటికి సంవత్సరానికి 50,000 టన్నుల దుక్క ఇనుమును తయారుచేసే స్థాయికి ఎదిగింది. తర్వాతి పది సంవత్సరాల్లో ఈ కంపెనీ లోని ఉత్పత్తి విభాగంలో విస్తరణ జరగడం వల్ల ఉత్పత్తి నెలకు 10,000 టన్నులకు పెరిగింది.

### 11.5.2. టాటా ఇనుము ఉక్కు కర్మాగారం:

ఈ కర్మాగారాన్ని భారతీయ ఉక్కు పరిశ్రమకు పితామహుడిగా పేరు పొందిన, ఉక్కు ఉత్పత్తికి విశేషంగా కృషిచేసి, గణనీయమైన అభివృద్ధిని సాధించిన జంషెడ్జి టాటా స్థాపించారు. అప్పటికే నూలు పరిశ్రమలో బాగా లాభాలు సంపాదించిన జంషెడ్జి టాటా ఇనుము ఉక్కు పరిశ్రమ వైపు తన దృష్టిని మరల్చాడు. అమెరిక. ఐరోపా దేశాలలోని నిపుణుల సహాయంతో సుదీర్ఘ అధ్యయనం చేసిన ఆయన 1907 వ సంవత్సరంలో బీహార్‌లోని సక్సి వద్ద "టాటా ఇనుము ఉక్కు కర్మాగారం" స్థాపించారు. సక్సి అనే పేరు తర్వాత జెంషెడ్ పూర్‌గా మారింది. టాటా ఈ కర్మాగారాన్ని 232 లక్షల రూపాయల పెట్టుబడితో ప్రారంభించారు. ఈ కర్మాగారం అనతి కాలంలోనే అభివృద్ధి చెందింది. ఈ కర్మాగారం మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో ఆంగ్ల ప్రభుత్వానికి 3 లక్షల టన్నుల ఉక్కు వస్తువులను, 1500 మైళ్ళ పొడవైన రైలు పట్టాలను సరఫరా చేసి ప్రభుత్వాన్ని ఆదుకుంది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత టాటా ఇనుము ఉక్కు కర్మాగారం 1920, 1933 సవత్సరాలలో దశల వారిగా విస్తరింపబడింది. ఫలితంగా 1935వ సంవత్సరం నాటికి సాలీనా 6 లక్షల టన్నుల తయారైన ఉక్కు ఉత్పత్తిని సాధించింది. రెండవ ప్రపంచ యుద్ధ ప్రారంభానికి టాటా ఇనుము ఉక్కు కర్మాగారం ఉత్పాదక శక్తి పాలినా 8 లక్షల టన్నులకు దగ్గరగా ఉండడం విశేషం. దేశంలోని ఉక్కు వాడకంలో ఈ కంపెనీ ఉక్కు ఉత్పత్తి శాతం 4 నుండి 80 కి పెరగడం ఈ కర్మాగారం కృషికి నిదర్శనం.

ఈ కర్మాగారాలే కాకుండా భారతదేశంలో మరికొన్ని ఇనుము-ఉక్కు కంపెనీలు కూడా స్థాపింపబడ్డాయి. 1918 వ సంవత్సరంలో బరాకర్ సమీపంలో ఇండియా ఇనుము ఉక్కు కంపెనీ స్టాపింపబడింది. ఈ సంస్థకు అనుబంధంగా 1937వ సంవత్సరంలో బెంగాల్ ఉక్కు కార్పొరేషన్ స్థాపింపబడింది. 1921లో మైసూర్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో భద్రావతి లో మైసూర్ ఇనుము – ఉక్కు కర్మాగారం స్థాపింపబడింది. ఒక్క భద్రావతిలో మైసూర్ ఇనుము – ఉక్కు కర్మాగారం ప్రభుత్వరంగ పరిశ్రమ. కాగా, మిగిలినవన్నీ ప్రైవేట్ రంగానికి చెందినవి. బరాకర్ సమీపంలోని ఇండియా ఇనుము – ఉక్కు కంపెనీ మూడు కోట్ల పెట్టుబడితో ప్రారంభించబడితే , బెంగాల్ ఉక్కు కార్పొరేషన్ 10 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైంది. చివరకు, ఈ రెండు కర్మాగారాల వ్యయాలను పరిశీలించిన సుంకాల కమీషన్ సిఫారసు మేరకు ఈ రెండు కర్మాగారాలు 1953 వ సంవత్సరంలో విలీనం చేయబడ్డాయి.

### 11.5.3. ఎగుమతి దిగుమతులు

మొదటి ప్రపంచయుద్ధం సమయంలో టాటా ఇనుము ఉక్కు పరిశ్రమ క్రమంగా పెరగడంతో పాటు దేశంలో వాడకం కూడా పెరిగింది. కాగా మిగతా కర్మాగారాల్లో ఉత్పత్తి తక్కువగా వుండేది. భారత దేశంలో ఉక్కు, ఇనుము ఉత్పత్తులు అభివృద్ధి సాధించడం దిగుమతులపై ప్రభావాన్ని కనబరిచింది. ప్రధానంగా దేశంలో ఉత్పత్తి పెరగడం వల్ల దిగుమతులమీద ప్రభావం పడింది. ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం. వ్యాపార మాంద్యం సమయాల్లో ఇనుము ఉక్కు దిగుమతులు బాగా తగ్గిపోయాయి. తర్వాత తిరిగి దిగుమతులు పెరిగినా ఆ పెరుగుదల అలాగే కొనసాగలేదు. 1929 వ సంవత్సరం తర్వాత ఇనుము ఉక్కు దిగుమతులు బాగా క్షీణించి పోయాయి. దీనికి తోడూ ప్రభుత్వం తీసుకున్న చర్యలు కూడా దిగుమతుల తగ్గుదలకు దోహదం చేశాయి. ఆంగ్ల ప్రభుత్వం 1924, 1927, 1934 సంవత్సరాలలో “ఉక్కు పరిశ్రమ రక్షణ చట్టాలు” చేసింది. ఈ చట్టాల ద్వారా ఇనుము ఉక్కు దిగుమతుల మీద పన్నులను అధికం చేసింది. దీనివల్ల దేశీయ ఇనుము, ఉక్కులకు దేశంలోనే మార్కెట్ పెరిగింది. ఫలితంగా దేశీయ ఇనుము ఉక్కు పరిశ్రమలకు ప్రోత్సాహం లభించి ఉత్పత్తులు పెంచే అవకాశం ఏర్పడింది.

దేశీయ ఇనుము ఉక్కు పరిశ్రమలకు ఆంగ్ల ప్రభుత్వం ప్రోత్సాహం కలిగించడం వల్ల ఇనుము ఉక్కు విదేశీ దిగుమతులు తగ్గినప్పటికీ, దేశీయ ఇనుము ఉక్కు పెద్దగా ఎగుమతులు జరగలేదనే చెప్పవచ్చు. ప్రధానంగా భారత దేశంలో ఉత్పత్తి అయిన ఇనుము ఉక్కు భారతదేశంలోని పరిశ్రమలకు, దేశంలో ఇతర ప్రయోజనాల ఉపయోగానికే సరిపోయింది. ఫలితంగా ఎగుమతుల్లో పెరుగదల లేదు.

## 11.6. పంచదార పరిశ్రమ:

భారతదేశంలోని ప్రధాన పరిశ్రమల్లో పంచదార లేదా చక్కర పరిశ్రమ ఒకటి. నూలు, జనపనార, ఇనుము ఉక్కు పరిశ్రమల తర్వాత మనదేశంలో అభివృద్ధి చెందిన పెద్ద పరిశ్రమగా పంచదార పరిశ్రమ పేరుపొందింది.

భారతదేశం నుంచి 17,18 శతాబ్దాలలో ఖండసార ప్రపంచంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేయబడేది. అయితే 19వ శతాబ్దంలో ఈ పరిస్థితి తారుమారు అయింది. అందుకు అనేక కారణాలు దోహదం చేశాయి. ఇతర ప్రాంతల్లో వీట్ పంచదార, చెరకు పంట, పంచదార తయారీలో నాణ్యత వృద్ధి చెందాయి. ఫలితంగా ఎగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి. అంతేకాకుండా పరిశ్రమలలో ఉత్పత్తి అయిన పంచదారను మారిషన్, జావా వంటి ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకోవడం

ప్రారంభమైంది. దిగుమతులు అధికం కావడం, దేశీయంగా తయారైన పంచదార ధర అధికంగా ఉండడం వల్ల, దిగుమతి చేసుకున్న పంచదార ధర తక్కువగా ఉండడం, దేశీయ ఉత్పత్తులలో నాణ్యత లేకపోవడం వల్ల గిరాకీ పూర్తిగా పడిపోవడం వంటి కారణాల వల్ల పంచదార కర్మాగారాలను నడపలేని పరిస్థితి ఏర్పడింది. వీటికి తోడూ పంచదార కర్మాగారాలు చిన్నవిగా వుండడం, వాటిల్లో ఉపయోగించే యంత్రాలు చిన్నవి కావడం, పరిశ్రమల్లో ఉపయోగించే పద్ధతులు చాలా పాతవి మొరటు విధానాలు కావడంవల్ల ఉత్పత్తిలో అధికంగా వృధా కావడం, నేరుగా చెరుకు రసం నుంచి కాకుండా బెల్లం తయారు చేసి దాని నుంచి పంచదారను తయారు చేయడం వంటి విషయాలు కూడా దేశీయ పంచదార పరిశ్రమలు క్షీణించడానికి దోహదం చేశాయి. వీటన్నింటికీ తోడూ మొలాసిస్ నుంచి రమ్ అనే మత్తు పానీయాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం అనుమతిని ఇవ్వకపోవడం కూడా కారణమైంది.

వీటన్నింటి వల్ల 1895–1900 సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశంలోని సంయుక్త రాష్ట్రంలో 180 కి పైగా పంచదార కర్మాగారాలు, బెంగాల్‌లో అనేక కర్మాగారాలు మూతపడ్డాయి. ఇది చెరుకు రైతులకు తీవ్ర ఇబ్బందులను కలిగించింది. ప్రధానంగా సంయుక్త రాష్ట్రంలోని భూమిలో 50 శాతం, పంజాబ్ రాష్ట్రంలో 15 శాతం, బీహార్, ఒరిస్సా ప్రాంతాలలో 10 శాతం భూములలో చెరుకును పండించేవారు. చెరుకు రైతులు తీవ్ర కష్టాలను, నష్టాలను ఎదుర్కొన్నారు.

ఇలాంటి స్థితిలో చెరుకు రైతులను ఆదుకునేందు సుంకాల మండలి నడుంకట్టింది. సుంకాల మండలి సూచనలతో వస్తువు విలువ ఆధారాన్ని బట్టి నిర్ణయం తీసుకునే సంస్థ అయిన అడ్వోలేరం విదేశాలనుంచి దిగుమతి చేసుకునే పంచాదార దిగుమతి మీద వంద శాతం రక్షిత పన్నును విధించింది. దీని ఫలితంగా విదేశాలనుంచి పంచదారను దిగుమతి చేసుకోవడం గణనీయంగా తగ్గిపోయింది. విదేశీ దిగుమతులు 1929–30 సంవత్సరాల ప్రాంతంలో విదేశాలనుంచి 9 లక్షలా 33వేల టన్నుల పంచదార దిగుమతి అవుతూ వుండేది. ఈ దిగుమతి 1936–37 సంవత్సరాల ప్రాంతం నాటికి శూన్యస్థాయికి చేరుకున్నాయి.

అంతేకాకుండా దీని ప్రభావం వల్ల తిరిగి పంచదార పరిశ్రమ అభివృద్ధి చెందసాగింది. దేశంలో పంచదార ఉత్పత్తి గణనీయంగా పెరగసాగింది. దేశంలో ఆధునిక పద్ధతులలో పంచదారను ఉత్పత్తి చేసే కర్మాగారాలు స్థాపించడం ప్రారంభమైంది. 1930–1931 సంవత్సరాల నాటికి ఇలాంటి కర్మాగారాలు దేశంలో 29 స్థాపింపబడ్డాయి. ఫలితంగా ఈ సమయానికి దేశంలో 3 లక్షలా యాభై వేల టన్నుల మేర పంచదార ఉత్పత్తి కాసాగింది. 1936–1937 సంవత్సరాల నాటికి ఇలాంటి కర్మాగారాల సంఖ్య దేశంలో 140 కి పెరిగింది. అందుకు అనుగుణంగా పంచాదార ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. ఈ సమయంలో దేశంలో 12 లక్షలా యాభై వేల టన్నుల పంచదార ఉత్పత్తి కాసాగింది. దీనికి తోడూ దేశంలో బెల్లం ఉత్పత్తి కూడా రెట్టింపు అయింది. పంచదార పరిశ్రమ భారతదేశంలో లాభదాయకంగా నడవ సాగింది.

ఇలాంటి స్థితిలో ప్రభుత్వం 1934 వ సంవత్సరంలో దేశంలో ఉత్పత్తి అయ్యే పంచదారపై ఎక్సైజ్ పన్నును విధించింది. తిరిగి ప్రభుత్వం 1937 వ సంవత్సరంలో ఎక్సైజ్ పన్నును పెంచింది. అయినా పంచదార ధర మాత్రం మార్కెట్లో పెరగక పోవడం విశేషం. పెరగక పోగా పంచదార ధరలు తగ్గ సాగాయి. 1931 నుంచి 1937 వ సంవత్సరం వరకు పంచదార ధరలలో నిరంతరం తగ్గుదల చోటు చేసుకుంది. దీనితో ధరల తగ్గుదలకు కారణాలను అన్వేషించిన పంచదార ఉత్పత్తిదారులు గిరాకీ కంటే పంచదార్ ఉత్పత్తి అధికం కావడమే అందుకు కారణంగా గుర్తించారు.

దీనితో చెరుకు రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, తమ స్వంత ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఉత్పత్తిదారులు తగిన చర్యలు తీసుకునడం ప్రారంభించారు. అందులో భాగంగా పంచదార అమ్మకాలను నియంత్రించడం కోసం 1937 వ సంవత్సరంలో 92 పంచదార కర్మాగారాల యజమానులు కలిసి పంచదార సిండికేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సిండికేట్ అనేక చర్యలు చేపట్టి రెండు సంవత్సరాలలో పంచదార ధరను రెట్టింపు చేసింది. ఇది పంచదార వినియోగదారులకు ఇబ్బంది కలిగిస్తుందని ప్రభుత్వం గుర్తించి పంచదార కర్మాగారాల గుత్తాధిపత్యాన్ని తొలగించింది. పంచదార ధరల నిర్ణయం, పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం తన అజమాయిషీ ని ఏర్పాటు చేసుకుంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రభావంగా ఏర్పడిన అధిక ఆదాయాలు, వినియోగదారుల అధిక గిరాకీని తట్టుకునేందుకు ప్రభుత్వం 1942 వ సంవత్సరంలో పంచదార రేషనింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టి పంచదార ధర, పంపిణీ పై నియంత్రణ కొనసాగింది. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1947 తర్వాత కూడా ఈ విధానం కొనసాగడం విశేషం.

ఈ విధంగా ఆధునిక పరిశ్రమలు ఆంగ్ల పరిపాలనా భారత దేశంలో కొంతమేరకు అభివృద్ధి చెందాయి.

## 11.7. సమీక్ష:

ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం జరిగిన తర్వాత ఆంగ్ల ప్రభుత్వం భారతదేశంలో అనుసరించిన వాణిజ్య, పారిశ్రామిక విధానాల ఫలితంగా భారతదేశంలోని సాంప్రదాయికమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడంతో మరో పరిణామం చోటుచేసుకొంది. ఇలాంటి స్థితిలో భారతదేశంలో ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భవించింది. కొందరు భారతీయులతో పాటు విదేశీయులు దేశంలో ఆధునిక పరిశ్రమలు స్థాపించారు. వాటిల్లో నూలు, ఇనుము ఉక్కు, పంచదార పరిశ్రమలు ప్రధానమైనవి. ఇవి భారత దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థాపింపబడి అభివృద్ధి చెందాయి.

## 11.8. వ్యాసరూప ప్రశ్నలు:

1) భారతదేశంలో ఆధునిక నూలు పరిశ్రమ ఏ విధంగా అభివృద్ధి చెందినదో వివరించండి?

2) భారత దేశంలో ప్రారంభింపబడిన ఆధునిక పరిశ్రమలను గురించి వ్యాసం రాయండి?

## 11.9. ఆధార గ్రంథాలు:


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.
2. Bipin Chandra - Essays on Colonialism.
3. R.P. Dutt - India Today.
4. D.R. Gadgil - The Industrial Evolution of India (1860-1939).
5. Sumit Sarkar - Modern Indian Economic History.
6. Sabyasachi Bhattachrya - Essays of Modern Indian Economic History.
7. Aladi Valdehi - History of Freedom Movement in India.
8. KK Datta - A Social History of Modern India.
9. తెలుగు అకాడమీ ప్రచురణ - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


**– డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

## పాఠం - 12

# భారతీయ పెట్టుబడిదారీ వర్గం

### 12.0. లక్ష్యము:

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారతదేశంలో స్థాపింపబడిన ఆధునిక యాంత్రిక పరిశ్రమలను స్థాపించిన పెట్టుబడిదారీ వర్గం, వారు జాతీయభావంతో దేశ స్వాతంత్రోద్యమానికి అందించిన సహాయం గురించి తెలుసుకోగలుగుతారు.

**విషయక్రమము:**


**12.1.** **పరిచయం**

**12.2.** **భారతదేశంలో పెట్టుబడిదారులు**

**12.2.1.** **పార్శీలు**

**12.2.2.** **టాటా కుటుంబం**

**12.2.3.** **బిర్లా కుటుంబం**

**12.3.** **జాతీయ నాయకుల పెట్టుబడి**

**12.4.** **భారతీయ పెట్టుబడిదారుల పట్ల ఆంగ్లేయుల వైఖరి**

**12.5.** **భారతీయ పెట్టుబడిదారీ వర్గంలో జాతీయభావ వృద్ధి**

**12.6.** **భారత వాణిజ్య పారిశ్రామిక సమాఖ్య**

**12.7.** **సమీక్ష**

**12.8.** **వ్యాసరూప ప్రశ్నలు**

**12.9.** **ఆధార గ్రంథాలు**


### 12.1. పరిచయం:

ప్రతి గ్రామంలోను గ్రామ వాడుక నిమిత్తం సామాన్య వస్తువులను తయారుచేసే పరిశ్రమలు ఉండేవి. నేత, కమ్మర, కుమ్మర, తోళ్ళపరిశ్రమ మొదలయినవాటిని ఆయా కులాలవారు కులవృత్తి పరిశ్రమలుగా, కుటీర పరిశ్రమలుగా నిర్వహిస్తూ వుండేవారు. వీరికి మాన్యాలు ఉండటంచేత వీరు గ్రామాలలో నివసిస్తూ ఉత్పత్తిని చేస్తూ ఉండేవారు. ఇందులోని ఉత్పత్తిలో ఆయా కుటుంబాలలోని సభ్యులంతా భాగస్వాములుగా వుండేవారు. సంపన్నులకోసం అవసరమైన వస్తువులను తయారుచేసే పరిశ్రమలు రాజధాని నగరాలలోను, ఇతర పట్టణాలలోను ఉండేవి. ఇక్కడ కూడా వస్తు తయారీదారులు నివసిస్తూ వస్తు ఉత్పత్తి చేస్తూ వుండేవారు. అందువల్ల వివిధ పట్టణాలు పారిశ్రామిక పట్టణాలుగా పేరుపొందాయి. ప్రధానంగా వారణాసి, మధుర, కంచి మొదలైన నగరాలు ఇలాంటి పరిశ్రమలకు కేంద్రాలుగా ఉండేవి. ఇక రాజ కుటుంబానికి అవసరమైన బంగారు, వెండి వంటి లోహాలను ఉపయోగించి వివిధ ఆభరణాలు వస్తువులు తయారు చేసేవారు కూడా గొప్ప

నైపుణ్యం కలిగినవారిగా పేరుపొందారు.

వీటన్నింటి ఫలితంగా 17, 18 శతాబ్దాలలో భారతీయ పరిశ్రమలు పేరు ప్రఖ్యాతులు సంపాదించి ఇతర దేశాల కంటే ఉన్నతంగా గుర్తింపు పొందాయి. అందువల్లనే అనాదిగా భారతదేశ నేత వస్త్రాలు, పట్టు వస్త్రాలు, అద్దకపు వస్త్రాలు వంటివాటికి విదేశాలలో ఎంతో గిరాకీ ఉండేది. వస్త్ర పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమలు కూడా భారతదేశంలో అభివృద్ధి చెందాయి. నిత్యం వాడకంకు అవసరమైన వస్తువులను తయారు చేయడంలో భారతదేశం స్వయంసమృద్ధిని సాధించింది. ఇలాంటి స్థితిలో భారతీయ వర్తకులు అనేకమంది భారతీయ వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసి బాగా లాభాలను ఆర్జిస్తూ వుండేవారు.

ఈ సమయంలో భారతదేశం 'ప్రపంచపు కార్ఖానా' అనేపేరు పొందింది. ఐరోపా ఖండంలో ప్రధానంగా లండన్, పారిస్, డమస్కస్ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉండేది. కాని ఐరోపా వర్తక సంఘాలు భారతదేశంలో ప్రవేశించడం, క్రమంగా ఆంగ్లేయులు భారత దేశంలో అధికారాన్ని పొందడంతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత ఈ పరిస్థితుల్లో పూర్తిగా మార్పులు చోటు చేసుకున్నాయి. పారిశ్రామిక విప్లవానికి ముందు తయారైన వస్తువులను ఎగుమతి చేసుకున్న ఆంగ్లేయులు విప్లవం తర్వాత ముడిసరుకులను ఎగుమతి చేసుకుని ఇంగ్లాండ్ లో వస్తువులను తయారు చేసి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయించడం ప్రారంభించారు.

దీనివల్ల సాంప్రదాయికమైన హస్త కళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడం ప్రారంభం అయింది. అయితే ఈ సమయంలో పారిశ్రామిక రంగంలో మరో పరిణామం చోటు చేసుకొంది. అదే ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భావం. అయితే భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి పరిమితంగానే ఉన్నప్పటికీ ఇది ముఖ్యమైన, సానుకూలమైన పరిణామానికి దారితీసింది. దీనివల్ల భారత భారతీయ దృక్పథం ఉన్న పారిశ్రామిక పెట్టుబడిదారి వర్గం ఆవిర్భవించింది.

## 12.2. భారతదేశంలో పెట్టుబడిదారులు:

విద్య ద్వారా పాశ్చాత్య శాస్త్రం. సాంకేతిక విజ్ఞానంలో ప్రవేశం ఏర్పడటం ఆ దేశాల నుంచి నిపుణులను పంచుకోడానికి అవకాశం కలగడం మొదలయిన కారణాల వల్ల కొంత మంది భారతీయులు కొద్దిపాటి పెట్టుబడులతో 19వ శతాబ్దం మధ్య భాగంలో పరిశ్రమలను ప్రారంభించడం మొదలుపెట్టారు. దీనితో భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభం కాగా, గతంలో వ్యాపార వ్యవహారాలను నిర్వహించిన కొందరు పెట్టుబడిదారులుగా మారారు.

అంతేకాకుండా బ్రాహ్మణులు, వైశ్యులు, కాయస్థులు వంటి వారు కూడా వారి వృత్తులను నిర్వహిస్తూనే వాణిజ్య ప్రపంచంలోకి ప్రవేశించారు. వీరు రెండుతరాలు గడిచే సరికల్లా మిగిలిన వర్గాల వారిని దాటి ముందుకు చేరుకోగలిగారు. మద్రాసులో కొన్ని హిందూ వాణిజ్య కులాల వారు కూడా ఐరోపా సంస్థలకు మధ్యవర్తులుగా మారి ఎగుమతి కోసం నీలిమందు, పత్తి, వస్త్రాలను కొనుగోలుచేయడంతో పాటు నేత పనిలో పెట్టుబడులు పెట్టడం, భూములు కొనుగోలు చేయడం మొదలైన పనులు ప్రారంభించారు. చివరకు వీరు సొంత ఏజెన్సీలు పెట్టుకోడానికి సరిపడా పెట్టుబడులను సంపాదించగలిగారు. సొంత ఏజెన్సీలు నడపడం ద్వారా వీరు సంపన్నులు అయ్యారు. తర్వాతి కాలంలో వీరు దేశీయ పరిశ్రమల స్థాపనలో కూడా కీలకమైన పాత్ర పోషించారు. ఈ వర్గాల శక్తియుక్తులూ, కృషి వలన బొంబాయి 19వ శతాబ్దపు మొదటి ఓడరేవుగా అభివృద్ధి చెందింది.

ఈ విధంగా భారతదేశంలో భారతీయ పరిశ్రమలను స్థాపించడంలో అనేక వర్గాలవారి కృషి వున్నా ప్రధానంగా ముగ్గురు కీలకమైన పాత్ర పోషించారు.

**12.2.1. పార్శీలు:**

భారతదేశంలోని పెట్టుబడిదారులలో పార్సీలు ప్రధాన పాత్ర పోషించారు. గతంలో వీరు భారత దేశ కుటీర పరిశ్రమలలో ఉత్పత్తి అయిన వస్తువులకు విదేశాలలో గిరాకీ వున్న సమయంలో భారతీయ వస్త్రాలు, వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఈ విధమైన అంతర్జాతీయ వ్యాపారం వల్ల వీరు అధిక లాభాలను ఆర్జించి దేశంలో సంపన్న వర్గంగా పేరుపొందారు. అంతేకాకుండా వీరు సాగించిన అంతర్జాతీయ వ్యాపారం వల్ల విదేశీ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలతో సంబంధాలు ఏర్పడ్డాయి. వీరు ప్రారంభంలో నీలిమందు పరిశ్రమపైన దృష్టి సారించారు. అయితే ప్రభుత్వ విధానాల వల్ల పార్సీలు దానిని కొనసాగించలేక ఇతర పరిశ్రమల వైపు దృష్టి సారించారు.

బొంబాయికి చెందిన పార్శీ వ్యాపారవేత్త కవాస్జీ నానాభాయ్ దవార్ 1851 వ సంవత్సరంలో "బొంబాయి స్పిన్నింగ్ వీవింగ్ కంపెనీ లిమిటెడ్" అనే నూలు మిల్లును బొంబాయిలో స్థాపించాడు. భారతదేశంలో స్థాపింపబడిన మొట్టమొదటి నూలు మిల్లు ఇది ఇతను. ఈ కర్మాగారం 1854 వ సంవత్సరంలో పనిచేయడం ప్రారంభించింది. ఈ కర్మాగారంలో 5 వేల కుదురులు (Spindles) వుండేవి. ఈ కర్మాగారం ఉత్పత్తిని ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే లాభాలను గడించడంతో అనేక పార్సీ ధనిక వ్యాపారుల దృష్టి నూలు కర్మాగారాలపై పడింది. ఫలితంగా బొంబాయిలో అనేక నూలు మిల్లులు స్థాపింపబడ్డాయి. 1851 వ సంవత్సరం మొదలు 1915 వ సంవత్సర కాలం వరకు ఒక్క బొంబాయి నగరంలోనే సుమారు 30 లక్షల కుదురులు, 52 వేల మగ్గాలు, ఒక లక్షా పదివేలకు పైగా కార్మికులతో 7.66 కోట్ల రూపాయల పెట్టుబడితో 96 మిల్లులు ప్రారంభం అయ్యాయి.

అహ్మదాబాద్ సంపన్న పార్సీ వ్యాపారులు కూడా నూలు కర్మాగారాలను ఏర్పరచడానికి ఆసక్తిని కనబరిచారు. 1859 వ సంవత్సరంలో అహ్మదాబాద్‌లో మొదటి నూలు మిల్లు స్థాపింపబడింది. ఈ మిల్లు 1861 వ సంవత్సరంలో మే నెల 30 వ తేదీన ఉత్పత్తిని ప్రారంభించింది. ది అహ్మదాబాద్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ కంపెనీ లిమిటెడ్ అనే పేరుతో అహ్మదాబాద్ లోని ఈ మొదటి మిల్లును రాంచోడ్ లాల్ చోటాలాల్ అనే వ్యాపార వేత్త ప్రారంభించాడు. అప్పటి నుంచి 1914 వ సంవత్సరం నాటికి అహమ్మదాబాద్ లో 50 నూలు మిల్లులు స్థాపింప బడ్డాయి.

బరాకర్ అనే పార్శీ వ్యాపారి "బెంగాల్ ఇనుము – ఉక్కు కంపెనీ" 1875 వ సంవత్సరంలో స్థాపించాడు. ఆధునిక పద్ధతుల్లో దుక్క ఇనుము ఉత్పత్తికి ఈ కంపెనీ శ్రీకారం చుట్టింది. తర్వాత 1919 వ సంవత్సరంలో బెంగాల్ ఇనుము – ఉక్కు కంపెనీ "బెంగాల్ ఇనుము కంపెనీ"గా పేరు మార్చుకుంది. ఈ కంపెనీ 1907 వ సంవత్సరం నాటికి సంవత్సరానికి 50,000 టన్నుల దుక్క ఇనుమును తయారుచేసే స్థాయికి ఎదిగింది. తర్వాతి పది సంవత్సరాల్లో ఈ కంపెనీలోని ఉత్పత్తి విభాగంలో విస్తరణ జరగడం వల్ల ఉత్పత్తి నెలకు 10,000 టన్నులకు పెరిగింది.

**12.2.2. టాటా కుటుంబం:**

భారతీయ పరిశ్రమలను స్థాపించడంలో కీలకమైన పాత్ర పోషించిన ముగ్గురిలో టాటా కుటుంబం ప్రధానమైంది. జంషెడ్జి టాటా 1870వ సంవత్సరంలో రూ. 21,000 మూలధనంతో వ్యాపార సంస్థను స్థాపించాడు. ఆయన చించ్‌పోక్లి వద్ద

ఒక దివాళా తీసిన ఆయిల్ మిల్లును కొనుగోలు చేసి, దానిని అలెగ్జాండ్రా మిల్ పేరుతో పత్తి మిల్లుగా మార్చాడు. దానిని అతను రెండు సంవత్సరాల తర్వాత లాభంతో విక్రయించాడు. 1874వ సంవత్సరంలో అతను నాగ్‌పూర్‌లో పత్తి మిల్లును స్థాపించాడు. "ఎంప్రెస్ మిల్" అని పేరు పెట్టారు. వీరు ప్రారంభంలో వస్త్ర పరిశ్రమ పట్ల దృష్టిసారించి అందులో బాగా లాభాలు గడించారు. తర్వాత వారి దృష్టి ఇతర పరిశ్రమల వైపుకు మళ్ళింది. ఆయన ఇనుము మరియు ఉక్కు కంపెనీ, ప్రత్యేకమైన హోటల్, ప్రపంచ స్థాయి అభ్యాస సంస్థ మరియు జలవిద్యుత్ ప్లాంట్ అనే నాలుగు సంస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని, నాలుగు లక్ష్యాలను సాధించడానికి తీవ్ర కృషి చేశాడు.

జంషెడ్జి నుస్సర్వాన్జీ టాటా – టాటా ఇనుము ఉక్కు కర్మాగారాన్ని అమెరిక, ఐరోపా దేశాలలోని నిపుణుల సహాయంతో సుదీర్ఘ అధ్యయనం చేసిన అనంతరం 1907 వ సంవత్సరంలో బీహార్‌లోని సక్సి వద్ద స్థాపించారు. టాటా ఈ కర్మాగారాన్ని 232 లక్షల రూపాయల పెట్టుబడితో ప్రారంభించారు. ఈ కర్మాగారం అనతి కాలంలోనే అభివృద్ధి చెందింది. ఈ కర్మాగారం మొదటి ప్రపంచయుద్ధం సమయంలో ఆంగ్ల ప్రభుత్వానికి 3 లక్షల టన్నుల ఉక్కు వస్తువులను, 1500 మైళ్ళ పొడవైన రైలు పట్టాలను సరఫరా చేసి ప్రభుత్వాన్ని ఆదుకుంది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత టాటా ఇనుము ఉక్కు కర్మాగారం 1920, 1933 సంవత్సరాలలో దశల వారిగా విస్తరింపబడింది. ఫలితంగా 1935 వ సంవత్సరం నాటికి సాలీనా 6 లక్షల టన్నుల తయారైన ఉక్కు ఉత్పత్తిని సాధించింది. రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభానికి టాటా ఇనుము ఉక్కు కర్మాగారం ఉత్పాదక శక్తి పాలినా 8 లక్షల టన్నులకు దగ్గరగా ఉండడం విశేషం. సక్సి అనే పేరు తర్వాత జెంషెడ్ పూర్ గా మారింది. ఈ కర్మాగారం వల్ల జంషెడ్జి టాటా భారతీయ ఉక్కు పరిశ్రమకు పితామహుడిగా పేరు పొందారు.

జంషెడ్జి టాటా 1903 వ సంవత్సరంలో బొంబాయి లోని కొలాబా ప్రాంతంలో తాజ్ మహల్ హోటల్‌ను ప్రారంభించారు. జంషెడ్జి టాటా మరణం తరువాత, అతని పెద్ద కుమారుడు దొరాబ్జీ టాటా టాటా సంస్థ ఛైర్మన్ అయ్యాడు. ఆయన తండ్రి కలలను సాకారం చేసేందుకు పశ్చిమ భారతదేశంలోని మొట్టమొదటి హైడ్రో ప్లాంట్‌కు జీవం పోసి, టాటా పవర్‌కు జన్మనిచ్చాడు. అలాగే "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్" ను 1911 వ సంవత్సరంలో ప్రారంభించాడు. 1932 వ సంవత్సరంలో టాటా సంస్థ ఒక విమానయాన సంస్థను స్థాపించింది, దీనిని టాటా ఎయిర్ సర్వీసెస్ అని పిలుస్తారు. తర్వాత ఇంది టాటా ఎయిర్‌లైన్స్‌గా మార్చబడింది. దోరాబ్జీ టాటా తర్వాత JRD టాటా తన పూర్వీకుల కృషిని కొనసాగించాడు. 1945 వ సంవత్సరంలో టాటా మోటార్స్ స్థాపించబడింది. మొదటగా లోకోమోటివ్‌లపై దృష్టి సారించింది. 1954 వ సంవత్సరంలో డైమ్లెర్–బెంజ్‌తో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసిన తర్వాత ఇది వాణిజ్య వాహన మార్కెట్లోకి ప్రవేశించింది.

టాటా కుటుంబం వారు దేశంలో పారిశ్రామికాభివృద్ధి సాధించడంతో పాటు మంచి పెట్టుబడిదారులుగా పేరుపొందారు.

### 12.2.3. బిర్లా కుటుంబం:

భారతీయ పరిశ్రమలను స్థాపించడంలో కీలకమైన పాత్ర పోషించిన ముగ్గురిలో బిర్లా కుటుంబం ఒకటి. జె.డి. బిర్లాగా పిలవబడే ఘన్ శ్యామ్ దాస్ బిర్లా భారతదేశంలోని దేశీయ పెట్టుబడి దారుల్లో పెద్ద పెట్టుబడి దారుడుగా పేరు పొందడంతో పాటూ దేశంలో దేశీయ పరిశ్రమల అభివృద్ధికి విశేషంగా కృషి చేశాడు. బిర్లా తాత గారు శివనారాయణ బిర్లా రాజస్థాన్‌లోని పిలాని ప్రాంతంలో పెద్ద వ్యాపారి. ఆయన తర్వాతి కాలంలో కలకత్తా కు చేరుకొని బట్టల వ్యాపారంలో

ప్రవేశించారు. వ్యాపారం బాగా అభివృద్ధి చెంది గొప్ప వ్యాపార వేత్తగా పేరుపొందారు. ఆయన తర్వాత ఆయన కుమారుడు బలాదియోదాస్ బిర్లా కూడా తండ్రి వ్యాపారాన్ని కొనసాగించాడు.

ఘన శ్యామ్ కూడా తాత తండ్రుల వలే కలకత్తా వెళ్ళి బట్టల వర్తకం సాగించాడు. దానితో పాటు వస్తు తయారీ యూనిట్లను దేశం నలుమూలలా స్థాపించాడు. 50 లక్షల పెట్టుబడి దాటిన తరువాత తన సోదరులతో కలిసి 1919వ సంవత్సరంలో గ్వాలియర్ పట్టణంలో సొంత వస్త్ర మిల్లు స్థాపించాడు. తరువాత బిర్లా రాజకీయాలలో ప్రవేశించాడు. ఆంగ్ల పాలనా కాలంలో 1926 వ సంవత్సరంలో శాసనసభకు ఎన్నికై శాసన సభ్యుడుగా పనిచేశాడు.

తరువాత ఘన శ్యామ్ కార్ల వ్యాపారంపై దృష్టి సారించాడు. 1940వ సంవత్సరంలో హిందూస్తాన్ మోటార్స్ అనే సంస్థను స్థాపించాడు. ఇందులో కూడా రాణించి లాభాలు పొందిన బిర్లా తరువాత సిమెంట్, ఇనుము, కెమికల్స్, ప్లాస్టిక్ పరిశ్రమలను స్థాపించారు.

అంతటితో ఆగకుండా 1943వ సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలోకి అడుగు పెట్టిన బిర్లా స్వదేశీ బ్యాంకు వుండాలని భావించారు. 1943వ సంవత్సరంలో యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ అనే బ్యాంకును కలకత్తాలో ప్రారంభించారు.

## 12.3. జాతీయ నాయకుల పెట్టుబడి:

భారతదేశంలో ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం ప్రారంభమయిన సమయంలో ఉద్యమంలో ప్రవేశించి నాయకత్వం వహించి ఉద్యమాన్ని నడిపిన కొందరు నాయకులు అంతకంటే ముందు వ్యాపార వేత్తలుగా, పారిశ్రామిక వేత్తలుగా రాణించడం విశేషం. తొలితరం జాతీయ నాయకుడుగా, మహాత్మాగాంధీజీ రాజకీయ గురువుగా ప్రసిద్ధి చెందిన దాదాభాయి నౌరోజీ అందులో ప్రముఖులు. ఇంగ్లాండ్ దేశంలోని లండన్ నగరంలో స్థాపింప బడిన కామాస్ అనే భారతీయ వాణిజ్య సంస్థలో దాదాభాయి నౌరోజీ భాగస్వామి. తర్వాత దాదాభాయి నౌరోజీ 1869 వ సంవత్సరంలో దాదాభాయి నౌరోజీ అండ్ కంపెనీ అనే పేరుతొ నూతన సంస్థను స్థాపించాడు.

ఈ విధంగా దాదాభాయి నౌరోజీ బాటలోనే అనేక మంది జాతీయ నాయకులు వాణిజ్య, పారిశ్రామిక రంగంలో రాణించారు. బాలగంగాధర తిలక్ కాటన్ జిన్నింగ్ పరిశ్రమలోని భాగాస్వాములలో ఒకరుగా వుండేవారు. అలాగే మదన్ మోహన్ మాలవ్య అలాహాబాద్‌లో స్థాపింపబడిన ప్రయాగ్ చక్కర కర్మాగారంలో భాగస్వామిగా వుండేవారు. తర్వాత ఆయనే వారణాసిలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. పంజాబ్ కేసరిగా పేరు పొందిన లాలాలజపతి రాయ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ డైరెక్టర్‌గా వుండేవారు. ఈ విధంగా ప్రసిద్ధి చెందిన నాయకులు పరిశ్రమల స్థాపనలో ప్రధాన పాత్ర పోషించి పెట్టుబడిదారులుగా ఉండడం వల్ల అనేకమంది భారతదేశంలోని వ్యాపారులు, సంపన్నులు ఆయా కంపెనీలలో పెట్టుబడులు పెట్టడంతో పాటు నూతనంగా పరిశ్రమలను స్థాపించడం ప్రారంభించారు. దీనితో భారతదేశంలో బలమైన పెట్టుబడీ దారి వర్గం ఆవిర్భవించింది.

దీనికి తోడు భారత జాతీయోద్యమంలో భాగంగా వందేమాతర ఉద్యమ కాలంనుంచి ఉద్యమంలో స్వదేశీ ఉద్యమం భాగంగా సాగింది దీనితో స్వదేశీ పరిశ్రమల స్థాపన అధికమైంది. ముఖ్యంగా యువకులు అనేక మంది అగ్గిపెట్టెలు, పెన్సిళ్ళు, సబ్బులు వంటి వాటి తయారీలో శిక్షణ కోసం జపాన్ లాంటి దేశాలకు పంపబడ్డారు. శిక్షణ పూర్తి చేసుకువచ్చిన యువకుల ఉపాధి కోసం దేశంలో స్వదేశీ పరిశ్రమల స్థాపన ప్రారంభం అయింది. దేశ భక్తులైన అనేక మంది సంపన్నులు

ఈ పరిశ్రమలను స్థాపించారు. కొందరు యువకులు కూడా పరిశ్రమల స్థాపనకు నిర్వహణకు ముందుకు వచ్చారు. దీనితో దేశంలో భారతీయ పెట్టుబడిదారుల సంఖ్య మరింత అధికమైంది.

## 12.4. భారతీయ పెట్టుబడిదారుల పట్ల ఆంగ్లేయుల వైఖరి:

ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చి వ్యాపారం చేసిన తొలిదశలో వాణిజ్యం చేస్తున్న, ఎగుమతి దిగుమతులు చేస్తున్న అంతర్జాతీయ వాణిజ్య వేత్తలను ప్రోత్సహించారు. అలాగే ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవం సంభవించి పరిశ్రమలు ప్రారంభం అయిన సమయంలో కూడా భారతీయ వాణిజ్య వేత్తలను ప్రోత్సహించారు. ఇంగ్లాండ్ దేశంలో పారిశ్రామిక విప్లవ ఫలితంగా పెరిగిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి భారతదేశం మంచి మార్కెట్ అని భావించిన ఆంగ్ల ప్రభుత్వం భారతదేశంలోని కుటీర, చిన్న పరిశ్రమలను నీరుకార్చేందుకు అనేక చర్యలు చేపట్టింది. దిగుమతి పన్నులను రద్దు చేయడం, స్వేచ్ఛా వ్యాపారం, భారతదేశ ఉత్పత్తుల మీద అధికపన్నులు విధించడం వంటి విధానాల ద్వారా భారతదేశ పరిశ్రమలను దెబ్బతీసింది. ఇలాంటి స్థితిలో గతంలో వాణిజ్యవేత్తలుగా బాగా సంపాదించిన వర్గాలు భారతదేశంలో ఆధునిక పరిశ్రమల స్థాపనను ప్రారంభించారు. దీనితో ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. భారతదేశంలో పెట్టుబడి దారీ వర్గం అవతరించినప్పటి నుంచీ భారతీయ పెట్టుబడిదారీ వర్గానికి ఆంగ్లేయ పెట్టుబడిదారీ వర్గానికి మధ్య పోటీ ఏర్పడి చివరకు అది అనేక వివాదాలూ, విభేదాలకు కారణం అయింది. ఇలాంటి స్థితిలో ఆంగ్ల ప్రభుత్వంలో భారత దేశంలో స్థాపింప బడిన ఈ పరిశ్రమలు తమదేశంలోని పరిశ్రమలకు పోటీగా నిలుస్తాయనీ, తమదేశంలో ఉత్పత్తి అయిన వస్తువులకు భారతదేశంలో మార్కెట్ ఉండదనే భయం ఏర్పడింది. దీనితో భారతీయ పరిశ్రమలకు ప్రోత్సాహం, రక్షణ ఇవ్వకపోగా, భారతీయ పెట్టుబడిదారులను అనేక ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించింది.

## 12.5. భారతీయ పెట్టుబడిదారీ వర్గంలో జాతీయభావ వృద్ధి:

భారతీయ పరిశ్రమలు, పెట్టుబడిదారీ వర్గం పట్ల ఆంగ్ల ప్రభుత్వం అనుసరించిన అణచివేత వైఖరి వారిలో ప్రభుత్వ వ్యతిరేకతను కలిగించింది. ఆంగ్ల పరిపాలనలో అణచివేతకు గురైన భారత పెట్టుబడి దారీ వర్గం తమ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే ఆంగ్లేయపాలనను అంతమొందించడం ఒక్కటే మార్గం అని భావించింది. దీనితో వారు జాతీయవాదం వైపు మొగ్గు చూపించసాగారు. విదేశీ పాలననూ, ఆంగ్లేయుల రక్షణాత్మక విధానాలను అంతమొందించడానికి జాతీయవాదమే సరైన ఆయుధమని భారతీయ పెట్టుబడిదారీ వర్గం భావించింది.

ఇలాంటి స్థితిలో కొన్ని పరిశ్రమలలో భాగస్వాములుగా వున్న దాదాభాయి నౌరోజీ, బాలగంగాధర తిలక్, లాలాలజపతిరాయ్, మదన్ మోహన్ మాలవ్యా వంటి వారు జాతీయవాద దృక్పథంతో జాతీయోద్యమంలో ప్రవేశించడం పెట్టుబడి దారీ వర్గానికి స్ఫూర్తిని ఇచ్చింది. దీనికి తోడూ వీరు జాతీయోద్యమానికి నాయకత్వం వహించి ఉద్యమాన్ని నడపడం భారతీయ పెట్టుబడి దారీ వర్గానికి మరింత స్ఫూర్తిని ఇవ్వడంతో ఉద్యమానికి సహాయ సహకారాలు అందించడం ప్రారంభించారు. అంతేకాకుండా ఈ వర్గాలు తమ సమస్యలను పరస్పరం చర్చించుకునేందుకు జాతీయ కాంగ్రెస్ ఒక వేదికగా ఉపయోగపడింది.

జాతీయ ఉద్యమం బలపడుతున్న కొద్దీ భారత పెట్టుబడి వర్గానికి రాజకీయ బలం పెరగసాగింది. తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తృత పరిచి తమ ప్రాబల్యాన్ని పెంచుకోడానికి వారికి తగిన అవకాశం ఏర్పడింది. స్వదేశీ ఉద్యమం తలెత్తడానికి పెట్టుబడిదారీ వర్గం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత పెట్టుబడిదారీ వర్గం

జాతీయోద్యమానికి మరింత దగ్గరైంది.

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో పెట్టుబడిదారులు పొందిన లాభాలు, యుద్ధం సమయంలో భారతీయులకు ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పిస్తామని ఆంగ్లేయులు ఇచ్చిన హామీ వంటివి భారతీయ పెట్టుబడిదారుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని కలిగించాయి. దీనితో వారిలో దేశంనుంచి ఆంగ్లేయ పెట్టుబడిదారీ వర్గాన్ని తొలగించ వచ్చనే ఆశ కలిగింది. దీనికి తోడూ టాటా ఇనుము ఉక్కు కర్మాగారంతో పాటు మిగిలిన పరిశ్రమలు అభివృద్ధి చెందడం పెట్టుబడిదారి వర్గానికి మరింత విశ్వాసాన్ని కలిగించాయి. వీటన్నింటి ఫలితంగా భారతీయ పెట్టుబడి దారులు జాతీయోద్యమాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉద్యమానికి విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు.

## 12.6. భారత వాణిజ్య పారిశ్రామిక సమాఖ్య :

భారత పెట్టుబడిదారీ వర్గం విదేశీ పెట్టుబడిలో విలీనం కాకుండా విడిగా ఉన్నప్పటికీ అది వలస ఆర్థిక వ్యవస్థలో భాగంగానే ఉండాల్సి వచ్చింది. ఆంగ్లేయ సామ్రాజ్య వాదం, పరిశ్రమలకు అవసరమైన యంత్ర సామాగ్రి కోసం ఇంగ్లాండ్‌తో పాటు ఇతరదేశాలపై ఆధారపడడం, దాదాపు అన్ని మౌలిక పరిశ్రమలూ ఆంగ్లేయుల ఆధీనంలోనే ఉండడం దీనికి కారణాలు. కాగా భారతదేశంలోని పెట్టుబడిదారీ వర్గం అంతా ఒకే లాంటిది కాదు. అందులో వాణిజ్య పెట్టుబడిదారులు, పరిశ్రమల పెట్టుబడిదారులు మొదలైన వారు వున్నారు. వీరిలో ఎవరి ప్రయోజనాలు వారికి వున్నాయి. ఈవిధంగా వున్న తేడాలను కూడా ఆంగ్ల ప్రభుత్వం తన స్వప్రయోజనాలకు వాడుకోవడంతో భారతీయ పెట్టుబడిదారీ వర్గం ఆలోచనలో పడింది. తమ తమ అవసరాలు వేరైనా తామందరికీ శత్రువు ఒక్కరే కనుక తామంతా ఒక్కటిగా, సమైక్యంగా ఉండాలనే భావన వారిలో కలిగింది. ఫలితంగా వారిలో ఐక్యత ఏర్పడింది. ఈ ఐక్యత ఫలితంగా 1920 వ సంవత్సర ప్రాంతంలో భారత వాణిజ్య పారిశ్రామిక సమాఖ్య అనే సంఘం ప్రారంభింపబడింది.

ఈ సమాఖ్య ఆంగ్ల పారిశ్రామిక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యంగా 1920 తరవాత యంత్రాలు, యంత్ర పరికరాలు, ఆటోమొబైల్స్, విమాన నిర్మాణం, నౌకానిర్మాణం, రసాయనాలు, రసాయనక ఎరువులు వంటి భారీ పరిశ్రమలలో ఆంగ్లేయులు పెట్టుబడి పెట్టడం వంటి విధానాలను భారత పెట్టుబడిదారులు వ్యతిరేకించారు. భారత పరిశ్రమలపై భారత పారిశ్రామికవేత్తలకే ఆధిపత్యం ఉండాలన్న నినాదాన్ని ప్రారంభించిన భారత పెట్టుబడిదారీ వర్గం దీనిని సహించలేక పోయింది. పరిశ్రమల దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సబ్సిడీలు, హామీలు, ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు హామీలు, మార్కెట్ల కల్పన, భారత సాంకేతిక సిబ్బందికి శిక్షణ మొదలయిన విషయాల్లో ప్రభుత్వం సహాయం చేయాలని భారత వాణిజ్య పారిశ్రామిక సమాఖ్య డిమాండ్ చేయసాగింది. ప్రభుత్వ పెట్టుబడులపై భారతీయ నియంత్రణ ఉండాలని, ఆర్థిక వ్యవస్థకు చెందిన కీలకమైన ప్రభుత్వ నిధుల్లో భారతీయులకు స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ విధంగా ఆంగ్ల పారిశ్రామిక విధానాలను వ్యతిరేకించిన భారతీయ పెట్టుబడిదారులు దేశ స్వాతంత్ర సాధనలో తమవంతు బాధ్యతను నిర్వహించడంతో పాటు స్వాతంత్రానంతరం కూడా దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

## 12.7. సమీక్ష:

సాంప్రదాయకమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడం ప్రారంభం అయింది. అయితే ఈ సమయంలో పారిశ్రామిక రంగంలో మరో పరిణామం చోటు చేసుకొంది. అదే ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భావం. అయితే

భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి పరిమితంగానే ఉన్నప్పటికీ ఇది ముఖ్యమైన, సానుకూలమైన పరిణామానికి దారితీసింది. దీనివల్ల భారత భారతీయ దృక్పథం ఉన్న పారిశ్రామిక పెట్టుబడిదారి వర్గం ఆవిర్భవించింది. భారతీయ పెట్టుబడిదారుల్లో పార్సీలు, టాటా కుటుంబం, బిర్లా కుటుంబం ప్రధానమైన వారు. కొందరు జాతీయ నాయకులు కూడా పరిశ్రమల స్థాపనలో భాగస్వాములు కావడం వల్ల భారతీయ పెట్టుబడిదారుల్లో జాతీయ భావం అభివృద్ధి చెందింది. దీనికి తోడు ఆంగ్లేయులు భారతీయ పెట్టుబడిదారులపైన చూపించిన వ్యతిరేక భావం వారిలో మరింత జాతీయ అభిమానాన్ని పెంచగా వారు దేశ స్వాతంత్ర్య సాధన కోసం సాగిన ఉద్యమానికి ఇతోధికంగా సహాయం చేశారు.

## 12.8. వ్యాసరూప ప్రశ్నలు:

1) భారతదేశ పెట్టుబడిదారీ వర్గాన్ని గురించి వివరించండి?
2) భారతదేశ పెట్టుబడిదారుల పట్ల ఆంగ్లేయులు అనుసరించిన విధానం వారిలో జాతీయభావాన్ని ఎలా కలిగించిందో వివరించండి?

## 12.9. ఆధార గ్రంథాలు:


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.
2. Bipin Chandra - Essays on Colonialism.
3. R.P. Dutt - India Today.
4. D.R. Gadgil - The Industrial Evolution of India (1860-1939).
5. Sumit Sarkar - Modern Indian Economic History.
6. Sabyasachi Bhattachrya - Essays of Modern Indian Economic History.
7. Aladi Valdehi - History of Freedom Movement in India.
8. KK Datta - A Social History of Modern India.
9. తెలుగు అకాడమీ ప్రచురణ - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


**- డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

## పాఠం - 13

# ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఆటంకాలు

**13.0. లక్ష్యము:**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారతదేశంలో స్థాపింపబడిన ఆధునిక యాంత్రిక పరిశ్రమలు అనుకున్నంతగా అభివృద్ధి చెందకపోవడానికి గల కారణాలను అడ్డంకులను గురించి తెలుసుకోగలుగుతారు.

**విషయక్రమము:**


**13.1.** పరిచయం

**13.2.** స్వేచ్ఛా విధానం

**13.3.** సరుకుల కొనుగోలు

**13.4.** పరిశ్రమలకు ఆర్థిక సహాయం

**13.5.** కరెన్సీ

**13.6.** రైల్వేలు

**13.7.** ప్రభుత్వ వ్యయం

**13.8.** కార్మికుల స్థితిగతులు

**13.9.** కార్మికుల సమస్యలు

**13.10.** కార్మిక సంఘాల ఉద్యమాలు

**13.11.** సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉండడం

**13.12.** సమీక్ష

**13.13.** వ్యాసరూప ప్రశ్నలు

**13.14.** ఆధార గ్రంథాలు


**13.1. పరిచయం:**

సాంప్రదాయకమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడంతో మరో పరిణామం చోటు చేసుకొంది. అదే ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భావం. విద్య ద్వారా పాశ్చాత్య శాస్త్రం. సాంకేతిక విజ్ఞానంలో ప్రవేశం ఏర్పడటం ఆ దేశాల నుంచి నిపుణులను పంచుకోడానికి అవకాశం కలగడం మొదలయిన కారణాల వల్ల కొంత మంది భారతీయులు, ఐరోపావారు కొద్దిపాటి పెట్టుబడులతో 19వ శతాబ్దం మధ్య భాగంలో ఆధునిక పరిశ్రమలను ప్రారంభించారు. అయితే భారతీయ పరిశ్రమల ప్రగతి, అత్యంత మందకొడిగా సాగింది. ఇది కూడా చాలావరకు, 19వ శతాబ్దిలో నూలు, జనపనార పరిశ్రమలు, తేయాకు తోటలకు, 1930 దశకంలో పంచదార, సిమెంట్ పరిశ్రమలకు మాత్రమే పరిమితమైంది. 1946లో కూడా కర్మాగారాల్లో పనిచేసే మొత్తం కార్మికుల్లో 40 శాతం మంది, నూలు, జనవనార పరిశ్రమల్లోనే పనిచేయడం జరిగింది.

ఉత్పత్తి, ఉద్యోగరీత్యా, ఇతర దేశాల ఆర్థికాభివృద్ధి, భారతదేశ ఆర్థికావసరాలతో పోల్చి చూస్తే, భారతదేశంలో ఆధునిక పారిశ్రామికాభివృద్ధి చాలా తక్కువగా జరిగింది.

భారతదేశంలోని పరిశ్రమలు అనుకున్నంతగా అభివృద్ధి చెందలేకపోవడానికి అనేక కారణాలు దోహదం చేశాయి.

## 13.2. స్వేచ్ఛా విధానం:

ఆంగ్లేయుల సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ విధానాలతో పాటు భారతీయ పరిశ్రమల పట్ల ఆంగ్లేయుల వ్యతిరేకత భారతీయ పరిశ్రమల ప్రగతికి అడ్డంకులుగా తయారయ్యాయి. ఆంగ్లేయులు ఇంగ్లాండ్‌లో పారిశ్రామిక విప్లవం జరిగిన తర్వాత భారతీయ వస్త్రాలు, వస్తువులు, పరిశ్రమలను శత్రువులుగా చూడడం ప్రారంభించారు. దీనితో వీటిని అడ్డుకునేందుకు ఆంగ్లేయులు ఆంగ్ల ప్రభుత్వం మీద వత్తిడి తీసుకురావడం మొదలు పెట్టారు. ప్రధానంగా భారతదేశంలో నూలు మిల్లులు స్థాపించబడడం ఇంగ్లాండ్‌లోని నూలుమిల్లుల ప్రధాన కేంద్రమైన లంకషైర్‌లోని నూలు మిల్లుల యజమానులకు ఇష్టం లేదు. అందువల్ల వారు భారతదేశంలోని నూలు మిల్లులకు ఎటువంటి ప్రోత్సాహకాలు లభించకుండా ఆంగ్ల ప్రభుత్వంపై వత్తిడి తేవడం ఉదాహరణ. వీటన్నింటి ప్రభావం వల్ల ఆంగ్ల ప్రభుత్వం భారతీయ పరిశ్రమల అభివృద్ధిని కుంటుపర్చే ఆర్థిక విధానాలు అవలంభించింది. అప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఇంగ్లాండ్, జపాన్, ఫ్రాన్స్ జర్మనీ దేశాల పరిశ్రమల నుంచి పోటి ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సహాయం, భారతీయ పరిశ్రమలకు రక్షణ అవసరమైన సమయంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించడం కానీ, రక్షణ చర్యలను తీసుకోవడం కానీ చేయలేక పోయింది. అంతేకాకుండా ఇంగ్లాండ్‌లోని పరిశ్రమల ప్రయోజనం కోసం స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని అనుసరించసాగింది. ఈ విధంగా భారతదేశంలో స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని అనుసరించిన ఇంగ్లాండ్ ప్రభుత్వం తమ దేశంలోని పరిశ్రమల రక్షణకు మాత్రం తమ స్వదేశంలో ఈ విధానాన్ని అనుసరించక పోవడం ఇంగ్లాండ్ పక్షపాత విధానానికి నిదర్శనం. తన స్వదేశంలో పరిశ్రమల రక్షణకు అనేక చట్టాలను ఇంగ్లాండ్ ప్రభుత్వం 19 వ శతాబ్దంలో చేసింది. వాటిల్లో ఫ్యాక్టరీ చట్టం, గనుల చట్టం, పారిశ్రామిక వివాద చట్టం వంటివి ప్రధానమైన చట్టాలు. ఇటువంటి చట్టాలు భారత దేశంలో ప్రవేశ పెట్టకపోవడం వల్ల భారతదేశ పరిశ్రమలకు రక్షణ లేకుండా పోయి అవి అనుకున్నంతగా అభివృద్ధి చెందలేక పోయాయి.

అయితే 1920 వ సంవత్సరం నుంచి భారతదేశంలో జాతీయోద్యమం తీవ్ర రూపం దాల్చడంతో భారతీయ పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వం మీద పరిశ్రమల రక్షణకు కొంత వత్తిడిని తీసుకురాసాగారు. ఇలాంటి స్థితిలో ఆంగ్ల ప్రభుత్వం కొంతమేరకు భారత పరిశ్రమల రక్షణకు కొన్ని చర్యలను చేపట్టింది. అయితే ఆంగ్ల ప్రభుత్వం వివక్షతనే కనబరిచింది. భారతదేశంలోని అన్ని పరిశ్రమలకు రక్షణ కల్పించే చర్యలను తీసుకోనలేదు. కేవలం విదేశీయులు యజమానులుగా వున్న అగ్గిపెట్టెల తయారీ వంటి పరిశ్రమలకు మాత్రమే రక్షణ కల్పించింది. భారతీయులు స్థాపించిన నూలు, సీమెంట్, ఇనుము ఉక్కు, జనపనార, గాజు పరిశ్రమలకు రక్షణ కల్పించలేదు. ఈ విధానాన్ని భారతీయులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఫలితం లేకపోగా, ఆంగ్ల ప్రభుత్వం ఇంగ్లాండ్ దేశం నుంచి చేసుకునే దిగుమతులకు ప్రత్యేక హక్కులు, రాయితీలు వంటివి కల్పించడం చేసింది. ఇటువంటి విధానాలు భారతీయ పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా తయారయ్యాయి.

## 13.3. సరుకుల కొనుగోలు:

స్వేచ్ఛా వ్యాపార విధానానికి తోడు ఆంగ్ల ప్రభుత్వం అనుసరించిన ప్రభుత్వానికి అవసరమైన సరుకులను కొనుగోలు

చేసే విధానం కూడా భారతీయ పరిశ్రమల అభివృద్ధికి గొడ్డలి పెట్టుగా తయారైంది. సాధారణంగా ప్రభుత్వం తన అవసరాల నిమిత్తం సరుకులు కొనుగోలు చేసే విధానం ఆ దేశంలోని పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేసేదిగా వుండాలి. అయితే ఆంగ్ల ప్రభుత్వం అందుకు విరుద్దమైన విధానాన్ని అనుసరించింది. మొదటి ప్రపంచ యుద్ధం వరకు కూడా అప్పటికే భారతదేశంలో పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తిని సాధించినా ఆంగ్ల ప్రభుత్వం సైన్యం, సివిల్ నిర్మాణాలు, టెలిగ్రాఫ్, టెలిఫోన్, రైల్వేలు వంటి వాటికి అవసరమైన సరకులన్నింటినీ తమ స్వదేశం ఇంగ్లాండ్ నుండి కొనుగోలు చేసింది. ఫలితంగా కోట్లాది రూపాయల భారతీయ ధనం ఇంగ్లాండ్ దేశానికి తరలి పోయింది.

మొదటి ప్రపంచ యుద్ధం వల్ల సైన్యానికి అవసరమైన సామాగ్రిని భారతదేశంలో తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1918 వ సంవత్సరంలో పారిశ్రామిక సంఘం భారత దేశంలో సరుకుల శాఖను స్థాపించవలసిన ఆవశ్యకతను తన నివేదికలో పేర్కొంది. దీనితో భారతదేశంలో సరుకుల శాఖను ప్రారంభించారు కానీ అది భారతీయ పరిశ్రమలకు పెద్దగా ప్రయోజనాన్ని చేకూర్చలేదు. 1928-29 సంవత్సరాల ప్రాంతం నుండి 1935-36 సంవత్సరాల ప్రాంతం వరకు వున్న ఏడు సంవత్సరాల కాలంలో సరుకుల శాఖ 15.6 కోట్ల రూపాయల విలువచేసే భారతీయ సరుకులను కొనుగోలు చేసింది. అయితే అదే సమయంలో ఈ శాఖ ఇంగ్లాండ్ దేశం నుండి 400 కోట్ల రూపాయలు విలువచేసే సరకులను దిగుమతి చేసుకోవడం సరుకుల శాఖ అనుసరించిన పక్షపాత వైఖరికి నిదర్శనం. అయితే 1935-36 సంవత్సరాల తర్వాత ఈ విధానంలో కొంత మార్పు వచ్చింది. రైల్వే సామాగ్రి, వంతెనల నిర్మాణానికి అవసరమయ్యే సామాగ్రి భారతదేశంలోనే కొనుగోలు చేయడంతో ఇంగ్లాండ్ నుండి క్రమంగా దిగుమతులు తగ్గాయి. ఏమైనప్పటికీ ఆంగ్ల ప్రభుత్వం అనుసరించిన సరకుల కొనుగోలు విధానం భారతీయ పరిశ్రమలు, వాణిజ్యం కుంటుపడే విధంగా వుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

## 13.4. పరిశ్రమలకు ఆర్థిక సహాయం:

సాధారణంగా ఏ దేశంలో అయినా పరిశ్రమల అభివృద్ధికి ఆ దేశంలోని బ్యాంకులు సహాయాన్ని తోడ్పాటును అందిస్తాయి. అయితే ఆంగ్ల పాలనా కాలంలో భారతదేశంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. భారతదేశంలో ఆంగ్లేయులు అనుసరించిన బ్యాంకింగ్ విధానం కూడా అందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బ్యాంకుల విషయంలో ప్రభుత్వం అనుసరించిన విధానం కూడా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా లేదు. భారత దేశంలోని ప్రెసిడెన్సీ బ్యాంకులు ఐరోపా పెట్టుబడి, ప్రభుత్వ సహాయంతో స్థాపించబడ్డాయి. ఈ బ్యాంకులు ప్రభుత్వ కార్యకలాపాలపై గుత్తాధికారాన్ని పొందాయి. అయితే, 1868వ సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో కొన్ని నిబంధనలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ నిబంధనల ప్రకారం విదేశీ మారక ద్రవ్య విషయంలో స్వంతంగా వ్యవహరించేందుకు, ఆరు నెలలకు పైబడి ధనం అప్పుగా ఇవ్వటానికి, స్థిరాస్తిపై ధరావత్తును స్వీకరించేందుకు ఈ బ్యాంకులకు అధికారం లేదు. ఇటువంటి నిబంధనల కారణంగా బ్యాంకులు పరిశ్రమలకు ఏవిధమైన ధన సహాయం కానీ, ఋణాలను కానీ ఇవ్వలేకపోయాయి. దీనికి తోడూ కొన్ని ఎక్స్ఛేంజి బ్యాంకులు వున్నా ఉపయోగం లేకుండా పోయింది. భారత దేశంలోని ఎక్స్ఛేంజి బ్యాంకులు విదేశీ బ్యాంకుల శాఖలుగా ఉండడం వల్ల అవి విదేశీ వ్యాపారానికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకే ఆసక్తిని కనబరిచాయి కానీ, భారతీయ పరిశ్రమలకు సహాయం చేసేందుకు శ్రద్ధ కనబరచలేదు.

అయితే 1900వ సంవత్సరం నాటికి భారతదేశంలో కొన్ని దేశీయ బ్యాంకులు ప్రారంభమయ్యాయి. కానీ వీటి

అభివృద్ధి అంతంత మాత్రమే జరిగింది. 1913-17, 1922-36 సంవత్సరాల కాలంలో ఏర్పడ్డ సంక్షోభాలను ఎదుర్కొని ఈ బ్యాంకులు నిలదొక్కుకోలేక పోయాయి. ఈ సమయంలో అనేక చిన్న బ్యాంకులు మూసివేయబడ్డాయి. అంతేకాకుండా భారతీయ బ్యాంకులు ప్రధానంగా డిపాజిట్లను ఆకర్షించడం, వ్యాపారానికి ఆర్థిక సహాయం అందించడం, నమ్మకమైన హామీపై స్వల్పకాలిక ఋణాలను ఇవ్వడం, రేవులు, దేశ మధ్య భాగాల మధ్య వస్తువుల రవాణా వంటి విషయాలపైనే అధికంగా దృష్టిని కేంద్రీకరించాయి. పారిశ్రామిక విస్తరణకు సహాయం చేయడం, ఋణాలు ఇవ్వడం పట్ల ఈ దేశీయ బ్యాంకులు శ్రద్ధ కనబరచలేదు. భారతీయ పరిశ్రమలకు బ్యాంకుల ఆర్థిక సహాయం, ఋణాలు లభించకపోవడం కూడా భారతీయ పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా తయారయ్యాయి.

## 13.5. కరెన్సీ:

భారతదేశంలో కరెన్సీ నిర్వహణా విధానం కూడా భారతదేశంలో దేశీయ పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా పనిచేసింది. భారతదేశంలో ఆంగ్ల ప్రభుత్వం వెండి, బంగారాల విలువల పెరుగుదల, తరుగుదల లను ఆధారంగా చేసుకుని రూపాయి మారకపు విలువను నిర్ణయించింది. దీని ఫలితంగా బంగారం వెండి ధరలు మార్పు చెందినప్పుడంతా రూపాయి విలువ మార్పులను చెందడంతో ఆర్థిక వ్యవస్థ తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి వచ్చింది. 1923వ సవత్సరం తర్వాత రూపాయి మారకపు విలువను రెండు షిల్లింగులుగా నిర్ణయించారు. ఇది స్పెక్యులేషన్‌కు దారితీసి, బంగారు ప్రమాణ నిధి తరిగిపోవడం ప్రారంభమై బంగారు నిల్వలు ఖాళీ అయ్యాయి. దీనితో భారతదేశం 35 కోట్ల రూపాయల నష్టానికి గురైంది.

ఇలాంటి స్థితిలో 1925వ సంవత్సరంలో హిల్టన్ యంగ్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన రాయల్ సంఘం మారకపు రేటును అనుసరించి బంగారంగా సిఫారస్ చేసింది. అయితే ఈ కొత్త విలువ దిగుమతులను ప్రోత్సహించి, ఎగుమతులను నిరుత్సాప పరచేదిగా తయారై విమర్శలను ఎదుర్కొంది. 1929 వ సంవత్సరంలో ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పటి నుంచి పరిస్థితి మరింత దిగజారింది. భారతదేశం నుంచి భారీఎత్తున బంగారం ఎగుమతి చేయడమైంది. 1931వ సంవత్సరం సెప్టెంబర్ నెల నుండి 1940వ సంవత్సరం జనవరి నెల వరకు 350 కోట్ల రూపాయలు విలువచేసే బంగారం భారతదేశం నుంచి ఇంగ్లాండ్‌కు తరలించబడింది. దీని ఫలితంగా భారతదేశంలోని సామాన్య రైతులు కూడా తరతరాల నుండి ప్రోగుచేసిన బంగారాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి కలిగింది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 60 శాతం మేరకు పడిపోవడం వల్ల రైతులు భూస్వాములు, వడ్డీ వ్యాపారులకు ఋణాలు తిరిగి చెల్లించడానికీ ప్రభుత్వానికి పన్నులను చెల్లించడానికి తమ వద్ద వున్న బంగారాన్ని ఉపయోగించాల్సి రావడం అందుకు కారణం.

ఈ విధంగా ఆంగ్ల ప్రభుత్వం అనుసరించిన కరెన్సీ విధానం కూడా భారతదేశంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకిగా తయారైంది.

## 13.6. రైల్వేలు:

పరిశ్రమల అభివృద్ధిలో రైల్వేల పాత్ర ఎంతో ప్రదానమైనదిగా ఉంటుంది. అందువల్లనే “ఆధునిక పరిశ్రమకు నిజమైన మార్గదర్శి రైల్వేలు” అని కార్ల్‌మార్క్స్ 1853 లోనే పేర్కొన్నాడు. అయితే భారతదేశంలో అందుకు అవకాశం కలుగలేదు. భారతదేశాన్ని పాలించిన ఆంగ్ల పాలకులు భారతీయ పరిశ్రమల అభివృద్ధికి ఏ మాత్రం శ్రద్ధ కనబరచనట్లే రైల్వే విధానాన్ని కూడా పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేసేదిగా రూపొందించలేదు. అందుకు భారతదేశంలో సత్వర సైన్య

సమీకరణ కోసం, ప్రభుత్వ తిరుగుబాట్లను వెంటనే అణచివేసేందుకు, సమర్థవంతమైన యుద్ధ నిర్వహణకు, భారతదేశంలో సామ్రాజ్య రక్షణకు రైల్వేల నిర్మాణం అవసరం అని 1848లో గవర్నర్ జనరల్ హార్డింజ్ ఇంగ్లాండ్ ప్రభుత్వానికి నివేదిక అందచేయడం నిదర్శనం. తర్వాత వచ్చిన గవర్నర్ జనరల్ డల్హౌసీ భారతదేశంలో రైల్వే వ్యవస్థకు శ్రీకారం చుట్టినా, ఇంగ్లాండ్ నుంచి దిగుమతి అయిన ఇంగ్లాండ్ వస్తువులను భారతీయ మార్కెట్లలోకి విస్తారంగా సరఫరా చేయడానికి, భారతీయ ముడిపదార్థాలను ఎగుమతి చేయడానికి సాధనంగా రైల్వే వ్యవస్థను తయారు చేసేందుకు కృషి చేశాడు.

అంతేకాకుండా రైల్వేలలో పెట్టే పెట్టుబడికి ప్రభుత్వం 5 శాతం వడ్డీ గ్యారంటి ఇవ్వడంతో, ఆంగ్లేయ పెట్టుబడిదారులు తమ మిగులు ధనాన్ని భారతదేశంలోని రైల్వేలలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపారు. దీనివల్ల కూడా రైల్వేలు ఆంగ్ల ప్రయోజనాలకు అనుకూలంగా తీర్చిదిద్దబడ్డాయి. అంతేకాకుండా సరుకు రవాణాలో కూడా భారతీయ పారిశ్రామిక వేత్తల పట్ల వివక్షత కనబరిచారు. భారతీయ పారిశ్రామిక వేత్తల ముడి సరుకులు, తయారైన వస్తువుల రవాణా పైన చార్జీలను అధికంగా వసూలు చేయడం వల్ల రైల్వేలు పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకిగా తయారయ్యాయి. వీటన్నింటికీ తోడు ఆంగ్ల ప్రభుత్వం ఓడరేవు ప్రాంతాలకు రైల్వే సదుపాయాలను ఏర్పాటు చేసి దేశ మధ్య ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం కూడా భారతీయ పరిశ్రమల అభివృద్ధికి నిరోధంగా తయారైంది.

## 13.7. ప్రభుత్వ వ్యయం:

ప్రభుత్వాలు సాధారణంగా ఉత్పత్తి, విద్యా, వైద్య, రక్షణ రంగాలకు తమ బడ్జెట్‌లో అధికంగా నిధులను కేటాయిస్తాయి. పారిశ్రామిక అభివృద్ధికి ఇతోధికంగా ధన వ్యయం చేసి ఉత్పత్తులను పెంచడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వాలు కృషిచేస్తాయి. అయితే భారతదేశంలో ఆంగ్ల పరిపాలనా కాలంలో ఆంగ్ల ప్రభుత్వం ఇందుకు వ్యతిరేకంగా పనిచేసింది. ఆంగ్ల ప్రభుత్వం తన ప్రభుత్వ వ్యయ ప్రణాళికలో పరిశ్రమలు, వ్యవసాయం, విద్యలాంటి జాతి నిర్మాణ కార్యక్రమాలకు అతి స్వల్ప మొత్తాలను కేటాయించింది. ప్రభుత్వ వ్యయంలో 70 నుండి 80 శాతం నిధులు సైన్యం, రుణ చెల్లింపులు, రక్షణ వ్యవహారాలు, సివిల్ పాలన లకే కేటాయించడం జరుగుతూ వచ్చింది.

ఒక్క 1935 రాజ్యాంగ చట్ట కాలంలో మినహా 1920 -21 సంవత్సర ప్రాంతం నుండి 1938-39 సంవత్సర ప్రాంతం వరకు గల సుమారు రెండు దశాబ్దాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో పరిశ్రమల మీద సంవత్సరానికి సరాసరి 50 లక్షలు రూపాయలు మాత్రమే కేటాయించడం అందుకు నిదర్శనం. 1935 రాజ్యాంగ చట్టం ప్రకారం పరిశ్రమల శాఖ రాష్ట్రాలకు కేటాయించబడింది. అయినా పెద్ద మార్పు సంభవించలేదు. 1939-40 సంవత్సరాలలో పరిశ్రమల మీద సంవత్సరానికి సుమారు ఒక కోటి రూపాయల మేరకు మాత్రమే ఖర్చు చేయబడింది.

ప్రభుత్వ వ్యయంలో 70 నుండి 80 శాతం నిధులు రుణ చెల్లింపులు, రక్షణ వ్యవహారాలు, సివిల్ పాలనలకే కేటాయిస్తూ పారిశ్రామికాభివృద్ధి పట్ల ఆంగ్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని భారతదేశ నాయకులు సహించలేక అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో సైన్యం, రుణ చెల్లింపులు, రక్షణ వ్యవహారాలు, సివిల్ పాలనలకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడం మాని పారిశ్రామికాభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలనే హెచ్చరికను కూడా ప్రభుత్వానికి చేశారు. అయినా ఏ మాత్రం లెక్క చేయక ఆంగ్ల ప్రభుత్వం ప్రతీకార చర్యలకు పూనుకుని వ్యవసాయం, పరిశ్రమలకు నిధుల కేటాయింపులో మరింత కోతను విధించింది. దీనితో పారిశ్రామికాభివృద్ధికి నిధుల కొరత

ఏర్పడింది. ఈ విధంగా ప్రభుత్వం అనుసరించిన వ్యయ విధానం కూడా భారతదేశంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా తయారైంది.

## 13.8. కార్మికుల స్థితిగతులు:

భారతదేశంలో 1931వ సంవత్సర కాలం నాటికి వివిధ వృత్తులకు చెందిన కార్మికులు 154 మిలియన్ల మంది వుండేవారు. ఈ కార్మికులలో 56.5 మిలియన్ల మంది వేతనాలను పొందే కార్మికులు. వేతనాలు పొందే కార్మికులలో 31.5 మిలియన్ల మంది వ్యవసాయ కార్మికులు కాగా మిగిలిన 25 మిలియన్ల మంది వ్యవసాయేతర కార్మికులు అంటే వీరు వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ వుండేవారు. వీరి స్థితిగతులు అంతంత మాత్రమే ఉండేవి. ఇది కూడా పారిశ్రామికాభివృద్ధి పట్ల ప్రభావాన్ని కనబరిచిందని చెప్పవచ్చు.

వ్యావసాయక కార్మికుల జీవన విధానాన్ని పరిశీలిస్తే– వ్యవసాయ కార్మికులు కడుపునిండా తిండి, బట్టకు సరిగా నోచుకోకపోవటమే కాక, వీరి గృహవసతి కూడా అతి సామాన్యంగా వుండేది. గాలి, వెలుతురు సరిగా లేని పూరి గుడిసెలు, లేకుంటే పెంకుటిళ్ళలో వీరు నివసించేవారు. వీరు ఇళ్ళలో ఒకే గది వుండేది. అందులోనే కుటుంబ సభ్యులందరూ నివశించే వారు. సంవత్సరంలో ఏడు నెలలు మాత్రమే తమ గ్రామంలో వ్యావసాయిక కూలీపని లభిస్తూ వుండడం వల్ల వీరు సంవత్సరం లోని మిగతా ఐదు నెలలు పట్టణాలు, ఇతర ప్రదేశాలకు జీవనోపాధి కోసం వెళ్ళాల్సి వుండేది.

ఇక, పరిశ్రమలలో పనిచేసే కార్మికుల స్థితిగతులు కూడా ఇంతకంటే గొప్పగా లేవనే చెప్పవచ్చు. పరిశ్రమలలో పనిచేసే వేతనాలు పెరిగినా, వస్తువుల ధరలు నానాటికి పెరుగుతూ వుండడం వల్ల పెరిగిన వేతనాల వల్ల కార్మికుల జీవితాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకోలేదు. వేతనాల్లో కొంత భాగాన్ని ధాన్య రూపంలో చెల్లించడం చేసేవారు. అంతేకాకుండా కార్మికుల లోని ఆలస్యం, అశ్రద్ధ వంటి కారణాలను చూపించి వేతనాలలో కోత విధించడం చేసేవారు. దీనికి తోడు పరిశ్రమలకు లాభాలు త్వరగా రానందున వేతనాలను రోజులు, నెలల కొద్దీ వాయిదా వేసి చాలా ఆలస్యంగా చెల్లించేవారు. వీటన్నింటి వల్ల కూడా వేతనాలు పెరిగినా ప్రయోజనం లేకుండా పోవడంతో పాటు వారి జీవితాలు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులకు లోనయ్యేవి.

పరిశ్రమలలో పనిచేసే కార్మికుల ఆహార, నివాస స్థితిగతులు కూడా వ్యవసాయ కార్మికుల మాదిరే అంతంత మాత్రమే ఉండేవి. పరిశ్రమలలో పనిచేసే కార్మికులు భుజించే ఆహారాని కంటే బొంబాయి కారాగారాల్లో ఉండే నేరస్థులు ఎక్కువ బలవర్ధక ఆహార పదార్థాలను తింటున్నట్లుగా చెప్పబడడం కార్మికుల స్థితికి నిదర్శనం. తేలింది. కిటికీలు లేని, గాలి, వెలుతురు రాని, మురికినీరు పోవటానికి, మంచినీరు రావటానికి వసతిలేని ఒకే గది వున్న ఇళ్ళలో కార్మికులు నివాసం వుండేవారు. ఒక ఇంటిలో 6 నుండి 20 మంది వరకు కూడా నివాసం వుండేవారు. భారతీయ పారిశ్రామిక కార్మికులు తమ వేతనాల్లో ఆహారపు అవసరాలపై అధిక శాతాన్ని వెచ్చించడమనేది అల్ప జీవన ప్రమాణానికి తార్కాణం.

ఈ విధంగా వున్న కార్మికుల స్థితిగతులు కూడా ఆధునిక పరిశ్రమలు అనుకున్నంతగా అభివృద్ధి చెందలేక పోవడానికి కారణం అయ్యాయి.

## 13.9. కార్మికుల సమస్యలు:

చాలీచాలని వేతనాలు, బలవర్ధకమైన ఆహారం లేకపోవడం కనీసావసరాలు లేని ఇళ్ళలో నివసించడం వంటి

సమస్యలతో పాటు మరికొన్ని ఇతర ఇబ్బందులను కూడా కార్మికులు ఎదుర్కొన్నారు. వాటిల్లో ఆరోగ్య సమస్యలు, పనిలో ప్రమాదాలు, మధ్యవర్తుల ప్రాబల్యం, ఋణాలు వంటివి ప్రధానమైనవి. ఈ సమస్యలు కార్మికుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. వీటన్నింటి వల్ల కొన్నిసార్లు కార్మికులు పని మానేయడం వల్ల తరచుగా నిరుద్యోగాన్ని ఎదుర్కొనాల్సి వచ్చింది.

పరిశ్రమలలో పనిచేయడం వల్ల కార్మికులు తరచూ అనారోగ్యాలకు గురవుతూ వుండేవారు. ఝరియా గనుల్లో పనిచేసే కార్మికుల్లో 90 శాతం మంది 'హుక్ వార్మ్' అనే వ్యాధికి గురికావడం అందుకు ఉదాహరణ. గనుల్లో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం వల్ల 'హుక్ వార్మ్' వ్యాధికి గురయ్యేవారు. అదేవిధంగా వంద మిలియన్ కార్మికులు మలేరియా వ్యాధికి గురయ్యారు. క్షయ వ్యాధి కూడా విస్తృత వ్యాప్తిని పొందింది. గనులు, నూలు, జౌళి, ఉన్ని, బియ్యం మిల్లుల్లో, దుమ్ము, ధూళి బాగా ఏర్పడి, ఫలితంగా వీటిలో పనిచేసే కార్మికులు ఊపిరితిత్తుల వ్యాధికి గురయ్యేవారు.

పరిశ్రమలలో పెద్ద సంఖ్యలో కార్మికుల వినియోగం కారణంగా 20వ శతాబ్ద ప్రారంభంలో ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం నుంచి వివిధ పరిశ్రమలలో ప్రమాదాలు జరగడం అధికమైంది. 1919–1923 సంవత్సరాల మధ్య కాలంలో పరిశ్రమల్లో ప్రాణాంతక ప్రమాదాలు 5 శాతం వుంటే, అది 1934 – 1939 మధ్య కాలానికి 13.6 కు పెరిగింది. యంత్రాల క్లిష్టత పెరుగుతూండడం, ఉత్పత్తి వేగం చేయబడడం, కార్మికులకు సరైన శిక్షణ ఇవ్వకపోవడం, పారిశ్రామిక యజమానులు ప్రమాదాల నివారణకు తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వంటివి పరిశ్రమల్లో ప్రమాదాలకు కారణం.

కార్మికులు ఎదుర్కొన్న మరొక సమస్య రుణగ్రస్తత. కార్మికులలో అధిక సంఖ్యాకులు ఈ సమస్యకు లోనయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బొంబాయిలో రుణగ్రస్తులైన కార్మికుల సంఖ్య 90 శాతం మేరకు చేరడం ఈ సమస్య తీవ్రతకు నిదర్శనం. చాలీచాలని వేతనాలు, వేతనాలను ఆలస్యంగా ఇవ్వటం, కుటుంబ, వ్యక్తిగత అవసరాలు, వ్యసనాలు వంటివి కార్మికులను ఋణాలు తీసుకునేందుకు కారణమయ్యాయి. వేతనాలు తక్కువగా వుండడం వంటి కారణం వల్ల అప్పులు తీర్చలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ఈ సమస్యలన్నింటితో పాటు కార్మికులు ఎదుర్కొన్న మరొక సమస్య మధ్య దళారీలు. వీరు కార్మికులు, యజమానుల మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహించేవారని చెప్పబడినప్పటికీ వాస్తవంగా వీరు పరిశ్రమల యజమానులకు రహస్య ఏజెంట్లుగా పనిచేసేవారు. వారి ప్రయోజనాలకే పాటుపడేవారు. చాలా కర్మాగారాల్లో కార్మికుల రక్షణ, భద్రత మధ్య దళారీల చేతుల్లో ఉండడం వల్ల వీరు ఆర్థికంగా బాగా లాభపడేవారు. పరిశ్రమలలో పనిలో పెట్టినందుకు గాను మధ్యదళారీలు కార్మికుల నుండి కొంత సొమ్మే కాకుండా ప్రతినెల వేతనం నుండి స్వల్ప ధనాన్ని పొందేవారు. కొన్ని సందర్భాల్లో మత్తు పానీయాలు వంటి ఇతర అవసర వస్తువులను మధ్య దళారీలను సంతృప్తి పరిచేందుకు కార్మికులు సమర్పించుకునేవారు. ఈ విధంగా మధ్య దళారీల వల్ల కూడా సమస్యలను కార్మికులు ఎదుర్కొన్నారు.

ఈ విధంగా వున్న కార్మికుల సమస్యలు కూడా ఆధునిక పరిశ్రమలు అనుకున్నంతగా అభివృద్ధి చెందలేక పోవడానికి కారణం అయ్యాయి.

## 13.10. కార్మిక సంఘాల ఉద్యమాలు:

కార్మికుల శ్రేయస్సు కోసం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు ఉండాల్సిందే కానీ ఈ కార్మిక

సంఘాల ఉద్యమాలు కూడా కొంతమేరకు పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా తయారయ్యాయి. ఈ కార్మిక సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయడం ప్రారంభించాయి. కార్మిక సంఘాలు చేసిన ఉద్యమాల్లో ప్రధానమైంది సమ్మె. భారతదేశంలో మొదటిసారిగా 1877వ సంవత్సరంలో వేతనాలను గురించి కార్మికులు నాగపూర్‌లోని ఎం ప్రెస్ మిల్స్ లో జరిగింది. ఈ విధంగా 19 వ శతాబ్దం చివరి సమయంలో సమ్మె జరిగినా మొదటి ప్రపంచ యుద్ధం సమయంనుంచే భారతదేశంలో కార్మికుల సమ్మెలు ప్రారంభం అయ్యాయని చెప్పవచ్చు. భారతదేశంలో జాతీయ ఉద్యమం ప్రారంభం కావడంతో పాటు దేశంలోని రాజకీయ ఆర్థిక పరిస్థితులు కార్మికుల్లో చైతన్యం పెరగడానికి కారణం అయింది.

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ధరలు పెరిగి పరిశ్రమల యజమానులు లాభాలను పొందినా, వేతనాల్లో మాత్రం వీటికనుగుణంగా పెంపు జరగకపోవడం కార్మికుల్లో ఆలోచనలకు కారణం అయింది. దీనికి తోడు 1917వ సంవత్సరంలో రష్యలో వచ్చిన కమ్యూనిస్ట్ విప్లవ ప్రభావ ఫలితంగా స్వపరిపాలన, సామ్యవాద, విప్లవ భావాలు కార్మికుల్లో చెలరేగాయి.

సమ్మె ఉద్యమం 1918వ సంవత్సరంలో ప్రారంభమై కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే దేశంలో పెద్దపెట్టున విస్తరించింది. 1919వ సంవత్సరం జనవరి నెల నాటికి బొంబాయిలోని అన్ని మిల్లులకు చెందిన ఒక్కలక్షా 25 వేల మంది కార్మికులు సమ్మెకు దిగారు. 1920 సంవత్సరం తొలి ఆరు నెలల్లో సుమారు రెండువందల సమ్మెలు జరిగాయి. వీటిల్లో ఒకటిన్నర మిలియన్ల మంది కార్మికులు పాల్గొన్నారు.

ఇలాంటి పరిస్థితులలోనే భారతదేశంలో కార్మిక సంఘాలు ఏర్పడడం ప్రారంభమైంది. బి.పి. వాడియా ప్రారంభించిన "మద్రాస్ కార్మిక సంఘం" భారతదేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలో మొదటి సంఘం. ప్రారంభ సంకేతమైంది. మొట్టమొదటి సారిగా సభ్యత్వం, చెల్లింపులు కార్మిక వ్యవస్థలో భాగమయ్యాయి. ఇదే సమయంలో "ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" స్థాపించబడింది. దీని మొదటి సమావేశం 1920వ సంవత్సరం అక్టోబర్ నెలలో బొంబాయిలో జాతీయ నాయకుడైన లాలాలజపతిరాయ్ అధ్యక్షతన జరిగింది. ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనతి కాలంలోనే జెనీవాలో జరిగే అంతర్జాతీయ కార్మిక సభలో ప్రాతినిధ్యాన్ని పొందే సంస్థగా బలాన్ని సంతరించుకుంది. ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్మికుల్లో త్రాగుడు, ఇతర దురలవాట్లను తగ్గించడంతో పాటూ పరిశ్రమలలో వీలైనంత వరకు సమ్మెలను అనుమతించకుండా ఉండేందుకు కృషి చేసింది. ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ త్వరితగతిన వ్యాప్తి చెంది 1927వ సంవత్సరం నాటికి 57 అనుబంధ సంఘాలను సంఘటితపరిచింది. సుమారు ఒక్క లక్షా 50 వేలా 555 మంది సభ్యత్వాన్ని సంపాదించింది. రెండవ ప్రపంచయుద్ధం మరియు ద్రవ్యోల్బణ సంవత్సరాలను మినహాయిస్తే మిగతా సమయంలో కార్మిక ఉద్యమం అభివృద్ధి చెందింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 1946వ సంవత్సరం నాటికి ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏడు లక్షల మంది సభ్యులతో కార్మిక ప్రాతినిధ్య కీలక సంస్థగా పేరుపొందింది.

కాగా భారతదేశంలో కార్మిక సంఘాల వృద్ధి, సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఒక వైపు ప్రారంభం కాగా మరో వైపు కార్మికులు సమ్మెకు దిగిన సందర్భంలో పరిశ్రమల యజమానులు లాకౌట్లు ప్రకటించడం ప్రారంభించారు. 1921వ సంవత్సరం నుండే లాకౌట్లు కూడా ప్రారంభింపబడ్డాయి. 1921 వ సంవత్సరంలో 396 పరిశ్రమలు, 1942 వ సంవత్సరంలో 694 పరిశ్రమలు, 1945లో 848 పరిశ్రమలు లాకౌట్లు ప్రకటించాయి. దీనివల్ల పారిశ్రామికాభివృద్ధి, ఉత్పత్తి నిలిచిపోవడం సర్వసాధారణంగా మారింది.

ఈ విధంగా కార్మిక ఉద్యమాలు తత్ఫలితంగా లాకౌట్లు వంటివి కూడా భారతదేశంలో పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా మారాయి.

## 13.11. సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉండడం:

విదేశాల నుండి వచ్చే దిగుమతులను, అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి పోటీని, భారతీయ పరిశ్రమలు ఎదుర్కొనలేకపోయాయి. అందుకు అనేక కారణాలు వున్నా, ప్రధానంగా విదేశాలలో తయారైన వస్తువులు భారతదేశంలో ఉత్పత్తి అయిన వస్తువుల కంటే తక్కువ ధరను కలిగివుండడం ఒక కారణంగా చెప్పవచ్చు. భారతదేశ వస్తువు అధిక ధర కలిగివుండడానికి, విదేశీ వస్తువు తక్కువ ధరను కలిగివుండడానికి అనేక కారణాలు కనిపిస్తాయి.

ఉదాహరణకు వస్త్ర ధరలను పరిశీలిస్తే – 20వ శతాబ్ద ప్రారంభంలో నూలు దారం, వస్త్ర ఉత్పత్తి నైపుణ్యంలో భారతీయ కార్మికుల కంటే తక్కువ స్థాయిలో ఉన్నట్లుగా భావించబడ్డ జపాన్ కార్మికులు, 1920 దశకం చివరినాటికి భారతీయ నూలు మిల్లు కార్మికుల కంటే ఎంతో నిపుణులుగా తయారయ్యారు. 1930 ప్రారంభం నాటికి ఒక జపాన్ నేత కార్మికుడు ఆరు మగ్గాలను నడపగలిగితే, బొంబాయిలోని నేత కార్మికుడు కేవలం రెండు మగ్గాలను మాత్రమే నడపగలిగేవాడు. ఇది జపాన్ దేశంలో ఉత్పత్తి ఖర్చు తగ్గటానికి దోహదపడింది. దీనితో వస్త్రం ధర భారతదేశ వస్త్రంకంటే తక్కువగా వుండడానికి కారణం అయింది. కర్మాగారాలకు అవసరమైన యంత్రాలను భారతదేశం ఇంగ్లాండ్ వంటి దేశాలనుంచి దిగుమతి చేసుకునేది. జపాన్ వంటి దేశాలు తమ కర్మాగారాలకు అవసరమైన యంత్రాలను తామే తయారు చేసుకోవడం వల్ల కూడా నాణ్యతలో ఉత్పత్తి ఖర్చులో తేడా వుండి భారతీయ వస్తువులకంటే చౌకగా లభించేవి.

ఈ విధంగా సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా వుండడం కూడా భారతదేశంలో పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా మారింది.

## 13.12. సమీక్ష:

సాంప్రదాయకమైన హస్తకళలు, కుటీర పరిశ్రమలు అంతరించి పోవడంతో మరో పరిణామం చోటు చేసుకొంది. అదే ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ఆవిర్భావం. విద్య ద్వారా పాశ్చాత్య శాస్త్రం. సాంకేతిక విజ్ఞానంలో ప్రవేశం ఏర్పడటం ఆ దేశాల నుంచి నిపుణులను పంచుకోడానికి అవకాశం కలగడం మొదలయిన కారణాల వల్ల కొంత మంది భారతీయులు, ఐరోపావారు కొద్దిపాటి పెట్టుబడులతో 19వ శతాబ్దం మధ్య భాగంలో ఆధునిక పరిశ్రమలను ప్రారంభించారు. అయితే భారతీయ పరిశ్రమల ప్రగతి, అత్యంత మందకొడిగా సాగింది. అందుకు అనేక కారణాలు దోహదం చేశాయి.

## 13.13. వ్యాసరూప ప్రశ్నలు:

1) భారతదేశంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఎదురైన ఆటంకాలు వివరించండి?

2) భారతదేశంలో ఆధునిక పరిశ్రమలలో పనిచేసే కార్మికుల స్థితిగతులు వారు ఎదుర్కొన్న సమస్యలను గురించి వ్యాసం రాయండి?

## 13.14. ఆధార గ్రంథాలు:


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.
2. Bipin Chandra - Essays on Colonialism.
3. R.P. Dutt - India Today.
4. D.R. Gadgil - The Industrial Evolution of India (1860-1939).
5. Sumit Sarkar - Modern Indian Economic History.
6. Sabyasachi Bhattachrya - Essays of Modern Indian Economic History.
7. Aladi Valdehi - History of Freedom Movement in India.
8. KK Datta - A Social History of Modern India.
9. తెలుగు అకాడమీ ప్రచురణ - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


- డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

పాఠం - 14

# భారతదేశంలో వలస పాలన విధానాలు - ప్రభావం

## 14.0. లక్ష్యము:

- ⌗ తూర్పు ఇండియా వర్తక సంఘము, బ్రిటీష్ పరిపాలనలో సంభవించిన ఆర్థిక పరిణామాలను అధ్యయనం చేయడం.
- ⌗ సంపద తరలింపు సిద్ధాంతము యొక్క పరిమాణమును తెలుసుకోవడం.
- ⌗ సంపద తరలింపు సిద్ధాంతకర, ఆర్థిక వేత్తల అభిప్రాయముల గురించి అధ్యయనం చేయడం.
- ⌗ డ్రెయిన్ సిద్ధాంతము విమర్శనాత్మక అధ్యయనం.
- ⌗ డ్రెయిన్ సిద్ధాంతము పరిణామాలను చర్చించడం.
- ⌗ జాతీయ ఉద్యమం సంపద తరలింపు సిద్ధాంతము యొక్క ప్రభావాన్ని అధ్యయనం చేయడం.
- ⌗ వలస పాలనలో పెరిగిన పేదరికం గురించి తెలుసుకోవడం.

**విషయక్రమము:**


**14.1.** **పరిచయము**

**14.2.** **డ్రెయిన్ సిద్ధాంతం పుట్టుక–ఆచరణ**

**14.3.** **సంపద తరలింపు సిద్ధాంతంపై ఆర్థిక వేత్తల అభిప్రాయాలు**

**14.4.** **డ్రెయిన్ సిద్ధాంతము యొక్క ఫలితాలు**

**14.4.1.** **ఇంగ్లండ్‌పై డ్రెయిన్ సిద్ధాంత ప్రభావం**

**14.4.2.** **భారతదేశంపై డ్రెయిన్ సిద్ధాంత ప్రభావం**

**14.4.3.** **డ్రెయిన్ సిద్ధాంతం–విమర్శ: విశ్లేషణ**

**14.5.** **డ్రెయిన్ సిద్ధాంతంపై విమర్శ–విశ్లేషణ**

**14.6.** **సారాంశము**

**14.7.** **నమూనా ప్రశ్నలు**

**14.8.** **ఆధార గ్రంథాలు**


## 14.1. పరిచయము:

ఆధునిక భారతదేశంలో ఐరాపా రాజ్యాలకు చెందిన వివిధ వ్యాపార సంస్థలు అడుగుపెట్టడం చాలా ముఖ్యమైన అంశం. వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా భారతదేశంలో వారు అడుగుపెట్టినప్పటికి, తర్వాత జరిగిన అనేక పరిణామాల దృష్ట్యా వారి మధ్య రాజకీయలు ప్రవేశించి విభేదించడం ప్రారంభించాడు. ఇందులో భాగంగా వారి మధ్య జరిగిన ఘర్షణలో

పుణ్యమామని చివరకు బ్రిటీష్ తూర్పు ఇండియా వర్తక సంఘంలో విజేతగా నిలిచి ఏకస్వామ్యలను సాధించింది. తదనంతరం దేశంలో వున్న "ప్రత్యేక పరిస్థితుల" దృష్ట్యా రాజకీయాలలో జోక్యం చేసుకుని క్రీ.శ. 1757వ సంవత్సరంలో బెంగాల్‌లో రాజకీయ అరంగేట్రం చేసింది. తర్వాత యుద్ధాల, సైన్య సహకార పద్ధతి, రాజ్య సంక్రమణ సిద్ధాంతము, పన్ను చెల్లించలేరనే నెపం, దుష్పరి పాలన తదితర కారణాలతో 1857 నాటికి యావత్ భారతదేశమంతా విస్తరించింది. 1857 తిరుగుబాటు నేపథ్యంలో తూర్పు ఇండియా వర్తక సంఘం కనుమరుగయినప్పటికి వారి మాతృదేశమయిన బ్రిటీష్ వారు భారతదేశ పాలకులయిరి. వీరి కాలంలో రాజకీయ రంగంతో పాటు ఆర్థిక, సామాజిక రంగాలలో విప్లవాత్మక మార్పులు జరిగి భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో పెనుమార్పులు సంభవించాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో జరిగిన మార్పులలో సంపద తరలింపు సిద్ధాంతము చాలా ముఖ్యమైనవి.

## 14.2. డ్రెయిన్ సిద్ధాంతం పుట్టుక-ఆచరణ:

బ్రిటీష్ తూర్పు ఇండియా వర్తక సంఘము ప్రాథమికంగా ప్రైవేట్ వ్యక్తుల సముదాయం. వారి ప్రధాన లక్ష్యం ఆర్థిక సంపాదన. ఆర్థిక సంపాదన లక్ష్యంగా ఉన్న ఆంగ్లేయ వర్తకులు బ్రిటీష్ ప్రభుత్వ అనుమతితో 1600వ సంవత్సరంలో తూర్పు ఇండియా వర్తక సంఘంగా మారి, లాభార్జన ధ్యేయంగా వారి కార్యక్రమాలను ప్రారంభించారు. నాటి నుండి తోటి ఐరోపా వర్తకులతో పోటీపడిన ప్రతి సందర్భంలోను వారు ధనాన్ని, కష్టాలను భరించాల్సి వచ్చింది. అందులో ప్రభుత్వ ప్రమేయం లేదా ప్రభుత్వం వారి ఖర్చులను భరించడం కాని జరుగలేదు. వ్యయ ప్రయాసలు, కష్ట సుఖాలు, లాభ నష్టాలు అన్నియు వారే భరించాల్సి వచ్చింది. మొదటగా పోర్చుగీసు వారితో పోటీ పడినా, డచ్ వారితో తగాదాలొచ్చినా, వారే స్వయంగా పరిష్కరించుకోవాల్సి వచ్చింది. ఫ్రెంచి వారితో చివరగా కర్ణాటక ప్రాంతాలలో జరిగిన కర్ణాటక యుద్ధాల ప్రారంభంలో వారీ నష్టాలను భరించారు. అదృష్టం బాగుంది, వారు కర్ణాటక యుద్ధాలలో విజయం సాధించారు. అలా లేని పక్షంలో వారు భారతదేశాన్ని వదలాల్సి వచ్చేది. అయితే రెండవ కర్ణాటక యుద్ధం మలి అర్ధభాగంలో వారు చూపిన చొరవ త్యాగం ఫలితంగా అదృష్టం తారుమారు అయ్యింది. నాడు వారు ఆలోచించింది కేవలం భారతదేశంలో వారి వర్తక స్థావరాల సుస్థిరత మరియు లాభార్జన.

కర్ణాటక ప్రాంతంలో, తర్వాత బెంగాల్ రాష్ట్రంలో బ్రిటీష్ తూర్పు ఇండియా వర్తక సంఘం రాజకీయంగా నిలదొక్కు-కోవడం కేవలం యాదృచ్ఛికం. రెండు సందర్భాలలో కూడా వారు ఆలోచించింది, పోరాడింది. వారి వాణిజ్య శత్రువులైన తమ ఖండ వాసులు అయిన ఫ్రెంచి వారిని ఓడించడం. అందులో భాగంగా బెంగాల్ నవాబయిన సిరాజుద్దౌలాతో వారు పోరాడవలసి వచ్చింది. నాటి భారతదేశంలో ప్రముఖ రాష్ట్రమయిన బెంగాల్ పాలకుడు ఆ తరహాలో ఓడిపోతారని బ్రిటీష్ వర్తక సంఘంతో సహా ఎవరు ఊహించలేదు. కావున మొదటి బెంగాల్ యుద్ధం (ప్లాసీ యుద్ధం) విజయం వారికి ఆమాచితంగా, అనూహ్యంగా లభించింది. ఈ నేపథ్యంలో ఆర్థిక లాభాపేక్షతో అడుగుపెట్టిన కంపెనీ సారధులు రాజకీయంగా నిలదొక్కు కున్నట్లయితే దానిని లాభార్జనకు మరింత దోహదపడుతుందని భావించారు. దాని పరంపరే "బ్రిటీష్ వారి సంపద తరలింపు సిద్ధాంతము". భారతదేశ ఆర్థిక వేత్తలు ముఖ్యంగా ప్రముఖ జాతీయవాద నాయకుడు దాదాబాయి నౌరోజి, రమేష్ చంద్రదత్ లాంటి వారు దీనిని 'డ్రెయిన్' యని 'డ్రెయిన్ సిద్ధాంతము 'అని వక్కాణించారు. డ్రెయిన్‌ను తెలుగులో ఆర్థిక నిస్స్రావం, 'ఐశ్వర్య నిర్గమనం', 'ఐశ్వర్య పరివాహం', 'సంపద తరలింపు' యని కూడా పేర్కొన్నారు. వీటిలో 'సంపద తరలింపు' అనే పదమే బహుళ ప్రచారంలో ఉన్నది.

సంపద తరలింపు అనగా భారతదేశానికి ఎలాంటి ప్రతిఫలం లేకుండా 'భారతదేశ సంపద' ఇంగ్లాండ్‌కు తరళి పోవడమే ఈ పదాల సారాంశము. నాటి భారతదేశ ఆదాయంలో దాదాపు 1/4 వంతు బ్రిటీష్ దేశానికి తరలిపోతున్నదని దాదాభాయి నౌరోజి తన గ్రంథమయిన 'Drain of Indian Wealth' లో వివరించాడు. మొదటగా తూర్పు ఇండియా వర్తక సంఘం బెంగాల్ రాష్ట్రం (నాడు భారతదేశంలో అత్యంత సుసంపన్నమయిన రాష్ట్రం) పై మొదటిగా దృష్టి పెట్టడానికి ప్రధాన కారణం బెంగాల్ రాష్ట్ర ఆర్థిక పరిపుష్టి. బెంగాల్ వసూలు చేసిన భూమి శిస్తు ద్రవ్యంతో భారతదేశంలోని సరుకులను కొని తమ మాతృదేశమయిన ఇంగ్లాండ్‌కు పంపే విధానం అవలంభించడంతో 'డ్రెయిన్' ప్రారంభమయిందని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. కంపెనీ సామ్రాజ్య విస్తరించడంతో పాటు భారతదేశ సంపద తరలింపు అనేక మార్గాల గుండా కొనసాగి భారతదేశం ఆదాయం క్రమక్రమంగా తగ్గి ఆర్థిక దుస్థితికి గురయింది.

బ్రిటీష్ పాలకులు భారతదేశం పట్ల అవలంభించిన ఇలాంటి ఆర్థిక విధానం వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం, తదితర రంగాలకు విస్తరించి ఆర్థికంగా దెబ్బతినడానికి కారణమయింది. ఇంగ్లండ్‌లోని పరిశ్రమల కోసం, భారతదేశంలో ముడి పదార్థాల ఉత్పత్తిని అధికం చేయడం, ఇంగ్లండ్‌లోని పరిశ్రమలు తయారు చేసిన వస్తువులకు ఇండియాను మార్కెట్‌గా రూపొందించడం బ్రిటీష్ ఆర్థిక విధాన లక్ష్యాలుగా మారాయి. ఇది వలస వాద దోపిడి వ్యవస్థకు ప్రతిబింబము. దీని ఫలితంగా ఇంగ్లండ్ నుండి ఇండియాకు దిగుమతి అయిన సరుకుల విలువ కంటే ఇండియా నుండి ఇంగ్లండ్‌కు ఎగుమతి అయ్యే వస్తువుల, సరుకుల విలువ ఎక్కువ అయింది. ఈ రెండు విలువల మధ్య 1890 వరకు సుమారు 18 కోట్ల రూపాయిల తేడా ఉంది. దీని అర్థం ప్రతి సంవత్సరం ఇంగ్లండ్ దేశం భారతదేశం నుండి 18 కోట్ల రూపాయల విలువ గలిగిన సరుకులను ఉచితంగా పంపింది. ఇదే వ్యత్యాసం 1903 సంవత్సరం నాటికి రూ.37 కోట్లకు పెరిగింది. దీనితో భారతదేశంలో ఉత్పత్తి చేస్తున్న పరిశ్రమలకు, పెట్టుబడి దారులకు ఆ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఉత్పత్తి అయిన వస్తువులకు గిట్టుబాటు ధర దక్కలేదు. దీనితో కుటీర పరిశ్రమలు మూతపడ్డాయి. కుటీర పరిశ్రమల మీద ఆధారపడిన వేలాది కుటుంబాలు బజారున పడ్డాయి. పేదరికం మరింత పెరిగింది. ఆకలి చావులు మరింత పెరిగాయి. సస్యశ్యామలంగా ఉన్న భారతదేశం, స్మశాన వాటికంగా మారింది. భారతదేశం ప్రతి గ్రామం అన్ని పరిశ్రమలన్నా గ్రామీణ స్వతంత్ర పారిశ్రామికవాద మని వర్ణించిన బ్రిటీష్ పాలకులు గ్రామాలను, గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యణ చేసినట్లుయింది.

**విలియం డిగ్బీ:**

ప్రముఖ బ్రిటీష్ ఆర్థిక విశ్లేషకుడు విలయం డిగ్బీ 1881వ సంవత్సరంలో భారతదేశంలోని ఆర్థిక సమస్యలకు సంబంధించి విడుదల చేసిన తన గ్రంథములో "భారత దేశం నుండి ఇంగ్లండ్‌కు వివిధ రూపాలలో చేరుతున్న ద్రవ్యాన్ని వివరించాడు. "1757 నుండి 1815 వరకు ఇండియాలోని మూలభండారాల నుండి ఇంగ్లండ్‌కు 100 కోట్ల పౌనులు ప్రవహించినట్లు" ధృవీకరించాడు. ఇదే 19వ శతాబ్దంలో మొత్తం 600 కోట్ల రూపాయలు ఇంగ్లండ్‌కు తరలించబడినది. ఇంకనూ డిగ్బీ "1901 సంవత్సరంలో Prosperous British India అనే గ్రంథాన్ని ప్రచురించి భారతదేశంలో బ్రిటీష్ ఇండియా ఆర్థిక పరిస్థితులను సవివరంగా వివరించి, ఆర్థిక మరియు జాతి వివక్షతలు లేని భారతీయ సమాజం కొరకు పిలుపునిచ్చెను. ఇతను రచించిన మరొక రచన Famine Compaigns in Southern India.

తూర్పు ఇండియా కంపెనీ బెంగాల్‌ను పాలించిన మొదటి ఆరు సంవత్సరాల కాలంలో దాదాపు 40 లక్షల పౌన్‌ల ఆదాయాన్ని భారతదేశం నుండి కబలించింది. భారతదేశం నికరాదాయంలో ఇది మూడవ వంతు కావడం గమనార్హం.

**మాతృభూమి వ్యయం:**

బ్రిటీష్ వలస పాలకులు భారతదేశం నుండి తరలించే సంపదలో హోమ్ చార్జీలు చాలా ముఖ్యమైనవి. వీటిని మనం కంపెనీ వారు తమ మాతృదేశం అయిన ఇంగ్లండ్‌కు చెల్లించే మాతృ భూమి వ్యయం అనవచ్చును. కంపెనీ వారికి బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇచ్చినందుకు ప్రతిఫలం. ఇందులో అనేక రకాలయిన పన్నులు ఉన్నాయి. వాటిలో ఇండియా బ్రిటీష్ సివిల్ ఉద్యోగులకు చెల్లించే జీతాలు, ప్రభుత్వ శాఖలకు సరఫరా చేసిన వస్తువుల మొత్తం పెన్షన్‌లు, ఇండియా సెక్రటరీ కార్యాలయ ఖర్చులు చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వ ఋణంపై భారతదేశం ప్రతి సంవత్సరం బ్రిటీష్ దేశానికి నిర్ణీత వడ్డీని చెల్లించాల్సి వచ్చింది. ఇంకనూ సబ్సిడీలపై వడ్డీలు, వార్షిక ద్రవ్యాలు, పునర్నిర్మాణ అధికారులపై కూడా భారతదేశ ఆదాయం నుండే చెల్లించేవారు. వీటన్నిటికి మించి రూపాయి విలువ పడిపోవడం వల్ల వచ్చే నష్టం కూడా సంపద తరలింపులో ప్రధాన భాగమయింది. ఇంకనూ 'అదృశ్య దిగుమతులు' గా పేర్కొనబడ్డ విదేశీ బ్యాంకుల సేవలు, భీమా కంపెనీలు, తేయాకు తోటలు, జనుము వస్తువుల తయారీ, ఖనిజ పరిశోధన మొదలగు వాటికి వేలాది రూపాయలు భారత ఖజానా నుంచి చెల్లించారు.

కంపెనీ పాలనలో మరొక చారిత్రాత్మక అంశము ప్రభుత్వ ఋణము ప్రారంభం కావడం. మొదటి ఆర్థిక చరిత్రకారుడూ, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన రమేశ్ చంద్రదత్ తన గ్రంథమయిన "ఆర్థిక భారతదేశ చరిత్ర" (Economic History of India) గ్రంథములో మొదటిసారిగా ఈ అభిప్రాయంను వ్యక్త పరిచాడు. భారతదేశంలోని కంపెనీ ప్రభుత్వం తమ మాతృదేశానికి చెల్లించాల్సిన హోమ్ చార్జీలు లేదా మాతృభూమి వ్యయం నిర్ణీత సమయంలో చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఋణం పెరుగతూ వచ్చింది. 1857 తిరుగుబాటు నేపథ్యంలో భారతదేశంలో అధికారం కోల్పోయిన నాటికి ప్రభుత్వ ఋణం 69.4 మిలియన్ స్టెర్లింగ్ పౌనులుకు చేరింది. అది క్రమక్రమంగా 1900 నాటికి 228.8 మిలియన్‌లకు పెరిగి భారతీయులు కోలుకోలేని స్థాయికి దిగజార్చింది. భారతదేశ పరిపాలన కోసం, దేశంలోని వనరులను అభివృద్ధి చేయడానికే ఈ మొత్తాన్ని వ్యయం చేశామని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించడం గమనార్హం. కాని బ్రిటీష్ ప్రభుత్వం తను ఇతర దేశాలతో చేసిన యుద్ధాలలో భారతీయ సైన్యాన్ని వినియోగించుకొని వారి ఖర్చులకు సైతం. భారతీయ ఖజానా నుండి వాడుకోవడం జరిగింది. దేశంలోని ఇతర ప్రాంతాలను వశపరచుకోవడానికి సామ్రాజ్యకాంక్ష విధానానికి అడుగుపెట్టిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ వ్యయాన్ని హోమ్ చార్జీల ఖాతాలో జమ చేయడంతో ఋణ భారం విపరీతంగా పెరిగింది. ఇంకనూ ఆఫ్ఘన్ యుద్ధాలలో భారతీయ సైన్యానికి ఖర్చు అయిన మొత్తం సైతం ఇందులోనిదే.

## 14.3. సంపద తరలింపు సిద్ధాంతంపై ఆర్థిక వేత్తల అభిప్రాయాలు:

కంపెనీ ప్రభుత్వం (1757-1857), బ్రిటీష్ ప్రభుత్వం (1858-1947) లు భారతదేశాన్ని పాలించడం ద్వారా రాజకీయ పలుకుబడితో పాటు ఆర్థిక సంపద కొరకు బాగా ఆధారపడ్డారనేది చరిత్రకారులు, ఆర్థిక వేత్తల వాదన. వాస్తవంగా ఆసియా ఖండంలో ముఖ్య భాగమయిన భారతదేశాన్ని బ్రిటీష్ వారు ఆక్రమించుకోవడంలో ముఖ్య ఉద్దేశ్యం కూడా ఇదియే. రాజకీయంగా భారతదేశాన్ని పాలించడం క్లిష్టమయినా, వారు దీనిని అంటిపెట్టుకోవడానికి ప్రధాన కారణం భారతదేశ సంపద. ఆ సంపదను పూర్తిగా వారు స్వాహా చేసిన తరువాతనే భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చారని కూడా అనేక మంది భావన. దీనిని గురించి ప్రముఖ వ్యక్తుల అభిప్రాయాలను మనం తెలుసుకుంటాము.

**రామ్‌సే మాక్డోనాల్డ్:**

బ్రిటన్‌లో లేబర్ పార్టీ నాయకుడు అయిన మాక్డోనాల్డ్ భారతీయుల పరిస్థితికి స్పందించి ఎన్నో సందర్భాలలో భారతీయ బ్రిటీష్ ప్రభుత్వాన్ని విన్నవించి భారతీయుల సంక్షేమాన్ని కోరాడు. తర్వాత కాలంలో మాక్డోనాల్డ్ బ్రిటన్ ప్రధానిగా పనిచేశాడు. ఈయన అభిప్రాయం ప్రకారం డ్రెయిన్ భారతదేశానికి ద్వంద్వ నష్టం. ఇండియాలో ఉత్పత్తి అయిన సరుకులను సరసమయిన ధరలకు కొనడం ద్వారా ద్రవ్యాన్ని పొందడం ఒకటి కాగా, అట్టా పొందిన ద్రవ్యాన్ని భారతీయ ప్రయోజనార్థం ఉపయోగించకపోవడం రెండవది. దీనికి తోడు హోం చార్జీల పేరిట కప్పం అధికమయినపుడు అభివృద్ధి విస్తరించే అవకాశం సన్నగిల్లుతుంది.

**లేలాండ్ జెంక్స్:**

ప్రముఖ ఆర్థిక వేత్త, జెంక్స్ డ్రెయిన్ సిద్ధాంతము గురించి వివరిస్తూ "ఇంగ్లండ్ ప్రభుత్వం తన సౌకర్యాన్ని ఉద్దేశించి తన ఖర్చుల భారాన్ని భారత్‌పై మోపడం చాలా అసంబద్ధమైనదని, భారత్‌తో సంబంధం లేని వ్యయం ప్రాతినిధ్యం లేని ఇండియా రైతుపై మోపడం అమానుషం" యని వ్యక్తం చేసెను.

**జె.సి. కుమారప్ప:**

భారతీయ ఆర్థికవేత్త, మహాత్మాగాంధీ సన్నిహితుడు అయిన కుమారప్ప "గాంధీయిజం ఎకనామిక్స్" ఆధారంగా ఆర్థిక సిద్ధాంతాను రచించాడు. అనుత్పాదకము లయిన ఈ ఋణాలు బ్రిటీష్ వారి ఇండియా ఆక్రమణ ప్రయత్నంలోనే ఆవిర్భవించాయి. తమ సామ్రాజ్య ప్రయోజనాన్ని ఉద్దేశించి ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వారు జరిపిన యుద్ధాలకై ఈ ఋణాలు పెరిగాయి. వీటిని కూడా భారతీయులు చెల్లించాలని అనడం చాలా అన్యాయమని విమర్శించారు.

**దాదాబాయి నౌరోజీ:**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశపు వృద్ధ మనిషిగా ఖ్యాతికెక్కిన నౌరోజి భారతదేశంలో మొదటి ఆర్థిక శాస్త్రవేత్త. సంపద తరలింపు పై అనేక సందర్భాలలో బ్రిటీష్ ప్రభుత్వం చేపడుతున్న అనేక చర్యలు భారతదేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాయని ప్రకటించాడు. Poverty and Un-British Rule in India మరియు Poverty of India లలో బ్రిటీష్ ప్రభుత్వం ఏవిధంగా భారతీయ సంపదను, ఏ ఏ మార్గాల ద్వారా తరలిస్తున్నది చాలా వివరంగా తెలియజేశాడు.

ఇంగ్లండ్‌కు భారతదేశం ప్రతి సంవత్సరం చెల్లించే కప్పానికి, దేశంలో సంభవిస్తున్న క్షామ పరిస్థితులకు ప్రత్యక్ష సంబంధం ఉంది. మూలధనం అభివృద్ధి యొక్క మందగతి, పారిశ్రామిక అభివృద్ధికి సంభవించిన నిరోధం దేశం యొక్క ద్రవ్య నిస్స్రావానికి కారణం" యని విమర్శించెను.

**రమేశ్ చంద్రదత్::**

ఆర్థిక చరిత్రకారుడు ఎం.జి. రానడే, ఎం.కే. గాంధీల సహచరుడు అయిన రమేష్ చంద్రదత్ ప్రముఖ ఆర్థిక చరిత్ర కారుడు. ఇతను రచించిన గ్రంధాలలో ముఖ్యమైనవి, భారతదేశ ఆర్థిక భావ చరిత్ర మరియు Mc Master University Archive for the History of Economic Thought. వీటి ద్వారా బ్రిటీష్ పాలకులు భారతదేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన విధానమును వివరించెను. డ్రెయిన్ సిద్ధాంతమును గురించి "ఆహార ధాన్యాల ఎగుమతి, తత్ఫలితంగా ఏర్పడిన ఆహారపు కొరత, ధాన్యాల అధిక ధరలు మొదలగునవి దాని ఫలితాలే" యని చెప్పాడు.

## 14.4. డ్రెయిన్ సిద్ధాంతము యొక్క ఫలితాలు:

బ్రిటీష్ ప్రభుత్వం దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు కొనసాగించిన "ఆర్థిక దోపిడి విధానం" ద్వారా స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై అనేక దుష్పరిమాణాలకు దారితీసింది. ఈ పరిణామాలను ప్రధానంగా రెండు భాగాలుగా చెప్పవచ్చును. అందులో ఒకటి మంచి ఫలితాలు. ఇవి కేవలం ఇంగ్లండ్‌కే వర్తించాయి. రెండవది దుష్ఫలితాలు. ఇవన్నియు భారతదేశానికి, భారతీయులకు మాత్రం పరిమితమయినాయి.

### 14.4.1. ఇంగ్లండ్‌పై డ్రెయిన్ సిద్ధాంత ప్రభావం: ఇంగ్లండ్ దేశంలో పరిమాణాలు

బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలో చేపట్టిన ఆర్థిక విధానం ప్రధాన లక్ష్యం వారికే ఏదో రకంగా లబ్ది చేకూర్చడము కొరకు కొనసాగినాయి. దీనికి తోడు బ్రిటీష్ దేశంలో పారిశ్రామిక విప్లవం రావడం కూడా వారికి ఎంతో శుభపరిణామం. పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో జరిగిన అధిక ఉత్పత్తి మార్కెట్ చేయడానికి వలస రాజ్యాలు మార్కెట్‌లా ఉపయోగపడినాయి. అందులో ప్రథమ భాధితురాలు భారతదేశం. ఐరోపా ఖండంలో ముఖ్యంగా ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం, భారతదేశంలో ఇంగ్లండ్ కంపెనీ రాజకీయ అధికార స్థాపన రమారమి ఒకే సమయంలో జరిగాయి. భారతదేశంలో ఇంగ్లండ్ అధికార స్థాపనకే పారిశ్రామిక విప్లవం పుట్టిందా అన్నట్టు ఉందని ఆర్థిక వేత్తలు అభిప్రాయ పడినాడు. ప్లాసీ యుద్ధానంతరం భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి భారతీయ పరిశ్రమల వినాశనాన్ని ఆధారంగా జరిగిందనేది అక్షర సత్యం. పారిశ్రామిక విప్లవం తొలిదశలో పెట్టుబడి పెట్టిన చాలా మంది పారిశ్రామిక వేత్తలు బెంగాల్ రాష్ట్రంలో వ్యాపారం చేసిన వారే. ఆధునిక యుగంలో పెట్టుబడి కోసం అనేక దేశాలు విదేశీ ఋణంపై ఆధారపడినాయి. కాని బ్రిటీష్ దేశంనకు అలాగా ఋణాలు చేయవలసిన అవసరం రాలేదు. వారు ఎలాంటి ఋణం చేయకుండా, ఇండియా నుండి ధనం తరలించి, వారి దేశంలో పరిశ్రమలు అభివృద్ధి చేసుకొని పారిశ్రామిక రంగంలో అగ్రస్థానం పొందారు.

సంపద తరలింపు సిద్ధాంతం అమలు పరచడం ద్వారా ఇంగ్లండ్ సిరి సంపదలు పెరిగాయి. తద్వారా రాజకీయ ప్రాబల్యాన్ని సాధించి భారత దేశమంతా త్వరితంగా వారి ఆధీనంలోకి తీసుకోగలిగారు. పరోక్షంగా భారతదేశంను వారి పాదా క్రాంతం చేసుకున్నారు. ఇంగ్లండ్ ఖజానా నింపుకున్నారు. దీనితో ప్రపంచ రాజ్యాల అధినేతగా ఇంగ్లండ్ కొనసాగడానికి దోహద పడింది.

### 14.4.2. భారతదేశంపై డ్రెయిన్ సిద్ధాంత ప్రభావం: ఇంగ్లండ్ దేశంలో పరిమాణాలు

బ్రిటీష్ వారి ఆర్థిక దోపిడి విధానం ద్వారా భారతీయుల కొనుగోలు సామర్థ్యం తగ్గింది. మూలధనం లేమితో పారిశ్రామికాభివృద్ధి ఆగిపోయి నిరుద్యోగం తాండవించింది. లక్షలాది మంది భారతీయులు నిరాశ్రయులయ్యారు. బ్రిటీష్ వారు కొనసాగించిన దమనకాండతో కుటీర పరిశ్రమలు కుప్పకూలాయి. గ్రామీణ పరిశ్రమలు కునారిల్లడంతో వాటిపై ఆధారపడిన లక్షలాది గ్రామాలు నిరాశ్రయులై నిర్భాగ్య జీవితాన్ని అనుభవించారు.

ఇంగ్లండ్‌కు చెల్లించవలసిన కప్పంలో భాగంగా ఆహార ధాన్యాల ఎగుమతి నిర్భందమయ్యింది. తత్ఫలితంగా దేశంలో ఆహారం గింజల కొరత ఏర్పడి ధరలు పెరిగాయి. దీనితో క్షామ పరిస్థితులు తరచూ భారతదేశాన్ని పట్టిపీడించాయి.

### 14.4.3. డ్రెయిన్ సిద్ధాంతం-విమర్శ: విశ్లేషణ

బ్రిటీష్ వారు ఆచరించిన సంపద తరలింపు విధానం భారతదేశాన్ని భారతీయులను ఎంత ఆర్థిక దుస్థితికి తెచ్చిందో మనం సవివరంగా తెలుసుకున్నాము. బ్రిటీష్ వారి మూలధనం మన సంపదయేనని తెలుసుకున్నాము. భారతీయుల వస్తువులపై

ఎగుమతి సుంకం అధికంగా వసూలు చేసి, బ్రిటీష్ వారి దిగుమతి వస్తువులకు తక్కువ పన్ను విధించడం ద్వారా భారతదేశ ఆదాయాన్ని వారు కొల్లగొట్టారు. అంతేగాక మూలధనంపై వడ్డీలు, హోమ్ చార్జీలు, విదేశీ ఋణ సౌకర్యంపై వడ్డీలు అన్యాయమని, అమానుషమని మన ఆర్థిక వేత్తలు విమర్శించారు.

అయితే ఈ అభిప్రాయాలన్నింటిని కొట్టిపారేస్తూ డ్రెయిన్ సిద్ధాంతం తప్పుల హోమ్ చార్జీలు భారతదేశానికి నష్టాలను గాక లాభాలను చేకూర్చాయని కొంతమంది ఆర్థిక వేత్తలు తమ అభ్యంతరాలను వ్యక్త పరిచారు. వారిలో ముఖ్యులు షిండ్లే షిరాస్, మారిసన్ మరియు మహదేవ గోవింద రానడేలు ముఖ్యులు.

ఇంగ్లాండ్ భారతదేశంలో పెట్టిన పెట్టుబడి ద్రవ్యంపై వడ్డీకి, లాభాంశాలకు బదులుగా ఈ ఖర్చులు ఇండియా ఇస్తున్నారే గాని, ఏకోశాన ఈ మొత్తం భారతదేశ సంపద తరలింపు తరహా కాదని వారు అన్నారు. ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు మహదేవ గోవింద రానడే సైతం వారి అభిప్రాయాన్ని సమర్థించినాడు.

ఇంగ్లండ్ నుండి తీసుకున్న ఋణాల మీద చెల్లించవలసిన వడ్డీని నష్టముగా భావించడం సమంజసము కాదని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త జి.ఫిన్డ్లే షిరాన్ అభిప్రాయపడ్డాడు. తను రచించిన "ద సైన్స్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్" మరియు ఇండియన్ ఫైనాన్స్ అండ్ బ్యాంకింగ్" లో బ్రిటీష్ వారి ఆర్థిక విధానాలను విశ్లేషించిన షిరాస్ భారతదేశంలో మూలధనం కొరత ఎక్కువగా ఉన్నదని, రైల్వే నిర్మాణమునకు, నీటి పారుదల ప్రాజెక్టులకు మరియు ఇతర ప్రయోజనాల కోసం అవసరమయ్యే మూలధనం లండన్ మార్కెట్‌లో చౌకగా దొరుకుతుందని అన్నారు. అలాంటి పరిస్థితులలో పెట్టుబడితో ముందుకు వచ్చిన ఎంటర్‌ప్రెన్యూర్స్ కనీసం వడ్డీలు చెల్లించకపోతే భవిష్యత్‌లో అభివృద్ధి, తద్వారా జాతీయదాయం పెరిగే అవకాశం లేదన్నారు. నేడు కూడా మనం ప్రపంచ దేశాల నుండి వివిధ ప్రాజెక్టులకు మూలధనం ఆశించడం ముదావహం. మూలధనం లేని దేశంలో జాతీయాదాయం, తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉండడం మనం గమనిస్తున్నాము. భారతదేశంలో మొదటిగా వలస పాలనలో జాతీయదాయంను అంచనా వేసిన వారిలో దాదాబాయి నౌరోజీ, విలియం దిగ్బేతో పాటు ఫిండ్లే షిరాస్ కూడా ఉండడం గమనించాలి.

భారతదేశంలో సంపద తరలింపు సిద్ధాంతమును సమర్థించిన మరొక ఆర్థిక వేత్త మోరిసన్. అభివృద్ధి లేని భారతదేశంలో పారిశ్రామికకరణే అభివృద్ధికి అవసరమని, అలాంటప్పుడు ఆధునిక పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, వాటికి మూలధనం పెట్టుబడి పెట్టాలని అన్నాడు. దానికి ప్రతిఫలంగా యంత్ర సామాగ్రి, అధిక ఉత్పత్తి, ఉద్యోగ కల్పన, ఆదాయం పెంపు మొదలగునవి లబ్ది పొందుతామని దానికి ప్రతిగా మనం ఇచ్చేదే "విదేశీ చెల్లింపులు" (వడ్డీ రూపేణ) యని, ఇది సమంజసమని అభిప్రాయ పడినాడు.

## 14.5. డ్రెయిన్ సిద్ధాంతంపై విమర్శ-విశ్లేషణ:

వెనుకబడిన దేశం అభివృద్ధి చెందడానికి, విదేశీ ఋణాలు తప్పనిసరి. పెట్టుబడి, మూలధనం వెచ్చించడంలో కొంత ధైర్యం, త్యాగం, ప్రతిఫలంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించవచ్చు. పెట్టుబడిదారులకు ప్రతిఫలంతో పాటు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయి. కావున వాటి మీద వడ్డీ చెల్లించడము ధర్మమే. అయితే మూలధనం సక్రమంగా వినియోగమై తగినంత ప్రతిఫలాన్ని ఇస్తుందా లేదా యనేది ఆలోచించాలి. బ్రిటీష్ ప్రభుత్వం మొదటి 50 సంవత్సరాలలో ఆదాయం లేకపోయినా రైల్వేల నిర్మాణ అభివృద్ధికి అత్యధికంగా ఖర్చు పెట్టారు. కాని అంతకంటే కీలకమయిన నీటిపారుదల అభివృద్ధికి నామమాత్రంగా ఖర్చు చేశారు. అనగా 1905 నాటికి రైల్వే నిర్మాణంనకు 222 మిలియన్ స్టెర్లింగ్

పౌన్‌లు ఖర్చు చేయగా, నీటి పారుదలకు కేవలం 24 మిలియన్ స్టెర్లింగ్ పౌన్‌లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రజలకు తక్షణకు ఆదాయం వచ్చే నీటి రంగంపై కాకుండా రైల్వేలపై బ్రిటిష్ ప్రభుత్వం అత్యధిక మొత్తాన్ని ఎందుకు ఖర్చు పెట్టినట్టు? దీనికి ప్రధాన కారణం రైల్వేల అభివృద్ధి అనేది వలస సామ్రాజ్యవాదంలో మొదటి ప్రాధాన్యత. రైల్వేల అభివృద్ధి ద్వారా రవాణా సౌకర్యము పెరిగి, బ్రిటీష్ వ్యతిరేక వ్యక్తులను అణచడానికి ఉపయోగపడింది. దీనిని గమనించినట్లయితే బ్రిటీష్ వారు మూలధనాన్ని ప్రజా సంక్షేమం కొరకు గాకుండా, వారి సామ్రాజ్య మనుగడకు మళ్లించారు. అందువలన ప్రజల ఆదాయం పెరగకపోగా, వారి జీవనాధానం పోయి ఆర్థిక ఇక్కట్లతో, ఆకలి బాధలతో జీవితం గడిపారని చెప్పవచ్చు.

## 14.6. సారాంశము

- బ్రిటీష్ తూర్పు ఇండియా కంపెనీ ప్రధాన లక్ష్యం వ్యాపారాభివృద్ధి, ఆర్థిక సంపాదన.
- సహచర ఐరోపా వ్యాపారస్థులను ఓడించడంతో భారతదేశంలో ఏకస్వామ్యం ఏర్పడి ఆదాయం పెరిగేందుకు దోహదపడెను.
- ప్లాసీ యుద్ధంలో ఒక వైపు బెంగాల్ సుల్తాన్, మరోవైపు ప్రధాన ప్రత్యర్థులయిన ఫ్రెంచి వారిని ఓడించడం వారికి కలిసొచ్చిన అదృష్టం.
- పారిశ్రామిక విప్లవం జరగడం, తద్వారా అధిక ఉత్పత్తి కూడా వారిని భారతదేశంపై పూర్తిగా కేంద్రీకరించడానికి ఆర్థిక దోపిడి విధానం వైపు మళ్ళడానికి కార్యమయ్యెను.
- డ్రెయిన్ సిద్ధాంతమునే ఐశ్వర్య నిర్గమనం, ఐశ్వర్య పరివాహం, సంపద తరలింపు సిద్ధాంతము యని కూడా అంటారు.
- భారతదేశాన్ని 'బ్రిటీష్ దేశపు వస్తువుల మార్కెట్' గా మార్చడం.
- స్వతంత్ర పారిశ్రామిక వాద వలసవాద దోపిడి వ్యవస్థకు బలియగుట.
- మాతృభూమి వ్యయం కూడా సంపద తరలింపులో భాగం అవ్వడం.
- అదృశ్య దిగుమతులు కూడా భారతీయుల ఆదాయంను గండికొట్టారు.
- రామ్ సే మాక్డోనాల్డ్, లేలాండ్ జేమ్స్, జె.సి. కుమారప్ప, దాదాబాయి నౌరోజి, రమేశ్ చంద్రదత్‌లు డ్రెయిన్ సిద్ధాంతము పై ప్రచారం చేసిన ఆర్థిక వేత్తలు.
- సంపద తరలింపును సమర్థించిన వారిలో షిండ్లే షిరాస్, మారిసన్‌లతో పాటు మహదేవ గోవింద రానడేలు ఉన్నారు.
- బ్రిటీష్ పాలన నుంచి భారతదేశం సంపాదించిన మరొకటి పేదరికం.
- బ్రిటీష్ పాలనలో ముఖ్యులయిన చార్లెస్ ఇలియట్, విలియం హంటర్, కోలిన్ క్లార్క్‌ల పేదరికంనకు బ్రిటీష్ పాలకులు కారణమని అభిప్రాయ పడ్డారు.

## 14.7. నమూనా ప్రశ్నలు:

**I) వ్యాసరూప ప్రశ్నలు:**

1) డ్రెయిన్ సిద్ధాంతమును వివరించి, దాని పరిణామాలను వివరింపుము?

2) డ్రెయిన్ సిద్ధాంతము యొక్క ఫలితాలను వివరించండి?

3) డ్రెయిన్ సిద్ధాంతం వివిధ ఆర్థిక వేత్తల విశ్లేషణలను చర్చింపుము?

**II) లఘు ప్రశ్నలు:**

1) డ్రెయిన్ సిద్ధాంతమును నిర్వచించుము?

2) వలసవాద దోపిడి వ్యవస్థను నిర్వచించుము?

3) విలియం డిగ్బీ

4) దాదాబాయి నౌరోజి

5) మాతృభూమి వ్యయము

6) అదృశ్య దిగుమతులు

7) రమేశ్ చంద్రదత్

8) డ్రెయిన్ సిద్ధాంతము ఫలితాలు

9) జి. షిండ్లే షిరాస్

10) మహదేవ గోవింద రానడే.

## 14.8. ఆధార గ్రంథాలు


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.

2. Bipin Chandra - Essays on Colonialism.

3. Sumit Sarkar - Modern Indian Economic History.

4. P.N. Chopra, SB Puri MN Das - A Social Cultural and Economic History of India Vol. III.

5. తెలుగు అకాడమీ ప్రచురణ – భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


- శ్రీ బాలగొండ గంగాధర్

## పాఠం - 15

# భారతదేశంలో సంభవించిన క్షామాలు - పేదరికం

**15.0. లక్ష్యము:** పాఠ్యాంశం చదివిన తరువాత విద్యార్థులు క్రింది విషయాలను తెలుసుకుంటారు.

- ⌗ బ్రిటీష్ పాలన కాలం నాటి ఆర్థిక సంస్కరణలు, చర్యలను గమనించడం.
- ⌗ ఆర్థిక సంస్కరణల పర్యావసనం గురించి అధ్యయనం చేయడం.
- ⌗ క్షామాలు సంభవించడానికి గల కారణములను, పరిణామాలను తెలుసుకోవడం.
- ⌗ క్షామ నివారణకు బ్రిటీష్ పాలకులు తీసుకున్న చర్యలను తెలుసుకోవడం.
- ⌗ క్షామాల ఫలితాలను అధ్యయనం చేసి, భవిష్యత్ ప్రణాళికలను ఆశించడం.
- ⌗ బ్రిటీష్ పాలన కాలంలో పేదరికం సంభవించడానికి గల కారణాలను, ఫలితాలను తెలుసుకోవడం.
- ⌗ బ్రిటీష్ వారి కాలంలో భారతదేశం వెనుకబాటుతనం గురించి తెలుసుకోవడం.

**విషయక్రమము:**


**15.1.** పరిచయము

**15.2.** భారతదేశంలో సంభవించిన క్షామాలు-చారిత్రక విశ్లేషణ

**15.3.** కంపెనీ పాలనలో సంభవించిన కరువులు

**15.4.** క్షామాలు సంభవించడానికి గల కారణాలు

**15.4.1.** ప్రకృతి కారణాలు

**15.4.2.** వ్యవసాయ వాణిజ్యకరణ

**15.4.3.** దేశీయ పరిశ్రమలు కనుమరుగు

**15.4.4.** పన్నుల భారంతో ఋణాగ్రస్థులగుట

**15.4.5.** ప్రభుత్వ వైఫల్యం

**15.5.** క్షామాలు-ప్రభావం

**15.6.** క్షామాల నివారణకు బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు

**15.7.** పేదరికం

**15.7.1.** బ్రిటీష్ వారి పాలనలో వివిధ కరువు కమీషన్‌లు

**15.7.2.** క్షామ నిధి ఏర్పాటు

**15.8.** సారాంశము

**15.9.** నమూనా ప్రశ్నలు

**15.10.** ఆధార గ్రంథాలు

## 15.1. పరిచయము:

భారతదేశంలో దాదాపు రెండు శతాబ్దాల పాటు కొనసాగిన బ్రిటీష్ ప్రభుత్వం, పూర్వపు ప్రభుత్వాలకు భిన్నంగా భారతదేశాన్ని దోచుకోవడానికే పాలించినట్లు అగుపిస్తుంది. వీరి కంటే ముందు భారతదేశంపై దండెత్తిన విదేశీయుల లక్ష్యం దోచుకోవడమే. అందులో భారతీయులకు ఒక స్పష్టత ఉంది. దీనికి ఉదాహరణలు ప్రాచీన కాలంలో దండెత్తిన విదేశీయులు తదనంతరం దండెత్తిన ముస్లింలు ప్రారంభ లక్ష్యం దండయాత్రలయినప్పటికి, తర్వాత భారతదేశంలో స్థిరపడినారు. భారతీయులుగా మారడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే క్రైస్తవ మతాచారులయిన బ్రిటీష్ వారు 200 సంవత్సరాలు పాలించినా, వారు భారతదేశంను పాలించినంత కాలం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా బాధపెడుతూ, హింసిస్తూ, యావత్ భారతీయ తత్వాన్ని నాశానం చేసేందుకు ఎసరుపెట్టారు. అందులో భాగమే ఆర్థిక దోపిడి విధానం. దానిని మనం సంపద తరలింపు సిద్ధాంతము యని అంటారు. ఈ ఆర్థిక సంస్కరణల పర్యవసానమే పేదరికం క్షామాలు, ఆర్థిక వ్యవస్థ శిథిలము, అభివృద్ధి లేకపోవడం, గ్రామీణ వ్యవస్థ కుంటుపడడం లాంటి దుష్పరిమాణాలు భారతదేశంలో ఆవిష్కృత మయినాయి. ఈ దుష్పరిణామాలు ప్రజలలో అలజడి రేపడంతో బ్రిటీష్ ప్రభుత్వం భారతీయులకు తలవంచి దేశం నుండి నిష్క్రమించింది. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థ 'ఏనుగు మింగి వదిలిన వెలగపండు' లాగా నిర్వీర్యమై నాటి నుండి నేటికిని కోలుకోలేక పోతుంది.

## 15.2. భారతదేశంలో సంభవించిన క్షామాలు-చారిత్రక విశ్లేషణ:

దక్షిణ ఆసియా దేశాలలో కరువులు సంభవించడం చాలా ఆనవాయితీగా మారింది. ముఖ్యంగా భారతదేశం, బంగ్లాదేశ్, చైనా దేశాలలో తరుచూ కరువులను ఈ దేశాల ప్రజలు అనుభవిస్తున్నారు. బ్రిటీష్ వారు భారతదేశాన్ని పాలించిన రోజులలో కూడా భయంకరమైన కరువులను ఎదుర్కోవలసి వచ్చింది. బ్రిటీష్ వారు కూడా వీటిపై దీర్ఘదృష్టి సారించక పోవడంతో కరువు పరంపరను అరికట్టలేకపోయారు. వాస్తవంగా బ్రిటీష్ వారు కొనసాగించిన ఆర్థిక విధానాలు కరువు సమస్యలను మరింత క్లిష్టతరం చేశాయనడంలో సందేహం లేదు.

**క్షామము నిర్వచనం:** క్షామంను మనము కరువు లేదా కాటకం లేదా తీవ్రమయిన కొరత, దౌర్భాగ్యం, దుర్భిక్షం అనే వివిధ పేర్లతో పిలుస్తాము. ఇది వర్షం లేకపోవడం వలన, సమృద్ధి చాలినంత లేకపోవడం విపరీతమైన ఆకలి కొరత వలన ఏర్పడుతుంది. దీని నిర్వచనం నకు సంబంధించి చరిత్రకారులు ఎన్నో అర్థ వివరణలు ఇచ్చారు. మన వాడుక భాషలో కరువును "దీర్ఘకాలంగా వర్షాలు లేక పంటలు పండని కారణంగా ప్రజలకు తినడానికి తిండి దొరకని పరిస్థితి" గా నిర్వహించవచ్చును. ఇది లాటిన్ పదము 'Hunger' నుండి ఉద్భవించినది. సాధారణ ఆహారం కూడా ప్రజలకు లభించక పోవడం ఫలితంగా ఒక ప్రాంతము లోని ప్రజలు విపరీతమైన ఆకలితో బాధపడే స్థితిని క్షామం అని చెప్పవచ్చును.

ఈ నిర్వచనంను గమనించినట్లయితే ప్రాచీన కాలంలో (ఎక్కువగా మానవుడు ఆహార పదార్థాలు, నీటి పారుదల సౌకర్యములపై దృష్టి పెట్టని కాలం) కూడా క్షామములు సంభవించేవి అని భావించవచ్చును. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త విలియం డిగ్బీ అంచనా ప్రకారం 14వ శతాబ్దం నుండి 17వ శతాబ్ది వరకు దాదాపు 14 సార్లు క్షామం సంభవించినది అని తెలియజేశాడు. అదేవిధంగా మొఘల్ కాలంలో ముఖ్యంగా మొఘల్ సామ్రాజ్యం సుస్థిరత పొందిన అక్బర్ కాలంలో నాలుగు సంవత్సరాలు తీవ్ర వర్షాభావం వల్ల దేశమంతటా కరువు తాండవించింది. అదేవిధంగా స్వర్ణయుగంగా పేరుపొందిన

'షాజహాన్' కాలంలో మానవాలి చరిత్రలోనే అతి దారుణమయిన కరువు వచ్చినట్లు తెలియుచున్నది. అయితే ఔరంగజేబు కాంలో జరిగిన కరువును నివారించడానికి అనేక చర్యలను చేపట్టినట్లు కూడా మనం తెలుసుకోవచ్చును.

## 15.3. కంపెనీ పాలనలో సంభవించిన కరువులు:

సస్యశ్యామలమైన భారతదేశం నిరంతరం క్షామాలకు గురికావడం చాలా దురదృష్టకరమైన విషయం. దీనికి ప్రధాన కారణం విభిన్న భౌగోళిక పరిస్థితులు మరియు భారతదేశం సమశీతోష్ణ మండలంలో ఉండడం. ఒకవైపు ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం గల అస్సాం ప్రాంతాలతో పాటు, అత్యల్ప వర్షపాతం నమోదయ్యే రాజస్థాన్ ప్రాంతము మరియు దక్షిణ భారతదేశంలో రాయలసీమ, పశ్చిమ కర్ణాకట ప్రాంతాలుండడం గమనార్హం. దీనితో ఒక్కోసారి, ఒక ప్రాంతంలో అతివృష్టి, మరొక ప్రాంతంలో అనావృష్టి ప్రబలి ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమయింది.

తూర్పు ఇండియా వర్తక సంఘం 1757వ సంవత్సరంలో ప్లాసీ యుద్ధంలో విజయం సాధించి 24 పరగణాలపై పట్టు సాధించింది. తర్వాత 1764వ సంవత్సరంలో జరిగిన బాక్సార్ యుద్ధంలో మరో ఘన విజయం నమోదు చేసుకొని, అలహాబాద్ సంధి ద్వారా మొత్తం బెంగాల్ రాష్ట్రంపై దివాన్ అధికారం (పన్ను వసూలు చేసుకోవడం) పొందింది. నాటి నుండి అంచెలంచెలుగా ఎదిగి 1857 వరకు భారతదేశాన్ని తమ ఏలుబడిలో ఉంచుకుంది. ఈ వంద సంవత్సరాల కాలంలో 12 సార్లు క్షామాలు, నాలుగుసార్లు తీవ్ర ఆహార కొరత ఏర్పడి ప్రజలు లక్షలాది మంది చనిపోయారు. 1770వ సంవత్సరంలో బెంగాల్‌లో సంభవించిన తీవ్ర క్షామం వల్ల దాదాపు జనాభాలో మూడవ వంతు మంది ఆకలి చావులతో ప్రాణాలు కోల్పోయారు. 1784వ సంవత్సరంలో సంభవించిన కరువు అయోధ్య, పంజాబ్, పశ్చిమ ఉత్తర పరగణాలు తీవ్ర దుర్భిక్షానికి లోనై ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణాది రాష్ట్రాలయిన హైదరాబాద్, మహారాష్ట్ర, మద్రాస్ మరియు గుజరాత్ రాష్ట్రాలు తీవ్ర క్షామానికి గురైనాయి. అదేవిధంగా 1838వ సంవత్సరంలో ఆగ్రా ప్రాంతంలో చెలరేగిన కరువు సుమారు 8 లక్షల మందిని పొట్టన పెట్టుకుంది.

### బ్రిటీష్ సామ్రాజ్య పాలనలో క్షామాలు:

యాదృశ్చికంగా బ్రిటీష్ దేశం ప్రత్యక్షంగా భారతదేశాన్ని ఆక్రమించిన తర్వాత ఎక్కువ కరువులు సంభవించడం గుర్తించదగిన విషయం. వారి 90 సంవత్సరాలు (1857-1947) పాలనలో దాదాపు సగటున ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రాంతంలో క్షామాలు సంభవించాయి. 19వ శతాబ్దంలోనే దాదాపు 24 క్షామాలతో పాటు తీవ్ర ఆహార కొరత, అనావృష్టి, కాటకాలతో పశ్చిమ ఉత్తర ప్రాంతం దద్దరిల్లింది. ఆహార ధాన్యాల కొరత కారణంగా ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఆకలి మంటలతో అలమటించారు. ఈ మధ్య కాలంలో క్షామాల వల్ల మరణించిన వారి సంఖ్య దాదాపు 50 లక్షలు అని భారతీయుల అంచనా. నాటి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఏ మాత్రం సరిపడలేదు అని కూడా చెప్పవచ్చును. ఈ పరంపరలోనే 1865-67 సంవత్సరాల మధ్య ఒరిస్సాలో అనావృష్టి ఫలితంగా ఒరిస్సా రాష్ట్రంలో తీవ్ర కరువు ఏర్పడింది. మరోవైపు 1866వ సంవత్సరంలో సంభవించిన వరదల వల్ల గ్రామాలు, గ్రామాలు తుడిచిపెట్టుకుపోయి దాదాపు 10 లక్షల మంది మరణించగా, అనేక లక్షల మంది నిరాశ్రయులయినారు.

బ్రిటీష్ వారి సామ్రాజ్యంలో సంభవించిన కరువులలో 1868-70ల మధ్య రాజపుటానా (రాజపుత్ర సంస్థానాలలో పంట పండకపోవడం జరిగినది) కరువు చాలా దారుణమైనది. రాజస్థాన్, మధ్య భారత్‌లోని వివిధ సంస్థానాల ప్రజలు తీవ్ర

కరువును ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నో చర్యలను ఏర్పాటు చేసినప్పటికి, జైపూర్, కృష్ణగఢ్ సంస్థానాల ప్రజల సహాయం మరువలేనవి. 1873–74లో బీహార్, బెంగాల్ పరగణాలలో కరువు సంభవించగా ప్రభుత్వం సకాలంలో రంగంలోదిగి అనేక నివారణ చర్యల ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగించింది. బ్రిటీష్ వారి కాలంలో సంభవించిన మరొక క్షామం 1876–1878 మధ్య కాలంలో దక్షిణ భారతదేశమంతా వ్యాపించింది. వర్షాలలేమితో పంటలు సరిగా పండక తీవ్రమైన ఆహార కొరత యావత్ దక్షిణాది రాష్ట్రాలయిన మద్రాస్, బొంబాయి, మైసూర్, హైదరాబాద్ సంస్థానాలకు విస్తరించింది. అదనంగా వివిధ రోగాలు సైతం ప్రజలను కమ్ముకోవడంతో 52 లక్షల మంది మరణించారు.

19వ శతాబ్దంలో సంభవించిన కరువులన్నింటిలోను భయంకరమైనది 1896–97 సంవత్సరంలో సంభవించింది. దీనికి ప్రధాన కారణం తీవ్ర అనావృష్టి ప్రభుత్వం ముందు జాగ్రత్తగా ఆహార నిల్వలు ఉంచకపోవడం కూడా అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. దీనితో దాదాపు 75 లక్షల మంది మరణించారు. ఢిల్లీ, ఆగ్రా, నాగపూర్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురై దోపిడీలు, కొట్లాటలకు దిగడంతో పరిస్థితి చాలా ఆందోళనకరంగా మారింది. ప్రభుత్వం వెంటనే అనేక సహాయకచర్యలు చేపట్టింది. అనేక వేల కోట్లు వెచ్చించడంతో పాటు అనేక ప్రాంతాలలో భూమి శిస్తును తగ్గించడం, ఋణ సదుపాయాలను కల్పించడం జరిగింది. 1899వ సంవత్సరంలో ఋతుపవన వర్షాలు కురవక పశ్చిమ, మధ్య భారతదేశంలో మరోసారి 1900వ సంవత్సరంలో తీవ్ర క్షామం కొనసాగింది. క్షామంను భరించలేని ఈ ప్రాంత ప్రజలు వివిధ ప్రాంతాలకు వలస వెళ్ళారు. అయినా కూడా దాదాపు 25 లక్షల మంది నిండు ప్రాణాలు మరియు లక్షల సంఖ్యలో పశువులు మరణించాయి.

బ్రిటీష్ పాలనలో జరిగిన మరొక భయంకరమైన కరువు 1943వ సంవత్సరంలో బెంగాల్ రాష్ట్రంలో సంభవించినది. దీనికి ప్రధాన కారణం రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఆహార ధాన్యాలు ఇంగ్లండ్‌కు సరఫరా కావడం, బెంగాల్‌లో పంటలు సరిగా పండకపోవడం మరియు బర్మాను కోల్పోవడం, రవాణా సౌకర్యాలు మెరుగుపడి, కరువు నివారణ యంత్రాంగం బాగా పనిచేసినప్పటికి అధికార అంచనా ప్రకారమే 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అనధికారికంగా మరణాల సంఖ్య 35 లక్షలకు పైబడి.

## 15.4. క్షామాలు సంభవించడానికి గల కారణాలు:

భారతదేశంలో క్షామాలు తరచు సంభవిస్తూ, లక్షలాది మంది ప్రాణాలను బలిగొనింది. దీనికి అనేక సహజ కారణములతో పాటు అనేక మానవ తప్పిదాలు కారణమని చెప్పవచ్చును. అలాంటి వాటిలో ముఖ్యమైనవి:

### 15.4.1. ప్రకృతి కారణాలు:

ప్రకృతి కనుకరించనపుడు లేదా అతిగా కనుకరించినపుడే జరిగే దుష్పరిణామాలు క్షామాలు, కరువులు సంభవించడానికి కారణమవుతాయి. సాధారణంగా అనావృష్టి అనగా వర్షాలు లేకపోవడం, పంటలు పండకపోవడం, మిడతలు, చీమల లాంటి విష పురుగుల బెడద ద్వారా ప్రజలు ఆహార విలువలను కోల్పోవడం. అయితే అతివృష్టి, వరదలు కూడా పంటలను నాశనం చేయడం ద్వారా కరువుకు కారణాలు అవుతాయి. అందుకే “అతివృష్టి, అనావృష్టి” కారణాలు యని కూడా అంటారు.

### 15.4.2. వ్యవసాయ వాణిజ్యకరణ:

అనగా ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పండించడం ద్వారా కలిగే క్షామ పరిస్థితులు. దీని ద్వారా ఆహార

ఉత్పత్తులు తగ్గి ఆహారం కొరత ఏర్పడి క్షామములు ఏర్పడుతాయి. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో వాణిజ్య పంటలు అయిన నీలిమందు, ప్రత్తి సాగులోనికి వచ్చి ఆహార పంటలు వరి, గోధుమ, భార్లీ, రాగులు, సజ్జలు, జొన్న తదితరమైనవి కనుమరుగయినాయి. దానితో ఆహారం కొరత తీవ్రంగా ఏర్పడి క్షామ పరిస్థితులు ఏర్పడుతాయి.

**15.4.3. దేశీయ పరిశ్రమలు కనుమరుగు:**

భారతదేశంలోని ప్రతి గ్రామం, అన్ని కుటీర పరిశ్రమలు గలిగిన స్వతంత్ర రిపబ్లిక్. అయితే బ్రిటీష్ వారు అధికారం స్థాపించిన తరువాత, పారిశ్రామికీకరణతో జరిగిన అధిక ఉత్పత్తిని, భారత్‌లో మార్కెట్ చేయడానికే నిర్ణయించారు. అంతేగాకుండా ఎగుమతులపై విపరీతమైన ఆంక్షలు, దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేయడంతో కుటీర పరిశ్రమలు, కుటీర పరిశ్రమ ఉత్పత్తులు కుదేలయ్యాయి. దీనితో భారత్‌లో ఏకస్వామ్యంతో వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, సామాన్య ప్రజల జీవనం దుర్భరమయ్యెను.

**15.4.4. పన్నుల భారంతో ఋణాగ్రస్థులగుట:**

బ్రిటీష్ వారి హయాంలో కూడా ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం భూమి శిస్తు, ప్రభుత్వ వ్యయము అంతా భూమి శిస్తు నుండి వసూలు చేయడంతో ప్రజలపై పన్నుల భారం అధికంగా ఉండెను. దానికి తోడు పండిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రజలు ఋణగ్రస్థులయ్యారు. ఋణ దాతల వలలో చిక్కిన రైతులు ఋణ విముక్తి కొరకు తమ భూములను అమ్ముకోవాల్సివచ్చింది. అతివృష్టి, అనావృష్టి సందర్భాలలో ఋణ దాతల భాదలను భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నారు.

బ్రిటీష్ వారు, భారతదేశంలో పాటించిన వ్యవసాయక విధానం దేశంలో కొనసాగుతున్న సాంప్రదాయ వ్యవసాయాన్ని నాశనం చేసింది. సాంప్రదాయ కారణములయిన ఋతు పవనాల వైఫల్యం, ప్రకృతి వైఫల్యాలతో పాటు బ్రిటీష్ వారి ఆర్థిక విధానం దేశంలో ఆహారం నిల్వల కొరతకు, తద్వారా కరువు కాటకాలకు కారణమయ్యాయి. బ్రిటీష్ వారి కాలంలో ఏర్పడిన కరువులను సమీక్షించినట్లయితే అని నిజంగా మానవ తప్పిదాలే యని తెలియవచ్చింది. ఈ విషయంపై ఫ్లోరెన్స్ నైటింగేల్ మాట్లాడుతూ "బ్రిటీష్ కాలంలో సంభవించిన కరువులు ఆప్రతీక భౌగోళిక ప్రాంతంలోని ఆహారం కొరత వల్ల గాక, ఇతర ప్రాంతాల నుండి అక్కడకు ఆహారపు దినుసులు చేరవేయడానికి రవాణా సౌకర్యాలు లేకపోవడం యని, దీనికి రాజకీయ, సాంఘిక నిర్మాణం లేకపోవడమే" యని వక్కాణించింది.

**15.4.5. ప్రభుత్వ వైఫల్యం:**

ప్రకృతి వైపరిత్యాలు, కరువు కాటకాలు, అతివృష్టి, అనావృష్టి సందర్భాలు అన్నియు ఆకస్మికం కావున, ఇలాంటి సందర్భాలలో ప్రభుత్వం చాలా చిత్తశుద్ధితో, సమయస్ఫూర్తితో పనిచేయాల్సి ఉంది. అంతేగాకుండా గతంలో జరిగిన ఇలాంటి సంఘటనలు గుర్తించుకొని, దీర్ఘ దృష్టితో ప్రభుత్వం ఎన్నో ముందస్తు, సహాయ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. కాని ప్రభుత్వంలో అంత ముందుచూపు, ప్రజల హాహాకారాల పట్ల దయ కనిపించలేదు. బ్రిటీష్ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎన్నో సహాయ చర్యలు, క్షామ నివారణకు అనేక కమీషన్‌లు నియమించినా, అవి సరిపడలేదని చెప్పవచ్చును. అందుకనే లక్షలాది మంది కరువు, కాటకాల మహమ్మారికి ప్రాణాలు కోల్పోక తప్పలేదు.

కరువు, కాటకాలను నివారించడంలో ప్రభుత్వం వైఫల్యానికి మరొక కారణం రవాణా సౌకర్యాలు తగిన స్థాయిలో లేకపోవడం. మొదటిసారిగా రైల్వేల నిర్మాణం, రోడ్ల నిర్మాణం 1850వ సంవత్సరంలో ప్రారంభమయినప్పటికి, ఆహార ధాన్యాలను దేశంలోని అన్ని ప్రాంతాలకు నిర్ణీత సమయంలో సరఫరా చేయడానికి తగిన రవాణా సౌకర్యాలు లేవనే చెప్పాలి.

లేని పక్షంలో ప్రభుత్వం క్షామాల నివారణలో, ఆకలి చావులను నివారించడంలో మరింత సఫలమయ్యేదని చెప్పవచ్చును.

సహజంగా భారతదేశంలో నెలకొని ఉన్న దారిద్ర్యం కూడా ప్రజలు ఎక్కువ సంఖ్యలో చనిపోవడానికి కారణమయింది. ఆహార ధాన్యాల కొరత, ఆహార ధాన్యాల ధరల పెరుగుదల, కూలి లేకపోవడం లాంటి సంఘటనలు కూడా వారి దారిద్ర్యానికి తోడయినాయి. మామూలుగానే అర, కొర తిండితో బ్రతికే వీరు, క్షామ పరిస్థితులతో అది కూడా దొరకక ఆకలితో అలమటించి మరణించడమే శరణ్యమయింది.

## 15.5. క్షామాలు-ప్రభావం:

అసహజ పరిస్థితులయిన కరువు, కాటకాలు, అతివృష్టి, అనావృష్టి సందర్భాలలో ఆయా ప్రాంతాల జనాభాపై సమాజంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. వాటిలో ముఖ్యమైనవి మనం అధ్యయనం చేస్తాం.

కరువు, కాటకాల తీవ్రత వల్ల మొదటిగా నష్టపోయేది జనాభా. కరువు తీవ్రతను బట్టి లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఉదాహరణ: 1770వ సంవత్సరంలో బెంగాల్‌లో 33 లక్షల మంది, 1876-78లో దక్షిణ భారతదేశం క్షామంలో 52 లక్షల మంది, ప్రఖ్యాత 1943 బెంగాల్ కరువులో 35 లక్షల మంది మరణించారు. క్షామాల ఫలితమాఅని ఆహార లోపం, అంటువ్యాధులు వ్యాపించి మరింతమంది జనాభా చనిపోయారు. క్షామ పరిస్థితులు ఏర్పడక పోయినట్లయితే అధిక జనాభా సమస్య, ఆహార సమస్య విషమించి ఉండేవి. క్షామాల ఫలితంగా రైతులు, రైతు కూలీలు ఎక్కువగా చనిపోయి వ్యవసాయాభివృద్ధి కుంటుబడింది. దీనిలో మరింత ఆహార ఉత్పత్తులు తగ్గినాయి. క్షామాల కాలంలో పశుసంపద కూడా విపరీతంగా క్షీణించింది. దీనితో రైతులు పండించే క్షేత్ర విస్తీర్ణం తగ్గి ఆహార ఉత్పత్తులు తగ్గినాయి. ప్రజలు దిగుబడులపై ఆధారపడాల్సి వచ్చింది. క్షామ కాలంలో సమాజంలో నైతిక, సాంఘిక సంబంధాలు దెబ్బతినే అవకాశముంది. కరువు భారాన్ని తట్టుకొనలేక పిల్లలను, భార్యలను పొగొట్టుకున్న లక్షలాది కుటుంబాలు భాధలు వర్ణించలేనివి.

**ఉదాహరణ:**

షాజహాన్ కాలంలో సంభవించిన కరువులో తల్లిదండ్రులు తమ పిల్లల వాత్సల్యానికి బదులు వారి మాంసాన్ని కోరారని, ఆస్థాన కవి కాఫీఖాన్ వర్ణించడం మనం చదివాము. క్షామ కాలంలో తల్లిదండ్రులు పిల్లలను, వృద్ధులను పోషించలేక వారిని అమ్మిన సందర్భాలు చదివాము. క్షామ పరిస్థితులను భరించలేక కొంతమంది తిరుగుబాట్లుకు, దొమ్మీలకు, దోపిడీలకు పాల్పడ్డారు. ఈ విపత్కర పరిస్థితులలో సాంఘిక సంబంధాలు, సమస్యలు ఎన్నో క్రొత్తగా ఆవిర్భవించాయి.

చేతి వృత్తులవారు క్షామ పరిస్థితులలో తమ వృత్తులను మాని వ్యవసాయ కూలీలుగా మారారు. ఋణ గ్రస్థులు, వడ్డీ వ్యాపారస్థుల బాధలు తాళలేక స్థిరాస్థులను, చరాస్థులను పోగోట్టుకున్నారు. అనేక మంది భూములను ఋణ దాతలకు బలవంతంగా ఇచ్చేశారు.

## 15.6. క్షామాల నివారణకు బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు:

బ్రిటీష్ వర్తకులు, బ్రిటీష్ ప్రభుత్వం రెండునూ కలిపి భారతదేశాన్ని 1757 నుండి 1947 వరకు పాలించారు. బ్రిటీష్ వారి పాలన నిత్యకృత్యంగా కరువు తరుచూ సంభవించింది. వీటికి మొదటగా 1757 నుండి 1857 వరకు పాలించిన బ్రిటీష్ వర్తకులు వ్యాపారంపై తర్వాత రాజ్య విస్తరణకై దృష్టి మళ్ళించారు గాని, భారతీయుల పట్ల సదభిప్రాయం కాని, వారి పట్ల

సానుభూతి గాని చూపక, విపత్కర పరిస్థితులలో ప్రజలను పూర్తిగా పట్టించుకోక అరకొర చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుండి ధాన్యం, ఆహార పదార్థాలు దిగుమతి చేయడం, క్షామ ప్రాంతాల నుండి ధాన్యం రవానాను నిషేదించడం, కరువు ప్రాంతాలలో ప్రజలకు పని సౌకర్యాలు కల్పించడం అందులో ముఖ్యమైనవి.

బ్రిటీష్ ప్రభుత్వ 1858వ సంవత్సరంలో అధికారం ప్రత్యక్షంగా స్వీకరించిన తర్వాత ఏర్పడిన కరువు, కాటకాల సందర్భములో తీసుకున్న చర్యలలో మార్పులను గమనించవచ్చును. 1858వ సంవత్సరంలో విక్టోరియా ప్రకటనలో పేర్కొన్న విధంగా "భారతీయుల పట్ల ఎలాంటి విచక్షణ చూపం" ను కార్యరూపం దాల్చుటలో భాగంగా కరువుకు సంబంధించి అధ్యయనంనకు ప్రత్యేక కమీషన్‌లను నియమించి వాటి నుండి ప్రజల రక్షణకు అనేక చర్యలను చేపట్టారు. 'క్షామ నివారణ విధానం' అంటూ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు.

### 15.6.1. బ్రిటీష్ వారి పాలనలో వివిధ కరువు కమీషన్‌లు:

నిరంతరం భారతదేశాన్ని కుదిపేస్తున్న కరువులను నివారించడం బ్రిటీష్ ప్రభుత్వమునకు పెద్ద సవాలుగా మారింది. దానిని నివారించడంలో భాగంగా మూడు కమీషన్‌లను నియమించింది. అందులో మొదటి కమీషన్‌కు 1878వ సంవత్సరంలో 'సర్ రిచర్డ్ స్ట్రాచీ" నాయకత్వం వహించాడు. ఆ సంఘం 1880వ సంవత్సరంలో తన నివేదికను సమర్పించి "క్షామ పీడితులను ఆదుకోవడం ప్రభుత్వం కనీస భాధ్యతయని, ధాన్యం కొనడానికి తగిన వేతనంతో క్షామ ప్రాంతాలలో పని కల్పించాలని సూచించింది. రైతులకు తక్కావి ఋణాలతో పాటు వృద్ధులకు, రోగులకు ఉచితంగా సహాయం చేయాలి యని కూడా సూచించింది. అయితే "మితిమీరిన సహాయం ప్రజలలో సోమరితనాన్ని పెంచుతుందని, ఆత్మ నిర్భరతను దెబ్బతీస్తుందని" కూడా అభిప్రాయపడింది.

రెండవ క్షామ నివారణ సంఘం 1897వ సంవత్సరంలో సర్ జేమ్స్‌ల్యాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మొదటి సంఘం సిఫార్సులను బలపరచడంతో పాటు, నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించాలని, బలహీన వర్గాలకు మరింత చేదోడు, వాదోడుగా ఉండాలని సూచించింది. 1899-1900 లలో సంభవించిన కరువును నివారించడానికి నాటి రాజ ప్రతినిధి లార్డ్ కర్జన్ మూడవ కరువు కమీషన్‌ను నియమించెను. దీనికి చైర్మన్ ఆంథోని మాక్‌డోనాల్. ప్రభుత్వ యంత్రాంగం తాత్కాలికంగా గాక మొత్తం సంవత్సరంమంతా కరువుపై పనిచేయాలని, అలాంటపుడే ఆహార ధాన్యాల కొరతను భాగ నియంత్రించవచ్చును యని సిఫార్స్ చేసింది. ఇంకను తక్కాని ఋణాలు ఉదారంగా ఇవ్వాలని, భూమి శిస్తు, సత్వరమే మాఫీ చేయాలని, పశుగ్రాసం పెంచాలని, నీటి పారుదల, రైల్వే సౌకర్యాలు పెంచాలని కూడా సూచించింది.

బ్రిటీష్ ప్రభుత్వం మూడు కమిటీలను ఏర్పాటు చేసినప్పటికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టలేరనే చెప్పాలి. ఎందుకంటే కరువులు తరువాత కూడా కొనసాగాయి. ముఖ్యంగా 1943వ సంవత్సరంలో సంభవించిన బెంగాల్ కరువు "చాలా భయంకరంగా 30 లక్షల మంది ప్రాణాలను బలిగొనింది. ఈ కరువును పురస్కరించుకొని బ్రిటీష్ ప్రభుత్వం 'ఉడ్ హెట్' నాయకత్వంలో 1944వ సంవత్సరంలో నియమించింది. దీనియొక్క ప్రధాన లక్ష్యం 1943 బెంగాల్ కరువును గురించి విశ్లేషించడము. "అఖిల భారతదేశ ఆహార మండలి" ఏర్పాటు చేయాలని, ప్రభుత్వమే ధాన్యం సేకరణ చేపట్టాలని, చౌక ధరలను నెలకొల్పాలని ఈ కమీటీ సూచించింది. విచారణ దీని ముఖ్య ధ్యేయ్యం. కాబట్టి దీనిని 'కరువు విచారణ సంఘము' అని కూడా అంటారు. ఈ కరువు ప్రధానంగా మానవ తప్పిదాల వల్లే జరిగిందని, ప్రభుత్వంను ఇందులో నిందించ

అవసరము లేదని" ప్రకటించిన ఈ నివేదికపై తీవ్ర దుమారం లేపింది.

**15.6.2. క్షామ నిధి ఏర్పాటు:**

బ్రిటీష్ సామ్రాజ్యం అధికారం చేపట్టిన తర్వాత తీసుకున్న మంచి నిర్ణయం క్షామనిధి ఏర్పాటు. దీని ఆధ్వర్యంలో 'కరువు కోడ్' ను తయారు చేసి 'కరువు తీవ్రతను బట్టి వివిధ శ్రేణులుగా విభజించి సహాయ చర్యలను కొనసాగించారు. ఈ క్షామ నిధికి ప్రతి యేటా ఒకటిన్నర కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధి ద్వారా కరువు సహాయక చర్యలను కొనసాగించింది. 1919 రాజ్యాంగ సంస్కరణల ద్వారా ప్రతి రాష్ట్రం 'ప్రత్యేక క్షామ నిధి' ని ఏర్పాటు చేయించింది. ఈ క్షామ నిధి కేంద్ర ప్రభుత్వం సంరక్షణలో ఉంది, కరువు సమయాలలో రక్షణ చర్యలకు, రైతులకు ఋణాలివ్వడానికి రాష్ట్రాల ద్వారా వినియోగిస్తుంది.

## 15.7. పేదరికం:

బ్రిటీష్ పాలనలో కొనసాగించిన అనేక ఆర్థిక విధానాల పుణ్యమా అని భారతదేశంలో పేదరికం తాండవించింది. బ్రిటీష్ వారి పాలనలో భారతదేశంలో మరింత పేదరికం పెరిగింది లేదా అనే విషయంలో చరిత్ర కారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. అయితే బ్రిటీష్ పాలన కొనసాగే కొలది భారతీయులు ఆకలి చావులంచున బ్రతికారనే విషయంలో మాత్రం చరిత్రకారులలో ఏకాభిప్రాయం ఉంది. బ్రిటీష్ పాలన కాలం భారతదేశంతో గడిచే కొద్ది భారతీయులు వారి కొలువలో ఉద్యోగాలు సంపాదించడం, జీవించడం క్లిష్టతరమైంది.

పేదరికానికి ప్రధాన కారణం బ్రిటీష్ వారి ఆర్థిక పీడన విధానం, స్వదేశీ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు క్షీణించడం, వీటి స్థానంలో ఆధునిక పరిశ్రమలు స్థాపించకపోవడం, ప్రజల నుండి అధిక పన్నుల వసూలు చేయడం తదితర కారణాలను ముఖ్యమైనవిగా చెప్పవచ్చును. వీటికి తోడు అభివృద్ధి చెందని అనగా సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయభివృద్ధి స్థబ్దత నెలకొనింది. అలాంటి పరిస్థితులలో జామీందారులు, భూ స్వాముల రాజుల, వ్యాపారస్థులు, వడ్డీ వ్యాపారులు మరియు రాజ్యం రైతులను దోచుకోవడంతో భారతీయుల దుస్థితి దయనీయమైన స్థాయికి దిగజారెను. భాతరదేశ వలస పాలన ఆర్థిక వ్యవస్థ ఏ మాత్రం అభివృద్ధి చెందక నిశ్చల స్థితిలో నిలిచింది. ఇలాంటి పరిస్థితులో 19వ శతాబ్దం రెండవ అర్థ భాగంలో అనేక కరువులు సంభవించడంతో పేదరికం తీవ్ర స్థాయికి దిగజారెను. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రంలో 1860-61లో సంభవించిన కరువుతో దాదాపు 2 లక్షల మంది ఆకలి చావులతో మరణించారు. అదేవిధంగా 1865-66 సంవత్సరంలో ఒరిస్సా, బెంగాల్, బీహార్, మద్రాస్ ప్రాంతాలలో ఏర్పడిన కరువు దాదాపు 20 లక్షల మందిని పొట్టన పెట్టుకుంది. 1876-78 సంవత్సరాలలో మద్రాస్ రాష్ట్రంలో ఏర్పడిన కరువులో 30 లక్షల మంది ప్రాణాలు కోల్పోగా, మైసూర్ రాష్ట్రంలో దాదాపు 20శాతం మంది ప్రజలు, ఉత్తరప్రదేశ్‌లో 12 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.

పై అన్నిటికంటే చాలా భాధాకరమైన సంఘటన 1896-97లో దేశవ్యాప్తంగా ఏర్పడిన దుర్భిక్షం. దీని కారణంగా దాదాపు 9.5 కోట్ల మంది నిరాశ్రములు కాగా అందులో దాదాపు 50% మంది ప్రాణాలు కోల్పోయారు. 1899-1900 సంవత్సరంలో సంభవించిన కరువుతో దాదాపు 25 లక్షల మంది మరణించారు. ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు విలియం డిగ్బీ అంచనా ప్రకారం 1854 నుండి 1901 వరకు దాదాపు 2 కోట్ల మంది ఆకలి చావులతో చనిపోయారని అంచనా. ఈ ఆకలి చావులను మనం గమనించినట్లయితే భారతదేశంలో పేదరికం, ఆకలి చావులు ఎంత తీవ్ర స్థాయిలో ఉందో తెలియ వస్తుంది.

19వ శతాబ్దంలో కొనసాగిన ఈ విషయాన్ని అనేక మంది ఆంగ్ల అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. గవర్నర్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు చార్లెస్ ఇలియట్ స్పందిస్తూ "భారతదేశంలో దాదాపు 50శాతం మంది వ్యవసాయ కుటుంబీకులు తర్వాత సంవత్సరానికి కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం వారికి సరియైన ఆహారం లభించకపోవడమే" యని అన్నాడు. బ్రిటీష్ సామ్రాజ్యం గెజిటర్‌ను రూపొందించిన "విలియం హంటర్" భారతదేశంలోని పేదరికం గురించి వివరిస్తూ "దాదాపు 40 లక్షల మంది భారతీయులు ఆహారం కొరత వల్ల జీవితాలను పోగొట్టు కుంటున్నారని యన్నారు.

దేశంలోని కరువు పరిస్థితులు 20వ శతాబ్దంలో మరింత దిగజారినవి. 1911 నుండి 1941 మధ్య 30 సంవత్సరాల కాలంలో భారతీయులకు అందే ఆహారం విలువ దాదాపు 29 శాతం తగ్గిపోయినంది. దీనిని బట్టి బ్రిటీష్ ప్రభుత్వం కరువు నివారణకు గాని, ప్రజల ఆకలి దప్పులను తగిన చర్యలు తీసుకోలేరని చెప్పవచ్చును.

భారతదేశం ఆర్థికంగా వెనుకబడడానికి పేదరికం కొనసాగడానికి మరికొన్ని కారణములను మనం గమనించవచ్చును. జాతీయ ఆదాయం మదింపులో పేరుగన్న 'కోలిన్ క్లార్క్' ప్రపంచ దేశాలలో తలసరి జాతీయ ఆదాయం (1925-34) తక్కువగా ఉన్న దేశాలలో చైనా, భారత్‌లు అధమ స్థాయిలో ఉన్నాయని తెలియజేసెను. బ్రిటీష్ వారి ఆదాయంతో భారతీయుల ఆదాయంను పోలిక చేసినట్లయితే 1:5 నిష్పత్తిలో ఉంది. అదేవిధంగా 1930వ సంవత్సరంలో భారతీయుల సగటు జీవిత కాలం 32 సంవత్సరాలు. కాని ఐరోపా దేశాలలో మరియు ఉత్తర అమెరికా దేశాలలో ఇది 60 సంవత్సరాలు కావడం గమనార్హం. భారతదేశం అభివృద్ధి చెందక పోవడానికి పేదరికం పెరగడానికి మరొక కారణం ప్రకృతి వైపరిత్యాల కారణం కాదు. మానవి సృష్టితాలు. భారతదేశంలో అపారమయిన సహజ వనరులు, సుసంపన్నమయిన పంటలిచ్చే భూములను సక్రమంగా వినియోగించినట్లయితే ప్రజలు సిరి సంపదలతో వెలుగొందుతారు. కాని విదేశీయుల పాలన పుణ్యమాయని వారి ఆర్థిక దోపిడి, వ్యవసాయాభివృద్ధి కుంటుపడడం, సాంప్రదాయ గ్రామీణ పారిశ్రామిక వ్యవస్థ కుప్పకూలడంతో "సిరి సంపదలు కలిగిన భారతదేశంలో రైతులు, కార్మికులు ఇతర వర్గాలు కఠినమయిన పేదరిక జీవితాన్ని అనుభవించాల్సి వచ్చింది. అందుకే 'India is Rich but Indians are Poor' అనే సామెత బహుళ వాడుకలో ఉన్నది.

అందువలన భారతదేశంలో పేదరికం అనేది భౌగోళిక పరిస్థితుల ఉత్పత్తి లేక సహజ వనరులు లేకపోవడం లేదా వారసత్వంగా ప్రజలలో వారి ఆచారాలలో ఉన్న లోపాల ఫలితం కాదు. అయితే మొగల్ సామ్రాజ్యం మిగిల్చిన అవశేషం లేదా బ్రిటీష్ వారు రాక మునుపు ఫలితం కాదు. భారతదేశంలోని పేదరికం "కేవలం గత రెండు శతాబ్దాల చరిత్ర యొక్క ఫలితం".

బ్రిటీష్ వారు రాకపూర్వం ఏ రకంగా పశ్చిమ ఐరోపా దేశాల కంటే భారతదేశం పేద దేశం మరియు వెనుకబడిన దేశం కాదు. రెండు దేశాల ప్రజల జీవన ప్రమాణాలలో కూడా అంత వ్యత్యాసం లేదు. అనగా ఐరోపా దేశాలు అభివృద్ధి, సంపద సాధించడము అంటే భారతదేశాన్ని వలస రాజ్యంగా మార్చిన తర్వాతనే. బ్రిటీష్ వారు భారతదేశాన్ని పాలించిన రోజుల లోనే నేడు అభివృద్ధి జాబితాలో ఉన్న దేశాలు అభివృద్ధికి నోచుకున్నాయి. 1850 తర్వాతనే ఆ దేశాలు అభివృద్ధి బాటలో పయనించాయి. 1750 వరకు మనకు ఐరోపా దేశాల ప్రజల జీవన శైలిలో మార్పులు పెద్దగా కనిపించక, తదనంతరం జరిగాయి అంటే దానికి కారణం మనం వలస పాలనలో మగ్గడమే. బ్రిటీష్ దేశం పారిశ్రామిక విప్లవం, భారతదేశంను వారు ఆక్రమించడం ఏక కాలంలో జరగడం యాదృచ్ఛికము. ఈ రెండింటి ఫలితాలను ఇక్కడ గమనించాలి.

పారిశ్రామిక విప్లవం బ్రిటీష్ దేశానికి సాంఘిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధిని సాధించిపెట్టగా, బ్రిటీష్ ఆధీనంలోని భారతదేశం ఆయా రంగాలలో అభివృద్ధిని సాధించకపోగా, మరింత దుస్థితిని పొందడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. "బ్రిటీష్ దేశం తన ఆధీనంలోని వలస దేశాలకు" పారిశ్రామిక ఫలితాలను అందించక తన దేశంలో పారిశ్రామిక ప్రగతికి వలస రాజ్యాల వనరులను ఉపయోగించుకొని, వాటిని సర్వనాశనము చేసింది". దీని ఫలితమే భారతదేశంలో వ్యవసాయం, పరిశ్రమలు స్థంభించిపోయాయి. జామీందారులు, భూస్వాములు, రాజులు, వడ్డీ వ్యాపారస్థులు. వ్యాపారులు, పెట్టుబడి దారులు, విదేశీ ప్రభుత్వం రైతులను, కూలీలను దోపిడి చేయడంతో "పేదరికం, తాండవించి ఆరోగ్యాలు క్షీణించి అర్థాకలితో అలమటించి చనిపోవడానికి కారణమయింది.

## 15.8. సారాంశము:

రెండు దశాబ్దాల పాటు భారతదేశాన్ని పాలించిన బ్రిటీష్ ప్రభుత్వం పాటించిన ఆర్థిక విదానం ద్వారా ప్రజల జీవన విధానంలో సమూల మార్పులు సంభవించెను. ప్రతి గ్రామం స్వతంత్ర్యంగా అన్ని రకాల కుటీర పరిశ్రమలతో స్వయం సమృద్ధికి బతికే వాతావరణం నుంచి అన్ని వస్తువులకు, వసతులకు పట్టణాలపై ప్రభుత్వంపై ఆధారపడే దుర్భర స్థితికి మారాయి. దానితో ఎలాంటి పకృతి వైపరీత్యం ఏర్పడిన స్వతంత్రంగా ఎదుర్కొనే శక్తి లేక గ్రాములు బలహీన పడినాయి. దానితో కరువు కాటకాలు, దుర్భిక్షాలు సర్వసాధారణం అయిపోయి భారతదేశానికి పట్టు గ్రామాల అయిన గ్రామాలు ప్రతి చిన్న విషయానికి చిగురుటాకులా వణికాయి. కరువు, కాటకాలకు మానవ తప్పిదాలు కొన్ని అయితే, ప్రభుత్వం భాధ్యత, నిర్లక్ష్యం కొండంత. వీటిని ఎదుర్కోవడంలో బ్రిటీష్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై లక్షలాది మంది ప్రాణాలకు కారణమయింది. ప్రకృతి వైపరిత్యాలతో పాటు వ్యవసాయ వాణిజ్యీకరణ, కుటీర పరిశ్రమలు కుంటు పడుట, పన్నుల భారం, వడ్డీ వ్యాపారస్థుల దురాశలతో సగటు మానవుడు నిరంతరం పోరాడవలసి వచ్చెను.

బ్రిటీష్ వారి పాలనలో దాదాపు 40 కరువులు సంభవించాయి. దక్షిణాది కరువు, రాజ పుటానా కరువు, 1943 నాటి బెంగాల్ కరువు భారతదేశ ప్రజలకు తీవ్రదుఃఖాన్ని, నిరాశను మిగిల్చి లక్షలాది మంది ప్రజలను పొట్టన పెట్టుకున్నాయి. ఇలాంటి పరిస్థితులలో బ్రిటీష్ ప్రభుత్వం అనేక కమిటీలను ఏర్పాటు చేసి కరువుల నుండి ప్రజలకు ఉపశమనాన్ని కృషి చేసింది. రిచర్ స్ట్రాచీ, మొదటి కమిటీ, జేమ్స్ వ్యాల్ రెండవ కమిటీ, ఆంథోని మాక్‌డొనాల్ మూడవ కమిటీకి నాయకత్వం వహించి అనేక సిఫార్సులను చేసింది. ఇంకను ఉడ్‌హెడ్ నాయకత్వంలోను కమిటీని నియమించింది. క్షామ నిధిని సైతం ఏర్పాటు చేసి కరువు, కాటకాలు, దుర్భిక్ష కాలంలో ప్రజల కష్టాలను తీర్చడానికి కృషి చేశారు. బ్రిటీష్ వారి కాలంలో పెరిగిన మరొక అంశం పేదరికం. బ్రిటీష్ వారి విధానాల వల్ల కోట్లాది మంది భారతీయులు పేదరికంలో జీవనం కొనసాగించారు. దారిద్ర్యరేఖకు దిగువు భాగాన ఉన్న వారి శాతం 75కు పైమాటే. బ్రిటీష్ సభ్యులు సైతం చార్లెస్ ఇలియట్, విలియం హంటర్‌లు భారతదేశ పేదరికంనకు బ్రిటీష్ వారి విధానాలే కారణమని చెప్పారు.

## 15.9. నమూనా ప్రశ్నలు:

### I) వ్యాసరూప ప్రశ్నలు:

1) బ్రిటీష్ వారి కాలంలో భారతదేశంలో సంభవించిన క్షామాలు, వాటి పరిణామాలపై ఒక వ్యాసం వ్రాయండి?

2) క్షామ నివారణకు బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించండి?

3) బ్రిటీష్ వారి పాలనలోని పేదరికంపై ఒక వ్యాసం వ్రాయండి?

**II) సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1) క్షామంను నిర్వహించుము?

2) వ్యవసాయ వాణిజ్య కరుణ గురించి వ్రాయండి?

3) క్షామనిధిని గురించి వ్రాయండి?

4) భారతదేశం సంపద రాజ్యం-భారతీయులే పేదవారు చర్చింపుము?

## 15.10. ఆధార గ్రంథాలు


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.

2. Bipin Chandra - Essays on Colonialism.

3. Sumit Sarkar - Modern Indian Economic History.

4. P.N. Chopra, SB Puri MN Das - A Social Cultural and Economic History of India Vol. III.

5. తెలుగు అకాడమీ ప్రచురణ - భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


**- శ్రీ బాలగొండ గంగాధర్**

పాఠం - 16

# బ్రిటీష్ కాలంలో అభివృద్ధి స్థబ్దత (లేక) అభివృద్ధి నిరోధకం

**16.0. లక్ష్యము:** ఈ పాఠ్యాంశం పఠనానంతరము విద్యార్థులు క్రింది అంశాలను తెలుసుకుంటారు.

- # బ్రిటీష్ ప్రభుత్వం ప్రధాన ఆశయాలను తెలుసుకోవడం.
- # బ్రిటీష్ సామ్రాజ్య వాద లక్షణములను అధ్యయనం చేయడం.
- # బ్రిటీష్ వారి కాలంలో వ్యవసాయం స్థబ్దతను తెలుసుకోవడం.
- # బ్రిటీష్ వారి 'ఆర్థిక పీడన విధానం', 'భారతీయ ఆర్థిక వ్యదస్థ స్థబ్దత' ను అధ్యయనం చేయడం.
- # భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి లేక భారతీయ స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం విశ్లేషించడం.
- # మతతత్వం ఏవిధంగా బ్రిటీష్ వారికి ఉపయోగపడింది.
- # భారతదేశంలో వ్యాపారం అభివృద్ధి లేక క్షీణతా విశ్లేషించడం.

**విషయక్రమము:**


**16.1. పరిచయము**

**16.2. రాజకీయ స్థబ్దత - బ్రిటీష్ వారిచే ఇండియా ఆక్రమణ**

**16.3. బ్రిటీష్ కాలంలో వ్యవసాయం స్థబ్దత, క్షీణత**

**16.4. బ్రిటీష్ కాలంలో ఆర్థిక స్థబ్దత-భారతీయ పరిశ్రమలు, వ్యాపారం, రవాణా క్షీణత**

**16.5. బ్రిటీష్ కాలంలో నూతన సామాజిక వర్గాల ఆవిర్భావం**

**16.6. బ్రిటీష్ వారి కాలంలో మతతత్వం అభివృద్ధి**

**16.7. సారాంశము**

**16.8. నమూనా ప్రశ్నలు**

**16.9. ఆధార గ్రంథాలు**


## 16.1. పరిచయము:

భారతదేశాన్ని రెండు శతాబ్దాల పాటు పాలించిన బ్రిటీష్ వారు గతంలో పాలించిన పలు విదేశీ జాతుల వారి కంటే పూర్తి భిన్నమయిన ధోరణి, పద్ధతి, మనస్తత్వాన్ని పాటించాడు. ముందు వారంతా భారత్‌లో తమ అధికారాన్ని నిలుపుకుంటూ, అనాది నుండి వస్తున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థలను యధావిధిగా కొనసాగనిచ్చారు. క్రమంగా వారు భారతీయ జీవన ప్రవంతిలో మమేకమై ఈ దేశాన్ని తమ దేశంగా, ప్రజలను తమ ప్రజలుగా భావించి పాలించారు. కాని దీనికి పూర్తి భిన్నంగా భారతదేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పాలన వ్యవస్థల్లో జోక్యం చేసుకుని వాటి స్వరూప, స్వభావాల్లో గణనీయమైన మార్పులు తెచ్చారు. వీటినే వారు 'ఆధునికీకరణ' యని కూడా అన్నారు. భారతీయ స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించి వేశారు. భారతదేశమును, భారతీయులను వారు ఎన్నడూ తమ దేశంగా, తమ ప్రజలుగా భావించలేదు.

భారతీయ జన జీవన స్రవంతిలో కలవడానికి ప్రయత్నించలేదు. వీరు ఆంగ్లేయులుగా, ఆంగ్ల పాలకులుగా, ప్రపంచ విజేతలుగా భావిస్తూ, భారతీయులు అనాగరికులు, సాంప్రదాయవాదులు, పాలితులు గావున వారిని నాగరికులుగా మార్చాలని, ప్రయత్నించారు. ఇందులో భాగంగా భారత్‌లోని పరిశ్రమలు, వ్యాపారం, వ్యవసాయం, చివరకు భారతీయులందరూ వారికి ఉపయోగపడాలని, భారత్‌ను ఒక వలస రాజ్యంగా వాడుకోవడం జరిగింది. ఏ రంగంలో అభివృద్ధి జరిగినా వారి లక్ష్యం బ్రిటీష్ దేశానికి, బ్రిటీష్ ప్రజలకు ఉపయోగపడడమే.

ఒక్క మాటలో చెప్పాలంటే "ఆంగ్లేయాధికారం, పాలనల ప్రభావము పడని భారతీయ వ్యవస్థ కాని, సామాజిక వర్గం కాని ఏదీ లేదు. అయితే ఈ ప్రభావ ఫలితాల లక్షణాలు వేర్వేరుగా ఉన్నాయి."

ఈ అభివృద్ధిని కొంతమంది పురోభివృద్ధి లేక భారతదేశం ఆధునిక యుగంలోకి ప్రవేశించడం యని అనగా మరికొంత మంది భిన్నంగా స్పందించారు. వీరి ఉద్దేశ్యంలో కాలానుగుణంగా కొంత మార్పు సహజమని, ఆ మార్పు కనీస కొలమానానికి ఎక్కువగా ఉన్నపుడే పురోభివృద్ధి అనాలని, లేని పక్షంలో దానిని 'అభివృద్ధి నిరోధికం',లేక 'స్థబ్దత' లేక 'క్షీణత' యని అనాలని వారు వాదించారు. దీనిని మనం ఈ పాఠ్యాంశములో చర్చిద్దాము.

## 16.2. రాజకీయ స్థబ్ధత – బ్రిటీష్ వారిచే ఇండియా ఆక్రమణ:

బ్రిటీష్ వ్యాపార కంపెనీగాని (1757–1857), బ్రిటీష్ ప్రభుత్వం (1857–1947) గాని భారతదేశంను, వలస రాజ్యంగా మార్చడమే లక్ష్యంగా పాలించారనేది అక్షరసత్యం. భారతదేశ వనరులను, సంపదను, మానవ శక్తిని బ్రిటన్ దేశ ప్రజల సౌభాగ్యం, సంక్షేమం కోసం ఫణంగా పెట్టడం జరిగింది. 1757 నుండి 1813 వరకు సాగిన తొలి వ్యాపార దశలో స్పష్టమయిన లాభాల కొరకు పని చేశారు. 1760వ సంవత్సరంలో ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభమయిన నేపథ్యంలో ఆర్థిక వనరులను లోబరచుకొనుటకు 1765 అలహాబాద్ సంధిని ఉపయోగించుకున్నారు. 1813 నుండి 1870 వరకు సాగిన రెండవ దశలో పెట్టుబడిదారి దశకు 1813 చార్టర్ చట్టంను పావుగా వాడుకున్నారు. 1870 నుండి ప్రారంభమయిన మూడవదశలో నూతన ఆర్థిక దోపిడిని కొనసాగించింది. అనగా ఇంగ్లండ్ చెల్లింపులు, జాతీయ ఋణం, గ్యారంటీ రైల్వే రుణం, విదేశీ పెట్టుబడులపై వడ్డీ చెల్లింపులు, బ్రిటీష్ విదేశీ ఓడల సర్వీస్ చెల్లింపులు, మాతృదేశ వ్యయం (హోమ్ చార్జీలు) తదితర పద్దుల క్రింద భారతీయ ధనం, బంగారము తరలించడం. దీనినే 'ఆర్థిక పెట్టుబడి దశ' అని పేరు. ఇది 1947 వరకు కొనసాగింది. ఈ విధంగా భారతదేశం నుండి దోచుకున్న సొమ్మునే తిరిగి ఋణంగా, పెట్టుబడిగా పెట్టి వాటిపై లాభాలను ఆర్జించారు.

రెండవ ప్రపంచ యుద్ధం నేపథ్యంలో భారతీయ వ్యాపార వేత్తలు ఆర్థికంగా లబ్ది పొంది, ఆత్మవిశ్వాసంతో ఇంగ్లండేతర దేశాల పట్ల సహాయ సహకారాలపై మొగ్గు చూపారు. అలాంటి పరిస్థితులో ఇంగ్లాండ్ రాజీ విధానం (Compromise Policy) అనుసరించడం గమనార్హం. ఈవిధంగా భారతదేశంలో స్వతంత్ర్యం వచ్చేవరకు భారతీయ భారీ, కీలక పరిశ్రమల అభివృద్ధి నిరోధానికి, బ్రిటన్‌లోని ఇలాంటి పరిశ్రమల, సంబంధిత వ్యాపారుల పరిరక్షణ, బ్రిటీష్ ఉత్పత్తులు నిరాటంకంగా ఇండియాలోకి దిగుమతయ్యేందుకు బ్రిటీష్ ఇండియా సామ్రాజ్యవాద ప్రభుత్వం విజయవంతంగా కృషి చేసింది.

బ్రిటీష్ సామ్రాజ్య ప్రభుత్వం సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలు, ఆచారాల పైన సైతం చేసిన పెత్తనం మనం గమనించవచ్చును. సాంఘిక దురాచారాల నిర్మూలనలో ఆంగ్లేయ పాలకులు ప్రభుత్వ స్వార్థ చింతన, ప్రయోజనాలు లేకపోలేదు. తక్కువ వేతనాలలో భారతీయులను దేశపాలన యంత్రాంగంలో భాగస్వాములను చేయడమే వారి ఆంగ్ల భాష విద్యా విధాన

లక్ష్యం. తమ అధికార సుస్థిరత కొరకు బ్రిటీష్ పాలకులు పాటించిన "విభజించు పాలించు" భారతదేశానికి ఎంతకీడు చేసిందో మనం గమనించాం. ఆంగ్లేయ కంపెనీ ఉద్యోగులు, అధికార్లు, వర్తకులు వ్యాపారంలో అధిక లాభార్జనకై దేశీయ నేత పనివారు, రైతులు, వర్తకులను ఎన్ని క్షోభలకు గురిచేశారో మనం చదివాం. నిరంతరం అధిక మిగులు నిమిత్తం రైతుల మీద వారు మోపిన భూమి శిస్తు, లక్షలాది మంది ప్రాణాలను బలితీసుకొంది.

"ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్య దేశాలకు పుట్టినిల్లు ఇంగ్లండ్" అని చెప్పుకునే బ్రిటీష్ ప్రభుత్వం ఏమేరకు భారతదేశంలో ప్రజాస్వామ్య సిద్ధాంతాలను, విలువలను కాపాడిందో మనం గమనించాలి. ప్రజాస్వామ్య మూల సూత్రాలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భారతదేశంలో ఏ మూలన ప్రసాదించారో మనకు తెలుసు. భారతీయ పౌరులుగా ఉండి స్వేచ్ఛగా మాట్లాడే హక్కు, అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు లేదు. బ్రిటీష్ వారితో ఏ కోశాన, ఏ రంగానా, ఏ కోణం లోను 'సమానత్వంను' పొందలేక పోయాము. సహజ హక్కు అయిన ఓటు హక్కు ఎంతమందికి బ్రిటీష్ వారు కల్పించారో చరిత్ర మనకు తెలియజేస్తుంది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతే కాని స్వతంత్ర్యం లభించలేదు. కష్టపడి, ప్రాణాలు కోల్పోయి స్వాతంత్ర్యం వచ్చిందా అంటే అదీ పూర్తిగా లేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం మొగల్ కాలంలో ఆఫ్ఘనిస్తాన్ భారతదేశం నుండి విడిపోగా బ్రిటీష్ వారి కాలంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లను కోల్పోయి పొందుకున్నాము. ఇలాంటి రాజకీయ సంఘటనలను మనం అధ్యయనం చేసినట్లయితే బ్రిటీష్ పాలనలో భారతదేశం రాజకీయంగా అభివృద్ధి చెందింది లేదా రాజకీయంగా ప్రాబల్యం కోల్పోయామా? అనే ప్రశ్నకు సరియైన సమాధానం లేదు.

## 16.3. బ్రిటీష్ కాలంలో వ్యవసాయం స్థబ్దత, క్షీణత:

బ్రిటీష్ వారి కాలంలో భారతీయ జనాభాలో దాదాపు మూడోవంతు భాగం వ్యవసాయంపై ఆధారపడినారు. గ్రామీణ వృత్తులయిన కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసలి, సాలె, మోచీ, తాపీ పనివారు, ఇటుకల బట్టీ పనివారు. పురోహితులు, తదితర కుటుంబీకులను వ్యవసాయ దారులుగా పిలిచేవారు. వీరందరూ వ్యవసాయ ప్రగతి, కొనసాగింపులు మీద ప్రత్యక్షంగా ఆధారపడి జీవనం చేసేవారు. బ్రిటీష్ వారు మినహా భారతదేశాన్ని పాలించిన పూర్వ పాలకులు ఎవ్వరూ "సాంప్రదాయక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను భంగ పరించేందుకు ప్రయత్నించలేదు. వీరు భారతీయ జీవన స్రవంతిలో ఐక్యం కావడం దానికి కారణం.

భారతీయ పరిశ్రమలపై బ్రిటీష్ వారు అనేక ఆంక్షలను రుద్దడంతో దేశీయ ప్రజలకు వ్యవసాయం తప్ప వేరే జీవనోపాధి మృగ్యమై వ్యవసాయంపై మునుపెన్నడూ లేనంతంగా అధిక వత్తిడి ఏర్పడింది. జనాభా పెరుగుదల, చేతి వృత్తుల పతనం, బ్రిటీష్ ప్రభుత్వం నూతన చట్టాలు, ధనిక వర్గాలు భూమిని ఆకర్షించడం తదితర కారణాలు భూమి సులభంగా లభ్యం కాని ఉత్పత్తి సాధనమయింది. వ్యవసాయ భూములకు డిమాండ్ పెరగడానికి మరొక కారణం పరిమితమయిన భూమిని పెరుగుతున్న కుటుంబాల మధ్య పంచవలసి రావడం. జనాభా పెరిగిన మేరకు సాగైన భూమి కాని, ఆహార ధాన్యాల ఉ త్పత్తిగాని పెరగలేదు.

వ్యవసాయం కుంటుపడడానికి మరొక ముఖ్య కారణము బ్రిటీష్ ప్రభుత్వం వసూలు చేసిన వివిధ భూమి శిస్తు విధానాలు. శాశ్వత శిస్తు విధానం ద్వారా జామీందారులకు ఆస్తి హక్కును, తాలూకాదార్లకు, చివరిగా రైత్వారి విధానం ద్వారా రైతులకు ఆస్తి హక్కును కల్పించారు. అయితే మొదటి రెండు పద్ధతులలో రైతులు గిట్టుబాటు ధరలేక రైతులు అనేక ఇక్కట్లను అనుభవించారు. పూర్వం గ్రామంలోని భూములన్నిటిపైన గ్రామస్థులందరికి సమిష్టిగా ఆస్తి హక్కు ఉండేది. కంపెనీ

వారి శిస్తు విధానాల ఫలితంగా వ్యక్తి జీవితానికి ప్రాధాన్యం, సమిష్టి జీవితానికి పెద్ద నష్టము సంభవించింది. గ్రామీణ వ్యవస్థ దెబ్బతినింది. రైతుల నుండి అమితంగా శిస్తు వసూలు చేయడం ద్వారా రైతుల స్థితి దిగజారిపోయింది. దిక్కుతోచని పరిస్థితులలో శిస్తు వసూలుకు రైతులు ఋణదాతలను ఆశ్రయించాల్సి వచ్చింది. పంటలు పండినా, పండక పోయినా రైతులు శిస్తును నగదు రూపంలో చెల్లించవలసి రావడం వారిని మరింత ఆర్థికంగా దెబ్బతీసింది. పాత పద్ధతిలో పండిన పంటలో కొంత భాగం కావున ఈ సమస్య నాడు అంతగా లేదు. వారు ఎక్కువ వడ్డీలను వసూలు చేయడంతో రైతులు ఋణ భారంతో కృంగి పోయారు. కష్టపడి రాత్రింబవళ్ళు పని చేసిన రైతుకు తగిన ప్రతిపలం లేక కృంగిపోయారు. దానితో వ్యవసాయంపై ఉత్సాహం తగ్గింది. వ్యవసాయం తగ్గు ముఖం పట్టడానికి మరొక కారణం గైర్హాజరీ భూస్వామయుల (Absentee Land Lords) నిర్లక్ష్యం.

రవాణా సౌకర్యాలు పెరగడం, వ్యాపార పంటలు ప్రవేశించినందున, విదేశీ వస్తువలు చౌకగా లభించడం వల్లను గ్రామాలలో రైతులకు గిట్టుబాటు ధర లభించలేదు. దీనితో ఆహార పంటలు, కాయగూర పంటలపై వ్యవసాయ దారులకు ఆసక్తి తగ్గింది. దానికి తోడు గ్రామ ప్రజలందరికి సహిష్టి హక్కుగా ఉండే అడవులు, పచ్చిక బయళ్ళను ప్రభుత్వం వశపరచుకోవడంతో గ్రామీణ వ్యవస్థ నిర్వర్యమయింది.

**ప్లాంటేషన్ పరిశ్రమలు:**

బ్రిటీష్ దేశం నుండి దిగుమతి అయ్యే వస్తువుల గిరాకీని పెంచడానికి బ్రిటీష్ ప్రభుత్వం శాసనం ద్వారా వీటికి పోటీగా భారతదేశంలో పెట్టుబడులను నిషేధించింది. అంటే బ్రిటీష్ దిగుమతి వస్తువులకు ప్రత్యామ్నాయంగా భారతదేశంలో ఎవ్వరూ ఉత్పత్తిని చేపట్టరాదు. కాని ఇంగ్లండ్ నుండి వచ్చే పెట్టుబడిదారులు భారతదేశంలో "నీలిమందు, కాఫీ, తేయాకు" తదితర తోటల పెంపకం పరిశ్రమలో పెట్టుబడి పెట్టాలి. దీనినే "ప్లాంటేషన్ పరిశ్రమ" అంటారు. భారీ ఎత్తున సాగిన ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా గ్రామీణ పంటలకు పోటీగా జరిగి రైతులకు ఆర్థిక నష్టం కల్పించుటచే వ్యవసాయం లాభసాటిగా లేక వ్యవసాయంను తగ్గించారు.

ఆహార ధాన్యాల కొరత వలన ధరలు కూడా విపరీతంగా పెరిగెను. ఈ ప్రధాన ఆహార ధాన్యాల ధరల పెరుగుదల వ్యవసాయేతర, భూమి లేని గ్రామీణ, పట్టణ, కార్మిక, కర్షక, సామాన్య ప్రజానీక, వృత్తి పనివారల జీవన స్థితిగతులను ఎంతో మార్చి వేసి కష్టాలకు గురిచేసింది.

జనాభా అభివృద్ధి దామాషా ప్రకారం వ్యవసాయ సాగుభూమి పెరగాల్సిన ఆవశ్యకత ఉంది. అయితే ప్రభుత్వ అనాసక్తి, అశ్రద్ధలు, సామాన్య రైతాంగ పేదరికం, భయం, అజ్ఞానాల కారణంగా, సాగుకాదగిన 30% పైబడి భూమిని, నిరుపయోగంగా వదలివేయడం జరిగింది.

19వ శతాబ్దంలో ద్వితీయార్ధంలో రవాణా, అంతర్జాతీయ వ్యాపార మార్కెట్లలో విప్లవాత్మక మార్పులు సంభవించాయి. దీనితో భారతీయ సాంప్రదాయ పంటల విధానం, గ్రామీణ స్వయం సమృద్ధి, స్వతంత్ర ఆర్థిక వ్యవస్థలు గణనీయమైన మార్పులు చెందాయి. రైతులు సాంప్రదాయక పద్ధతికి బిన్నంగా, ప్రపంచ మార్కెట్‌లో గిరాకి ఉండే పంటలను పండించి అధిక నికర ఆదాయంను పొందారు. తమకు కావలసిన లేదా పండించని ఆహార ధాన్యాలు ఇతర ప్రదేశాల నుండి పొందగలిగారు. ఈ విధంగా భారతీయ వ్యవసాయిక వాణిజ్య రంగంలో సంభవించిన ఇలాంటి పరిణామాన్ని "వ్యవసాయ వ్యాపారికరణమని" పేరు. 1860-65 మధ్య ఉత్తర అమెరికాలో సంభవించిన అంతర్యుద్ధం 'వాణిజ్య విప్లవానికి' నాంది పలికింది. అనగా ఇంగ్లండ్

ఆహార ధాన్యాల దిగుమతులకై అమెరికా కాకుండా ఇండియా మీద ఆధారపడింది. దీనితో భారతీయ ఎగుమతులు కనివినీ ఎరుగని విస్తరణను అందుకున్నాయి. భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ఏర్పడ్డ ఈ విదేశీ గిరాకి భారతీయ వ్యవసాయాభివృద్ధికి గొప్ప దోహదకారి కాలేకపోయింది. దీనికి కారణం సాంకేతిక పరమైన మార్పులను చేపట్టేందుకు కావలసిన ఆర్థిక వనరులు రైతులకు లేకపోవడం.

బ్రిటీష్ కాలంలో వ్యవసాయం వృద్ధి చెందకపోవడానికి మరొక కారణం నీటి పారుదల అభివృద్ధి లేకపోవడం. బ్రిటీష్ పాలకులు నీటి పారుదల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టినప్పటికి అవి కావలసినంత పెరగలేదు యనేది సత్యం. అంతగా ఆదాయం లేని రైల్వేల అభివృద్ధితో పోల్చినపుడు దీని మీద వారు ఎంతో అనాసక్తిని చూపారని చెప్పవచ్చును.

“నేలకు నీరు పెట్టినట్లయితే అది ఫలసాయాన్ని ఆరు రెట్లు ఇంకా అధికంగా పెంచుతుందనీ, వేరే ఏమీ పండని విశాల భూములను, నీటి వసతి ఉత్పత్తి దాయకాలుగా చేస్తుందని” ప్రసిద్ధ ఆంగ్లేయ పాలనాధికారి సర్ చార్లెస్ ట్రెవలియన్ అన్న మాటలను వారు బాగా అర్థం చేసుకున్నట్లు లేదు.

**బ్రిటీష్ వారి కాలంలో ఆర్థిక స్థబ్దత:**

వ్యవసాయ రంగంలో మాదిరి బ్రిటీష్ వారి కాలంలో పరిశ్రమలు, వ్యాపారం, రవాణా రంగాలు కూడా కుదేలు అయినాయి. బ్రిటీష్ ప్రభుత్వ పారిశ్రామిక, వ్యాపారం, రవాణా విధానాలు ఇంగ్లండ్‌లోని పరిశ్రమల వ్యాపారుల పెట్టుబడి దార్ల ప్రయోజనాలకు ఉపయోగపడేవిధంగా తయారు చేయబడ్డాయి. దీని ఫలితంగా వ్యవసాయంపై వత్తిడి, రైతాంగ పేదరికం, పారిశ్రామిక స్థబ్దత, క్షీణతలు, నికృష్ట పని పరిస్థితులు నెలకొని ఆర్థిక క్షీణత చోటు చేసుకొంది.

**పరిశ్రమల క్షీణత:**

వాస్తవంగా 19వ శతాబ్దపు తొలి భాగంలో భారతదేశపు ఉత్పత్తులలో నాణ్యతలో బ్రిటీష్ ఉత్పత్తులు, పోటీపడలేక పోయాయి. దానితో ఇంగ్లండ్ వస్తువులకు అనుకూల పరిస్థితులను కలిగించడానికై తన రాజకీయ అధికారాన్ని ఉపయోగించింది. వర్తకులు పరిపాలకులు కావడం, వర్తక దృష్టితో వారు పరిపాలన సాగించడం దీనికి ప్రధాన కారణం. నేతగాండ్ర నుండి తక్కువ ధరలకు బ్రిటీష్ వారికే అమ్మేటట్లుల అధికారుల ద్వారా వత్తిడి తెచ్చి, అనేక ఆంక్షలు విధించారు. తమకు వచ్చిన నేత పనిచేసుకోవడానికి కూడా తప్పనిసరి వారి అనుమతి కావాలని, అలా నమోదు అయిన వారు తూర్పు ఇండియా కంపెనీకి తప్ప మరెవ్వరికి తమ వస్తువులను అమ్మకూడదని, ఇతరులకు పనిచేయకూడదని ఆంక్షలు విధించారు.

**కారణాలు:**

భారతీయులు తాము తయారు చేసిన వస్తువులను విక్రయించడానికి భారతీయ మార్కెట్ కొరకు ఆసక్తిని చూపక పోవడం, భారతీయ చక్రవర్తులు దృష్టి మళ్లించిన ఉదాశీనంగా ఉండటము, ఆంగ్లేయులు నౌకబలంతో మార్కెట్ చేసే సామర్థ్యం పెంచుకోవడం, కార్మికుల ప్రయోజనాలకు పాటుపడే బలమైన కార్మిక సంఘాలు లేకపోవడం, ఇంగ్లండ్‌లో మాదిరి పారిశ్రామిక ఉద్యమ కర్తల వర్గం లేకపోవడం మరియు సంస్థానాధీశుల నుండి పోషణ లేకపోవడం తదితర కారణాలు దేశంలో పరిశ్రమల క్షీణతకు ప్రధాన కారణములుగా చెప్పవచ్చును. దానికి తోడు ప్రజలకు కూడా స్థానిక ఉత్పత్తులపై మోజు తగ్గి పాశ్చాత్య వస్తువులపై మోజు పెరగడం కూడా దేశీయ ఉత్పత్తులు తగ్గడానికి మరొక కారణం. ప్రముఖ వర్గానికి చెందిన భారతీయులు పాశ్చాత్య వస్తువును ఉపయోగించడం నాడు గౌరవంగా, హోదాగా భావించేవారు. అంతేగాకుండా వారి నుండి గౌరవం కూడా వస్తుందని వారు భ్రమపడ్డారు. భారతదేశంలో పరిశ్రమలు తగ్గడానికి మరొక కారణం ప్రభుత్వ కార్యకలాపాలకు

కావలసిన వస్తు సామాగ్రి అంతా బ్రిటన్ నుండి దిగుమతి చేశారు. దీనికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. అలాకాకుండా వస్తు సామాగ్రిని భారతదేశంలోనే ఉత్పత్తి చేసినట్లయితే ఎన్నో పరిశ్రమలు ఏర్పడి, నిరుద్యోగ సమస్య కూడా కొంతవరకు నివారించి ఉండవచ్చును.

పారిశ్రామిక విప్లవం ఫలితంగా అన్ని దేశాలలో కూడా కుటీర పరిశ్రమలు క్షీణించాయి. అయితే ఫ్యాక్టరీ పరిశ్రమలు స్థాపనతో కుటీర పరిశ్రమల్లో వృత్తులు కోల్పోయిన వారికి ఉపాధి దొరికింది. కాని భారతదేశంలో అలా జరుగలేదు. తత్ఫలితంగా నేత, కమ్మరి, వడ్రంగి, తదితర కులవృత్తుల వారు కూలీలుగా, వ్యవసాయదార్లుగా నిరుద్యోగులుగా మారారు. తద్వారా వారి జీవితం కూడా దుర్భరమయింది. కరువు, కాటకాల, క్షామాల కాలంలో ఈ వర్గమే తీవ్రంగా నష్టపోయింది.

## 16.4. బ్రిటీష్ కాలంలో ఆర్థిక స్థబ్దత-భారతీయ పరిశ్రమలు, వ్యాపారం, రవాణా క్షీణత:

### వ్యాపార క్షీణత:

బ్రిటీష్ వారు భారతదేశంలో అడుగుపెట్టేటప్పటికి ప్రతి గ్రామంలోను, వెలుపల కూడా వ్యాపారం జరిగి, ధాన్య వర్తకుడు ఒక విధమయిన బ్యాంకర్‌గా వ్యవహరించేవాడు. వారంలో నిర్ధిష్టమయిన ఒక రోజు పెద్ద గ్రామాలలో 'సంత' ఏర్పాటు చేసేవారు. ఈ సంతలలో అన్ని రకాల వస్తువులు లభ్యమయ్యేవి.

దీనికి తోడు ఏడాదికోసారి పశువుల సంత అన్ని రకాల జంతువులు కొనుగోల్లు, అమ్మకాలు జరిగేవి. ఈ విధంగా స్వయం పోషక సమర్ధమయిన భారతదేశం చాలా అరుదుగా భోగవిలాస వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవడం జరిగింది. బంగారం, వెండి, సీసం, తగరం, రాగి, గంధకము, ముడిపట్టు, దంతం, పగడాలు, తాబేలు చిప్పలు తదితర వస్తువులను దిగుమతి చేసుకున్నారు. అయితే భారతదేశం ప్రత్తి, పట్టు వస్త్రాలు, మసాలా సామాగ్రి, నీలి మందు, చక్కెర, రత్నాలు, శిలాఖండాలను ఎగుమతి చేసి ప్రపంచంలో ముఖ్యమైన వాణిజ్య దేశంగా పేరు సంపాదించింది. "భారతదేశ వాణిజ్యమే ప్రపంచ వాణిజ్యం. దానిని తన ఆధీనంలో నిలుపుకోగలిగినవాడు యూరప్ ఖండానికి నియంత కాగలడు" యని రష్యా చక్రవర్తి పీటర్ అన్న మాటలు గమనించాలి.

విదేశీ వ్యాపారం మనదేశంలోని కొన్ని వర్తక వర్గాలు నిర్వహించారు. ఉత్తర భారతంలోని బనియాలు, మార్వాడీలు, దక్షిణ భారతంలో కోమట్లు, నాటుకోట్ చెట్టియార్లు తదితరులు ముఖ్యులు. నేటి బ్యాంకులు చేసే న్యాస ధనం స్వీకరించడం, అప్పులు ఇవ్వడం, హుండీలను విడుదల చేయడం, వ్యాపారానికి, పరిశ్రమలకు విత్తాన్ని సమకూర్చడం లాంటి పనులను నిర్వహించి సమాజంలో ప్రముఖంగా నిర్వహించారు. అయితే కంపెనీ వారు అధికారాన్ని స్థాపించడం, ఏకస్వామ్యాన్ని సాధించడంతో కంపెనీ ఉద్యోగులు వీటిని దుర్వినియోగం చేసి దేశీయ వ్యాపారాన్ని వారి చేతుల్లోకి లాక్కున్నారు. పక్షపాతంతో కూడిన సుంక విధానాన్ని ప్రయోగించి దేశీయ వర్తకులను వ్యాపార కార్యక్రమాల నుండి తప్పించారు. తమకు అవసరమయిన సరుకుల విషయంలో ఏకస్వామ్యంను పాటించి స్వదేశీ వర్తకుల ప్రయోజనాలను చావు దెబ్బతీశారు. దీనిలో వారు స్వచ్ఛందంగా వర్తక వృత్తిని విరమించుకున్నారు. ఇంకనూ ఇంగ్లండ్‌కు ఎగుమతి అయ్యే వస్తువులపై అధిక సుంకాలు, ఇంగ్లండ్ నుండి దిగమతయ్యే వస్తువులపై నామమాత్రపు సుంకాలను విధించి భారతీయ పరిశ్రమలను, విదేశీ వ్యాపారాన్ని కుంగదీశారు. స్వదేశీ వస్తూత్పత్తి, బ్రిటీష్ వారికే విక్రయించాలిన ఆజ్ఞాపించింది. కాలక్రమేణా బ్రిటీష్ పరిశ్రమల ప్రయోజనానికై "ప్రత్యేక వాణిజ్య విధానం" ను రూపొందించి ఇండియాను బ్రిటీష్ వస్తువులు విక్రయించే ఇండియా మార్కెట్‌గా మార్చారు.

స్వేచ్ఛా వాణిజ్య విదానము పేరుతో 'భారతదేశపు సంపద' ను బ్రిటీష్ దేశానికి తరలించిరి. దీనినే దాదాబాయి

నౌరోజి, రమేష్ చంద్రదత్ తదితర ఆర్థిక వేత్తలు డ్రెయిన్ (లేదా) ఐశ్వర్య పరీవాహం లేదా 'ఆర్థిక సంపద తరలింపు యని వ్యవహరించారు. దీనినే "భారతదేశం బ్రిటన్‌కు చెల్లించే కప్పం" యని కూడా అంటారు. ఈ విధంగా సంపాదించిన ధనాన్ని తిరిగి భారతదేశంలో "ఫ్యాక్టరీ పరిశ్రమలను నడపడానికి పెట్టుబడిగా పెట్టారు. దీని ద్వారా వారి పరిశ్రమలను భారతదేశంలో అభివృద్ధి చేసికొని పారిశ్రామిక రంగంలో అగ్రస్థానం సంపాదించారు. ఇదియే వారి సిరిసంపదలకు, భారతీయుల దారిద్ర్యానికి కారణం అయింది.

**రవాణా స్థబ్దత:**

నీటి పారుదల, రవాణా సౌకర్యములు రెండూ ఉత్పత్తి దాయకములు. ఇందులో దేనికి ప్రాముఖ్యత ఇవ్వాలి అనేది దేశ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయించవలసి వుంది. ఇండియా వంటి వ్యవసాయ దేశం, వర్షాచ్ఛాయ దేశాన్ని పాలించే ప్రభుత్వం నీటి పారుదల వసతులను కల్పించడంలో శ్రద్ధ వహించాలి. ఎందుకంటే తద్వారా ఆహార దినుసులు, వ్యవసాయం పెరిగి కరువు, కాటకాలను సులభంగా ఎదుర్కొనవచ్చును. సాగునీటి సౌకర్యం వల్ల పంట దిగుబడి పెరిగి, పొలం విలువ పెరుగుతుంది. నగదు పంటలు పెరిగి వ్యవసాయ వాణిజ్యీకరణ ఏర్పడుతుంది. నీటి తీరువా వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది.

అయితే వీటిని పెడచెవిన పెట్టిన బ్రిటీష్ ప్రభుత్వం నీటి పారుదలకు నామమాత్రంగా ధనం వెచ్చించి, రవాణా సౌకర్యములను ముఖ్యంగా రైల్వేల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కుమ్మరించింది. ఉదాహరణ: 1880 నాటికి రైల్వేల మీద 125 మిలియన్ పౌనులు కాగా, నీటి పారుదలపై 12 మిలియన్ పౌన్‌లు. అంటే పదిరెట్లు ఎక్కువ. దీనికి ప్రధాన కారణం వారి ఆర్థిక విధానం. భారతదేశంలో రైల్వే నిర్మాణం లాభదాయం కాకపోయినా, ఇంగ్లండ్ పారిశ్రామిక వేత్తలకు మంచి మార్కెట్లను కల్పిస్తుంది. ప్రతిగా నీటి పారుదల అభివృద్ధి బ్రిటీష్ వారికి లాభదాయకం కాదు. అంతేగాక నదులు, కాలువలు ప్రయాణానికి అనుకూలమయితే అవి రైల్వేలకు పోటీ అవుతాయి. అందుకనే బుద్ధి పూర్వకంగానే నీటి పారుదల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు.

## 16.5. బ్రిటీష్ కాలంలో నూతన సామాజిక వర్గాల ఆవిర్భావం:

బ్రిటీష్ వారు భారతదేశంలో అడుగిడిన తరువాత అనేక రంగాలలో మార్పులు తేవడానికి తీవ్ర కృషి చేశారు. అందులో పెట్టుబడిదారి ఆర్థిక విధానము, జామిందారి, రైత్వారి విధానాలు, ఆంగ్ల విద్యా విధానం, భారీ పరిశ్రమలు, నూతన పాలన యంత్రాంగం ద్వారా భారతదేశంలో సామాజికంగా పెనుమార్పులు సంభవించాయి. వీటినే మనం "సామాజిక వర్గాల ఆవిర్భావం" అని అంటాము. బ్రిటీష్ వారు మొదటిగా అధికారాన్ని స్థాపించిన ప్రాంతంలోనే ఈ నూతన సామాజిక వర్గాలు ఆవిర్భవించడం గమనార్హం. దీని ఫలితంగా అనాదిగా సాంప్రదాయంగా కొనసాగుతున్న వర్గాలు అస్థిత్వం కోల్పోయి వాటి స్థానంలో నూతన సామాజిక వర్గాలు వెలుగులోకి వచ్చినాయి. అందుకే ఈ ప్రక్రియకు "సామాజిక పునరేకీకరణ" యని కూడా చెప్పవచ్చును.

బ్రిటీష్ విధానాల ఫలితంగా నాడు ఆచారంలో ఉన్న చాతుర్వర్ణ వ్యవస్థ, ఫలితంగా ఏర్పడిన సామాజిక వర్గాలు బలహీనమై వాటి స్థానంలో నూతన సామాజిక వర్గాలు ప్రవేశించాయి. వాటిలో జామీందార్లు, కౌలుదార్లు, యాజమాన్య కర్షకులు, మధ్య తరగతి బూర్జువా వర్గం, కార్మిక వర్గం తదితర వర్గాలు ఆవిర్భవించాయి. కర్షకులు, కౌలుదార్లు, వ్యవసాయ కార్మికులు కలిసి భారతీయ కిసాన్ వర్గంగా మారి బలోపేతమైన సామాజిక వర్గంగా మారింది. స్వాతంత్ర్యోద్యమంలో కార్మిక

వర్గం నిర్వహించిన పాత్ర చాలా ముఖ్యమైనవి. గ్రామీణ వ్యవస్థలో గ్రామ ప్రజలు సంయుక్తంగా కలిసి పనిచేయడం, గ్రామ పెద్దల పట్ల, వారి నిర్ణయాలను గౌరవించే సాంప్రదాయ వ్యవస్థకు దీనితో గండిపడినట్లయింది. అంతేకాదు పెద్ద పరిశ్రమలు పట్టణాలలో నెలకొల్పడంతో ఉద్యోగ నిమిత్తం పట్టణాలకు వలస వెళ్ళడం కూడా నాడే ప్రారంభమయింది. నేటి పట్టణ వలసలకు, నాడే శ్రీకారం పడింది.

బ్రిటీష్ వారి విధానాలతో ఆవిర్భవించిన మరో మార్గం "మేధావి వర్గం లేక బ్రిటీష్ వారు ప్రారంభించిన విద్యా విదానం ఫలితంగా 'ఆంగ్ల చదువును అభ్యసించిన మధ్య తరగతి వర్గం" ఏర్పడింది. ఇందులో న్యాయవాదులు, వైద్యులు, ఆచార్యులు, పత్రికా రచయితలు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు ఉన్నారు. వీరు ఆధునిక భారత ప్రజలను ఆధునిక జాతిగా ఐక్యపరిచి, ప్రగతి శీలక, సామాజిక, మత సంస్కరణోద్యమాలను నిర్వహించారు. బ్రిటీష్ వారు కొనసాగిస్తున్న అనేక ప్రజా వ్యతిరేక చర్యలను సామాన్య ప్రజలకు తెలియ చేసి వారిలో జాతీయ భావములను ఏర్పాటు చేసిన వారు వీరే. జాతీయ ఉద్యమాలకు తొలి బాటలు వేసి నిర్వహించి నాయకులుగా పనిచేశారు.

భారతదేశంలో నూతనంగా ఆవిర్భవించిన సామాజిక వర్గాల్లో జాతీయ ప్రాతిపదికన ఏకకాలంలో రెండు రకాల ఉద్యమాలు అభివృద్ధి చెందాయి. అందులో మొదటి వర్గం భిన్న సామాజిక వర్గాలు తమ వర్గ ప్రయోజనాలు, లక్ష్య సాధనకై కృషి చేశాయి. ఉదాహరణకు పారిశ్రామికులు, వర్తకులు, కార్మికులు, కర్షకులు, వృత్తి వర్గాలు, విద్యార్థులు, మహిళలు తదితరులు తమ వర్గ ప్రయోజనాలకు పాటుపడ్డారు. రెండవ వర్గంలో నూతన సామాజిక వర్గాలన్నియు సమిష్టిగా దేశ ప్రయోజనం కొరకు కలిసి పని చేశాయి. దీనినే జాతీయోద్యమం యని కూడా అంటారు. ప్రారంభంలో జాతి అప్రమత్తత, తదనంతరము స్వపరిపాలన, స్వయం ప్రతిపత్తి, సంపూర్ణ స్వాతంత్ర్యములను సాధించుటకు ఏకతాటిపై విదేశీ పాలనపై ధ్వజమెత్తారు. వీరి సమిష్టి కృషియే "స్వాతంత్ర్య సముపార్జన'.

భారత స్థాయిలో ఇలాంటి వర్గాల ఉద్యమాలు గాని, అన్ని వర్గాల ఉద్యమం గాని గతంలో ఎన్నడూ జరుగలేదు. ఇది కేవలం బ్రిటీష్ వారి కాలంలోనే జరగడం గమనించాలి.

## 16.6. బ్రిటీష్ వారి కాలంలో మతతత్వం అభివృద్ధి-భారతదేశం విభజన:

బ్రిటీష్ వారి పాలన వలన భారతదేశానికి జరిగిన మరొక నష్టం మతతత్వం అభివృద్ధి. తత్ఫలితమే భారతదేశ విభజన. బ్రిటీష్ పాలకులు తదేకంగా భారతదేశంపై పట్టు సాధించడానికి వాడిన 'విభజించి పాలించు' అనే సూత్రం 1947 నాటికి మహావృక్షమై భారతదేశాన్ని రెండు ముక్కలుగా విభజించింది. భారతదేశం నుండి బ్రిటీష్ వారిని తరిమేశాం అనే ఆనందం కూడా లేకుండా, బ్రిటీష్ వారు మతతత్వం అనే దుర్బాణంతో భారతీయులను విడదీసి, దాని ప్రతిఫాలాలు తదితరాలు ప్రజలు 'అనుభవించుటట్లు చేయగలిగారు. బ్రిటీష్ వారు భారతదేశంలో అడుగడిన తర్వాత వారి స్వలాభం కొరకు భారతదేశంలో నిలబడడానికి ఎన్నో 'వేర్పాటు ధోరణులకు' భీజం చేశారు.

మొదటగా కంపెనీ పాలన అడుగిడినపుడు ముస్లిం పాలకులు, సర్దారులు, బలంగా ఉన్న నేపథ్యంలో వారిని వ్యతిరేకించి హిందువులతో సన్నిహితంగా ఉన్నారు. అయితే "భారత జాతీయ కాంగ్రెస్' ఏర్పడి బ్రిటీష్ వారిని తమ హక్కుల కొరకు ఎదిరించడంతో హిందువులను వ్యతిరేకించడం ప్రారంభించారు. రోజురోజుకు వారి ఆర్థిక పీడన విధానంతో బలహీనమవుతున్న ప్రజల కొరకు 'జాతీయ కాంగ్రెస్' వారిని ఎదురించడంను వారు భరించలేక మహమ్మదీయులను తమకు పావుగా వాడుకోవడం ప్రారంభించి హిందూ-ముస్లిం మతాల మధ్య వైషమ్యాన్ని రెచ్చగొట్టారు. అంతేగాకుండా హిందూ-

ముస్లింలు వేర్వేరు జాతి వారని, వారు కలిసి జీవించలేరని 'ద్విజాతి సిద్ధాంతాన్ని' ప్రచారం చేశారు. అంతేగాకుండా వారు ఆర్థికంగా, సామాజికింగా వెనుకబడ్డారని వారికి రాజ్యాంగంలో ప్రత్యేక సదుపాయాలు అవసరమని వాదించింది. దీనిలో సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ ఆలీఘర్ ఉద్యమంను ప్రారంభించి ముస్లింలలో విద్యావ్యాప్తి కావాలని మొదలుపెట్టాడు. అంతేగాకుండా 1906లో "ముస్లిం లీగ్" ఏర్పాటై ముస్లింలకు ప్రత్యేక ప్రయోజనాలు కావాలని రాజకీయ ఉద్యమం ప్రారంభించారు. ఇది భారత జాతీయ కాంగ్రెస్ సమాంతరంగా ఏర్పడింది. ఇదియే క్రమక్రమంగా బలపడి మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ ఆలీ జిన్నాల నాయకత్వంలో ఏర్పాటు వాదంగా రూపొందింది. హిందుస్థాన్ హమారా అన్న నోటితోనే మహ్మద్ ఇక్బాల్ పాకిస్థాన్ ఆవిర్భావాన్ని కోరడం గమనించాలి. జిన్నా సైతం ప్రారంభంలో తొలుత జాతీయవాదిగా ఉండి, తర్వాత పాకిస్థాన్ ఆవిర్భావానికి "ప్రత్యేక చర్యకు" పిలుపునిచ్చి భారతదేశాన్ని నిలువునా చీల్చి "పాకిస్థాన్" సాధించాడు. అంటే ఇదంతా బ్రిటీష్ వారు దుర్బుద్ధితో ముస్లిం సోదరులను అడ్డుపెట్టుకుని ఆడించిన నాటకము యని చెప్పవచ్చును.

## 16.7. సారాంశము:

బ్రిటీష్ పాలనను భారతదేశంలో ప్రారంభించింది వర్తకులు అధికారం స్థాపించిన తర్వాత వారు అదే స్వభావంతో వర్తకుల మాదిరే వ్యవహరించి వర్తక పాలనను ప్రవేశపెట్టారు. వారి ప్రధాన ఉద్దేశ్యం లాభం. ఆ లాభార్జన కోసమే భారతదేశాన్ని వలస రాజ్యంగా మార్చారు. వలస రాజ్యాన్ని ఏవిధంగా ఆర్థికంగా దోచుకోవచ్చో అదే తరహాలో 'ఆర్థిక పీడన విధానం' ను పాటించారు. ఇందుమూలంగా దేశంలోని కుటీర పరిశ్రమలు కుప్పకూలి స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశారు. రాజకీయంగా భారతదేశాన్ని నిర్వీర్యం చేసి బ్రిటీష్ వారి చేతిలో కీలుబొమ్మను చేశారు. భారతదేశానికి ఆర్థిక ఆదాయంనకు మూలం అయిన వ్యవసాయంను మొదటిగా నిర్వీర్యం దిశగా తీసుకెళ్ళారు. వ్యవసాయంపై ఆధారపడిన 70% ప్రజలను నిర్భాగ్యులగా మార్చారు. రైతులకు, రైతు కూలీలకు గిట్టుబాటు ధర కూడా కల్పించక లక్షలాది మంది ప్రజల మరణానికి కారణమయినారు.

పారిశ్రామికీకరణ పేరుతో భారతదేశంలోని కుటీర పరిశ్రమలను, నిర్వీర్యం చేసి, వాటి పైన ఆధారపడిన లక్షలాది కుటుంబాలు నిరాశ్రయులు కాగ దేశంలో పరిశ్రమలు అభివృద్ధి క్షీణించింది. ప్రాచీన కాలం నుంచి వ్యాపారం చేసే బనియాలు, మార్వాడీలు, కోమట్లు, నాటుకోట్ చెట్టిమార్‌లు నేటి బ్యాంక్ కార్యకలాపాలు చేసేవారు. కానీ దేశీయ వ్యాపారం దెబ్బతినడంలో వారి వృత్తులను కోల్పోయారు. వాణిజ్య విధానం ద్వారా డ్రెయిన్ ఏర్పడి భారతీయుల దారిద్ర్యంనకు కారణం అయినది. అదేవిధంగా బ్రిటీష్ వారి విధానాల వలన భారతదేశంలో జామీందార్లు, కౌలుదారులు, కార్మికులు, కర్షకులు, బూర్జువా వర్గం లాంటి నూతన వర్గాలు సమాజంలో పుట్టుకొచ్చి, నూతన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వర్గాలు స్వాతంత్ర్యోదమంలో ముఖ్యంగా మేధావులు క్రియాశీలక పాత్రను పోషించారు. మతతత్వం కూడా అభివృద్ధి చెంది భారతదేశం విడిపోవడానికి కారణమయింది.

## 16.8. నమూనా ప్రశ్నలు

### I) వ్యాసరూప ప్రశ్నలు:

1) బ్రిటీష్ సామ్రాజ్యవాద లక్షణాలు భారతదేశం నిరోభివృద్ధి చెందదానికి ఏవిధంగా కారణమో వివరింపుము?

2) భారతదేశంలో వ్యవసాయ, స్థబ్దతకు గల కారణాలు వివరించండి?

3) భారతదేశంలో బ్రిటీష్ కాలంలో జరిగిన ఆర్థిక స్థబ్దత గురించి వ్రాయండి?

4) బ్రిటీష్ కాలంలో ఏర్పడిన నూతన సామాజిక వర్గాలను గురించి తెల్పండి?

**II) సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1) రాజీ విధానం

2) ప్లాంటేషన్ పరిశ్రమ

3) ఆర్థిక సంపద తరలింపు

4) సామాజిక పునరేకీకరణ

## 16.9. ఆధార గ్రంథాలు:


1. Bipin Chandra - Nationalism and Colonialism in Modern India.
2. Bipin Chandra - Essays on Colonialism.
3. Sumit Sarkar - Modern Indian Economic History.
4. P.N. Chopra, SB Puri MN Das - A Social Cultural and Economic History of India Vol. III.
5. తెలుగు అకాడమీ ప్రచురణ – భారతదేశ సామాజిక ఆర్థిక చరిత్ర.


- శ్రీ బాలగొండ గంగాధర్

మాదిరి ప్రశ్నాపత్రం

**302HI21**

# ఆధునిక భారతదేశ ఆర్థిక చరిత్ర (1757-1947)

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

**Answer All Questions**

**All questions Carry Equal Marks**

1. a) Write an essay on the Indian Economy in the mid-18th Century.

   18వ శతాబ్ద మధ్య భాగంలో భారత ఆర్థిక వ్యవస్థపైనొక వ్యాసము వ్రాయుము?

   (or)

   b) Write a note on colonialism.

   వలసవాదముపై ఒక వ్యాసము వ్రాయుము?

2. a) Explain the changes in agriculture made by British rule.

   వ్యవసాయ రంగంలో బ్రిటీష్ పాలన తీసుకొచ్చిన మార్పులను వివరింపుము?

   (or)

   b) Examine the introduction of plantation in India.

   భారతదేశంలో ప్రవేశపెట్టిన తోటల పెంపకాన్ని పరీక్షింపుము?

3. a) Write a note on de-industrialisation.

   భారతీయ పరిశ్రమల నిర్వీర్యముపైనొక వ్యాసము వ్రాయుము?

   (or)

   b) Examine the development of transport in British India.

   బ్రిటీష్ భారతదేశంలో రవాణా రంగ అభివృద్ధిని పరీక్షింపుము?

4. a) Discuss the growth of large industries in India.

   భారతదేశములో భారీ పరిశ్రమల పెరుగుదలను చర్చింపుము?

   (or)

   b) Analyse the impediments to the growth of industries in British India.

   బ్రిటీష్ భారతావనిలో పరిశ్రమల అభివృద్ధికి గల అవరోధాలను విశ్లేషించుము?

5. a) Critique on the Drain of wealth in British India.

   బ్రిటీష్ భారతావనిలో సంపదస్రావంపై సునిశిత పరిశీలన చేయుము?

   (or)

   b) Explain the Indian Economic ideas on Indian economic development.

   భారత ఆర్థికాభివృద్ధి విషయమై భారతీయ ఆర్థికాలోచనలను వివరింపుము?